# మిసిమి

చింతనాత్మక సారస్వతం



అనంత శయన పద్మనాభ శ్రీ మహావిష్ణువు

మాసపత్రిక, ఆగష్టు, 2023 ₹ 50/-

ISSN 2454–4329



గజ దారుశిల్పం

# మిసిమి

మాసపత్రిక

సంపుటి 34 సంచిక 8

ఆగస్టు - 2023

సంస్థాపకులు : రవీంద్రనాథ్ ఆలపాటి

సంపాదకుడు : వల్లభనేని అశ్వినీకుమార్

సహకార సంపాదకుడు : వోలేటి పార్వతీశం

KALA JYOTHI
Since 1946

Printed & Published by

**BAPANNA ALAPATI**

at **Kala Jyothi Process Pvt. Ltd.,**

1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad,

**Hyderabad - 500 020.**

Ph: 040 - 27612436, 27645538.

Editor: V. ASWINI KUMAR

Ph: 994 951 6567

**చందా వివరాలు:**

₹ 600/- (సంవత్సర చందా),

₹ 1200/- (రెండు సంవత్సరాలకు),

₹ 1800/- (మూడు సంవత్సరాలకు),

కార్యదర్శి : జి. ఉమాసుందరి

**040-27645536**

Scan QR to Pay

**Misimi Publication**

LIBRARY OF CONGRESS

LCCN 91-903060

UGC Care

INTERNATIONAL STANDARD SERIAL NUMBER INTERNATIONAL CENTRE

ISSN 2454-4329

**misimi90monthly@gmail.com**

www.misimimonthly.com

e-magazine : www.kinige.com/misimi

facebook.com/misimimaasapathrika

YouTube : **Silver jubilee celebrations of MISIMI Telugu Monthly**

అట్టతో కలిపి 84 పేజీలు

# మిసిమి

## ఆగష్టు నెల సూచికలు...




అద్భుత దారు శిల్పం : అశ్వినీ కుమార్ ...3
శరత్ గారితో : మిసిమి ... 4
చిత్రకారుని స్వప్నసాకారం : రాయన గిరిధర గౌడ్... 9
వేదిక : విజయ్ బక్ష్ ...14
ఖండాంతరాల స్నేహ బంధం : అవధానం రఘుకుమార్ ....15
క్యూబా-శాంతాక్లారా-ఛే గువారా : డా. నిమ్మగడ్డ శేషగిరి రావు... 24
నైరూప్య చిత్రకళ : తంగెడ విశ్వేశ్వర ప్రసాద్ ...31
రాజస్థాన్ సమాజ చరిత్ర : ప్రొ. లక్ష్మీ అయ్యర్...37
కర్పూర పరిమళాలు : డా. నల్లపనేని విజయలక్ష్మి ... 40
శక పురుషుడు : డా. పాటిబండ్ల దక్షిణామూర్తి ... 44
రాజనాల బండ : దొండపాటి కృష్ణ..47
గురువందనం : తోట వెంకటస్వామి ...50
కొమర్రాజు వారి పరిశోధన : మండలి బుద్ధప్రసాద్ ... 51
జావళీలు-చిత్రగీతాలు : డా. ఎమ్. పురుషోత్తమాచార్య ... 55
నవలాహృదయం - స్వేచ్ఛ : ఓల్గా ... 59
సూక్తి సురభి : రెంటాల సాంబశివరావు ... 62
గాంధీ జ్ఞాన దర్శనం : దోర్బల బాలశేఖర శర్మ ... 64
కాశీలో అఘోరాలు : డా. కిల్లాడ సత్యనారాయణ ... 67
అనిమల్ ఫార్మ్ : వేలూరి కృష్ణమూర్తి ... 70
తెలుగు సాహిత్య వైభవం : కొప్పర్తి విజయ్‌కుమార్ ... 72
రాయరత్నమంజూష : ఘట్టమరాజు ... 77
చదవండి : ***మిసిమి*** ... 78







**అట్టమీది బొమ్మలు**










**వివరాలకు 9వ పుట**

# అద్భుత దారు శిల్పం

మనమున్న ప్రపంచంలో రోజూ ఎన్నో అద్భుతాలు జరుగుతుంటాయి. మన దృష్టిలోకి రానివి చాలా ఉంటాయి. అలాగే మనం తిరిగే హైద్రాబాద్‌లో ఒక అద్భుతం జరుగుతోంది. అది మనకు తెలియకపోవచ్చు. కాని ఈ అద్భుతం గురించి మీకు చెప్పాలనుకుంటున్నాను.

ఎన్నో చెట్లు మొలకెత్తి పెరిగి మట్టిలో కలిసిపోతుంటాయి. మనిషి స్వార్థానికి మరెన్నో తెగిపడుతుంటాయి. సరే దీనిలో వింతేముంది? కాని 1500 సంవత్సరాలక్రితం ఈ దేశాలు సరిహద్దులు పెట్టుకోకముందు భారతదేశానికి ఉత్తర ఈశాన్యాన కారడవులు కీకారణ్యాలుండేవి. బ్రహ్మపుత్రకు ఉత్తరాన 'బర్మా'గా తర్వాత పేరుపొందిన ప్రదేశంలో ఏ బౌద్ధభిక్షువు నాటారో – ఏ దివ్య పక్షి వదిలిందో ఓ విత్తు మొలకెత్తి – తల ఎత్తి ఆకాశంలోకి చూస్తూ మహావృక్షమై ఎన్నో ఋతువులు ఆకులు రాలుస్తూ – చిగురులు వేస్తూ నీడనిస్తూ – ఎండను భరిస్తూ వెయ్యి సంవత్సరాలకు పైగా భూమి మీద నిలిచి తపస్సు చేసింది! ఎందుకో జన్మ చాలిద్దామనుకుని – చిగురేయటం మానుకుంది. అలాంటి మహావృక్షం నేలకొరగదు. తలవంచదు! మన వృక్షరాజుకు 'మహా మౌని' అని నామకరణము. మనుష్యులకే కాదు మహావృక్షాలకూ జన్మసంస్కార ముంటుంది. అవీ ప్రాణమున్న మనలాంటి



అనంత శయన పద్మనాభ శ్రీ మహావిష్ణువు

పదార్థాలే కదా. అలా వృక్షరాజు అరణ్య రాజ్యాన్ని ఏలటం మాని మౌనమునిలాగా నిలబడిపోయింది. తర్వాత సంఘటనలు త్వరగానే జరిగిపోయి వుంటాయి.

బర్మా టేకు ప్రపంచ వ్యాప్తంగా ఖ్యాతి పొందినది. ఆవిధంగా ఈ 'ముని' ప్రభుత్వాధీనంలోకి వచ్చి ప్రపంచ విపణికి పరిచయం అయ్యింది.



శ్రీదేవి - భూదేవి

అసలు విషయం ఏమిటంటే – ఈ 'మునివృక్షం' 15 వందల సంవత్సరాల తపస్సు – మన అదృష్టం ఒక్కటై జన్మ సంస్కారం గల శరత్‌బాబు చేతికి వచ్చింది.

ఏ ఒక్కరైనా కలప వ్యాపారం చేసేవారికి ఆ వృక్షరాజు ఒక బంగారు గని! కాని జన్మతః సంస్కారవంతులైన వారికి అది మానవజాతి సంపద. ముందు తరాలకు అందించవలసిన అపురూప సంపద. శరత్‌బాబుకి ఇదే ఆలోచన వచ్చింది. ఇది కేవలం వృక్షకాండం కాదు–మహాదారుశిల్ప కళాఖండం అనుకున్నాడు ఆయన. ఆ ఆలోచన, సంకల్పం 'విత్తు'గా మొలకెత్తి – ఇప్పుడు మనం చూస్తున్న అనంతశయన పద్మనాభ శ్రీ మహావిష్ణుమూర్తిగా రూపుచెందింది. ఆ కథ ఆయన మాటల్లోనే విందాం–

(సంతకం)

# శరత్ గారితో ....

- మిసిమి



చదలవాడ శరత్ బాబు

**మిసిమి : శరత్ గారూ నమస్కారం మీ నాన్నగారు తిరుపతిరావు గారికి, మీ సోదరులు కిరణ్ గారికి, మీకూ శుభాకాంక్షలు. ఇంతటి మహత్కార్యాన్ని వ్యాపార దృష్టితో కాకుండా ఒక ఆధ్యాత్మిక దృష్టితో దారుశిల్ప చరిత్రలో నిలపాలన్న మీ సంకల్పం ఎంతో శ్లాఘనీయం. ఇది ఒక అమూల్యమయిన అద్భుతం. ఈ ఆలోచన మీకు ఎలా కలిగింది? పూర్వం పురాణాల్లోను, తర్వాత సినిమాల్లోను ప్రాచుర్యం పొందిన స్వప్నసందేశం, ఏమన్నా కారణమా! ఈ అనంతశయన మహా విష్ణువుని మీ అదితిలో విడిది చేయించేందుకు ఎదుర్కొన్న సాధక బాధకాలను తెలియ చేయండి!**

శరత్ : మీ ప్రశ్నకు సమాధానం చెప్పాలంటే అంత పెద్ద మహావృక్షాన్ని ముక్కలు చేసి కుర్చీలు, బల్లలుగా చేయటం నాకిష్టం లేదు. అందుకని ముందుతరాల వారికి ఇంత పెద్ద మహా వృక్షాలుండేవని తెలియజేయడం ముఖ్యమనిపించింది. అదే మా మొదటి ఆలోచన. ఆ ఆలోచనతో ఆ దుంగను కోయకూడదని అనుకున్నప్పుడు కొరోనా వచ్చింది. అప్పుడు ఎదురయిన సమస్య చెబుతాను. కట్ చేయకుండా ఆ దుంగను మన దేశానికి తీసుకురావటానికి బర్మ వాళ్లు ఒప్పుకోరు. బర్మా ప్రభుత్వం అనుమతి ఇవ్వదు. మరి అంతపెద్ద చెట్టుని ఆ రూపంలో ఎలా రక్షించాలనేదే నా ఆలోచన, నా సంకల్పం. మాకొచ్చిన సలహాలేమిటంటే ఆ మహావృక్షాన్ని టేబుల్స్‌గా కట్ చేయండి, రౌండ్‌గా కట్ చేయండి, స్క్వేర్‌గా కట్ చేయండి... ఇలా సూచనలు చేశారు చాలామంది. ఈ మహావృక్షాన్ని అంతర్జాతీయ వేలంలో బిడ్ చేసి కొన్నాం. ముప్ఫై సంవత్సరాల నుంచి మేమక్కడ వ్యాపారంలో ఉంటే ఇంత పెద్ద దుంగ వేలంపాటకు రావడం ఇదే మొదటిసారి. మా తమ్ముడు ఆ దుంగతో ఫొటో దిగాడు. ఆరడుగులు కన్నా ఎత్తుంది ఆ దుంగ. చాలా బావుంది అంటే అప్పుడు మా మేనేజర్ చూసి బిడ్ చేశారు.

ఆ దుంగని మేం వేలంలో కొన్న తర్వాత ఒక అమెరికన్ బిలియనీర్ దాన్ని కొందామని ముచ్చట పడ్డాడు. ఈలోగా కరోనా వచ్చింది. అంతర్జాతీయ రవాణా స్తంభించింది. విమానాలు రద్దయిపోయాయి. అంత విపత్కర పరిస్థితులలో ఆయన మాకేం చెప్పాడంటే ఒకవేళ మీరేమన్నా వాడుకోదలుచుకుంటే వాడుకోండి. మామూలుంగా ఇబ్బంది పడకండి అన్నాడు. దానితో ఈ దుంగను కట్ చేయకుండా ఎలా వాడవచ్చు అనే అంశం మీద నా మిత్రులు సీనియర్ పోలీస్ అధికారి కె. సదాశివరావు గారిని సంప్రదించాను. మా దగ్గర వరల్డ్ లార్జెస్ట్ లాగ్ ఉంది, దీన్ని నేను బొమ్మగా చేసి బర్మానుంచి మనదేశానికి ఎగుమతి చేసి తెచ్చుకుందామనుకుంటున్నాను అని. అప్పటికే వేం ఆ ప్రయత్నాలు చేస్తున్నాం. అప్పుడాయనని సలహా కోరితే ఆయనేమన్నారంటే 'నువ్వు ఏం చేయదలచుకున్నావో పేపర్ మీద స్కెచ్ వేయించుకో అని సలహా ఇచ్చారు.

మీకు చాలామంది ఆర్టిస్టులు తెలుసుకదా! ఎవరినయినా మీరు మాకు పరిచయం చేయండని కోరాను. ఆయన అప్పుడు గిరిధర్‌గౌడ్ గారని తమ దగ్గర ఓ ఆర్టిస్టు ఉన్నాడని మాకు తెలియచేశారు. అతను ఇలాంటివి బాగా చేయగలడు. మరొక ఆర్టిస్టు పేరు కూడా చెప్పారు, అతని పేరు రమేష్ గొర్జాల. వీళ్లిద్దరూ మీకు సరైన సలహా

ఇవ్వగలరని నాకనిపిస్తోంది, నువ్వాళ్లతో మాట్లాడు అన్నారు. రమేష్ గోర్జాల గారు అంత ఆసక్తి కనపరచలేదు. వారికేవో సెంటిమెంట్లున్నాయి. గిరిధర్‌గౌడ్ గారిని సంప్రదించడం జరిగింది. ఆయన కూడా సదాశివరావు గారితో ఇంత పెద్ద బాధ్యత నేనెలా చేయగలను అని అన్నారుట. లేదు నువ్వు ముందు ఫోన్ చేయి అంటే ఆయన నాకు ఫోన్ చేశారు. అప్పుడు నేను 'మీరేది గీస్తే అది చెక్కుతాం! కానీయండి' అన్నాను.

నా సమాధానానికి ఆయన రెండు బొమ్మలు, ఒక ఆంగ్ల వనిత, ఇంకొకటి గజేంద్రమోక్షం గీసిచ్చారు. సరే గజేంద్రమోక్షం కోసం పర్మిషన్ అడుగుదామని మేం రెడీ అయ్యాం. బర్మా ప్రభుత్వం పర్మిషన్ కోసం మేం మా ప్రపోజల్‌ని మూవ్ చేశాం. అయితే వాళ్ల దేశంలో అలాంటి పర్మిషన్ అడగటం మొదిసారి. ఇలా ఎక్స్‌పోర్ట్ చేస్తే కండిషన్స్, రూల్స్ అవీలేవు. ఇవన్నీ మనకోసం. వాళ్ల పార్లమెంట్ ఫార్ములేట్ చేసింది. పార్లమెంట్ దాకా తిరిగాం. బర్మా పార్లమెంట్‌లో పాసయి వచ్చింది. స్పెషల్ జి.వో లాంటిది విడుదల చేశారు. పర్మిషన్ వచ్చేలోపల కాన్సెప్ట్, డ్రాయింగ్ మీద క్లారిటీ వచ్చింది. ఇంకా బెటర్ ఆప్షన్, బెటర్ ఆప్షన్ అని మథనపడుతుంటే ఆ దుంగలో అనంత పద్మనాభస్వామిని రూపొందిస్తే బావుంటుందని అనుకున్నాం. ఆ ఆలోచన మాకు గిరిధర్ గౌడ్ గారే ఇచ్చారు. ఎందుకంటే ఆ దుంగ ఆకారం అలా ఉంది. పర్మిషన్ వచ్చింది కానీ కరోనా వచ్చింది. విమానాలు లేవు. ఇక్కడ నుంచి దారుశిల్పుల్ని పంపించాలి. వాళ్ళకి కాంట్రాక్టు ఇచ్చా. బెస్ట్ కార్వర్స్ మహాబలిపురం నుంచి పదిమంది వెళ్తామన్నారు. అవన్నీ మాట్లాడుకున్న తర్వాతే అనుమతికోసం దరఖాస్తు చేశాం. కానీ వెళ్లేందుకు పరిస్థితులు అనువుగా లేవు. అప్పుడు బర్మాలో ఒక చిన్న పల్లెటూరులో ఇద్దరు దారుశిల్పులతో మేము కాంటాక్టులో ఉన్నాం. వారిద్దరు అవార్డులు కూడా పొందారు. వాళ్ళు చేయగలరేమో చూపించమన్నారు. అవసరమయిన స్కెచెస్ పంపించాం. ఇంకా వెక్టర్ డ్రాయింగ్స్ కూడా పంపాం. లైఫ్ సైజ్ పోస్టర్లు వేశాం. ఒక్కమాటలో చెప్పాలంటే అధునాతన టెక్నాలజీ అంతా వాడేశాం.

అక్కడ ఏం జరుగుతుందో తెలుసుకోవటం కోసం లైవ్ కెమెరాలు పెట్టించాం. గిరిధర్ గౌడ్ గారు రోజూ చూస్తుండేవారు. టెక్నాలజి సహకారం తీసుకోవడం పెద్ద విషయం కాదు. విషయం ఏమిటంటే భారతీయ బొమ్మ వేయటంలో ఏమయినా తేడాలొస్తాయేమోనని. మా అదృష్టమో, ఆ భగవంతుడే వీరిచేత అలా చేయించు కున్నాడో వాళ్ళు ఎంతో అద్భుతంగా చెక్కారు. అంత అద్భుతంగా వుడ్ కార్వింగ్ చేయొచ్చని వాళ్లు నిరూపించారు. అలా వారు చెక్కిన తర్వాత బొమ్మ ఆదిశేషుడు లేకుండా మనదేశానికి వచ్చింది. అనంత పద్మనాభస్వామి మూర్తితో మాత్రమే వచ్చింది. మిగతాది పూర్తి చేయాలి. పెద్ద కంటెయినర్ షిప్‌లో ప్రత్యేకమయిన ఏర్పాట్లతో తీసుకురావటానికి సంవత్సరం పట్టింది. ప్రత్యేకంగా ఫ్రేం తయారుచేయించాల్సి వచ్చింది. ఎటువంటి గీతలు పడకుండా ఒక చిన్న కంటెయినర్‌లో ఆ బొమ్మ వున్న దుంగను తేవాల్సి వచ్చింది. మనదేశం ఆ బొమ్మ వచ్చాక మహాబలిపురం దారు శిల్పులకు చూపించాం. పూర్తి చేయాలని వారిని పిలిపించాం. వారు దణ్ణం పెట్టారు. ఇంత ఫైన్ కార్వింగ్ మావల్ల కాదని చెప్పేసారు. అయితే బొమ్మను పూర్తిచేయాలి కదా! అందుకని ఆ బర్మా దారుశిల్పులను పిలిపించాం. వాళ్లు ఊరు దాటిన వాళ్లు కాదు. విమానం ఎక్కినవాళ్లు కాదు. మళ్లీ ఒక టీంని పెట్టి వాళ్ళందరికీ ఆ దేశంలో పాస్‌పోర్ట్‌లు ఇప్పించి, ఇండియన్ ఎంబసీని సంప్రదించి భారత ప్రభుత్వం నుంచి వీసా ఇప్పించే బాధ్యత తీసుకున్నాం. మొత్తం ఎనిమిదిమంది వచ్చారు. వారు ఎంత నిబద్ధత కలిగినవారంటే గిరిధర్‌గౌడ్ గారు, డ్రాయింగ్స్ తయారు చేసే సమయంలో ఇక్కడ మాకోసం కొన్ని దారుశిల్పాలు చెక్కారు.

**మిసిమి : అయితే అనంతశయన విష్ణువు చుట్టూ ఎన్నో సూక్ష్మ శిల్పాలను కూడా వారే చెక్కారు కదా!**

శరత్ : అవునండి, వాళ్లు ఇక్కడ వచ్చాక ఇంకా అద్భుతంగా శిల్పాన్ని తీర్చిదిద్దారని మాకు అనిపించింది. వారుకూడా



బర్మా శిల్పుల నైపుణ్యం

చాలా ఉత్సాహంగా ఉన్నారు. ఆ (బర్మ) దారుశిల్పులందరినీ రామప్ప దేవాలయం తీసుకెళ్లి చూపించాం. నగలు, నగిషీలు, వారు ధరించిన వస్త్రాలు, ఆభరణాలు ఇవన్నీ వారికి వివరించాం. వరంగల్ వారసత్వ సంపదపై మంచి అవగాహన ఉన్న పాండురంగారావు వీరిని చక్కగా గైడ్ చేశారు. వాళ్లకర్థమయిందో లేదో మాకర్థం కాలేదు కానీ, వారికర్థమయిందంతా బొమ్మలో చూపించారు. అయితే రామప్ప దేవాలయం స్ఫూర్తితో అద్భుతంగా దేవతల నగలను, ఆభరణాలను, శిల్పాలను చెక్కారు. ఇది ఆర్నమెంట్‌కు సంబంధించి, అలాగే స్వామివారి పట్టువస్త్రం ఎంతో పలచగా, కాగితంలా ఉంటుంది. దాన్నికూడా నైపుణ్యంతో తీర్చిదిద్దారు. ఇటువంటివి రాయిలో సాధ్యమేమో కాని చెక్కలో చెక్కటం కష్టం. ఎందుకంటే ఉలి, శాను దెబ్బలకు చెక్క చిట్లిపోతుంది. అలా ఆ ఫైన్ కార్వింగ్ వాళ్లు తీసుకొచ్చారు.

***మిసిమి* : చుట్టూ ఉన్న దేవతలను ఆ శేషశయనుడిని భగవద్గీత శ్లోకం ప్రకారం చెక్కారు కదా! ఆ శ్లోకంలో ఒక భావం మాత్రమే ఉంది. దేవతలు, అశ్వినీదేవతలు, దిక్పాలకులు వంటి వారందరిని గిరిధర్ గౌడ్ వెలికితీసి వాటికో రూపమిచ్చినారు. ఈ దారుశిల్పులు అంతే సుందరంగా వాటిని ఆ దుంగపై చెక్కారు, ఫస్ట్ ఆఫ్ ఇట్స్ కింగ్ ఈ దారుశిల్పం అనొచ్చా!**

శరత్ : అవునండీ ఇదీ ఆ కోవకు చెందిందే. అందుకే గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డ్‌కు అప్లై చేయాలనుకుంటున్నాం,

***మిసిమి* : ఇదంతా మీకు ఎంతకాలం పట్టింది! మీరు ఆ దుంగను కొన్నప్పటి నుంచి.**

శరత్ : కొన్నప్పటి నుంచి లెక్కేస్తే ఇప్పటికి ఆరో ఏడు నడుస్తోంది. కార్వింగ్ ఏప్రిల్ 20లో మొదలుపెడితే ఫిబ్రవరి 23కు పూర్తయింది.

***మిసిమి* : సరే శరత్ గారు, మీరు అన్నీ చెప్పకపోయినా కొన్ని సాధక బాధకాలు చెప్పారు. ఇలా చాలా పడుంటారు కదా!**



శరత్ : అంటే ఇది మాకు శ్రమ అని అనిపించలేదండీ. బాధ్యత అనండీ... దాన్ని ఆస్వాదిస్తూనే పూర్తి చేశాం. ఇందులో ఎన్నో కష్టాలున్నాయి. కస్టమ్స్ క్లియరెన్సు, జాగ్రత్తగా బర్మానుంచి మనదేశానికి ఆ దారు శిల్పాన్ని తరలించడం ఇవన్నీ కాస్త టైం తీసుకున్నవే. కానీ చిత్రంగా అన్ని పనులు వాటికవి అయిపోయాయి. ఎక్కడా మేం హడావిడి పడలేదు. ఎవరినీ హడావిడి పెట్టలేదు. మేం టైం లిమిట్ పెట్టుకోలేదు. దానివలన మాకంత ఒత్తిడి కూడా లేదు. గవర్నమెంట్ ఆఫ్ మయన్మార్ పర్మిషన్ ఇవ్వటమే మా తొలి విజయం. మయన్మార్ ప్రభుత్వం ప్రతి టాప్ అఫీషియల్ కూడా వచ్చి చూశారు. ఈ వార్త వైరల్‌గా మారి వాళ్ల టీవీల్లో, న్యూస్ పేపర్లలో ఇలా అన్ని ప్రసార మాధ్యమాల్లో వచ్చింది. ఈ శిల్పం చెక్కిన తర్వాత ఇటువంటిది మనదేశంలో జరిగిందని వీరు గొప్పగా చెప్పుకున్నారు. ఇక్కడో విషయం చెప్పాలి. ఈ శిల్పం గురించి అక్కడున్న మా మేనేజరు డాక్యుమెంట్ చేశారు. ఇక ఇక్కడ కూడా అనేకమంది చూసి వెళ్లారు. జమ్మూ కాశ్మీర్, గుజరాత్ అటవీ అధికారులు చూసి వెళ్లారు. ఈ బొమ్మ దానికదే ఆకర్షిస్తోంది అందరినీ. బాలీవుడ్ నటుడు సునీల్‌షెట్టికి ఎలా తెలిసిందో ఏమో! వచ్చి చూసి వెళ్లాడు.

***మిసిమి* : ఇంత సొమ్ము ఖర్చు చేసి ఒక అద్భుతమైన దారు శిల్పాన్ని సృజించారు మీరు. ఇక ఆ మహావిష్ణువు ప్రయాణం ఇప్పుడు ఎలాగ సాగబోతోంది!**

శరత్ : తెలీదు. అది ఆయనే నిర్ణయించుకుంటాడు. ప్రస్తుతానికి స్వామివారు ఇక్కడున్నారు. ఇక్కడనుంచి ఎటువెళతారో అది ఆయన నిర్ణయం. రెండు విషయాలకు మా దగ్గర సమాధానం లేదు. ఇది ఎందుకు చేశారు అంటే తెలియదు. ఎవరికోసం చేశారు, ఇప్పుడేం చేయబోతున్నారు.. అదీ తెలియదు. ఇవన్నీ తెలియకుండా మొదలుపెట్టిన ప్రాజెక్ట్ ఇది.

***మిసిమి* : అద్భుతమైన ఈ ఆధ్యాత్మిక భారతాత్మను స్వామి వారి రూపంగా ఆవిష్కరించడం మీరు జన్మ సంస్కారంతో చేసినది. కేవలం డబ్బుమీద ప్రేమ ఉన్నవారు చేయలేరు ఈ పనిని. రూపాయి దృష్టి ఆ పనిని చేయనివ్వదు.**

శరత్ : మళ్లా నేను మొదట్లో చెప్పినదే చెప్పాల్సి వస్తుంది. ఆలోచన అనేది ఎందుకొచ్చింది అనే దానినుంచి మొదలవుతుంది. దాన్ని బొమ్మగా ఎందుకు తయారు చేశాను, ఇంత అద్భుతమైన శిల్పం ఎలా తయారయింది అంటే... నా ప్రధానలక్ష్యం అంత పెద్ద వృక్షాన్ని భవిష్యత్ తరాలు చూడాలి. అదే నా సంకల్పం.

**మిసిమి : ఎంత గొప్పది మీ ఆలోచన... నిజమే ముందు తరాలవాళ్ళకు తెలియదు, ఇలాంటివి రూపొందించపోతే!**

శరత్ : అంత పెద్ద బర్మా టేకు వృక్షం ఆ పరిమాణంలో ఉంటుందని ఎలా తెలుస్తుంది! అన్నిచోట్లా అడవులు తగ్గిపోయి వూళ్లు వచ్చేస్తున్నాయి. చెట్లు కనుమరుగై పోతున్నాయి. మరి భావితరాలకు ఎలా రక్షించి చూపాలి అన్నదే మా లక్ష్యం. దాన్నొక దేవుడి రూపంలో చూపితేనే ఆ దైవాన్ని పూజిస్తూ తర్వాత తరాలకు అందిస్తారన్న నమ్మకం కలిగింది. ఆ టేకు దుంగను అదేవిధంగా భద్రపరచాలన్న ఆలోచనే దీనికంతటికీ మూలం.

**మిసిమి : ఆ ఆలోచన మీకు రావటానికి జన్మ సంస్కారం ఓ కారణం. అది మీలో పుష్కలంగా ఉందని మా అభిప్రాయం.**

శరత్ : ప్రధాన లక్ష్యం బొమ్మ చేయటం కాదు. భావితరాలకు దీని గురించి తెలియచేయటం అని మేమనుకున్నాం.

**మిసిమి : ఈ మహారూపం ఎక్కడుండాలనే ఆలోచన ఇంకా మీకు లేదు. పోనీ ఏమన్నా ప్రణాళికలున్నాయా!**

శరత్ : ప్రణాళికలేని ప్రయాణం (నవ్వుతూ)... గమ్యం లేని ప్రయాణం. ఇంకో విషయం చెప్పాలి. ఈ దారు శిల్పాన్ని చెక్కిన వారందరూ బుద్ధుని మార్గాన్ని అనుసరిస్తున్న వారు. మన భారతీయ సంస్కృతి వారి అణువణువులోనూ ఉంది. బౌద్ధాన్ని మనం వదిలేసినా బుద్ధుని భావనలు, ఆ సంస్కృతి వారిలో ఇంకిపోయున్నాయి. వారికి లోతుగా నేర్పిస్తారు. ప్రతి బుద్ధిస్టు ఉదయాన్నే పూజ చేయకుండ బయటకు కదలడు. అంటే వాళ్ల పద్ధతిలో జాతక కథల ద్వారా మన సంస్కృతి అంతా వారికి తెలుసు.

**మిసిమి : మీరు తయారుచేసిన ఈ అద్భుత దారుశిల్పం గురించి ప్రపంచంలోని ఏ మ్యూజియం వారికి తెలిసినా కళ్లకద్దుకుని మీకు కనకాభిషేకం చేసి తీసికెళతారు. కానీ అది మీ ఉద్దేశ్యం కాదు.**

శరత్ : అవునండీ అది మా ఉద్దేశ్యం కాదు. అది ఇక్కడుండి మన భావితరాల వారికి అందాలి.

**మిసిమి : సంకల్పాన్ని సాధించిన ఒక మహాయజ్ఞాన్ని మీరు నిర్వహించారు. కొన్ని అనుకూలతలు, కొన్ని ప్రతికూలతలు ఇందులో ఇమిడి ఉండొచ్చు.**

శరత్ : వ్యతిరేకంగా చాలామంది విమర్శించారండీ... చాలా బావుంది కానీ వీళ్ళకేమన్నా పిచ్చా అన్నవారున్నారు. మీరు యజ్ఞం అన్నారు కదా!

ఈ యజ్ఞంలో పాలుపంచుకుని ఎంతో తోడ్పడిన వారిగురించి చెప్పాలంటే మా బర్మా మేనేజర్ "ణి ణి ఆన్గ్". ఆవిడ ఈ ప్రాజెక్టు కోసం సర్వశక్తులు ఒడ్డి కృషి చేసింది. చేయాలన్న ఆలోచన మాదే అయినా పర్మిషన్స్ కోసం పట్టువదలని విక్రమార్కుడిలా తిరిగింది మాత్రం వారే. ఆవిడ మా బర్మా హెడ్. ఈ దారుశిల్పాన్ని అనూరాధ ఇంటర్నేషనల్ టెంబర్స్ అనే సంస్థ చేసింది. ఇది పర్సనల్ ప్రాజెక్టు కాదు. ఈ దుంగ దారుశిల్పంగా భారతదేశం చేరటానికి మా మేనేజర్ కృషి అపూర్వం. అలాగే ఆ శిల్పం రూపొందటంలో ముఖ్యపాత్ర ఈ శిల్పుల నాయకుడు "యుకె సవార్"ది. అతను ప్రిన్సిపల్ ఆర్టిస్ట్. మిగిలినవారు అతనికి సహకరిస్తుంటారు. వీరందరి సంకల్ప బలం గొప్పది. దీన్ని కేవలం టేకుమొద్దుగానే కాకుండా ఒక రూపంతో అందించాలన్న మా ఆలోచనకు ప్రాణం పోశారు. మా కుటుంబ సభ్యులంతా ఈ ఆలోచనను హర్షించారు. వారెవరు ఒద్దన్నా ఓ ప్రాజెక్టు ఆగిపోయేది. ఎవరూ వద్దని అనలేదు. అలాగే చిత్రకారుడు గిరిధర్ గౌడ్ అతనికి స్వేచ్ఛ నిచ్చాం. గిరిధర్ గౌడ్ గారి దగ్గర నుంచి... బర్మా శిల్పుల వరకు.... మేం చేసిందల్లా వీరికి ఏం కావాలంటే అది అందించాం. గిరిధర్ గౌడ్, సవార్... ఇప్పుడిద్దరూ మంచి స్నేహితులు అయిపోయారు. చిత్రం వేయటం వేరు... దాని ఆధారంగా శిల్పం చెక్కడం వేరు. వాదనలు, ప్రతివాదనలు ఉండేవి. అవన్నీ అధిగమించారు వారిద్దరు. ఇద్దరు ఇప్పుడు ఓ ఫ్లో లో ఉన్నారు. ఇద్దరి మధ్య ఒక బంధం ఏర్పడింది.

ఈ యజ్ఞాన్ని మేం కొనసాగిస్తున్నాం. ఆపడం లేదు. ఇప్పుడు శ్రీరాముల వారి విగ్రహాన్ని కూడా చెక్కిస్తున్న.



బర్మా నుంచి తెప్పించిన
ఏకాండి శ్రీ మహావిష్ణువుతో శరత్ బాబు



బర్మా శిల్పుల దారుశిల్పం

**మిసిమి : మీరు ఇటలీ చాలాసార్లు వెళ్లుంటారు. మైకేల్ ఏంజెలో శిల్పాలు చూసుంటారు. నాలాంటి సామాన్యుడు ఎంత బాగా చెక్కావయ్యా అని అన్నాడట. అప్పుడు "నేను చెక్కేదేముంది శిల్పం అందులో దాగి ఉంది. నేను అనవసరమయిన రాతిని తొలగిస్తున్న" అన్నాడట. అలాగే ఈ దుంగలో అనంతశయన విష్ణుమూర్తి నిక్షిప్తమై ఉన్నాడు. అవసరం లేని చెక్కను తొలగించారు మీరు. వెయ్యేళ్ళనాడు రామప్ప రూపొందించిన ఆ దేవాలయం ఇప్పుడు సాధ్యపడుతుందా! ఎంతమంది శిల్పులు ఆ ఆలయం కోసం కృషి చేసి ఉంటారు!**

శరత్ : అవునండి. ఇవ్వాళ్టి తరం అలా ఆలోచించడం లేదు. మా లక్ష్యం కూడా అదే. ఒక రామప్పను ఎలా గుర్తుపెట్టుకున్నారో, ఈ దారుశిల్పం చూసి భవిష్యత్తరాలు అలా గుర్తుంచుకోవాలనే మా కోరిక.

**మిసిమి : బావుంది మీదికూడా అలాంటి సారూప్యమైన ఆలోచనే. అనుమానం లేదు.**

శరత్ : ఇది నా గురించి కాదు. నేను చేశాను అన్నది కాదు. ఇది నా కృషి కాదు. ఆ బొమ్మ అలా చేయించుకుంది. అంతే అనుకుంటాను. ఎక్కడ నా పేరు ఉండటానికి, చెప్పుకోవటానికి కూడా ఇష్టపడను. ఏ గుడిలో కూడా మూలవిరాట్టును చెక్కిన శిల్పి పేరుండదు కదా! అలాగే అనుకుంటాను. చెక్కింది సవార్. బొమ్మ గీసింది గిరిధర్ గౌడ్ అంతే

**మిసిమి : ఈ మహా కఠిన వృక్షంలో ఎన్నో ఇబ్బందులుంటాయి కదా!**

శరత్ : అందుకే ఈ దారుశిల్పం చెక్కటానికి అవసరమయిన పనిముట్లు కూడా బర్మానుంచి తెప్పించాం.

**మిసిమి : ఈ మహా కఠిన వృద్ధ వృక్షంలో అనంత శయన మహావిష్ణువు ఎప్పటినుంచో విశ్రాంతి తీసుకుంటున్నాడు. మీ సంకల్పం మూలంగా మనందరికీ దర్శనమిస్తున్నాడు.**

శరత్ : ఈ దారుశిల్పం మాకు ఇచ్చిన ధైర్యం ఏమిటంటే దానితో మనం ఇటువంటివి మరికొన్ని ప్రాజెక్టులు చేపట్టవచ్చు అని తెలిసింది. నమ్మకం వచ్చింది. ఈ దారుశిల్ప రంగాన్ని మరింత పెంచుదామన్న ఆలోచనలో ఉన్నాను.

**మిసిమి : ఇటువంటి లాగ్స్ లేదా దుంగలు దొరుకుతాయా?**

శరత్ : అంటే వేరేవేరే దేశంలో వెతికి తేవాలి. అదృష్టవశాత్తు మేము ఈ రంగంలో ఉన్నాము కాబట్టి మా ప్రయత్నం విజయవంతం కావొచ్చు అన్న నమ్మకముంది. యాదగిరిగుట్ట నరసింహస్వామి వారి మహరాజ గోపురం మేం తయారుచేసిందే.

**మిసిమి : మీ రెండో ప్రాజెక్టు గురించి చెప్పండి.**

శరత్ : అన్నిరకాల వుడ్స్ గురించి శోధించి అన్వేషిస్తున్నాం. ఏ చెక్క దేనికి పనికి వస్తుందన్న ఆలోచనను విస్తరించే ప్రయత్నంలో ఉన్నాం.

**మిసిమి : అయోధ్యలో శ్రీరాముడి ఆలయం కోసం కూడా మీరు కృషిచేస్తున్నారని విన్నాం.**

శరత్ : అయోధ్య రామజన్మభూమికి సంబంధించిన వుడ్ వర్క్ మేమే చేస్తున్నాం. గర్భగుడి తలుపులు అన్నీ అక్కడే చేస్తున్నాం. మా టీమంతా అక్కడే ఉంది. గుడి తలుపులు, చుట్టూతా పరకోటా అని ఉంటుంది. అది మేం చేస్తున్నాం. క్యూ కాంప్లెక్స్‌కు సంబంధించిన వుడ్ వర్క్ మాదే. అంతా టేక్ వుడ్.

మా మహాబలిపురం శిల్పులు ప్రస్తుతం అయోధ్యలో ఉన్నారు. అలాగే మన యాదాద్రికి సంబంధించిన వుడ్‌వర్క్ పనులన్నీ మేమే చేశాం. ఈ శిల్పులందర్నీ మేం దత్తత చేసుకున్నామనుకోండి. అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. వారికి బీమా సౌకర్యం కూడా కల్పించాం. వారు శిల్పం చెక్కాలంటే చాలా శ్రమ. ఈజీ మనీ కోసం వీరు తాపత్రయపడకుండా వారికి అన్ని అవసరాలను మా కుటుంబ సభ్యులే అనుకుని తీరుస్తున్నాం.

పని ఉన్నా లేకపోయినా వారిని నిరంతరం కాపాడుకుంటూ ఒక మంచి దారుశిల్పుల బృందాన్ని రూపొందించడం కూడా చాలా తృప్తినిచ్చిన విషయం. అందుకే అన్ని పనులు మాకప్పగిస్తున్నారు. కొత్తగా ప్రారంభమయిన మన పార్లమెంటుకు కూడా మా బృందం పనిచేసింది.

**మిసిమి : మీ ప్రయత్నాన్ని మరోసారి అభినందిస్తూ మీకు చాలాచాలా ధన్యవాదాలు శరత్‌గారు, కిరణ్ గారు.**

శరత్ : మిసిమి పత్రిక వారికి మా కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నాం.

(ఈ ధ్వని ముద్రణను రాతిప్రతి చేసినది సి.ఎస్. రాంబాబు గారు)

# చిత్రకారుని స్వప్నసాకారం

- రాయన గిరిధర్ గౌడ్



శ్రీ వెంకయ్యనాయుడుతో గిరిధర్ గౌడ్

అది చాలా పెద్ద బర్మా టేకు దుంగ. పుట్టి పెరిగినది బర్మా అడవి ప్రాంతంలోనే. దానిని కొనుగోలు చేసినది అనూరాధ టింబర్స్ ఇంటర్నేషనల్, బోయిన్‌పల్లి, హైదరాబాద్, చదలవాడ తిరుపతి రావు గారు.... వాట్సాప్‌లో దాని బొమ్మని చూడగానే షాక్ అయ్యాను!

సుమారు 21 అడుగుల పొడవు, 8 అడుగుల ఎత్తు, 22 అడుగుల చుట్టుకొలత కలిగిన ఈ బర్మా టేకు దుంగ వయసు సుమారు 1500 సంవత్సరాల కంటే పైనే ఉంటుందని అంచనా. విషయం విని వింత అనుభూతిని పొందాను.అది గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ లో చోటు చేసుకునే అర్హత కలిగి ఉన్నదని విని సంతోషించాను.

ఇంతకీ జరిగినది ఏమిటంటే... మిత్రులు స్వర్గీయ కొడాలి సదాశివరావు రిటైర్డ్ డిజిపి గారు – ఒక చిత్రకారుడుగా నా పై గల నమ్మకం, ఈ బృహత్ కార్యాన్ని నేనే చేయగలననే ధృఢవిశ్వాసం నాలో నింపారు. చదలవాడ తిరపతిరావు గారి అబ్బాయిలు శరత్ బాబు గారు, కిరణ్ కుమార్ గార్ల దీక్ష, కృషి, పట్టుదలే కాకుండా వారికి నా పైగల అపారమైన నమ్మకాన్ని గమనించి ఈ ప్రాజెక్ట్ చేపట్టడానికి సాహసించాను. అంటే నా పర్యవేక్షణలో ఈ పెద్ద దుంగను పెద్ద శిల్పంగా మలచాలని శరత్ బాబు గారి కోరికగా గ్రహించి, ఈ శిల్పానికి శక్తివంచన లేకుండా న్యాయం చేయాలని మాత్రమే నా సంకల్పం.

ముందుగా, లక్షల రూపాయల ఖరీదు చేసే ఈ విలువైన దుంగపై నేను తగుదునమ్మా అని ప్రయోగం చేసి, యజమానిని నష్ట పరుస్తానేమో అని చాలా బాధపడ్డాను. కానీ ఆఖరుకు శరత్ గారు ఇచ్చిన భరోసాతో తిరిగి మరలా సమాధానపడి ఈ ప్రాజెక్టును కొనసాగించాను.

ముఖ్య ఉద్దేశమేమిటంటే ఈ దుంగ బయటి రూపాన్ని ఎక్కువగా మార్చకుండా శిల్పంగా మలచాలని, భావి తరాలకు ఈ మద్దు రూపాన్ని చరిత్రలో సాక్ష్యంగా నిలపటానికి లక్ష్యంగా అధినేతలు తీసుకున్న గట్టి నిర్ణయానికి ఈ శిల్పం నిదర్శనం. ముందుగా ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఎన్నో అంశాలు ఎంచుకున్నప్పటికీ చివరగా మూడు చిత్రాలు తయారుచేశాను, వాటిల్లో కొన్ని...

1. గజేంద్ర మోక్షము
2. వనిత – భవిత
3. అనంత శేష శయన మహావిష్ణుమూర్తి.

ఆఖరికి ఎంపిక చేసిన దుంగ ఆకారాన్నిబట్టి అనంత శేషశయన శ్రీ మహావిష్ణు మూర్తిగా ఊహించి, దాని ఆకారాన్ని అనుసరించి పెన్సిల్ స్కెచ్ చేశాను. కానీ కొంత సమయం తర్వాత ఆ స్కెచ్ లో దోషం గమనించాను. కారణం ఏమిటంటే ఆ మూర్తి తల కుడివైపుకు, కాళ్ళ భాగం ఎడమ వైపుకు గీయటం వాస్తు ప్రకారం దోషంగా గమనించాను. కాబట్టి ఆ చిత్రనమూనాని ప్రక్కన పెట్టి, మరలా తిరిగి చిత్రాన్ని తయారు చేశాను. ఇదంతా జరిగి సుమారు 3 సంవత్సరాలు దాటి ఉంటుంది. సుమారు నవంబర్ 4 2021 నాటికి ఈ పనిలో వేగం పుంజుకుంది. ఇక ఈ శిల్పానికి ప్రేరణ భగవద్గీత 11వ అధ్యాయంలోని 6వ శ్లోకం అయిన ....

*పశ్యాదిత్యాన్ వసూన్ రుద్రాన్*
*అశ్వినౌ మరుతస్తథా*
*బహూన్యదృష్టపూర్వాణి*
*పశ్యాశ్చర్యాణి భారత || 6 ||* – లో

నాలో పరికించుము ఓ భరత వంశీయుడా, (పన్నెండుగురు) అదితి పుత్రులను, (ఎనిమిది మంది)

వసువులను, (పదకొండు) రుద్రులను, (ఇద్దరు) అశ్వినీ కుమారులను, అంతే కాక, (నలభైతొమ్మిది) మరుత్తులు మరియు మరెన్నెన్నో ఇంతకు పూర్వం తెలియపరచబడని అద్భుతములను కూడా చూడుము.

పన్నెండు మంది ఆదిత్యులు,పదకొండు మంది రుద్రులు, యెనిమిది మంది వసువులు, ఇద్దరు అశ్వినీ దేవతలు – నలుబది తొమ్మిది మంది మరుత్తులు నాలోని వారు అని చెప్పుకున్నారు శ్రీ మహావిష్ణువు. కనుక ఈ అందరు దేవతలతో సహా ఇతర ముఖ్య విష్ణు భక్తులు, అతి ముఖ్యమైన దేవతామూర్తులను కూడా శ్రీ మహావిష్ణువును కలిసి సేవిస్తున్నట్లు చిత్రించాను. ఇందులో భాగంగా, శ్రీ మహావిష్ణువును అనంతశయన మూర్తిగా శిరస్సు యెడమ వైపుకు, పాదాలు కుడివైపుకు ఉండేటట్లు చిత్రించాను. అనంతశేషుని దివ్యమంగళ పడగల క్రింద కిరీటం దివ్యాభరణాలతో కూడుకుని, పట్టు పీతాంబరధారియై, ఒక కుడి చేతిని తల క్రింద వూతంగా ఆనించి, మరొక చేతితో పద్మాన్ని పట్టుకొని, ఒక ఎడమ చేయిని లాలిత్యంగా యెడమ కాలు పైన మోపి, మరొక ఎడమ చేతితో పాంచజన్యం అనే శంఖాన్ని పట్టుకొని ఉన్నాడు శ్రీ మహావిష్ణువు. ఆతని కుడి చేతులకి అందుబాటులో సుదర్శన చక్రం ఉపస్థితమై ఉన్నది. ఆతని కుడివైపున ఊరువుకి దగ్గరగా కౌముది అనే గదాయుధం చిత్రించటమైంది.

హిందూ పురాణాల ప్రకారం పాల సముద్రంలో శ్రీ మహావిష్ణువు శయనించే శేషతల్పమే ఆదిశేషుడు. సర్పాలలో ముఖ్యుడు. కశ్యప ప్రజాపతి, కద్రువలకు పుట్టిన పుత్రులలో జ్యేష్ఠుడు. పురాణాల ప్రకారం వేయి పడగలు కలిగి, అంటే వెయ్యి ముఖాలు అని అర్థం – వేయినోళ్ళ శ్రీ మహావిష్ణువును అను నిత్యమూ కీర్తిస్తూ ఉండేవాడు అని ప్రతీతి. కానీ నేను ఇక్కడ ఐదు పడగలకే పరిమితం చేసి చూపించాను. అంత పెద్ద ఆకారం కలిగిన సర్పాన్ని చూస్తే ప్రసన్నంగా అనిపించలేదు. కనుక తక్కువ పడగలతో ప్రసన్న వదనాలతో ఆది శేషుని చిత్రించాను. ఆ ప్రక్క శేషుని తమ్ముడు వాసుకి భగవంతునికి వినమ్రతతో నమస్కరిస్తూ ఉన్నాడు. శ్రీ మహా విష్ణుమూర్తి మోచేతికి క్రిందగా విప్పారిన రెక్కలతో పక్షిరాజు గరుత్మంతుడు, అతనికి ఎదురుగా నారద మహర్షి, తుంబురుడు, తరువాత సప్త ఋషులు మరీచి, అత్రి, అంగీరసుడు, పులహుడు, పులస్త్యుడు, క్రతువు, వశిష్ఠుడు, వారి ప్రక్కన విష్ణు భక్తులైన సనక, సనాతన, సనందన, సనత్కుమారులు ఉన్నారు.

సత్యాక్షుడు, దస్యుడు, అనే అశ్వినీ దేవతలు కూడా కౌముది గదాయుధానికి ఎదురుగా ఉన్నారు. సరిగ్గా విష్ణుమూర్తి పాదాలకు క్రిందుగా వీర నమస్కార ముద్రలో ఆంజనేయుడు, క్రింద క్షీర సాగరం పై అనంత శేషుని శరీరము చుట్టలు చుట్టలుగా పానుపు వలె శిల్పాన్ని మలచాలి. ఇక పై భాగాన ఆకాశాన్ని సూచిస్తూ మేఘాల వరుసలు వరుసలుగా మలచాలి. యక్ష గంధర్వ కిన్నెర కింపురుష విద్యాధర ఖేచరులతో సమావృతమైన ఆకాశం – విష్ణువు నాభి నుండి పుట్టిన కమల తూడుకు ఇరు ప్రక్కల ఉన్న వారు మధు, కైటభులు అనే రాక్షసులని చిత్రించాను. కమలం మధ్యలో బ్రహ్మ దేవుడు నాలుగు ముఖాలతో, నాలుగు చేతులతో, ఒక కుడిచేతిలో లేఖిని ఒక ఎడమ చేతిలో భూర్జ పత్రాన్ని ధరించి – మరొక కుడి చేతిలో అక్షమాల, మరొక ఎడమ చేతిలో కమండలం ధరించి ఉన్నాడు. ఆతని భార్య సరస్వతి అమ్మవారు హంస వాహనంపై ఒకవైపున ఉన్నారు. బ్రహ్మకు ఎడమవైపున వాహనములపై అష్టదిక్పాలకులు ఇంద్ర, అగ్ని, యమ, నిరుతి, వరుణ, వాయు, కుబేర, ఈశానుడు ఉపస్థితమై ఉన్నారు. ఇంకా నవగ్రహాలు

1. సూర్యుడు, 2. చంద్రుడు, 3. మంగళ, 4. కుజుడు 5. బృహస్పతి ,6. శుక్రుడు, 7. శని, 8. రాహువు 9. కేతువు పంద్రెండు మంది ద్వాదశ ఆదిత్యులు – అదితి, కశ్యపుని పుత్రులు.

1. ధాత 2. మిత్రుడు 3. ఆర్యముడు 4. శుక్రుడు 5. వరుణుడు 6. అంశుడు 7. ధవుడు 8. వివశ్వంతుడు 9. పూషుడు 10. సవితా 11. త్వష్ట 12. విష్ణువు.

ఏకాదశ రుద్రులు – శివుడు మనకు ఏకాదశ రూపాలలో దర్శనమిస్తాడు (వీరి పేర్లు వేరు వేరు పురాణ కథలల్లో వేరు వేరుగా చెప్పబడ్డాయి)

1. అజుడు 2. ఏకపాదుడు 3. అహిరుబద్నుయుడు 4. హరుడు 5. శంభుడు 6. త్రయంబకుడు 7. అపరాజితుడు 8. ఈశానుడు 9. త్రిభువనుడు 10. త్వష్ట 11. రుద్రుడు అష్ట వసువులు – వీరు దేవలోకంలో ఇంద్రునికి మరియు విష్ణుమూర్తికి సహాయం చేసే శక్తివంతమైన దేవతలు. వీరు బ్రహ్మ ప్రజాపతి పుత్రులు, ప్రకృతి తత్వానికి ప్రతీకలు,

1. అపుడు 2. ధృవుడు 3. సోముడు 4. ధరుడు 5. అనిలుడు 6. ప్రత్యూషుడు 7. అనలుడు 8. ప్రభాసుడు

18 మరుత్తులు నలుబది తొమ్మిది

1. ఏకజ్యోతి 2. ద్విజ్యోతి 3. త్రి జ్యోతి 4. జ్యోతి 5. ఏకశక్రుడు 6. ద్విశక్రుడు 7. త్రిశక్రుడు 8. మహాబలుడు 9. ఇంద్రుడు 10. గత్యదృశ్యుడు 11. ప్రతిసక్రుత్పరుడు 12. మిత్రుడు 13. సమ్మితుడు 14. సుమితుడు 15. మహా బలుడు 16. ఋతజిత్తు 17. సత్యజిత్తు 18. సుషేణుడు 19. ఫేనజిత్తు 20. అంతిమిత్రుడు 21. అనమిత్రుడు 22. పురుమిత్రుడు 23. అపరాజితుడు 24. ఋతుడు 25. ఋతవాహుడు 26. ధర్త 27. ధారుణుడు 28. ధ్రువుడు. 29. విదారణుడు 30. దేవదేవుడు. 31. ఈద్రుక్షుడు 32. అద్రుక్షుడు. 33. ప్రతిసుడు. 34. ప్రసద్రుక్షుడు. 35. సభరుడు 36. మహా యశస్కుడు, 37. ధాత, 38. దుర్గ్రోధితి, 39. భీముడు, 40. అభియుక్తుడు 41. అపాత్తు 42. సహుడు 43. ఘతి 44. ఘువ్వు, 45. అన్యాయ్యుడు, 46. వాసుడు 47. కాముడు, 48. జయుడు 49. విరాట్టు.

ఇలా శ్రీ మహా విష్ణువును సేవించుచు ఉన్న దేవతా మూర్తులతో ఈ శిల్పాన్ని ప్రణాళికాబద్ధంగా చిత్రించాను.

***<u>పైన వర్ణించిన శ్రీమహావిష్ణు శిల్పాకృతి పూర్తిగా - సంపూర్ణంగా నా ఊహాచిత్రమే. దీనికి ప్రేరణ భగవద్గీత 11వ అధ్యాయం, 6వ శ్లోకం. ఇది దేనినీ అనుకరించిగాని మరోవిధంగా ప్రభావం చెంది గాని చిత్రించి-శిల్పంగా మలిచినది కాదు. అనంతశయన ఆకృతి-తిరువనంతపుర ఆలయ విగ్రహమే - అంతవరకే.</u>*** కోవిడ్ ప్రభావం అధికంగా ఉన్న పరిస్థితుల్లో, అంతేకాకుండా నా పాస్పోర్ట్ లేనందు వల్ల కలిగే ఇబ్బందిని గమనించి నేను బర్మా వెళ్ళలేక పోయాను కానీ - లేకపోతే కొన్నాళ్లపాటు బర్మా స్థానిక శిల్పులతో కలసి ఈ దారు శిల్పాన్ని చేయించే వాడిని. అయినా సరే శరత్ బాబు గారు తీసుకున్న గట్టి నిర్ణయంపై వాట్సాప్ ద్వారా, వైబర్ ద్వారా, సీసీ కెమేరాల ద్వారా పరీక్షించి సలహాలు సూచనలు ఆధారంగా ఈ చిత్రాన్ని శిల్పంగా మలచడం జరిగింది. అయితే గత రెండు నెలల క్రితం (సుమారు ఆగస్ట్ 2022 నాటికి) చాలా ఖర్చుతో కూడిన వ్యయ ప్రయాసలకోర్చి శరత్ గారు ఆ శిల్పాన్ని మంచి పకడ్బందీగా ఉండేటట్లు ఏర్పాటుచేసి, నౌకలో ఇండియాకు చేర్చి, తర్వాత హైదరాబాద్‌లో అనూరాధా టింబర్స్ ఇంటర్నేషనల్ సంస్థలో కొలువు తీరింది. పనుల వత్తిడిలో ఉన్న నేను కొంత లేట్ గానే చూడడానికి వెళ్ళాను. ఒక్కడినే చూడాలంటే ఏదో వ్యక్తం చేయలేని భావం... నా మిత్రులు, ఆత్మీయులతో కలసి సందర్శించాలని కోరిక బలీయంగా ఉండి. కారికేచర్ నిపుణులు శంకర్, మోషి దయాన్, చిత్రకారులు కుమార స్వామి, ఆర్టిస్ రమేష్, కలసి వెళ్ళాము. 21 అడుగుల పొడవు, క్రింద ఇనుప చట్రంతో కలసి 7 నుంచి 8 అడుగుల శిల్పాన్ని చూసి నేను ఒక్కసారిగా నిశ్చేష్టుడయ్యాను. తెలియకుండానే నేను కళ్ళ వెంట నీరు పెట్టుకున్నాను! అలా ..2022 నవంబర్ 4వ తారీఖున బర్మా శిల్పులు 8 మంది హైదరాబాద్ చేరారు.

నేను 5వ తారీకు నవంబర్ నెలలో హైదరాబాద్ ప్రయాణం అయ్యాను. ద్వితీయ విఘ్నం కలగకుండా మేము 5వ తారీకునే శిల్పులతో పని మొదలుపెట్టాము. మొదటిరోజుగా జింబోలాగ్ -1 లో చేసిన ఐదు పెద్ద శిల్పాలను ప్రస్తుతం వారు సాండ్ పేపరింగ్ చేస్తూ ఉన్నారు. వారు బర్మా నుండి వచ్చేటప్పుడు వారివద్ద కార్వింగ్ టూల్స్ కానీ, పవర్ సా, పవర్ వీల్స్ గానీ తెచ్చే అవకాశం లేకపోయింది. వాటినన్నింటినీ రెండు మూడు బాక్సులుగా పాక్ చేసి బర్మాలోనే వారు కొరియర్ చేశారట. అవి పది లేదా పదిహేను రోజులలోపు ఇండియాకు చేరలేకపోయాయి. ఈలోగా శిల్పులలో కొందరు టూల్ మేకర్స్ ఎక్స్ పర్ట్స్ హైదరాబాదులో కొన్ని పరికరాలను సంపాదించారు. కానీ దురదృష్టం ఏమిటంటే ఆ పరికరాలు మెతకలోహంతో తయారు చేయడం వల్ల గట్టి పనులకు విరిగి ముక్కలు ముక్కలు అయిపోయేవి. మరికొన్ని పరికరాలు మొనలు వంగిపోతూ వుండేవి. అలా కొన్నాళ్ళు బాధపడ్డారు. కొన్నాళ్ళు జరిగాక వాళ్ళ టూల్స్ వాళ్ళకి బర్మా నుండి వచ్చేశాయి. ఈలోగా నేను అనంతశేషశయన మూర్తి మూలరేఖా చిత్రాన్ని ఆధారం చేసుకుని గీచిన డీటైల్డ్ డ్రాయింగ్, దేవతారూపాలను చుట్టూ మిగిలి వున్న దుంగ ఆకారంపై వాటిని వేరు వేరు పరిమాణాలలో కాంపోజిషన్‌కి అనుకూలంగా జిరాక్స్ ఐదు నుండి పదిరోజులలోపు వారికి అందించగలిగాను. వారు వాటిని అనుకున్న చోట్ల అనుకరించి వాటి ప్రతి ముద్ర తీసుకుని (రేఖాచిత్రంపై మేకులతో ఏర్పరచిన గుర్తుల ఆధారంగా) రూపాలను అనుకరించారు. అక్కడ నుండి

ప్రతి దేవతా రూపానికి ముందు లోతు నిర్ణయించుకుని అనుకూలమైన లోతు ప్రమాణాన్ని అనుసరించి శిల్పించడం మొదలుపెట్టారు. అప్పటి నుండి పని వేగాన్ని అందుకుంది. నేను ప్రతి వారానికి ఒకసారి హైదరాబాదు వచ్చి నాలుగైదు రోజులు వారితో గడిపి అవసరమైన సూచనలు ఇస్తూ వుండేవాడిని.

శిల్పులకు అనూరాధా టింబర్స్ వారే వారి కంపెనీ భవనం ఫస్ట్ ఫ్లోర్ లో నివాసయోగ్యం, ఆహార వసతులు కల్పించడం వలన వారు నిర్ణీతమైన సమయంలో ప్రతిరోజూ పని పూర్తి చేసి వెళ్తుండేవారు. (వారు అనుకున్న నిర్ణీతమైన సమయం 8 గం.లకు మొదలుపెట్టి 12 గంటలకి కచ్చితంగా ఆపేసేవారు. తరువాత భోజన విరామం. మరల కచ్చితంగా 1 గంటకి పనిలో దిగి 5 గంటలకి ముగించేవారు. ఎక్కడా అనవసరంగా సమయాన్ని వృధా చెయ్యకుండా పనిమీదే ధ్యాస పెట్టేవారు.) నేను ఏదైనా మార్పులు చెప్పాలంటే ఏ చిత్రం ద్వారానో రేఖా చిత్రాలను గీసి సాంకేతికంగా వాటిని సూచనా ప్రాయంగా ఒప్పించుకుని, అవసరాన్ని బట్టి గూగుల్ ట్రాన్స్ లేటర్ ద్వారా తెలుగు నుండి బర్మీస్ భాషకు, బర్మీస్ నుండి తెలుగుకు సంభాషిస్తూ అతి తక్కువ సంభాషణతో చర్చలు ముగిస్తూ వుండేవాళ్ళం. నచ్చని పనిని కరాఖండీగా నచ్చదని చెప్పే అలవాటు వీరికుంది. ఇలా సాగిన వీరి శిల్ప రచనా ధోరణి 85 రోజుల వరకూ కొనసాగుతుందనే విషయం నాకర్థమయ్యింది.

ఇక శిల్పులు ఇండియా చేరగానే వారికి మన భారతీయ చిత్రం, శిల్పం గురించి అవగాహన తెప్పించాలి అనే కోరికతో వారికి మన ప్రాచీన శిల్పాలను చూపించి (బుక్ రిఫరన్సెసెస్, రిప్రొడక్షన్స్) వారిలో అవగాహన పెంచాలనుకున్నాను. అయితే వారు కొత్తవారు కావడం వల్ల ముందుగానే ఈ రిస్క్ తీసుకోవడం మంచిది కాదని కొంతపనిలో పడితే వారికి అవసరమైన నాడు చుట్టుప్రక్కల ఉన్న శిల్పాల గురించి వివరించడం మంచిదని, ఆభరణాలు చెక్కేటప్పుడు రామప్పగుడి, హనుమకొండ వేయిస్తంభాల మంటపం, వరంగల్ ఫోర్ట్ చూపిద్దామని శరత్ బాబుగారు, కిరణ్ బాబుగారు అన్నారు. కానీ నేను ఉండబట్టలేక మధ్యలోనే మెయిన్ శిల్పి యూకేశ్వర్ మరియు సహాయశిల్పి టింకోవిల్ అనేవారిని ఇద్దరినీ హైదరాబాద్ స్టేట్ మ్యూజియంకు తీసుకు వెళ్ళాను. కానీ నేను ఆశించినంత శిల్పం అక్కడ లేదు. ఇలా వర్కు కంటిన్యూ అయ్యింది. నేననుకున్నట్లు దేవతా విగ్రహాలను శ్రీ మహావిష్ణువునకు చుట్టూరా చెక్కడం మొదలుపెట్టారు. కొన్ని ముఖాలు కూడా చెక్కడం జరుగుతున్న సందర్భంలో ముఖకవళికలు చైనా ముఖాలులాగా స్ఫురించాయి. అప్పుడు చైనా ముఖాలకు, భారతీయ ముఖాలకు ఉన్న తేడాలను డ్రాయింగ్స్ ద్వారా గీసి తెలియచేశాను. గమనించిన శిల్పులు అలా కొంత అవగాహన చేసుకుని శిల్పాలను తీర్చిదిద్దుతున్నారు.

ఈలోగా జనవరి 11వ తారీకు నాడు ఈ శిల్పుల నందరినీ ఒక్కమ్మడిగా రామప్ప గుడికి, ములుగు జిల్లా గణపేశ్వరం శివాలయానికి, హనుమకొండ వేయిస్థంభాల గుడి, వరంగల్ కోటల శిల్పచాతుర్యాన్ని వారికి చూపించాను. అక్కడ పాండురంగారావు గారు (వీరు నృత్త రత్నావళిని ఆంగ్లంలో ఆచార్య పప్పు వేణుగోపాలరావు గారు కలిసి గ్రంథస్థం చేశారు.) మాకు అందించిన సహకారం విలువ కట్టలేనిది. అశ్వినికుమార్ గారి రిఫరెన్స్‌తో వీరిని కలిశాము. ఆ రెండవరోజు నుండీ శిల్పులు రామప్ప శిల్పాల ప్రేరణతో శ్రీ మహావిష్ణువు పైన వున్న ఆభరణాలను అత్యుత్సాహంతో చెక్కడానికి ఉపక్రమించారు. నేను ఆ రెండవ వారం అంటే జనవరి 19వ తారీకు వచ్చేసరికి మహావిష్ణువు పాదపట్టీలు, కాలి అందెలు, ముంజేతి కడియాలు, నడుము వడ్డాణం, ఉదర బంధము, యజ్ఞోపవీతము, మెడలోని ముత్యాల సరాలు, భుజకీర్తులు, భుజాలంకరణలు, కంఠాభరణములు, విశేషమైన రీతిలో అలంకరించబడ్డాయి. విగ్రహాల వరుసలను ఒక్కొక్కరికీ ఒక్కొక్క భాగంగా కేటాయించాడు మెయిన్ శిల్పి. కనుక స్థూలంగా చూస్తే అందరి శైలి ఒక విధంగా పోలిలేదు. ఎవరికి కేటాయించిన భాగం వారి వారి నైపుణ్యాన్ని బట్టి రూపాలు ప్రతిబింబించబడ్డాయి.

వీరిలో ముఖ్యమైన విషయాన్ని ఒకటి గమనించాను. వీరు ముందుగా శిల్పాన్ని లోతుగా చెక్కుకుని తరువాత దాన్ని ఆకారాన్ని నిరూపణ చేస్తారు. కానీ మన భారతీయ నమూనాలు అలా కాదు. నమూనా చేస్తూ లోతుకి వెడతారు. ఇది బర్మా శిల్పులకు, భారత శిల్పులకు మధ్య ఉన్న స్పష్టమైన వ్యత్యాసం. బర్మా శిల్పులు శిల్పాన్ని పూర్తి 3 డైమన్షన్ గా రెండర్ చేయడానికి ఇష్టపడతారు.


శిల్పి టింకో విన్ తో ఎడిటర్

ఈ శిల్పాలు ఎవరి వరకు వాళ్ళు భాగాల వారీగా చేయడం వలన శిల్ప రూపాలలో చిన్న చిన్న వ్యత్యాసాలను వీక్షకులు గమనించవచ్చు. ఈ చెక్కిన ఆభరణాలను కూడా రామప్ప ఆలయ స్ఫూర్తితో వీరు చేశారని మనం భావించగలం. అలా సుమారు రెండు నెలల పైచిలుకు వారు 8 మంది పని చేస్తూ వుండగా ముఖ్య శిల్పాల ముఖాలను తీర్చిదిద్దడానికి పూనుకున్నారు.

జింబోలాగ్ – 2 శ్రీరామ్ పరివార్ , చిన్న మోడల్ కూడా పూర్తి చేస్తూ ఉన్నారు శిల్పులు. వీలు కలిగినప్పుడల్లా జింబోలాగ్-1 డ్రాయింగ్‌లోని 84 దేవతా రూపాలకు ముఖాలను చెక్కడం మొదలుపెట్టారు మిగిలిన శిల్పులు. ఇలా కొనసాగిన 85 రోజుల వారి ప్రణాళిక. ఇది ఫిబ్రవరి 25వ తారీకుతో మొదటి ప్రణాళిక ముగుస్తుంది. వీరి రెండవ ప్రణాళిక మే ఆఖరున మరల మొదలవగలదని భావిస్తున్నాం. ఈలోగా 17 అడుగుల ఎత్తు కలిగిన మద్దును చదలవాడ శరత్ గారు ఒక ఐరన్ గడ్డర్స్ తో కూడిన నిలువెత్తు స్ట్రక్చర్ ని ఆలంబనగా చేసుకుని శ్రీరామ్ పరివార్ విగ్రహం స్థూల రూపంగా నిలబెట్టడం జరిగింది. ఇది రెండవ ప్రణాళిక. ఈ శిల్పం రూపుదిద్దుకుంటున్న సమయంలో ఎంతోమంది సందర్శకులు ఈ జింబోలాగ్ 1ని చూడడానికి వచ్చిన వారిలో కార్టూనిస్టు శంకర్ గారు, ప్రొ. వి. రమేష్ గారు (ఆంధ్ర విశ్వవిద్యాలయ విశ్రాంత ఉపాధ్యాయులు) వైజాగ్ నుంచి వచ్చిన ఆర్టిస్టు, చిప్పా సుధాకర్ గారు ఆర్టిస్ట్, ..... శిశిర్ సహానా (శాంతినికేతన్ లో ఆర్ట్ కాలేజి లో ప్రొఫెసర్), మండలి బుద్ధ ప్రసాద్ గారు(మాజీ డిప్యూటీ స్పీకర్), తనికెళ్ళ భరణిగారు (సినీరచయిత, నటులు), కె. రామచంద్రమూర్తిగారు (ప్రముఖ పాత్రికే యులు), నగ్నమునిగారు (దిగంబర కవుల్లో ముఖ్యులు), 'మిసిమి' సంపాదకులు, రచయిత వల్లభనేని అశ్వినికుమార్ గారు, ప్రముఖ చిత్రకారుడు, పద్మశ్రీ ఎస్వీ రామారావు గారు, సురేష్ (సమాజ సేవకులు), తెనాలి, వెనిగళ్ళ వెంకరత్నంగారు ( రిటైర్డ్ ఆఫీసర్), రవికిషోర్ (ఈనాడు పత్రిక చిత్రకారులు) గారు, ఇంకా సదాశివరావుగారి కుటుంబ సభ్యులు రంజిత్, వినయ, దామరాజు నాగలక్ష్మి, జానకిరాం (ప్రింటింగ్) ఇలా సాహితీ, సాంస్కృతిక మేధా ప్రముఖులు ఎందరో వచ్చి ఈ ప్రాజెక్ట్ ను తిలకించి ఉన్నారు. ఇంకా రావలసిన ఎందరో మహానుభావులు అందరికీ అభినందనాలు. ప్రొఫెసర్ ఎమ్. పాండురంగారావు రావు గారు కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ వారు కూడా ఈ ప్రాజెక్టుకి పరోక్షంగా సహకరించడం హర్షదాయకం. మి



**దివ్యద్వార బంధం**

అపురూపమైన పద్మపత్రాలు, మొగ్గలు, పుష్పాలతో శోభాయమానంగా ఉన్న ఒక దివ్య జలాశయం. దాని మధ్యలో ఓ కల్పవృక్షం. కొమ్మలు, రెమ్మలు, ఆకులు, చిగురులు, మొగ్గలు, పువ్వులు, ఫలములతో తులతూగుతున్న వృక్షరాజం. దానిని ఆశ్రయించి ఉన్న పక్షి క్రిమి కీటకాలతో ఉషోదయవేళ – క్రిందుగా భద్రగజముల గుంపు నీటి చెలమలకు ప్రక్కగా నడుచుచున్న దృశ్యం.

ఈ దృశ్య రూపాన్ని 10 అడుగుల ఎత్తు, 7 అడుగుల వెడల్పు, 2 అంగుళాల మందం కొలతలతో అసలైన జాతి బర్మా టేకు కలపపై ద్వారబంధంగా మలచే ముందు దీనికి సంబంధించిన రేఖాచిత్రాన్ని గీసి బర్మా శిల్పుల వద్దకు చేర్చాం. దాని ఆధారంగానే బర్మా శిల్పులు రెండు తలుపులుగా చేసి చాలా నైపుణ్యంతో చిత్రకారుడు ఇచ్చిన రూపానికి అనుగుణంగా మలిచారు. ఎంతో లాలిత్యంగా ఈ పద్మపత్రాల రూపాలను అవసరమైనంత మేర లోతులతో, ఎత్తులతో సూక్ష్మాతి సూక్ష్మమైన పక్షి ఆకారాల, హావభావాలను కూడా వీరి శిల్ప నైపుణ్యంలో చూడవచ్చు.

# వేదిక

జులై నెల **మిసిమి** లో టి.గౌరిశంకర్ గారి వ్యాసం' ఎన్.టి.ఆర్ మానస పుత్రిక తెలుగు విశ్వవిద్యాలయం'చాలా విపులంగా, వివరంగ విషయ వివరణతో విజ్ఞాన దాయకంగా ఉంది. తెలుగు విశ్వవిద్యాలయస్థాపనకు శ్రీకారం చుట్టిన దగ్గరనుండి మొదలుపెట్టిఎంత బాగా చెప్పారో! తెలుగు విశ్వవిద్యాలయ స్థాపన పూర్వ రంగాన్నంతా ఎంతో ఓపికగా చెప్పారు.

శ్రీ.ఎన్.టి.రామారావు గారికి తెలుగు భాషా సంస్కృతులపై ఎంత మక్కువో తె.వి.వి స్థాపనలో ఆయన చూపిన శ్రద్ధ వల్ల వెల్లడవుతుంది.విద్యాలయ స్థాపనలో ఎందరో రామారావు గారికి వెన్నుదన్నుగా నిలిచారు. హైదరాబాదులో ప్రధాన ప్రాంగణంతో పాటు ఇటు శ్రీశైలంలోను, అటు రాజమహేంద్రిలోను విశ్వ విద్యాలయ ప్రాంగణాలు ఏర్పడటం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు ఇచ్చిన ప్రాధాన్యం వెల్లడవు తుంది.


ముఖ్యమంత్రి శ్రీ. ఎన్.టి.రామారావు చేతులమీదుగా ఎం.ఫిల్.పట్టాను స్వీకరిస్తూ... (1989)

శ్రీశైలం, రాజమండ్రి ప్రాంగణాలను శంఖు స్థాపనలకు సమాయత్తం చేయడనికి ఆ ప్రాంతాల ప్రముఖులతో పాటు సిబ్బంది పడ్డ శ్రమ కళ్ళకు కట్టినట్లు వర్ణించారు.మా రాజమహేంద్రి బొమ్మూరు ప్రాంగణం కీకారణ్యం లాగచెట్లు పొదలు రాళ్ళు కంపలతో ఎగుడు దిగుడుగ వున్నదాన్ని సువిశాలమైన మైదానంగా తయారు చేయటాన్ని నన్నయ భారతంలోని ఆదిపర్వం షష్టాశ్వాసం ప్రారంభంలో 'కుమారాస్త్ర విద్యాప్రదర్శనానికి' వేదికను తయారు చేసిన సంఘటనతో పోల్చి చమత్కారంగ చెప్పారు గౌరిశంకర్ గారు.

ఈ వ్యాసాన్ని చదివి నేనింతగా స్పందించటానికి కారణం లేకపోలేదు. నేను రాజమహేంద్రి ప్రాంగణం నుండి ఎం.ఫిల్ డిగ్రీ పొందిన తెలుగు విశ్వవిద్యాలయం మొట్టమొదటి బ్యాచ్ విద్యార్థినిని. ఎం.ఫిల్‌లో మేము మొత్తం ఎనిమిది మందిమి (నలుగురు విద్యార్థినిలు - నలుగురు విద్యార్థులు) వుండేవారం. ఇద్దరు తప్ప అందరం ఏదో సంస్థలో లేదా కళాశాలలో ఉద్యోగస్తులమే. నేటి మేటి సహస్రావధాని గరికపాటి నరసింహారావుగారు కూడా మా క్లాసుమేటే! మాకు ఆనాటి గురువులు కొత్తపల్లి వీరభద్రరావు, జయధీర్ తిరుమల రావు, శ్రీమతి పొన్నా లీలావతమ్మ గార్లు. అందరం ఎంతో మమతానురాగాలతో ఓ సాహిత్య కుటుంబంలా గడిపేవారం.

ఆపై పి.హెచ్.డి కూడా నేను తెలుగు విశ్వ విద్యాలయంలోనే చేసాను. ఆనాటి రోజులు అందించిన ఆనందకరమైన మరపురాని విషయం అప్పటి ముఖ్యమంత్రి శ్రీ.ఎన్.టి. రామారావు చాన్స్‌లర్‌గ 1989లో ఆయన చేతుల మీదుగ పట్టాస్వీకరించటం. వేదిక మీద ఉన్న కులపతి (చాన్స్‌లర్) ఉపకులపతి (వైస్ చాన్స్‌లర్) కుల సచివులు (రిజిస్ట్రార్)ల వేష భాషలు అన్నీ తెలుగుతనం ఉట్టిపడేలా ఉన్నాయి. తెలుగులోనే కార్యక్రమం జరిగింది. ఎన్నో పత్రికలు ఎన్.టి.ఆర్ శతజయంతిని పురస్కరించు కొని ఆయన నటనా వైదుష్యాన్ని, వైభవాన్ని, ముఖ్యమంత్రిగ ఆయన పాలనా నైపుణ్యాన్ని ఎన్నో విధాలుగా కొనియాడయి. కాని **మిసిమి** పత్రికమాత్రం ఎన్.టి.ఆర్ మానస పుత్రిక అయిన 'తెలుగువిశ్వవిద్యాలయ' ఘన కీర్తిని గూర్చి ఇంత చక్కటివ్యాసాన్ని ప్రచురించినందుకు హృదయపూర్వకంగా **మిసిమి** వారిని మరిమరి అభినందిస్తున్నాను.

ఇన్నేళ్ళ తర్వత మరొక్కమారు తెలుగు విశ్వ విద్యాలయంతో నాకున్న అనుబంధాన్ని జ్ఞప్తికి వచ్చేలా చేసి ఎంతో చక్కటి సమచారాన్ని అందించిన టి.గౌరిశంకర్ గారికి అభివాదాలు తెలియచేస్తున్నాను.

**- విజయ బక్ష్, మండపేట**

# ఖండాంతరాల స్నేహ బంధం

– అవధానం రఘు కుమార్




కల్లేన్ బాక్

**ఖండాంతరాల స్నేహ బంధం, సాధారణ వివరణలకు లొంగని అనుబంధం–గాంధీ – కల్లేన్ బాక్**

పురాణ పాత్రలపై రామ్ మనోహర్ లోహియా సాహిత్యాన్ని తెలుగులో పుస్తకంగా తెచ్చే ప్రక్రియలో భాగంగా లోహియా రాసిన ఒక వివరణ విషయంలో నేను ఒక చోట ప్రాక్టికల్‌గా మంత్ర ముగ్ధుణ్ణి అయ్యాను. భారత దేశపు పురాణ, ఇతిహాస సాహిత్యం ప్రపంచ సాహిత్యంలోనే ఒక అద్భుత స్థానాన్ని కలిగి వుంది. గ్రీకు పురాణ సాహిత్యం కూడా అద్భుతమైనదే. కానీ దాని విస్తృతి కాలపు లెక్కల్లో ఒక మూడు నుండి ఆరు వందల ఏళ్లు. క్రీ. శ 3 వ శతాబ్దం నాటికి గ్రీకు నగర రాజ్యాలు దాదాపుగా బలహీన పడ్డాయి. అందువల్ల అక్కడ ఈ పురాణ, ఇతిహాస సాహిత్యం మరింత ఎదగలేదు. కానీ భారతీయ పురాణ సాహిత్యం నిర్విరామంగా సాగుతూనే వుంది. ముఖ్యంగా అందులోని రామ, కృష్ణ, శివ, రావణ, కర్ణ, పార్వతి, లక్ష్మీ, సావిత్రి, ద్రౌపది, .. ఇలా అనేక పాత్రలు అనేక వివరణాలకు, విశ్లేషణాలకు, కొన్ని సార్లు వ్యతిరేకతలకు కూడా ఉత్ప్రేరకాలుగా అయినాయి.

అనేక పురాణ పాత్రల సంబంధాలలో కృష్ణా – కృష్ణ (కృష్ణుడు – ద్రౌపది) ల సంబంధాన్ని గురించి ఎంతో చర్చ వుంది. అయితే ఈ చర్చలో లోహియా వివరణ అత్యంత విశిష్టమైనది. ఆయన ఇచ్చిన వివరణ ఇటు సాహిత్యకారులను, అటు మానవ విజ్ఞాన నిపుణలను ఆశ్చర్య పరిచేదే! మానవ సంబంధాలను నేలపైకి లాగి, నీఛపు స్థాయితలో అర్థం చేసుకునే ఈ సమాజంలో కృష్ణుడు – ద్రౌపదిల గురించిన లోహియా ఆలోచనలు, విశ్లేషణ భారతీయ జ్ఞానాన్ని, మానవ సంబంధాల చిత్రీకరణని మహోన్నత శిఖరాల నిలపింది. కృష్ణుడు – ద్రౌపదిలది అన్న చెల్లెళ్ల సంబంధమా? ప్రియా ప్రియుల సంబంధమా? ... అంటూ మొదలు పెట్టి అది ఒక వున్నతమైన, అత్యంత సంస్కార వంతమైన, పురాణ సాహిత్యంలో అతి అరుదైన “సఖా – సఖీ” సంబంధం అంటాడు లోహియా. ఈ “సఖా–సఖీ” సంబంధం స్నేహాన్ని మించింది, శారీరక – భౌతిక అనుభవాలు, అవసరాల పరిధిని దాటినది అంటాడు. ఆధునిక జీవితంలో, ఆధునిక జ్ఞానంలో మునకలు వేస్తున్న అనేక మందికి ఈ లోహియా ప్రతిపాదన ఒక అర్థం కానీ ప్రహేళిక.

మహాభారతం లోనే మనకు అలాంటి అనేక ఇతర గొప్ప సంబంధాలు కనిపిస్తాయి – కృష్ణుడు – కుచేలుడు, కృష్ణుడు – అర్జునుడు, దుర్యోధనుడు – కర్ణుడు... వాటి గురించి ఎన్ని విశ్లేషణలు చేసినా తక్కువే! ఇక ఈ దేశపు అశేషమైన ఇతిహాస, పురాణ, ప్రబంధ, భక్తి సాహిత్యాలను పరిశీలిస్తే అవి ఊహించిన, సృష్టించిన, వివరించే ప్రయత్నం చేసిన మానవ సంబంధాల వైవిధ్యం అనంతమైనది. నిజానికి ఏ పాశ్చాత్య దేశాలలోనైనా ఇలాంటి అద్భుత సాహిత్యం వుంటే, వారి ఆధునిక మానసత్త్వ శాస్త్రవేత్తలెవరికైనా వీటిని వివరించే అవకాశం దొరికి వుంటే వారు ఆనందంతో అద్భుతమైన కృషి చేసి వుండేవారు. కానీ తిట్టు, విమర్శ తప్ప సృజనాత్మకంగా, నూతనంగా సృష్టించే, విశ్లేషించే, అర్థం చేసుకునే శక్తిని మనం ఎందుకో గత కొంత కాలంగా కోల్పోయాం. ఒక పురుషుడు – స్త్రీ కలసి కనిపిస్తే శృంగారం అనే భావన,

అలాగే ఒక పురుషుడు – మరో పురుషుడి భుజం మీద చేయివేసి నడిస్తే స్వలింగ సంపర్కం అనే అత్యంత చౌకబారు స్థాయిలోకి మనం ఎప్పుడు దిగజారి పోయామొ తెలియదు. నిజానికి ఇవి మన సాంస్కృతిక విలువలు కూడా కావు. అలాంటి స్థితిలో మరి ఇంత సంక్లిష్టమైన, కాలపు పొరలలో ఎక్కడో దాగిన సుదూరమైన పురాణ సాహిత్యాన్ని అర్థం చేసుకోడమే కష్టమే కదా? ఇక విశ్లేషణ సాధ్యమే?

మనకంటే చాలా వెనుక నాగరిక ప్రయాణం మొదలు పెట్టిన పాశ్చాత్య దేశాలలో గ్రీకు పురాణ సాహిత్యాన్ని అర్థం చేసుకున్న తీరు, ఆ కథలనూ, గాథలనూ తిరిగి ఆధునిక శాస్త్రాలైన సోషియాలజీ, మానసిక శాస్త్రాలలో ఉపయోగించుకున్న తీరు ఎంత ఔన్నత్యాన్ని, ఎంత ఉదారత్వాన్ని ప్రదర్శిస్తాయి? అనుకోని సంఘటనల నేపధ్యంలో, తన తండ్రిని చంపి, తల్లిని పెళ్లి చేసుకున్న ఈడిపస్ గాథని ఆధునిక మానసిక శాస్త్రంలో ఒక మానసిక సంక్లిష్ట స్థితిని వివరించడానికి ఈడిపస్ కాంప్లెక్స్ అని ఉపయోగించిన పాశ్చాత్యులు మనకు కొన్ని పాఠాలు చెబుతున్నారు. అలాగే మడోన్నా – హెూర్ కాంప్లెక్స్. పురాతన గాథలను, కథలనూ, ప్రతిమలనూ కేవలం ఎగతాళికి, తిట్టుకూ, విమర్శకూ వాడుకోవచ్చును. లేదా సృజనాత్మకంగా, క్రియాశీలకంగా ఒక సంక్లిష్ట, విపరీత, విభిన్న పరిస్థితిని నిర్వచించడానికి కూడా వాడుకోవచ్చును. మనం ఎలా వాడుతున్నాం అనేది మన నాగరిక, సంస్కార, సాంస్కృతిక, చైతన్య స్థాయిలను తెలుపుతుంది.


గాంధి - కల్లేన్ బాక్

ఈ లోకంలో, చరిత్రలో, ఈ ప్రపంచ జీవన నాటక రంగంపై అద్భుతమైన స్నేహాలు అనేకం వున్నాయి. తాత్విక లోకంలో అందరికీ తెలిసిన అపూర్వ సంబంధం మార్క్స్ – ఎంగెల్స్ ది. ఒక జ్ఞానవంతమైన, అపారమైన కార్మిక ప్రేమికుడు, మేధావి ఒకరు. ఒక వ్యాపారి – వ్యాపారం అంటే ఎంతో తెలిసి, వాటి సూత్రాలను బట్టబయలు చేసిన మరో మేధావీ! అది ఒక ఫలవంతమైన జ్ఞానాన్ని మానవలోకానికి పరిచయం చేసింది. అలాంటి మరో ఉదాహరణ హెల్లెన్ కెల్లర్ – మార్క్ ట్వేయిన్‌లది. కెల్లర్ పుట్టు గుడ్డి, మూగ. తాత్వికంగా ఒక రాడికల్ సోషలిస్ట్ జ్వలన శీలి. శ్రామిక జన జీవనం తో "కలసి పోతిని, కదలి పోతిని, కానరాకే కరగి పోతిని" అని బ్రతికిన జీవనం. మార్క్ ట్వేయిన్ మతాన్ని, మత ఛాందశాన్ని నిరసించినా ఒక నిరంతర నిరాశవహ, వ్యంగ్య ప్రవాహం. వయస్సులోనూ దాదాపు నలభై ఏళ్ల తేడా! కానీ కెల్లర్ ఎదుగుదల, అనేక అనానుకూలతల మధ్య తనని తాను నిలబెట్టుకునే ప్రయత్నంలో ఆమె చేసిన జీవన సంఘర్షణలలో ట్వేయిన్ ఆమెకు సహాయం చేసిన అదృశ్య, ఆపన్న హస్తం.

చరిత్రలో అలాంటి మరో సులభ విశ్లేషణలకు అందని స్నేహం, సంబంధం, ఆత్మీయత గాంధీ – కళ్ళేన్ బాక్‌లది. అది కేవలం స్నేహమేనా? అంతకు మించి ఇంకేమయినా వుందా? నిజానికి 2011 దాకా ఇలాంటి చర్చ ఒకటి వస్తుందని, దానికి గాంధీ కానీ, ఆయన అనుచరులు కానీ సమాధానాలు వెతుక్కోవలసిన అవసరం వస్తుంది అని కానీ ఎవరి ఆలోచనాలలోనూ లేదు. 2011 లో ప్రచురింప బడ్డ ఒక అమెరికన్ జర్నలిస్ట్, 1994–2003ల మధ్య న్యూయార్క్ టైమ్స్ ఎడిటర్ అయిన జోసెఫ్ లేలివెల్డ్ రాసిన ఒక పుస్తకం – "గ్రేట్ సోల్ – మహాత్మా గాంధీ అండ్ హిస్ స్ట్రగుల్స్ విత్ ఇండియా" గాంధీ అనుయాయులలో అలజడిని, ఆందోళనలను రేకెత్తించింది. ఎందుకు? అందులో లేలివెల్డ్ మొదటిసారి తన మేధస్సుతో వీరి మధ్య వున్న సంబంధం "స్వలింగ సంపర్కం" అని ఒక విస్ఫోటనం సృష్టించాడు. అప్పటిదాకా గాంధీ కానీ, గాంధీ శిష్యులు కానీ గాంధీ మీద ఏవైనా ఆరోపణలూ, నిందలూ వస్తే వాటిని ఆయా వ్యక్తుల, రచయితల, మేధావుల విజ్ఞతకు వదిలేసే వారు. వారి సాధారణమైన జవాబు – గాంధీకి ఒక బాహ్య జీవితం, మరో రహస్య, ఆంతరంగిక జీవితం అంటూ లేదు, అది తెరచిన పుస్తకం, ఆయన జీవితంలో దాదాపు యవ్వనం నుండీ, ఆయన చని పోయేదాకా ప్రతి కదలిక, చర్య, చివరికి ఆయన ఆలోచనలు కూడా బహిరంగమే! నిజానికి ఆయన జీవితంలో "మిస్సింగ్ పీరియడ్స్", "తెలియని సమయాలు", శోధించి, ఛేదించి కనుక్కోవలసిన కొత్త

అంశాలూ, రహస్యాలూ అంటూ ఏమీ లేవు. అయినా ఆయన చుట్టూ ఎప్పుడూ అనేక మంది ఆశ్రమ జీవులూ, ఆశ్రితులు, స్నేహితులు, రాజకీయ, తాత్విక అనుచరులు, దేశ, విదేశ విలేఖరులూ, .. వుండేవారు. ప్రపంచంలో అతి ఎక్కువగా ఫోటోలు తీయబడ్డ వ్యక్తులలో ఆయన ఒక్కడు. ప్రతి క్షణం ఎవరో ఒకరితో నిండి వుండే జీవితం. నిరంతర చలన జీవితం. జీవితంలోని దాదాపు అన్నీ క్షణాలు డాక్యుమెంట్ చేయబడి, రికార్డు చేయబడ్డ జీవితం. ఏదైనా ఛేదించవలసిన రహస్యాలు వుంటే అనేక సార్లు ఆయన బాధతో, విసుగుతో, విరక్తితో నవ్విన నవ్వులు, కొన్ని మాటల ప్రహేళికలు. కానీ జీవితానికి సంబంధించిన రహస్యానికి తావేది?

అలాంటప్పుడు ఎవరయినా ఒక పాశ్చాత్యుడు సారి అయిన అవగాహన కలిగో, లేకనో ఓ మాట అంటే నష్టం ఏమిటి? ఎందుకు ఆయన శిష్యులు ఉలిక్కి పడ్డారు? ఎందుకు ఆ పుస్తకాన్ని నిషేధించాలని ఉద్యమాలు చేశారు? ఇంతకీ లెలీవెల్డ్ తన పుస్తకంలో ఏమన్నాడు? గాంధీ–కెల్లెన్ బాక్ ల మధ్య సంబంధం – "స్వలింగ సంపర్కం" అన్నట్టుగా కొన్ని చోట్ల చాలా నర్మగర్భంగా, అక్కడక్కడా ప్రత్యక్షంగా అంటాడు. సత్యం, అహింసల గురించి మాట్లాడే గాంధీయులు ఒక్కసారి ఉలిక్కి పడ్డారు. ఆ పుస్తకాన్ని నిషేధించాలి అనే దాకా వెళ్లారు. ఏమయితేనేం 2011 లో లేలివెల్డ్ పుస్తకం బయటికి వచ్చింది. అది చదివిన పాఠకులలో నేనూ ఒకడినే.

దాదాపు అదే సమయంలో ఈ పుస్తకం పై "నిషేధం" అన్న వార్తా విని పాల్ రుడ్నిక్ అనే అమెరికన్ రచయిత, సినిమాలకు స్క్రీన్ ప్లే లు రాసే వ్యక్తిగా ప్రసిద్ధుడైన ఒక వ్యక్తి "న్యూయార్క్ టైమ్స్" లో (న్యూ యార్క్ టైమ్స్ ఏప్రిల్ 4, 2011 లో "ఐ వాస్ గాంధీ'స్ బాయ్ ఫ్రెండ్" అనే ఒక వ్యాసంలో) గాంధీకి బాగా వ్యాయామం చేసి, ధృడమైన శరీర సౌష్టవం కలిగే వారంటే చాలా ప్రేమ, కళ్ళెన్ బాక్ అలాంటి శరీర సౌష్టవం వున్న వ్యక్తి అంటూ రాశాడు. నిజానికి ఈ లేలివెల్డ్ పుస్తకం తరువాత కాలంలో చాలా మంది గాంధీ ద్వేషులకు ఒక పెద్ద ఆయుధం దొరికినట్టు అయ్యింది. గాంధీని భౌతికంగా హత్య చేసినా తృప్తి చెందని కొందరికి ఇప్పుడు ఆయనను నైతికంగా కూడా హత్య చేయగలిగే బలమయిన ఆయుధం దొరికింది అనుకున్నారేమో!

గాంధీ – కల్లేన్ బాక్ ల మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాల లోని కొన్ని పదాలు – ముఖ్యంగా – లండన్ నుండి గాంధీ కళ్ళెన్ బాక్ కు రాసిన ఉత్తరం లో – "నా పడక గదిలో నీ ఫోటో ఒకటి వుంటుంది. అది నా మంచానికి ఎదురుగా వుంటుంది" అని రాసిన మాటలు లేలివెల్డ్ విశ్లేషణకు ప్రధాన భూమిక. ఈ మాటలూ, ఇతర ఉత్తర ప్రత్యుత్తరాలని విశ్లేషిస్తూ లేలి వెల్డ్ అనేక ఊహలు చేస్తాడు. అయితే 19.09.2015 లో "టైమ్స్ ఆఫ్ ఇండియా" షిమోన్ లేవ్ అనే ఒక ఇజ్రాయిలీ పరిశోధకుడితో ఆ పత్రిక ప్రతినిధి కౌన్తేయ సింహా చేసిన ఒక ఇంటర్వ్యూ ప్రచురించింది. లేవ్ అంతకు ముందు ఒక కేసు విచారణ, విశ్లేషణలో భాగంగా హెర్మన్ కెల్లెన్ బాక్ సమాధిని చూడడానికి వెళతాడు. అందులో భాగంగా కెళ్ళెన్ బాక్ ప్రాచీన ప్రతులు చూసే అవకాశం వస్తుంది. అందులో గాంధీ – బాక్ ఉత్తరాల ప్రతులూ దొరుకుతాయి. వాటిని విస్తృతంగా పరిశీలించిన లెవ్ తాను "టైమ్స్ ఆఫ్ ఇండియా" కు ఇచ్చిన ఇంటర్వ్యూ లో వాటిని వివరిస్తాడు. కెల్లెన్ బాక్ ను గాంధీ "ఆత్మీయ మిత్రుడు" (సోల్ మేట్) అంటాడు. అది వ్యక్తిగత, నైతిక, ఆధ్యాత్మికత ఇలా..పరస్పర ఔన్నత్యం కోసం ఏర్పడ్డ పరిచయం అంటాడు.

ఇంతకీ ఈ కళ్ళెం బాక్ ఎవరు? లిథుయేనియా అనే దేశంలో పుట్టిన ఒక యూదుడు. పూర్తి పేరు హెర్మన్ కళ్ళెన్ బాక్. జర్మనిలో ఆర్కిటెక్చర్ చదివి, 1896 లో సౌత్ ఆఫ్రికాలోని జోహనస్ బర్గ్ లోని తన బంధువుల ఆర్కిటెక్చర్ వ్యాపారంలో చేరడానికి వస్తాడు. కొంత కాలానికి సౌత్ ఆఫ్రికా పౌరుడు కూడా అవుతాడు. మంచి శారీరక ధృఢత్వం కలిగిన వ్యక్తిగా గుర్తింపు వున్న వ్యక్తి. స్కేటింగ్, ఈత కొట్టడం, సైక్లింగ్, .. ఇలా అనేక ఆటలలో నేర్పరి. అంతే కాదు – వడ్రంగి పని, చెప్పులు కుట్టడం, బట్టలు కుట్టడం .. ఇలా అనేక వృత్తి పనులలో కూడా ప్రవీణుడు. 1904 లో మొదటి సారి గాంధీని కలిస్తాడు. అప్పటికి గాంధీ సౌత్ ఆఫ్రికాలో భారతీయుల పౌర హక్కుల కోసం పోరాడుతున్నాడు.

మొదట్లో వారు మత విషయాల చర్చలలో భాగంగానే మిత్రులు. కెల్లెన్ బాక్ యూదు మతంలో 19 వ శతాబ్దంలో వచ్చిన జియోనిస్టు ఉద్యమ నేపథ్యం నుండి వచ్చిన వాడు. అదే సమయంలో ఇటు టాల్స్టాయ్, బుద్ధ

ఆలోచనలతో కూడా ప్రభావితం అయిన వ్యక్తి. వారి ఇద్దరి మధ్య ప్రధాన చర్చ, వారి మైత్రికి తొలి పునాది ఈ మత పరమైన అంశాల పై చర్చ. గాంధీ కూడా టాల్స్టాయ్ ఆలోచనలతో కొంత ప్రభావితం అయిన వ్యక్తి. అయితే కాలక్రమేణా కెల్లేన్ గాంధీ "సత్యాగ్రహం" వైపు ఆసక్తుడు అవుతాడు. గాంధీ మాటలలో వారు "ఆత్మీయులు". ఇప్పుడు "సత్యాగ్రహ గృహం" అని ప్రసిద్ధి కెక్కిన జోహన్నాస్ బర్గ్ లోని గాంధీ వున్న ఇల్లు కళ్ళెన్ బాక్ డిజైన్ చేసిందే! అప్పటికే తన వ్యాపారంలో బోలెడు ధనం సంపాదించిన కెల్లేన్ 1910 లో గాంధీ తన ఆదర్శాల క్షేత్రంగా, ఆచరణ క్షేత్రంగా ఒక ఆశ్రమము పెట్టాలని అనుకున్నప్పుడు - ("టోల్ స్టోయ్ ఫారం") దాని నిర్మాణానికి 1000 ఎకరాల భూమిని దానంగా ఇచ్చేస్తాడు.

ఈ "టోల్ స్టాయ్ ఫారం" అనే పేరు కూడా కెల్లేన్ బాక్ పెట్టిందే. ఇక్కడే కల్లేన్ బాక్ తన విలాస వంతమైన జీవితాన్ని త్యజించి సాధారణ ఆశ్రమ జీవితాన్ని, శాకాహార జీవితాన్ని స్వీకరించడం మొదలు పెడతాడు. డిసెంబర్ 1914 లో గాంధీ సౌత్ ఆఫ్రికా వదిలేసే దాకా ఇద్దరూ, మరో స్నేహితుడు పొలాక్ తో కలసే వుంటారు. 1913లో సౌత్ ఆఫ్రికాలో గాంధీ ఏర్పాటు చేసిన రెండో ఆశ్రమం "ఫీనిక్స్" లో కూడా వీరంతా కలసే వున్నారు. నిజానికి 1914 లో గాంధీతో కలిసి ఇండియా కూడా వద్దాం అనుకున్నాడు. అయితే అదే సమయంలో ప్రారంభం అయిన మొదటి ప్రపంచ యుద్ధంలో ఆయన జర్మన్ దేశ పౌరుడు కావడం వల్ల సౌత్ ఆఫ్రికా బ్రిటిష్ ప్రభుత్వపు ఆయనను "విదేశీ శత్రువు" కేటగిరిలో సౌత్ ఆఫ్రికన్ జైల్ లోనే వుంచేయవలసి వస్తుంది. 1917 లో బయటికి వచ్చాక తిరిగి సౌత్ ఆఫ్రికాలోనే తన ఆర్కిటెక్ట్ పని ప్రారంభిస్తాడు.

తరువాతి కాలంలో జర్మనిలో నాజిజం బలంగా ఎదగడంతో షాక్ గురి అయ్యి, కొంత కాలం అహింసా, సత్యాగ్రహ లాంటి ఆలోచనలను పక్కన బెట్టి తన జీయోనిస్ట్ మూలాలు వెతుక్కుంటూ జీవితాన్ని గడుపుతాడు. జియోనిస్టుగా మారడం కూడా మొదలు పెడతాడు. అదే ప్రయాణంలో భాగంగా తిరిగి రెండు దశాబ్దాల తరువాత 1937లో గాంధీని కలిసి తన ఉద్యమానికి సలహా, సహాయం కోసం వస్తాడు. కానీ ఇక్కడ ఏం జరిగిందో కానీ గాంధీ ప్రభావంతో తిరిగి ఆశ్రమ జీవిగా సాధారణ జీవితం వైపుకు వస్తాడు. అయితే వీరి మధ్య చర్చలలో ప్రధాన విషయం హిట్లర్ నాజీయిజాన్ని ఎలా ఎదుర్కోవాలి అన్నదే అంటారు కొంత మంది ఆంతరంగికులు. గాంధీ అహింసను, కల్లేన్ హింస అవసరాన్ని గురించి వాదించుకున్నారు అని కూడా అంటారు. అక్కడే వారి మధ్య తొలి, బలమైన విభేదాలూ కూడా వచ్చాయి అంటారు మరికొంత మంది పరిశీలకులు. అయినా వారి మధ్య స్నేహం దెబ్బ తినలేదు. 1939 లో కళ్ళెన్ మళ్ళీ ఇండియా వచ్చి గాంధీని కలుస్తాడు. కళ్ళెన్ సౌత్ ఆఫ్రికా లోనే 1945 లో చనిపోతాడు. తన సంపాదనలోని అధిక భాగాన్ని సౌత్ ఆఫ్రికాలోని భారతీయులకే ఇచ్చేస్తాడు.

లేలివెల్డ్ గాంధీ, కళ్ళెన్ బాక్ ల సంబంధాన్ని గురించి రాయడానికి పది ఏళ్ల ముందే ఈసా సరీద్, క్రిస్టియన్ బార్టాఫ్ లు 1996 / 97 లలో హెర్మన్ కళ్ళెన్ బాక్ జీవిత చరిత్రను (హెర్మన్ కెల్లేన్ బాక్ -మహాత్మా గాంధీ'స్ ఫ్రెండ్ ఇన్ సౌత్ ఆఫ్రికా - ఏ కన్సైజ్ బైయోగ్రాఫి) రాశారు. అందులో కూడా వీరిద్దరి మధ్య వున్న సంబంధాన్ని, వీరి మధ్య జరిగిన చర్చలను, ఉత్తర ప్రత్యుత్తరాలను పరిశీలించారు. నిజానికి ఈసా సరీద్ కెల్లేన్ బాక్ చుట్టం కూడాను. 1945 లో కెల్లేన్ బాక్ చనిపోయినప్పుడు గాంధీ రాసిన సందేశంతో ఈ పుస్తకం దాదాపుగా మొదలు అవుతుంది. ''ఆఫ్రికా ఒక గొప్ప సహృదయున్ని కోల్పోయింది. ఆ దేశంలోని భారతీయులు ఒక ప్రేమాస్పద మిత్రుణ్ణి కోల్పోయారు. అతని మరణంతో నేనూ అత్యంత ప్రియమైన, సన్నిహితమైన మిత్రుణ్ణి కోల్పోయాను. అతను తరచూ నాతో చెపుతూ వుండేవాడు: ఎప్పుడైనా ఈ లోకం అంతా నిన్ను వదిలేసినా, అవసరమయితే నాలో నీతో ఈ భూమి అంచుల దాకా నడిచే ఒక నిజమైన మిత్రుణ్ణి చూస్తావు".

గాంధీ "ఆత్మకథ", "సత్యాగ్రహ ఇన్ సౌత్ ఆఫ్రికా" లాంటి పుస్తకాలు చదివిన వారికి కళ్లేన్ బాక్ గాంధీకి కేవలం మిత్రుడూ, సహచరుడే కాదు, సౌత్ ఆఫ్రికాలో భారతీయుల హక్కుల ఉద్యమం విజయవంతం అవ్వడానికి, భారతీయులు అంతిమంగా విముక్తి పొందడానికి ప్రధాన బాధ్యత తీసుకున్న వ్యక్తి అని అర్థం అవుతుంది. అందుకే కెల్లేన్ బాక్ మృతి సమయంలో గాంధీ తన సౌత్ ఆఫ్రికా జీవితంలో తనకు కార్యదర్శి గా పనిచేసిన సోనియా ష్లేజీన్ కు రాసిన మరో ఉత్తరంలోనూ - "ఒక

నిజమైన మిత్రుడు మనల్ని వదలి వెళ్ళి పోయాడు" అని రాస్తాడు.

కెల్లెన్ బాక్ కి ఇతరులతో స్నేహాలు చేయడం పెద్ద అలవాటు. చాలా మంది ప్రపంచ ప్రఖ్యాత రచయితలు, మేధావులు ఆయనకు మిత్రులు. ఆయన స్నేహితాలు విశ్వవ్యాపితం. ఉదా: చాయిమ్ వీజ్మన్ (1949– 1952 ల మధ్య ఇజ్రాయిల్ మొదటి ప్రెసిడెంట్, రష్యా లో పుట్టి పెరిగిన బయో కెమిస్ట్, ప్రముఖ జీయోనిస్ట్ నాయకుడు), ప్రొ. బ్రోడెట్స్కీ (గణిత శాస్త్ర నిపుణుడు), బ్రోన్స్లావ్ హుబర్మన్ (పోలాండ్‌కు చెందిన ప్రముఖ వయొలిన్ విద్వాంసుడు) స్కాటిష్ కవయిత్రి ఈశబెల్లా మెయో, జార్జ్ బెర్నార్డ్ షా,... ఇలా ఆ లిస్ట్ చాలా పెద్దది.

ఆయన చిన్నప్పటి ఇంటి మత, రాజకీయ వాతావరణం జియోనిజం. ఇది యూధులకు ఒక స్వంత దేశం ఉండాలి అని కోరుకునే జాతీయ ఉద్యమం. అంతిమంగా ఇజ్రాయిల్ ఏర్పాటుకు కారణం అయిన మత – రాజకీయ – సామాజిక ఉద్యమం. అప్పటికే యూరోప్ లో బలంగా వున్న యాంటీ–సెమెటిజం (యూధులను అసహ్యించుకుని, వివక్షకు గురిచేసి, హింసించి, ఒక్కోసారి సామూహిక హత్యలకు కూడా కారణం అయిన ఆలోచన) ను ఎదిరించి, యూధుల హక్కులు, వారికి వారి ప్రత్యేక దేశం వుండాలనే ఆలోచన నుండి వచ్చిన ఈ ఉద్యమంలో ప్రపంచ వ్యాప్తంగా అనేక మంది యూదు మేధావులు, కార్యకర్తలు పాలు పంచుకున్నారు. ఇది ఒకరకమైన యూదు జాతీయ వాదం.

హెర్మన్ కళ్ళెన్ బాక్ తల్లి తండ్రులు యూదులు అయినా, వారి పిల్లలను సాధారణ జర్మన్ విద్యాలయాల లోనే చదివించారు. అయితే చిన్ననాటి నుండీ ఇతను అనేక విధాలయిన వృత్తి విద్యలు, ఆటలు, శారీరక వ్యాయామాలలో ఆరితేరిన వాడు. మన భాషలో సకల శాస్త్ర ప్రవీణ. మాక్స్ నార్డో అనే జియోనిజం చరిత్ర కారుడు కెల్లెన్ బాక్ ని "మజ్ల్ జూ" అంటాడు. ఇతనికి గాంధీని పరిచయం చేసింది ఖాన్ అనే ఒక సౌత్ ఆఫ్రికా లో వున్న ఇండియన్ న్యాయవాది. గాంధీ న్యాయ వాద వృత్తి నుండి ప్రజా ఉద్యమాల వైపు వెళుతూన్నప్పుడు ఖాన్ గాంధీ కోర్టు వ్యవహారాలు చూసుకునే వాడు. మొదటిసారి గాంధీని కెల్లెన్ బాక్ కలసినప్పుడు గాంధీ ఇతని విలాసవంతమైన జీవితం చూసి నిర్ఘాంత పోతాడు.

వారి తొలి పరిచయం ఎక్కువగా మతపరమైన అంశాల మీదే – ముఖ్యంగా గౌత బుద్ధుడి చుట్టే. గాంధీ ఆత్మ కథలో "టువర్డ్స్ సెల్ఫ్ రిస్ట్రైయిన్ట్" నుండి రెండో అంశం టాల్స్టాయ్. గాంధీ నిరాడంబర జీవితం గురించి చేస్తూన్న ప్రయోగాలు మరో విషయం. గాంధీ ప్రభావంతో కెల్లెన్ బాక్ శాకాహారం, నిరాడంబరత వైపు వచ్చాడు. ఆ సమయంలో కెల్లెన్ బాక్ జర్మనిలో వున్న తన సహోదరుడికి ఉత్తరం రాస్తూ: "అయిదు వారాలుగా పనిమనిషి లేదు.. మా పనులు మేమే చేసుకుంటున్నాం. మేమే వండుకుంటాం, వడ్డించుకుంటాం, గిన్నెలు తోముకుంటాం .. నేనూ ఒక సంవత్సరంగా మాంసాహారం మానేశాను. గత 18 నెలలుగా నేనూ నా శృంగార జీవితాన్ని వదిలశాను. ... మెల్లగా నాలో వుండే వింత పోకడలు పోయి, నేనూ మొత్తం మీద మార్పుకు లోను అవుతున్నాను... అయితే ఏ క్షణాన అయిన నేనూ తిరిగి మారి పోవడానికి సిద్ధంగా వున్నాను." అంటాడు.

గాంధీ – కెల్లెన్ బాక్ లు ఒకరిని ఒకరు "దిగువ సభ'' (కెల్లెన్ బాక్), "ఎగువ సభ'' (గాంధీ) అని సంబోధించుకునే వారు. దిగువ సభ ఆశ్రమానికి సంబంధించిన ఆర్థిక వ్యవహారాలు, జమాఖర్చులు .. చూసుకుంటే, ఎగువ సభ అందులోని అనవసరపు ఖర్చులను నియమిస్తూ, కోత విధిస్తూ వుంటుంది. ఈ పదాలు ఆధునిక భారత పార్లమెంటరీ వ్యవహారాలతో పరిచయం వున్న వ్యక్తికి ఎవరికైనా అర్థం అవుతుంది. మనం కూడా బ్రిటిష్ వారి నుండీ దిగుమతి చేసుకున్నాం. 1908 లో కళ్ళెన్ బాక్ ఒక కారు కొంటాడు. అది చూసి గాంధీ మౌనంగా వుండిపోతాడు. దాదాపు ఒక సంవత్సరం పైన ఆ కారు అలా నిరుపయోగంగా గరాజ్‌లో పడి వుంటుంది. ఒక సారి 1914 లో ఇద్దరూ ఒక నౌక మీద ప్రయాణం చేస్తున్నప్పుడు కల్లెన్ బాక్ బైనాకులర్స్‌తో చుట్టూ చూస్తుంటే గాంధీ అవి లాక్కుని సముద్రంలో పడేస్తాడు. ఇలా గాంధీ నిరంతరం కళ్ళెన్ బాక్ విలాసవంత జీవితాన్ని కట్టడి చేయడం మనం చూస్తాం. అంతకు మించి వారి స్నేహం ఒక ఆత్మీయ సంబంధంగా ఎదిగింది. ఇద్దరూ వారి బాధలను, ఆనందాలనూ ఒకరితో ఒకరు పంచుకున్నారు.

వీరిద్దరినీ కలపిన మరో బంధం – ప్రసిద్ధ రష్యన్ రచయిత, శాంతి కాముకుడు .. టాల్ స్టాయ్. ఇద్దరూ

ఆయన అభిమానులు. టాల్ స్టాయ్ తన రచనలలో రాజ్యం, చర్చి, సైన్యం.. ఈ మూడింటిని ప్రశ్నిస్తాడు. ఆయన రాసిన "కింగ్డం ఆఫ్ గాడ్ ఈస్ విథిన్ యు" పుస్తకం ఇద్దరికీ ప్రియమైనది. విశేషం ఏమిటంటే అదే సమయంలో ఆరొన్ డేవిడ్ గోర్డాన్ అనే జియోనిస్టు పాలస్తీనాలో కిబ్బుట్జ్ దేగానీయ అనే ఒక కమ్యూనిటీ ప్రయోగం చేస్తున్నాడు. వీరి వ్యవసాయ క్షేత్రాన్నే కెల్లెన్ బాక్ గాంధీ ఆశ్రమానికి ఇచ్చింది. అలాగే సౌత్ ఆఫ్రికా లో గాంధీ చేసిన ప్రతి ఉద్యమానికి వెనుక ప్రోత్సాహక హస్తం కెల్లెన్ బాక్. మామూలుగా అత్యంత దుందుడుకుగా వుండే కళ్ళెన్ బాక్, గాంధీ సాహచర్యం లో అత్యంత సౌమ్యుడుగా, అహింసా వాది మారిపోయాడు. ఒకసారి ఒక పాతకాలపు యూరోపియన్ మిత్రుడు కళ్ళెన్ బాక్ ని ద్వంద యుద్ధానికి రమ్మంటాడు. అయితే కళ్ళెన్ బాక్ ఇప్పుడు నేను అహింసావాదిని, యుద్ధాలు చేయను అంటాడు. 1914 లో గాంధీ సౌత్ ఆఫ్రికా నుండి తిరుగు ప్రయాణం చేసే సమయంలో జరిగిన ఒక వీడ్కోలు సభలో కళ్ళెన్ బాక్ ఇలా అంటాడు: "గాంధీ! నీవు నాకు నా మతం అంటే ఏమిటో గొప్పగా అర్థం చేయించావు. నా ప్రజలను నేనూ ఎక్కువగా ప్రేమించేలా చేశావు. నన్ను మరింత నిగర్వి గా, మరింత క్రియాశీలక వ్యక్తిగా, మరింత సత్యవంతుడిగా చేశావు... ఇక్కడ ముస్లిములు, హిందువులు కలసి వుండేలా చేశావు. కేవలం బాహ్యంగానే కాదు, అంతరాలలోనూ. .. భారతీయులు తమ సాంప్రదాయా లనూ, కట్టుబాట్లను ఎందుకు గౌరవించాలో నేర్పించావు".

ఇలా గాంధీ స్నేహంలోనే కళ్ళెన్ బాక్ తన దేశపు జియోనిస్టుల పట్ల ప్రేమను, వారి సమస్యల పట్ల పోరాడవలసిన అవసరాన్ని తెలుసుకున్నాడు. వారు 1914 లో విడిపోయాక, కళ్ళెన్ బాక్ 1917 లో జైలు నుండి విడుదల అయ్యాక ఆయన జర్మని లోని యూదుల సమస్యలపై పోరాడడానికి, తిరిగి జియోనిస్టు ఉద్యమంలో పనిచేయడానికి కారణం గాంధీ. తిరిగి 1937 లో ఈ జియోనిస్టు ఉద్యమంలో భాగంగా సలహాల కోసం కెల్లెన్ బాక్ ఇండియా వస్తాడు. వారు ఇద్దరూ ఇండియాలో మహదేవ్ దేశాయి ఇంట్లో కలిశారు. ఆ సమయంలో గాంధీ తన రోజు వారి చర్యలో భాగంగా ప్రార్థనా సమావేశంలో వున్నారు. అది అయ్యే దాకా కెల్లెన్ బాక్ నిరీక్షిస్తూనే వున్నాడు. ప్రార్థనా సమావేశం అయ్యాక గాంధీ కళ్ళెన్ బాక్ దగ్గరికి వచ్చి, కౌగలించుకుని అతని కళ్ళలోకి చూస్తూ – "ఎంత కాలం అయ్యింది?" అంటాడు. కళ్ళెన్ బాక్ "23" అంటాడు. "రా గదిలోకి వెళదాం. ఈ చీకటిలో నీ మొహం నాకు కనిపించడం లేదు" అంటూ గాంధీ ఇతన్ని గదిలోకి తీసుకెళ్ళి లాంతరు వెలుతుర్లో అతన్ని చూస్తూ, అతని తల నిమురుతూ – "నాలాగే నీ జుట్టు తెల్ల బడిందే!" అంటాడు. ఆ సమయంలో వారి సంభాషణాలలో ఎక్కువగా అస్పృశ్యత నివారణలో భాగంగా గాంధీ చేస్తున్న నిర్మాణాత్మక కార్యక్రమం గురించి కెల్లెన్ బాక్ ఆసక్తిగా అడిగినట్టు, అలాగే జియోనిస్టు ఉద్యమం లో పాశ్చాత్య దేశాల పాత్ర గురించి ఎక్కువగా చర్చ జరిగినట్టు తెలుస్తోంది.

యూదుల ఉద్యమం విషయంలో గాంధీ తన అభిప్రాయాన్ని స్పష్టంగానే చెప్పేస్తాడు. ''యూదుల ఉద్యమం ఒక పదార్థ, భౌతిక ఉద్యమంగా కాక ఒక ఆధ్యాత్మిక ఉద్యమంగా భావిస్తే, వారు బ్రిటిష్ మరియు ఇతర దేశాల ఆయుధ సహకారం తీసుకోడం ఉద్యమ స్ఫూర్తికి వ్యతిరేకం. .. నా ఉద్దేశ్యంలో యూదులు అన్ని రకాల ఆయుధ సంరక్షణను వదిలేయాలి. .. మాకు ఒక స్వంత నేల కావాలి అనే యూదుల కోరికలో ఏ తప్పూ లేదు. అయితే వారు అరబ్ ప్రజల సమ్మతి కోసం ప్రయత్నం చేయాలి. ..." అంటాడు. కళ్ళెన్ బాక్ కూడా చాలా నిర్మొహమాటంగా: ''మీ ప్రతిపాదనలు రాజకీయంగా లేవు, మా స్త్రీలను, పిల్లలనూ .. అరబ్బుల దయా దాక్షిణ్యానికి వదిలేయమనడం సరికాదు. .. మేము ఆచరిస్తున్నది ఈ సమయంలో అనుసరణీయ రాజకీయాలు" అంటూ జవాబు ఇస్తాడు. అయితే ఇద్దరూ యూదులూ, అరబ్బులు ప్రత్యక్షంగా మాట్లాడుకోవాలి అన్న విషయంలో ఏకీభవిస్తారు.

26 నవంబర్ 1938 లో గాంధీ తన "హరిజన్" అనే పత్రికలో ఈ యూదుల సమస్యపై ఒక వ్యాసం రాస్తాడు. దాని పేరు "ది జ్యూస్". నిజానికి అది 9 నవంబర్ లో జర్మని లో జరిగిన యూదుల ఊచ కొత్త పైన. అందులో గాంధీ యూదుల అహింసా పోరాటాన్ని, పాశ్చాత్య దేశాల సహాయాన్ని నిరసిస్తాడు. పాశ్చాత్య దేశాలలో మొదటి నుండి గాంధీ అహింసా ఉద్యమాన్ని "పాసివ్ రెసిస్టన్స్" గా అర్థం చేసుకున్నారు. కానీ గాంధీ ఈ "పాసివ్ రెసిస్టన్స్" ని ఒప్పుకోలేదు. అది అహింసా

వాదాపు బలహీన రూపం అని గాంధీ భావన. గాంధీ అహింస ఒక మిలిటంట్ రూపం.

ఈలోగా అదే విషయం పై కెల్లెన్ బాక్ నెహ్రూ కు ఒక ఉత్తరం రాస్తాడు. అందులో ఈ నాజీల యూదుల ఊచకోత పై ఇండియన్ సహకారాన్ని కోరడం, ఊచకోతపై తీవ్రమైన నిరసన వుంటుంది. గాంధీ వ్యాసం యూదులలోనూ, ఇతర పాశ్చాత్య దేశాల మేధావుల లోనూ తీవ్ర ఆగ్రహం కలిగిస్తుంది. ఈ సందర్భంగానే మళ్ళీ కెల్లెన్ బాక్ 1939 లో ఇండియా వస్తాడు. “చయిమ్” అంటే హిబ్రూ లో “జీవితం”. చాలా కాలంగా కళ్ళెన్ బాక్ ఈ పదాన్ని తన పేరులోని మొదటి పదం “హెర్మన్” కు బదులుగా వాడేవాడు. గాంధీ అహింసా సిద్ధాంతానికి, దాన్ని పాశ్చాత్య దేశాలు, కెల్లెన్ బాక్ అర్థం చేసుకున్న తీరుకు వున్న తేడాలే వీరిద్దరి మధ్య స్నేహానికి కానీ, విభేదాలకు కానీ కారణం. అయితే ఇన్ని సమస్యల మధ్య ఇండియాలో ఈ చివరి కలయికలో కెల్లెన్ మలేరియా వాత పడతాడు. దాని నుండీ బయట పడ్డా కెల్లెన్ బాక్ ఆరోగ్యం తిరగి సాధారణ స్థాయికి రాదు.

కళ్ళెన్ బాక్ జీవితం ఓ అంతర్, బాహ్య విలువల ఘర్షణ. ఒక వైపు గాంధీ తన జీవితంలోకి జొప్పించిన అహింసా, ఇతర వున్నత విలువలు, మరో వైపు దారుణ మారణ హోమానికి గురి అవుతోన్న తన యూదులు, వారి ముందున్న మార్గాలు. మరో వైపు కుటుంబంపట్ల బాధ్యతలు, వ్యాపారాలు. అక్కడ జర్మనిలో తన కుటుంబ సభ్యులు, స్నేహితులు కూడా ఎలాగైనా సరే ఈ మారణ హోమం నుండి తప్పించుకోవాలి అనే ప్రయత్నాలు చేస్తున్నారు. నిజానికి కెల్లెన్ ఆజన్మ బ్రహ్మచారి. పెళ్లి చేసుకోలేదు. హన్నా లాజర్ అనే ఆవిడ దగ్గరగా వుండేది, ఈయన బాగోగులు చూసుకునేది. ఈసా లాజర్ ఆయన దగ్గర పెరిగిన అమ్మాయే. ఆయన మరణం తరువాత ఆయన సమాధి పై: “మంచి కోరునేవాడు, న్యాయాన్ని డిమాండ్ చేసేవాడు, నిటారుగా నడిచే వాడు.” అని వుంటుంది.

కెల్లెన్ బాక్ గాంధీకి ఒక మంచి స్నేహితుడు. సౌత్ ఆఫ్రికా లోని భారతీయుల భౌతిక, ఆధ్యాత్మిక అభివృద్ధి కోరుకున్న వాడు. గాంధీ సౌత్ ఆఫ్రికా వదిలేసిన దశాబ్దాల పాటు సౌత్ ఆఫ్రికా లోని భారతీయుల కోసం నిలబడ్డ వాడు. గాంధీ చుట్టూ ఎంతో మంది విదేశీయులు మూగినా, ఆయనతో ప్రభావితులైనా కెల్లెన్ బాక్ తరువాతే ఎవరయినా. అయితే చివరి దశలో కెల్లెన్ బాక్ ఒంటరి. అంతర్ముఖుడు అయిపోతాడు. 2 ఫిబ్రవరి 1915 లో గాంధీ కెల్లెన్ బాక్ కు రాసిన ఉత్తరంలో: “మా ఆవిడ నీపై అపారమైన ప్రేమను పెంచుకుంది. ప్రతి క్షణం నీ గురించి ఆలోచిస్తోంది. నీవు లేక పోతే మా జీవితాలు అసంపూర్ణం అంటోంది. నీకు తెలుసు నేను ఇలాంటి బంధాలు కోరుకోననని. కానీ ఆవిడ అలా ఆలోచిస్తోంది.” అంటాడు. 21 మే 1915 న రాసిన ఉత్తరంలో: “ఇక్కడ నా చుట్టూ కపటత్వం, మోసం, దిగజారుడుతనం .. అయితే ఈ అన్నింటి అడుగునా ఒక దైవత్వం కోసం వెతుకుతున్నాను. ఇది నా ఇండియా. నా గుడ్డి ప్రేమ కావచ్చును, లేదా అజ్ఞానం, లేదా నా ఊహ కూడా కావచ్చును. అయినా ఇదే నాకు శాంతి, ఆనందం ఇస్తుంది. నాకు నమ్మకాన్ని ఇస్తోంది.”

గాంధీ కళ్ళెన్ బాక్ ఉత్తర ప్రత్యుత్తరాలలో ఎక్కువ భాగం చుట్టూ వున్న సమాజం, సమస్యలూ, .. కళ్ళెన్ బాక్ తనతో లేకపోవడంలోని ఆవేదనా ఎక్కువగా వుంది అని ఈసా సరీద్, క్రిస్టియన్ బార్ట్రాఫ్ పుస్తకం చెబుతోంది. వారి పరిచయం ఆధ్యాత్మికం, వారి జీవితం వారి, వారి ప్రజల పోరాటాలు. ఎక్కడో ఒక చోట ఒకటి, రెండు వాక్యాలు కూర్చి ఒక మహోన్నత స్నేహాన్ని పాశ్చాత్యపు సామాజిక కళ్ళద్దాల లోనుండి చేసిన విశ్లేషణను అంతగా ప్రామాణికంగా తీసుకొనక్కర లేదు.

గాంధీ తన ఆత్మ కథలో ఈయన గురించ చాలా సార్లు ప్రస్తావిస్తాడు. ఈసా సరీద్ అనే కళ్ళెన్ బాక్ చుట్టాల అమ్మాయి, జర్మని లోని గాంధీ ఇన్ఫర్మేషన్ సెంటర్ నిర్వాహకులు, గాంధియన్ అయిన క్రిస్టియన్ బార్ట్రఫ్‌లు కలసి 1997 గాంధీకి, కళ్ళెన్ బాక్ కి వున్న సంబంధాన్ని చాలా నిశితంగానే పరిశీలించారు.

అయితే లేలి వెల్డ్ తన పుస్తకం రాసిన దాదాపు అదే సమయంలో త్రీదిప్ సహృద్ అనే ఇండియన్ – గుజరాతీ రచయిత, సాంస్కృతిక చరిత్ర కారుడు ఒక చోట వీరి సంబంధాన్ని “భార్య – భర్తల సంబంధం” అని వర్ణిస్తాడు. ఈ వ్యాఖ్య కూడా తీవ్రమైన దుమారాన్ని లేపింది. ఈ వ్యవహారం ఎక్కడిదాకా వెళ్ళింది అంటే, ఇక ఈ చర్చకు ముగింపు పలకాలి అని 2012 లో ఆనాటి ఇండియా ప్రభుత్వం గాంధీ – కళ్ళెన్ బాక్ లకు సంబంధించిన

మొత్తం ఉత్తర – ప్రత్యుత్తరాలని కొనేసి, బహిరంగ వేలంలో వెరవ్వరూ కొనకుండా ఆపింది. షిమోన్ లేవ్ అనేక ఇజ్రాయిలి జర్నలిస్ట్ 2012 లో రాసిన "సోల్ మేట్స్ – ది స్టోరీ ఆఫ్ మహాత్మా గాంధీ అండ్ హర్మన్ కల్లెన్ బాక్" వీరి సంబంధాలను ఇద్దరు ఆదర్శ వాదుల సంబంధంగా చిత్రీకరిస్తుంది. అక్టోబర్ 2, 2015 లో గాంధీ 146 వ జయంతి సందర్భంగా లిథుయేనియా ప్రధాన మంత్రి, భారత దేశపు అప్పటి వ్యవసాయ మంత్రి రూజెన్ నగరంలో వీరిద్దరి విగ్రహాన్ని ఆవిష్కరించారు.

మన దేశంలో మనస్తత్వ శాస్త్రం అంటూ స్వతంత్రంగా, ప్రత్యేకంగా అభివృద్ధి కాకపోవడం, మనం అనేక మానసిక విషయాలకు పాశ్చాత్య మనస్తత్వ శాస్త్రపు రూప కల్పనల పరిధిలో ఆలోచించడం సమస్య మరో పార్శ్వం. పాశ్చాత్య మానసిక నిపుణుడు ఇలాంటి చిత్రీకరణాలు, ఊహలు, విశ్లేషణలలో కొన్ని శృంగార భావనలు, స్వలింగ సంపర్కాలు చూడడం వారి చారిత్రిక, సామాజిక నేపథ్యంలో సాధ్యమేమో కానీ ఇక్కడ, ఈ దేశంలో ఇద్దరు మగపిల్లలు భుజాల మీద చేతులు వేసుకుని నడచినా, చివరికి ఒకే గదిలో, ఒకే మంచం మీద పడుకున్నా, నేనూ నిన్ను ప్రేమిస్తున్నాను అని ఒక అబ్బాయి మరో అబ్బాయికి రాసినా అది స్వలింగ సంపర్కం అన్న భావనలు మనకు ఒక పట్టాన కలగవు. అదే ఏ అమెరికా లోనో, ఇంగ్లండ్ లోనో, ఫ్రాన్స్ లోనో అయితే అది ఖచ్చితంగా అనుమానించ తగ్గ వ్యవహారం. అనుమానించడం కాదు ధృవీకరణ కూడా అయ్యిపోయే వ్యవహారం.

భారత దేశంలో విదేశీ చదువు చదువుకున్న వారికి, జ్ఞానులకు, పాశ్చాత్య మేధావులకు ఏదో ఒక శత్రు – మిత్ర సంబంధం వుంది. ముఖ్యంగా మనలో వారి మీద కోపం వుంటుంది, అనురాగం వుంటుంది. వారిని ప్రశంసించ కుండా వుండలేము. కానీ నిరంతరం మనం వారి భావ దాస్యంలో వున్నామన్న దిగులూ వుంటుంది. వారి బిగి కౌగిలి నుండి బయట పడాలి అన్న తపన ఒక వైపు, ఎక్కడో మూలాలలో వారే కరెక్ట్ ఏమో అన్న దాస్యం. వారి నిష్పాక్షికత మీద ఒక వైపు విశ్వాసం, గౌరవం, మరో వైపు వారి మాటలపైన అనుమానం, అసహనం. మనకు నచ్చిన విషయంలో తెల్ల వాడు కరెక్ట్. నచ్చని విషయంలో ఈ ఇంగ్లీషు వాడి మాటల్లో ఏదో కుట్ర.

ఈ సమస్యకు మరో కోణం ఏమిటంటే – ఇంగ్లీషు వాళ్ళకే కాదు, అనేక మంది శ్వేత జాతీయులకు తాము చేసే పరిశోధనల మీద, వాటి ఫలితాల మీద విపరీతమైన ఆత్మ విశ్వాసం. అలాగే వారికి తాము ఈ ప్రపంచాన్ని, ముఖ్యంగా రంగు జాతుల వారిని, ఉద్ధరించే ఒక బాధ్యత ఆ భగవంతుడు తమ మీద ప్రత్యేకంగా మోపాడు అనే బలమైన భావన వుంటది. దానికి వారు పెట్టుకున్న అందమైన పేరు – "వైట్ మాన్'స్ బర్డెన్" శ్వేత జాతీయుల పవిత్ర బాధ్యత! బయటికి దీన్ని వ్యతిరేకించినట్టుగా, ప్రతిఘటించినట్టుగా ఎంత చెప్పుకున్నా ఎక్కడో మన అంతరంగాలలో కూడా వాడి జ్ఞానం, పరిశీలన పట్ల అలవికాని విశ్వాసం, నమ్మకం, గురుత్వ భావన. ఈ సమస్య తాము భావ దాస్యం నుండి బయట పడిపోయాం లేదా బయట పడడానికి ప్రయత్నిస్తున్నాం "డీ – కొలనైజ్" అవుతున్నాం అనుకునే వారిలో, ఆధునికులలో మరీ ఎక్కువ.

ఇక్కడే గాంధీ విభిన్నంగా కనబడతాడు. గాంధీ తెల్లవారిని దేశం వదలి పోవాలి అన్నాడు. లేదా ఇండియన్స్ గా మారమన్నాడు. మొత్తం మీద స్వాతంత్ర్యం అంటే అది ఒక మానసిక స్థితి. భౌతిక స్వాతంత్ర్యం కంటే ముందు మానసిక స్వాతంత్ర్యం కలిగి వుండాలి అంటాడు. అతనికి తెల్ల వారిపై ప్రేమా లేదూ, ద్వేషమూ లేదు. కానీ పాశ్చాత్యులు మనకంటే గొప్ప జ్ఞానులు అన్న విషయాన్ని నిర్ద్వందంగా నిరాకరించిన తొలి "డి కాలనైజ్డ్" వ్యక్తి ఎవరైనా వున్నారా అంటే అది గాంధీయే. గాంధీ "హింద్ స్వరాజ్" లో అంటాడు ఒక చోట. "ఈ ఇంగ్లీషు వాళ్ళకి చరిత్ర రాసే అలవాటు. వాళ్ళు అన్నీ రకాల ప్రజల ఆచార వ్యవహారాలను, సాంప్రదాయాలను చదివిన వారిగా నటిస్తారు. భగవంతుడు మనకి నియమిత బుద్ధిని, శక్తి సామర్థ్యాలను ఇచ్చాడు. కానీ ఈ పాశ్చాత్యులు బుద్ధికే అధిపతి అయిన బ్రహ్మ స్థానాన్ని గాడ్ హెడ్ ఆక్రమిస్తారు. అనేక వినూత్న ప్రయోగాలు చేసేస్తారు. తమ పరిశోధనలను అత్యంత ఉత్కృష్టమైనవిగా పొగడుకుంటారు. మనల్ని వాటిని నమ్మేలా చేస్తారు. మనం మన జ్ఞాన రాహిత్యంతో వారి పాదాలపై వాలిపోయి దాసోహం అయిపోతాము."

నిజానికి ఈ జబ్బు పాశ్చాత్య సాహిత్యాన్ని, జ్ఞానాన్ని ప్రేమించే వారికంటే వాటిని వ్యతిరేకిస్తూ స్వదేశీ ఆలోచనలతో ముందుకు వస్తున్నాం అనే వారిలో ఎక్కువ.

ఆశీస్ నంది అనే సామాజిక-మానసిక పరిశోధకుడు, రచయిత తన "ఇంటిమేట్ ఎనిమీ" అనే అత్యంత నిశితమైన పరిశీలనలో ఈ విషయాన్ని చాలా చక్కగా వివరిస్తాడు. ఆధునిక వలస వాదం సైన్యంతోనూ, తుపాకులు, మర ఫిరంగులతోనూ వలస దేశాలపై దాడి చేయదు. ఇంకా ముందుకు వెళ్ళి చెప్పాలి అంటే వ్యాపార ఆధిపత్యం కూడా దాని బలం కాదు. వలస వాదాపు అతి గొప్ప బలం, ఆధునిక స్వరూపం ఆయా దేశాలలో సాంప్రదాయకంగా, స్వతంత్రంగా ఆలోచించ గలిగె శక్తిని ధ్వంసం చేసే పనిలోనే వుంది. ఒక జ్ఞాన సంబంధిత, లౌకిక సోపాన క్రమాన్ని తయారు చేయగలగడం వారు విజయవంతంగా చేసేశారు అంటాడు నంది.

అంటే పాశ్చాత్యలు ఒక విధమైన నియమాలు తయారు చేశారు. పరిశోధన, రచనా విధానం సృష్టించారు. ఆ విధానం, అది ఒక్కటే వైజ్ఞానికం, అది కానిది అజ్ఞానం. హేతువు, రుజువులు, ప్రతిపాదన, ప్రయోగం లాంటి ఒక సాంకేతిక పద్ధతిని వారు సృష్టించి ఇక అదే అంతిమ జ్ఞాన మార్గం అని, అది కానిది విశ్వాసం, అజ్ఞానం, నిర్హేతుకత అని మనలో బాగానే ఎక్కించ గలిగారు. వలస వాదాన్ని వ్యతిరేకిస్తున్న వ్యక్తి కూడా అంతరంగాలలో దానికి అత్యంత విధేయుడు కాగలిగే అవకాశం ఈ ఆధునిక వలస వాద జ్ఞాన సోపానం, పద్ధతి ఇస్తుంది. గాంధీ జీవితం తెరచి వుంచిన పుస్తకమే! మరీ ముఖ్యంగా దాదాపు 1883 నుండి, (అంటే ఆయన వయస్సు 23-24 నుండి), అంటే ఆయన సౌత్ ఆఫ్రికా పోయిన తొలి రోజు నుండి అంతా బహిర్గతం. ఆయనకు తనది అంటూ దాచుకున్న భౌతిక శరీరమూ లేదు, జీవితమూ లేదు. మానసిక, ఆంతరంగిక జీవితమూ లేదు. నిరంతరం తపించిన ఆయన ఆత్మ, కొంత మిస్టిక్ ప్రకంపనలు వున్న భాష-ఇవే మనకు చాలా వరకు అర్థం కానీ విషయాలు. దాదాపు పాతికేళ్ళ వయసు వచ్చినప్పటి నుండి ఆయన తుది శ్వాస పీల్చే దాకా అంటే 79 ఏళ్ల వయసు దాకా ఆయన ప్రతి అడుగు, ప్రతి శ్వాస, ప్రతి పని, ... చివరకు ఆయన తిండి, నిద్ర, స్నానం, .. అన్నీ బహిరంగమే.



ఇద్దరుమిత్రులు

నిరంతరం కొన్ని వందల మందితో పెనవేసుకున్న ఆయన జీవితంలోని అన్ని అంశాలు, క్షణాలు ఆయన చుట్టూ వున్న స్నేహితులకు, అనుచరులకు, దేశ, విదేశీ సందర్శకులకు తెలుసు. ఆయనకు వ్యక్తిగత, సామాజిక జీవితాలు - అంటూ రెండు లేవు. నిరంతరం ఆయనతో కలసి జీవించిన, కలసి పనిచేసిన, కలసి ఉద్యమాలు, జైళ్లు, ప్రయాణాలు చేసిన అంత మంది స్నేహితులకు, సన్నిహితులకు తెలియని రహస్యం వుందా?

అయినా ఒక బ్రిటిషర్, ఒక అమెరికన్, ఒక జర్మన్ ... ఎవరో ఏదో రాస్తే మనం వులిక్కి పడడం ఏమిటి? మనకు ఆయన గురించి తెలియంది, ఇప్పుడు కొత్తగా ఏ విదేశీ విశ్లేషకుడో ఎవరో చెప్పడం, ఏదో రాయడం ఏమిటి? మనం ఆయన మీద ఒక కొత్త అస్త్రం దొరికినట్టు మురిసిపోవడం ఏమిటి? అంటే మన ఇంటి పెద్ద గురించి మనకు తెలియదా? పక్కింటి వైద్యుడు చెప్పాలా? మన జ్ఞానం, మన అవగాహన, మన విశ్లేషణ .. వీటి మీద మనకు నమ్మకం లేదా? .. ఇది ఆధునిక వలస వాదపు జ్ఞానాధిపత్యం. ఈ స్థితి నుండి బయటపడకుండా మనం మన తండ్రుల గురించి, తల్లుల గురించి, బాబాయి, పిన్ని, అన్న, అక్క, తమ్ముడూ .. ఇలా అనేకమైన మన వాళ్ళ గురించి వారు పోయిన కొన్ని దశాబ్దాల తరువాత ఎక్కడో బయటి నుండి వచ్చి, ఒక సంఘటన, ఒక వాక్యం పట్టుకుని విశ్లేషించడం, మనం మన వాళ్ళ మీద ప్రయోగించడానికి ఏదో కొత్త అస్త్రం దొరికినట్టు ఆనందించడం మన బలహీనతలు. ఇదే సమయంలో కొంత మంది ఈ విషయం బయటికి వస్తే మన ఇంటి పరువు పోతుంది అని ఖంగారు పడడం కూడా అసంబద్ధం. ఈ రెండూ ఆలోచనల లోనూ మన భావ దారిద్ర్యం, మన జ్ఞానపు బాలహీనత, మన మీద మనకు విశ్వాసం లేకపోవడం లాంటి వాటిని సూచిస్తున్నాయి. ఇలా ఎంత కాలం? మనల్ని ఉద్ధరించడానికి మనలో ఇంకా ఒక గూగి, ఒక ఫ్రాంజ్ ఫానాన్, ఒక పౌలో ఫ్రాయరీ .. రాలేదని ఎదురు చూస్తున్నామా? అవసరమా?

డా. అవధానం రఘుకుమార్
ఫోన్ : 9441015709

# శాంతా క్లారా
# ఛే గువారా

– నిమ్మగడ్డ శేషగిరి రావు



కనులవిందు చేస్తూ మనసును కట్టిపడేసిన హవానా అందచందాలు, మురిపించే సంస్కృతి, ముంచెత్తే కాక్‌టైల్స్ నుండి నాలుగు రోజుల తరువాత బయట పడి, క్యూబా నిజరూప దర్శనం కోసం దేశం లోపలికి బయలుదేరాము. ట్రినిడాడ్ నుండి సియాన్‌ఫ్యుగోస్ వరకు సాగే ఈ రోడ్డు ప్రయాణంలో..మా ప్రియమిత్రుడు ఛే గువారాను కలుసుకునే, 'శాంతాక్లారా' పట్టణం మా మొదటి గమ్యం. డొమింగో, ప్రిషియా, మోహన్, నేను ఒక 8 సీట్ల వాన్‌ను ఏర్పాటు చేసుకున్నాము. డ్రైవరు వెూరిసియో ఆ ప్రాంతమంతా బాగా తెలిసినవాడు. కాని కొంచెం సిగ్గరి. అతనితో మాకు కొంచెం చనువు ఏర్పడే సరికి మా ప్రయాణం ముగిసింది. మా గైడ్ మార్తా కు మాత్రం, మా లాంటి యాత్రికులను అలరించటం కొట్టిన పిండి. మా వాన్‌లో ఇంకా చాలా చోటుండటంతో, మార్తా వద్ద శిక్షణ పొందుతున్న సోఫియా కూడ మాతో వచ్చింది. ఇది కూడ ఒకందుకు మంచిదే. యాభైయవ పడి మధ్యలో ఉన్న మార్తా, మాకు దోవ పొడుగునా విషయవిశేషాలు పంచితే, ఇరవైలలో ఉన్న సోఫియా వాతావరణాన్ని తేలిక పరస్తూ మమ్మల్ని అలరించింది.

శాంతా క్లారా, హవానాకు దక్షిణంగా 300 కిలోమీటర్ల దూరంలో ఉంది. చిన్న చిన్న పట్టణాలు, గ్రామాలు, అంతు లేని చెరుకు తోటల గుండా సాగిన ఈ ప్రయాణం, ఇంకా కొంత హవానా మత్తులో ఉన్న మమ్మల్ని మేల్కొలిపింది. శాంతాక్లారా భౌగోళికంగా క్యూబా ద్వీపానికి కేంద్రం. అక్కడకు చేరటానికి 5 గంటల ప్రయాణం. ఉదయాన్నే బయలుదేరి, 11 గంటలకల్లా అక్కడికి చేరుకున్నాము. 'శాంతాక్లారా' నగరానికి నడిబొడ్డున పెద్ద కూడలిలో 'విదాల్' అనే చిన్న పార్కు ఉంది. దాని చుట్టూ స్పానిష్ పాలన కాలం నాటి రంగు వెలిసిన భవనాలు ఉన్నాయి. వాటి మీద 60 సంవత్సరాల క్రితం జరిగిన యుద్ధకాలపు బుల్లెట్ గుర్తులు ఇప్పటికి కనిపిస్తున్నాయి. 300 మంది ఛే గువారా గెరిల్లా సైన్యానికీ, నాటి క్యూబా నియంత జనరల్ బటిస్టాకు చెందిన అసంఖ్యాకమైన, తర్ఫీదు పొందిన సైనికదళానికి మధ్య జరిగిన తుపాకి యుద్ధం అది. 1950వ సంవత్సరంలో ఫైడెల్ కాస్ట్రో నాయకత్వంలో జరిగిన క్యూబా విప్లవం ఆ కాలంలో జరిగిన ఒక మహత్పరిణామం. దానికి ప్రపంచ చరిత్రలో ఎంతో ప్రాముఖ్యత ఉంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కమ్యూనిస్ట్ విప్లవకారులందరి దృష్టినీ అది ఆకర్షించింది.

ఫైడెల్ కాస్ట్రోకు మిత్రుడు కుడి భుజం అయిన ఛే గువారా ఈ విప్లవంలో అందరినీ ఆకర్షించిన వీరుడు. ఎర్నెస్టో ఛే గువారా నిజాయితీ, ధైర్య సాహసాలు గల మచ్చలేని విప్లవవాది. విప్లవానికే తన జీవితాన్ని అంకితమిచ్చాడు. లాటిన్ అమెరికాలో పెట్టుబడిదారీ దోపిడీకి వ్యతిరేకంగా నిలబడ్డ ధీరుడు. 1960వ సంవత్సరంలో ప్రపంచంలో ఏ కమ్యూనిస్ట్ నాయకుణ్ణి భయపెట్టనంతగా, అమెరికా వారు ఛే గువారాను భయపెట్టారు. అమెరికా వారి ఆధారిత బహుళజాతి సంస్థల గుత్తాధిపత్యానికి వ్యతిరేకంగా, వారి సామ్రాజ్యవాద విధానాలకు వ్యతిరేకంగా అతడు చేసిన అలుపెరగని పోరాటమే అందుకు కారణం. అర్జెంటైనాలో జన్మించిన ఈ డాక్టర్ జీవితం మీద నాకున్న ఆకర్షణ ఈ నాటిది కాదు. ఛే గువారాలోని నిబద్ధుడైన యాత్రికుణ్ణి నేను గౌరవిస్తాను. తన యాత్రలే అతనిని మలచి ఉంటాయని

నా నమ్మకం. నేను శాంతాక్లారాలో ఉండగానే, ఆయన జీవితాన్ని గురించి వివరించటానికి కొద్దిగా స్వేచ్ఛ తీసుకుంటాను.

ఇండియాలో గాంధీకి, రష్యాలో లెనిన్‌కీ, చైనాలో మావోకి ఎంతటి జనాదరణ ఉందో, బహుశా ఛే గువారాకు అంతకు మించిన జనాదరణ ప్రపంచవ్యాప్తంగా ఉంది. నా ప్రపంచ ప్రయాణాల్లో అతని చిత్రాన్ని ప్రతి దేశంలోనూ చూశాను. ఏ ఒక్క చారిత్రక వ్యక్తికీ లేనంత ప్రజాదరణ అతనికి ఉండటం నేను గమనించాను. గడచిన శతాబ్దంలో ఏ ఇతర విప్లవ నాయకుడికి లేనంత కీర్తి అతని సొంతం. బలవంతులు బలహీనులపైన, ధనికులు పేదలపై జరిపే దురాగతాలకు, దుశ్చర్యలకు నిరసనగా జరిపే ఉద్యమాలకు, ఈ నాటికి అతనే స్ఫూర్తి. అతని చిత్రమే పోరాటచిహ్నం. ఈ రోజుకీ క్యూబాలో ప్రతి శుక్రవారం ఉదయం, అన్ని పాఠశాలల్లో పిల్లలు "మేము ఛే గువారా లా ఉంటాం, అతని నిజాయితీ విలువలు, ధైర్యం, మానవత్వం, అంతర్జాతీయవాదం, ఆచరిస్తాం" అంటూ ప్రమాణం చేస్తారు. అతను ఏదైతే బోధించాడో దాన్నే ఆచరించి, తన జీవితాన్ని ఒక ఉదాహరణగా మన ముందు నిలిపాడు. అతను నమ్మిన దాని కోసం పోరాడి, చిన్న వయసులో మరణించాడు. ఒక్కొక్కసారి నాకు, తేజోవంతమైన అతని ముఖం వలనే అతడు ప్రపంచ వ్యాప్తంగా అణచివేతను ప్రశ్నిస్తూ, ఎదిరించే విప్లవధోరణికి ప్రతీకగా నిలబడ్డాడేమో అనిపిస్తుంది.

క్యూబాలోని అన్ని ప్రదేశాల కంటే శాంతాక్లారాతోనే ఛే గువారాకు ఎక్కువ అనుబంధం ఉంది, అందుకే దీనిని ప్రేమగా 'సిటీ ఆఫ్ ఛే' అని పిలుస్తారు. ఛే గువారా స్మారక ప్రదేశం (మాసోలియం) శాంతాక్లారాలో ఒక పెద్ద పర్యాటక ఆకర్షణ. అదే అతని చివరి మజిలీ, శాశ్వత విశ్రాంతి ప్రదేశం కూడా. ఒక చిన్న కొండపై ఉన్న ఆ ప్రదేశం నుండి చూస్తే నగరమంతా కనిపిసూ ఉంటుంది. నలుచదరంగా ఉండే బహిరంగ ప్రదేశంలో, కట్టబడిన ఎత్తైన దిమ్మ పైన తన గెరిల్లా దుస్తుల్లో, తుపాకీతో గర్వంగా కాంస్య విగ్రహంగా నిలబడి ఉంటాడు ఛే. కళ్ళు తిప్పుకోనివ్వని ఆకర్షణ ఉంటుంది ఈ విగ్రహానికి. అక్కడ చక్కగా నిర్వహిస్తున్న మ్యూజియం ఒకటి ఉంది. అందులో 'ఛే' వ్యక్తిగత వస్తువులు, తుపాకీ, బైనాక్యులర్స్, అతని మెడికల్ డిగ్రీ సర్టిఫికేట్లు, డైరీలు, ఉత్తరాలు భద్రపరిచి ఉన్నాయి. ఇక్కడ తిరుగుతుంటే, నాకు తెలిసిన చరిత్ర గుర్తుకొచ్చింది. బొలీవియా అడవుల్లో పోరాడుతుండగా, బొలీవియా సైన్యం చేతుల్లో అక్టోబర్ 7, 1967లో హతమవుతాడు ఛే గువారా. అది అమెరికా వారి సెంట్రల్ ఇంటిలిజెన్సీ ఏజనీ (సి.ఐ.ఎ) సహాయంతో జరిగింది. చేతులు లేని అతని శరీరాన్ని బొలీవియా అడవుల్లో గుర్తు తెలియని ప్రదేశంలో పూడ్చి పెడతారు. తొలగించిన అతని చేతులను స్వదేశమైన అర్జెంటైనాకు వేలి ముద్రల గుర్తింపు కోసం పంపిస్తారు. ఆ తరువాత, 1997లో, ఫైడెల్‌కాస్ట్రో తన మిత్రుడైన ఛే గువారా, అతని సహచర విప్లవకారుల మృతదేహాలను పూర్తి సైనిక గౌరవంతో శాంతాక్లారాకు రప్పించి అక్కడ సమాధి చేయిస్తాడు. క్యూబా విప్లవంలో శాంతాక్లారాలోనే 'ఛే'ఎన్నో యుద్ధాల్లో విజయం సాధించటం వల్ల ఫైడెల్‌కాస్ట్రో ఆ నగరాన్ని 'ఛే విశ్రాంతి ప్రదేశంగా' ఎన్నుకున్నాడు.

అది 1958వ సంవత్సరం. క్యూబాలో ప్రధాన రైలు మార్గం శాంతాక్లారా నగరం మీదుగా వెళుతూ దేశపు ఉత్తర, దక్షిణ దిశలను కలుపుతుంది. ఆయుధాలతో వెళుతున్న ఆర్మీ రైలు ఈ మార్గంలోనే వెళుతుందని తెలుసుకుని, వాటిని చేజిక్కించుకోవటం వల్ల, యుద్ధం విప్లవకారులకు అనుకూలంగా మార్చుకోవచ్చనే ఆలోచనతో ఆ రైలు మార్గంలో ఉన్న శాంతాక్లారాలో రైల్వే లైనును తొలగిస్తాడు ఛే గువారా. ఛే గువారా స్మృతుల్ని గుర్తు చేసుకొంటూ శాంతాక్లారా వీధుల్లో నిదానంగా నడుస్తూ అతడి గెరిల్లా సైన్యం దాడికి గురై పడిపోయిన రైలు బోగీలు, పట్టాలు తొలగి ఉన్న రైలు మార్గాన్ని చూశాము. ఆ ప్రాంతాన్ని ఓపెన్ మ్యూజియంగా ఉంచేశారు. మరో గెరిల్లా కమాండర్, కామిలో సీన్‌ఫ్యూగోస్ ఉత్తరం నుండి వచ్చి ఛే గువారాతో కలుస్తాడు. ఇద్దరూ వ్యూహాత్మకంగా ఈ నగరాన్ని అధీనంలోకి తెచ్చుకుంటారు. ఆ విధంగా విప్లవవాదులు శాంతాక్లారాను ఆక్రమించటంతో దేశం రెండుగా చీలి పోయి, నియంత బటిస్టా పాలన పతనం మొదలయింది. శాంతాక్లారాను కోల్పోయిన కొద్ది రోజుల్లోనే ఇక వేరే ఆశలేదని తెలుసుకున్న జనరల్ బటిస్టా, సి.ఐ.ఎ. సహాయంతో తన కుటుంబాన్ని, కొద్ది మంది సన్నిహితులనీ చాలా ధనాన్ని వెంట తీసుకొని దేశం వదిలి వెళ్ళిపోతాడు.

మెక్సికోలో కాస్ట్రో, ఛే గువారాల కలయిక లాటిన్ అమెరికా చరిత్ర గతిని మార్చివేసిన రాజకీయ పరిణామం. వృతిరీత్యా ఫైడెల్ కాస్ట్రో లాయర్, ఛే గువారా డాక్టర్. ఆ సమయంలో ఇద్దరూ ఇరవైల్లో ఉన్న యువకులు. ఫైడెల్ 'ఛే' కంటె రెండేళ్ళు పెద్ద. ఇద్దరూ సంపన్న బూర్జువా కుటుంబాలనుండి వచ్చిన వాళ్ళే. ఫైడెల్ కాస్ట్రో తండ్రి స్పెయిన్‌లోని గలీషియా నుండి క్యూబాకు వలస వచ్చి, వ్యాపారాలలో అదృష్టాన్ని వెతుక్కున్నాడు. పెద్ద భూస్వామి అయ్యాడు. తొమ్మిది మంది సంతానంలో ఒకడైన ఫైడెల్ పుట్టుకతోనే నాయకత్వ లక్షణాలు ఉన్నవాడు. క్యూబాకు స్పెయిన్ నుండి విముక్తి కలిగించిన హొసె మర్తి అతనికి ఆదర్శం. ఫైడెల్ క్యూబా జాతీయవాది. పుట్టు విప్లవకారుడు. అమెరికా గుత్తాధిపత్యానికి వ్యతిరేకి. మొదట్లో ఫైడెల్‌కు కొంత కమ్యూనిస్ట్ వ్యతిరేక భావాలు ఉండేవి, కాని నాయకుడిగా ఎదుగుతూ వామపక్ష భావాలు సంతరించుకున్నాడు. లాటిన్ అమెరికాలో యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా ఏకస్వామ్య ఆర్థిక ఆధిపత్యాన్ని ఎదుర్కోవటానికి కమ్యూనిజమే సరైన పంథా అని నమ్మాడు. ఈ మధ్యనే (2018) క్యూబా అధ్యక్ష పదవి నుండి వైదొలగిన రావూల్ కాస్ట్రో (ఫైడెల్ తమ్ముడు)కూడ, విద్యార్థి దశ నుండి మార్క్సిస్ట్ భావజాలాన్ని అలవరచుకున్న వ్యక్తి. ఛే గువారా, ఒక సంపన్న అర్జెంటైనా కుటుంబం నుండి వచ్చాడు. తండ్రి వ్యాపారంలో చేసిన తప్పులు, అప్పులు, తల్లి విలాసజీవనశైలి వలన ఆ కుటుంబం, నిత్యం ఆర్థిక ఇబ్బందులలో ఉండేవారు. ఛే కు చిన్నప్పటి నుండే దేశాటన అంటే ఇష్టం. వైద్యవిద్య ఆఖరి సంవత్సరంలో, చేతిలో ఉన్న తక్కువ డబ్బుతో, ప్రత్యేకమైన లక్ష్యమేమీ లేకుండానే, మిత్రుడు 'అల్‌బెర్టో గ్రనడో'తో కలిసి మోటార్‌సైకిల్ మీద దక్షిణ అమెరికా పర్యటన చేశాడు. ఈ ప్రయాణం గురించి 'మోటార్ సైకిల్ డైరీస్' అనే పుస్తకంలో ఛే వ్రాసుకున్నాడు. దేశాటనతో పాటు, తనను తాను తెలుసుకోవాలని చేసిన ఈ ప్రయాణం తొమ్మిది నెలలు పాటు సాగింది. ఆండీస్ పర్వతాలు దాటి, చిలీ చేరుకుని, అక్కడ మోటార్ బైక్ చెడిపోవటంతో, దానిని వదిలేసి, గుర్రాలు, పడవలు, లారీలు, ఏదీ లేకపోతే రెండుకాళ్ళ బండిమీద ప్రయాణం చేస్తూ, చిలీ, పెరూ, బ్రెజిల్, కొలంబియా, వెనిజువేలా దేశాలు చుట్టి వచ్చారు. ఈ యాత్రలో లేమితో పాటు ఆకలి దప్పులు, ఎముకలు కొరికే చలి, మండే ఎండ, రక్తం పీల్చే దోమల మందలు, బాల్యం నుండి 'ఛే' ని బాధించే ఆస్తమా..ఇవన్నీ వారిని పరీక్షించటంతోపాటు, మానసిక స్థైర్యానికి సాన పెట్టాయని అతను వ్రాసుకున్నాడు. ఈ ప్రయాణంలో వారు దొరికిన చిన్న ఉద్యోగాలు చేస్తూ, పోలీస్ స్టేషన్లలోనో, హాస్పటళ్ళలో ఖాళీగా ఉన్న పడకలలోనో, ఏవీ దొరకనప్పుడు ఆరుబయట కటికనేల మీదనో నిద్ర పోయేవారు. అయినా ఈ ప్రయాణాన్ని ఆపివేయాలని 'ఛే' అనుకోలేదు. ఈ ప్రయాణం, లక్ష్యసాధన పట్ల అతనికున్న తిరుగులేని తపన, అన్వేషణాభిలాషలకు ప్రతీకగా నిలచింది.



శాంతా క్లారా

'ఛే' మోటార్ సైకిల్ ప్రయాణం ప్రారంభించే సమయానికి అతనికి స్పష్టమైన రాజకీయ ఆలోచనలు ఏమీ లేవు. మెడికల్ స్కూల్ రోజుల్లో రాజకీయాలకు దూరంగా, బాధ్యతలు లేని నిర్విచార జీవితాన్ని అనుభవించాడు. కాని ఈ ప్రయాణంలో ఎక్కడికి వెళ్ళినా లాటిన్ అమెరికా దేశాల ప్రజలు, అక్కడి సహజ వనరులు దోపిడీకి గురి అవటం అతను చూశాడు. అవినీతిపరులైన స్థానిక నియంతలు, స్థానిక మధ్యతరగతి మనుషుల సహకారంతో అమెరికాకి చెందిన పెద్ద పెట్టుబడిదారులు చేస్తున్న దోపిడీ ఇది అని అతను ఈ ప్రయాణంలో గ్రహించి, అమెరికన్ పెట్టుబడి దారీ వ్యతిరేక భావాలవైపు మొగ్గు చూపాడు. ఈ ప్రయాణంలోనే అతను కమ్యూనిస్ట్ భావజాలంపై అవగాహన పెంచుకుని, అమెరికా ఆధిపత్యాన్ని రూపుమాపటానికి, కమ్యూనిజమే పరిష్కారం అని భావించాడు.

తొమ్మిది నెలల మోటారు సైకిల్ ప్రయాణం ముగిశాక 'ఛే' అర్జెంటైనా వెళ్ళి, తన మెడికల్ పరీక్షలు పూర్తి చేశాడు. అతను డిగ్రీ తీసుకున్న తర్వాత మళ్ళీ తన ప్రయాణాలు

కొనసాగించాడు. 'గ్వాతమాలా'లో కొంత సమయం గడిపి తిరిగి మెక్సికోకి చేరుకొంటాడు. 'ఛే' జీవితం ఎక్కువ భాగం క్యూబా విప్లవంతోనే అల్లుకుపోయింది. మెక్సికోలో అజ్ఞాత జీవితం గడుపుతున్న కాస్ట్రోను మరోసారి కలిశాడు. ఆ సమయంలో కాస్ట్రో తన అనుచరులతో క్యూబాపై దండయాత్ర సన్నాహాల్లో ఉన్నాడు. ఆ నాటి వారి భేటీ చారిత్రాత్మకం. క్యూబా వారి విప్లవ విజయాలకి అది కీలకం. 1956లో 'గ్రాన్మా' అనే ప్రసిద్ధమైన బోటుపై 82 మంది పోరాట యోధులతో క్యూబా గడ్డపై అడుగు పెట్టారు ఫైడెల్ కాస్ట్రో, ఛే గువారా, రావుల్ కాస్ట్రో. వాస్తవానికి అది ఒక ఊహించని దుర్ఘటన. వాళ్ళ రాక ముందుగానే తెలియటం వల్ల క్యూబన్ సైనిక నియంత జనరల్ బటిస్టా బలగాలు, వారికి తుపాకీ కాల్పులతో స్వాగతం పలుకుతూ, ఎందరినో బలి తీసుకున్నారు. బోటులో వచ్చిన 82 మందిలో కేవలం 12 మంది మాత్రమే మిగిలారు. ఫైడెల్, ఛే, రావుల్ ముగ్గురూ తప్పించుకుని సియారా మేస్ట్రా పర్వతాలకు తరలిపోయారు.

బ్రిగేడ్‌లో డాక్టర్‌గా చేరిన 'ఛే' భయమెరుగని గెరిల్లా కమాండర్‌గా మారాడు. తర్వాత మూడు సంవత్సరాలలో ఈ ముగ్గురూ మరో సైనిక మేధావి 'కామిలో'తో కలిశారు. కామిలో 'ఛే' శిక్షణలో పైకొచ్చిన వాడే. బటిస్టాకి అమెరికా వారి తోడు ఉన్నప్పటికీ ఈ నలుగురే చివరికి జనరల్ బటిస్టా నియంతృత్వాన్ని గెరిల్లా యుద్ధంతో అంతమొందించారు. క్యూబాలో తిరుగుబాటు ముగిసి, ఫైడెల్ అధికారం చేపట్టాక 'ఛే' ని పరిశ్రమల మంత్రిగా, క్యూబన్ సెంట్రల్ బ్యాంక్ ఛైర్మన్‌గా, తిరుగులేని అధికారాలతో నియమించాడు. ఆ దశలో ఛే గువారా ఎన్నో విప్లవాత్మక సంస్కరణలు చేశాడు. అధికారపరంగా రెండవ స్థానంలో ఉండి కూడ ఒక మామూలు సైనికుడిలా సామాన్యమైన ఆదర్శవంతమైన జీవితం గడిపాడు 'ఛే'. తన పదవీభృతిలో ఎక్కువ భాగం తిరిగి ప్రభుత్వానికే ఇచ్చివేసి, వారాంతపు శెలవు దినాల్లో చెరుకు తోటలలో కూలీగా పనిచేసేవాడు. అంతర్జాతీయంగా 'ఛే' కాస్ట్రోకి ప్రతినిధిగా నిలబడి, క్యూబాన్ విప్లవానికి సహాయ సహకారాలకోసం పాటుపడ్డాడు. క్యూబా దేశపు ముఖ్య పంట అయిన పంచదారను ప్రపంచవ్యాప్తంగా ఎగుమతి చేయటానికి ఎంతో కృషి చేశాడు. క్యూబా ఆర్థిక పరిస్థితి పంచదార ఎగుమతిపై ఆధారపడి ఉంది. అమెరికన్ల యాజమాన్యంలో ఉన్న పంచదార మిల్లులను, తోటలను కాస్ట్రో గవర్నమెంటు జాతీయం చెయ్యటం వల్ల, యునైటెడ్ స్టేట్స్ వారు క్యూబా పంచదార కొనటం ఆపేశారు. అప్పటి వరకు క్యూబా పంచదారకు అమెరికా దేశమే ప్రధానమైన దిగుమతిదారు. ఈ నేపథ్యంలో 'ఛే' చేసిన కృషి అమూల్యమైనది. 'ఛే' ఎక్కడికి వెళ్ళినా, ఏ సందర్భంలోనైనా, సాధారణమైన గెరిల్లా యూనిఫాం మాత్రమే ధరించేవాడు. అందువల్ల అతను ఎంతటి ఉన్నత వ్యక్తుల మధ్యలోనైనా విభిన్నంగా ప్రత్యేకంగా కనిపించేవాడు. అప్పటి ప్రధాన కమ్యూనిస్టు దేశాలైన స్టాలినిస్ట్ సోవియట్ యూనియన్, మావోయిస్ట్ చైనాలు రెండూ 'ఛే' ని తమ వైపు తిప్పుకోవాలని చూశాయి. ఏ ఒక్క దానివైపు మొగ్గని 'ఛే' స్వతంత్ర ఆలోచనా విధానం కొంతవరకు సోవియట్ విధానాలకు దూరంగా, మావో భావజాలానికి దగ్గరగా ఉండేది. ఏమైనప్పటికీ, 'ఛే', కమ్యూనిస్టు సిద్ధాంతాలను మనసావాచా నమ్మిన ఆదర్శప్రాయుడు.

'ఛే' మంత్రిగా తిరుగులేని అధికారాలతో ఉన్నప్పుడు కూడ, అతని హృదయంలో విప్లవాగ్ని చెలరేగుతూనే ఉండేది. అతను తన అధికారాన్ని, నిధులను లాటిన్ అమెరికాలోని అనేక ఉద్యమాలకు వినియోగించేవాడు. అమెరికా నుండి లాటిన్ అమెరికాకు సంపూర్ణ స్వేచ్ఛ కలిగించటమే అతని కల. అయితే అధికారం చేతికొచ్చిన తొలిదశలో, సైనిక న్యాయస్థాన విచారణలను తన చేతిలోకి తీసుకుని, విప్లవ వ్యతిరేకులను ఉరికంబమెక్కించటానికి అధికార దుర్వినియోగం చేశాడనే విమర్శ కూడ 'ఛే' మీద వచ్చింది. కొద్ది సంవత్సరాలు అధికారంలో ఉన్న తరువాత, 'ఛే' కాస్ట్రో అనుమతితో మధ్య ఆఫ్రికాలోని కాంగో విప్లవంలో పోరాడేందుకు వెళ్ళాడు. అది అంతగా విజయవంతం కాలేదు. అనేక వర్గాలతో కూడిన ఆఫ్రికన్ కమ్యూనిస్టులు, 'ఛే విప్లవ భావాలకు సరితూగలేదు. ఆ తరువాత 'ఛే', సౌత్ అమెరికా మధ్యలో ఉన్న బొలీవియా వెళ్ళాడు. అక్కడ సి.ఐ.ఎ. అనుకూలురైన సైనిక నియంతలకు వ్యతిరేకంగా విప్లవాగ్ని రగిలిస్తే, అది పొరుగు దేశాలైన చిలీ, బ్రెజిల్, పెరూ, పెరుగ్వే, అర్జెంటీనాలకు త్వరగా విస్తరిస్తుందని భావించాడు.అయితే బొలీవియా సైన్యం సి.ఐ.ఎ. సహాయంతో ఛే గువారాను పట్టుకొని చంపివేసింది.

చనిపోయే ముందు కూడా అతను ఎవరికీ తలవంచలేదు. చంపే వ్యక్తిని, తన కళ్ళల్లోకి చూసి కాల్చమని అడుగుతాడు. 'ఛే'చరిత్రలో నిలచిపోయే ఉద్యమకారుడు. చనిపోయిన తర్వాత కూడా అతని ప్రాచుర్యం పెరుగుతూనే ఉంది. ప్రపంచ వ్యాప్తంగా విప్లవానికి చిహ్నంగా, ఒక గొప్ప కారణం కోసం మరణించిన వ్యక్తులకు మారుపేరుగా నిలిచాడు, 'ఛే'. ఆయన పోరాడిన అన్ని యుద్ధాలలో ఆయనే ముందు వరుసలో నిలబడ్డాడు. క్యూబా విప్లవ పోరాట సమయంలో ఫైడెల్ క్యాస్ట్రో 'ఛే' కిచ్చిన స్పష్టమైన ఆదేశం, "తుపాకి యుద్ధంలో ముందు ఉండవద్దు. ఎందుకంటే నీ ప్రాణం మాకు, విప్లవానికి ఎంతో విలువైంది" అని. కాని దాన్ని 'ఛే ఎప్పుడూ ఒప్పుకోలేదు. గెరిల్లా దుస్తుల్లో బలహీనంగా ఉన్న 'ఛే' మృత దేహాన్ని చూచిన బొలీవియన్ ప్రజలకు అతను జీసస్‌లా కనిపించాడు. 'ఛే' మృతశరీరం ఫోటోలలో చూసిన వారికి కూడ అది నిజమేననిపించింది. పాత హాలీవుడ్ బయోపిక్ సినిమాలలో, శిలువ వేసిన తర్వాత జీసస్ ఎలా కనిపిస్తాడో సరిగ్గా అలాగే కనిపించాడు 'ఛే'. ఆ ఛాయచిత్రం విస్తృతంగా ప్రచారంలోకి వెళ్ళటంతో, బొలీవియాలోని స్థానిక చర్చి 'ఛే' ని 'క్రిస్టియన్ సెయింట్'గా గుర్తించటం జరిగింది. తన జీవిత కాలమంతా నాస్తికుడిగా వున్న వ్యక్తి, సెయింట్‌గా గుర్తింప బడటం ఒక వింతైన విశేషం.

అమెరికా అనుయాయసంస్థలు 'ఛే' గొప్పతనాన్ని, అతని శరీరంతో పాటే బొలీవియా అడవుల్లో పూడ్చటానికి ప్రయత్నించారు. మరణం తర్వాతే మరింత శక్తివంతుడై, 'ఛే' ప్రపంచవ్యాప్తంగా యువకుల హృదయాల్లో ఒక రాక్‌స్టార్ లాంటి స్థానాన్ని పొందగలిగాడు. 1960, 1970లోని అమెరికా విద్యార్థులు, యువకులు వియత్నాం యుద్ధానికి వ్యతిరేకంగా నిరసనలు తెలియజేస్తున్న సమయంలో, ఛే గువారానే ఆ నిరసనలకు 'చిహ్నం' అయ్యాడు. ప్రపంచంలో ఎలాంటి వ్యతిరేక ఉద్యమాలు, ప్రదర్శనలు జరిగినా, వారి ప్లకార్డ్, బేనర్లు, పోస్టర్‌లలో చిహ్నంగా 'ఛే', కనిపిస్తాడు. నిశితంగా చూస్తున్నట్లుండే భయమెరుగని కళ్ళు, పొడవాటి జుట్టు, పెరిగిన గడ్డంతో ప్రత్యేకంగా కనిపించే అతని శిరస్సు మీద అతని టోపీ, విప్లవ చిహ్నాన్ని సూచించే ఒక నక్షత్రం, తల చుట్టూ, కనిపించని తేజోవలయంతో ఉన్న 'ఛే' ఫోటోగ్రాఫ్‌ను, క్యూబన్ ఫోటోగ్రాఫర్ అయిన ఆల్‌బెర్టో కోర్డా 1960లో యాదృఛికంగా తీశాడు. ప్రపంచ వ్యాప్తంగా ఎక్కువసార్లు ముద్రించబడిన 'ఛాయా చిత్రం'గా అది చరిత్రలో మిగిలిపోయింది. ఈ ఫోటో

లక్షల టి-షర్టుల మీద, నిరసన పోస్టర్లు, కార్డుల మీద కనిపిస్తూనే ఉంటుంది. జీవితాంతం ధనికవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి ముఖం, మళ్ళీ ఆ వ్యవస్థకే ఒక వ్యాపారవస్తువుగా మారింది. దీనిని 'ఛే' ఎప్పటికీ అంగీకరించడని నా వ్యక్తిగత అభిప్రాయం. నిజమైన విప్లవానికొస్తే 'ఛే' ఒక నిబద్ధత కలిగిన వ్యక్తి. విప్లవంలో త్యాగం ఒక నైతిక బాధ్యత అని 'ఛే' బలంగా నమ్మాడు. చెప్పాడు. అంతేకాదు విప్లవ బాధ్యతలు నిర్వహించే సమయంలో, ఏ క్షణంలోనైనా చనిపోవటానికి సిద్ధంగా ఉండేలా విప్లవకారుడు జీవించాలని భావించేవాడు. చివరకు అతని విమర్శకులు కూడా 'ఛే' ని గౌరవించారు. అతను ఏదైతే చెప్పాడో దానికే కట్టుబడ్డాడు, ఎప్పుడూ తానే ముందు నిలబడి ఉద్యమాన్ని నడిపించాడు. ప్రపంచ వ్యాప్తంగా అతడు చేసిన కమ్యూనిస్టు విప్లవాల గురించి చాలా పుస్తకాలు ఉన్నాయి. నాకైతే 'ఛే' లోని ప్రయాణికుడి మీద కూడా సమానమైన కుతూహలం ఉంది.

20వ శతాబ్దంలో ఎంతో మంది కమ్యూనిస్ట్‌లు, కమ్యూనిస్టేతర విప్లవకారులు ఉన్నారు. ఇతర విజయవంతమైన విప్లవకారులతో పోల్చినప్పుడు 'ఛే' ని అంతర్జాతీయంగా ఉన్నత స్థానంలో నిలిపింది విప్లవం పట్ల అతనికున్న నిశ్చితమైన అభిప్రాయాలే. విప్లవం, అణచివేయబడుతున్న బడుగు ప్రజల విముక్తికేగాని, నాయకులకు పదవులు అధికారాలు సమకూర్చి పెట్టే సాధనం కాదని, తన జీవితం ద్వారా చాటి చెప్పిన వ్యక్తి 'ఛే'. అతను అర్జెంటైనా వాసి. కానీ క్యూబా, కాంగో మరియు బొలీవియాలలో ప్రజల విముక్తి కోసం పోరాడాడు. అతను క్యూబా విప్లవం విజయవంతమైన తరువాత, పదవులు స్వీకరించి, సుఖవంతమైన జీవితం గడిపి ఉండవచ్చు. కాని కొద్ది సంవత్సరాలకే క్యూబాలో మంత్రిపదవిని, అధికారాన్ని, అతని కుటుంబాన్ని క్యూబాలో వదిలేసి, తుపాకి చేత పట్టి ఆఫ్రికా, దక్షిణ అమెరికా అడవుల్లోకి వెళ్ళాడు. ఏ క్షణమైనా చనిపోతానని అతనికి

స్పష్టంగా తెలుసు. మరణం అనివార్యం అని భావించే తన ఉద్యమాన్ని నడిపాడు. తను జీవించే ప్రతిక్షణం అరువు తెచ్చుకున్నదేనని, అది విప్లవాన్ని విస్తరించటానికేనని నమ్మి పనిచేశాడు. 39 ఏళ్ళకే వీర మరణం పొందిన 'ఛే' ఒక గొప్ప ఆశయాన్ని సాధించిన వ్యక్తిగా ప్రపంచంలో గుర్తించబడ్డాడు.

గత కొన్ని సంవత్సరాలుగా నేను సాగించిన ప్రయాణాలు ఒక పద్ధతిని సంతరించుకున్నాయి. ఒక ప్రాంతాన్నో లేక దేశాన్నో చూడటానికి బయలుదేరిన నేను, ఆ క్రమంలో అక్కడి ప్రజల గురించి, ఆ ప్రాంతపు చరిత్ర, అక్కడ విఖ్యాతిగాంచిన వ్యక్తులు, వారి సంస్కృతి, ఆచార వ్యవహారాలు, ఆ ప్రాంతపు ఆహారశైలి గురించి తెలుసుకుంటాను. వీటి గురించి వ్రాస్తాను. శాంతాక్లారా బహుశా దానికి మినహాయింపు కావచ్చు. ఈ ప్రయాణంలో నేను ప్రదేశాలకంటే ఒక వ్యక్తి గురించి చాలా వ్రాయటం జరిగింది. ఛే గువారా కొనియాడదగ్గ వ్యక్తి. అతని వ్యక్తిత్వం చాలా విశిష్టమైనది. అది శాంతాక్లారాతో విశిష్టంగా మిళితమైపోయింది. నేను శాంతాక్లారకు వెళ్ళింది ప్రత్యేకంగా ఛే గువారా కోసమే. అతన్ని గురించి మాట్లాడకుండా ఉండటం చాలా కష్టం. ప్రత్యేకించి క్యూబా, లాటిన్ అమెరికాలో పర్యటిస్తున్నప్పుడు. తను జీవించిన స్వల్ప కాలంలోనే చెరగని ముద్ర వేసిన వ్యక్తిగా, అతడు నాకు కనిపించాడు. ఇక్కడికి రావటం వలన, 'ఛే' కు మరింత దగ్గరైన భావం కలిగింది నాకు. 'ఛే' గురించి నేను చాలా చదివాను. శాంతాక్లారాలోని అతని మెమోరియల్ సందర్శించిన తర్వాతే, ఆయన నిజమైన ఆశయాల పట్ల మరింత అవగాహన కలిగింది. ఈ నగరంలో అతని ఆశయాలు ఇంకా సజీవంగానే ఉన్నాయి. అతని స్వేచ్ఛా జీవితం, సాహస యాత్రలు, ధైర్యం, త్యాగం ఎప్పటికీ అందరికీ ఒక నిరంతర చోదక శక్తిగా ఉంటాయని నమ్ముతాను.

శాంతాక్లారాలో, నాకు ప్రియమైన ఛే జ్ఞాపకాలలో తలమునకలైన నాకు, వర్తమానంలోకి తిరిగిరావటం కొంత కష్టమయింది. ఆ మధ్యాహ్నాం భోజనానికి, మార్తా మమ్మల్ని ఒక రెస్టారెంట్‌కు తీసుకెళ్ళింది. ఒక కుటుంబపు సభ్యులు నడిపే ఇటువంటి భోజనశాలను స్పానిష్‌లో, 'పాలడార్' అంటారు. మిత్రుడు డొమింగో సలహా మేరకు,



క్యాస్ట్రోతో ఛే గువారా

ఉల్లిపాయలు, సువాసనలు వెదజల్లే ఆకులు వేసి చేసిన క్రపెండలపు వంటకంతో పాటు వడ్డించబడే, రోస్టు చేసిన పోర్కు తెప్పించుకున్నాను. దీని మీద కొంచెం చేదనిపించే గుజ్జు లాంటి నారింజ చట్నీని కూడ ఇచ్చారు. క్యూబాలో మధ్యాహ్నభోజనం చాలా వైనంతో కూడుకున్నది. ఎన్నో ఇతర విషయాలు చెపుతూ, మార్తా, శాంతా క్లారాలో, ఛే జ్ఞాపకాలు మాత్రమే కాకుండా ఇంకా తెలుసుకోవలసినవి ఎన్నో ఉన్నాయని మాకు తెలియచెప్పాలని ప్రయత్నించింది. ఈ ప్రయత్నంలో భాగంగా, నగర వీధులలో నడిపిస్తూ, క్యూబా విప్లవానికి ముందు ఛే సృజించిన చరిత్ర చాలా నవీనమైనది. వైడాల్ పార్కు చుట్టూ ఉన్న భవనాలు, క్యూబా విప్లవకాలం నాటి బుల్లెట్ గుంటలు మినహాయిస్తే, చాలా అందమైనవిగా కనిపించాయి.

ఆ నగరంలో ముఖ్యమైన కార్యక్రమాలన్నీ జరిగేది వైడాల్ పార్కు చుట్టూనట. క్యూబా స్వతంత్ర్యపోరాటపు నాయకుడైన లియోన్సియో వైడాల్ పేరు దీనికి పెట్టటం వలన అతని పేరు నిత్య స్మరణీయమయింది. అతను చనిపోయినచోట నిర్మించిన స్మారక చిహ్నానికి కూడ మార్తా మమ్మల్ని తీసుకెళ్ళింది. ఆ పార్కులో సేద తీరుతున్న స్థానికులు, అక్కడి గాలిని సంగీతంలో విలీనం చేస్తున్న సంగీతజ్ఞులు, విద్యార్థులు, యువతీ,యువకుల గుంపులు..ఆ పార్కుకున్న జనాదరణను సూచిస్తున్నాయి. వైడాల్ పార్కులో ఉన్న మరో విశేషం, 'మార్తా అబ్రు డి ఎస్టెవెజ్' స్మారక చిహ్నం. ఈమె శాంతా క్లారాకు చేసిన మేలు అంతా ఇంతా కాదు. 20వ శతాబ్దపు తొలి రోజులలో స్పెయన్ కోరలలో చిక్కిన క్యూబా స్వాతంత్ర్యానికి కృషి

చేయటంతో పాటు, ఎన్నో అధికార భవనాలు, పాఠశాల భవనాల నిర్మాణానికి కావలసిన నిధులు సమకూర్చిన మహిళ ఈమె. ఇందుకు సముచితంగా ఆమెను, ఆ ప్రాంతానికి పుత్రికగా, శ్రేయోభిలాషిగా ఇప్పటికీ తలుస్తారు. టీట్రో లా కారిడాడ్ అని పిలువబడే రంగస్థలభవనం ఆమె కృషికి ప్రతీకగా ఆ పార్కుకు ఒక మూల, వైభవంగా నిలచి ఉంది. తరువాత మార్తా మమ్మల్ని కొంచెం దూరంలో ఉన్న కార్మెన్ పార్కుకు తీసుకువెళ్ళింది. అక్కడ ఒక చింత చెట్టు ఉంది. 1689లో 17 కుటుంబాలు తీరంలో ఉన్న రెమిడియోస్ అనే ఊరు నుండి, సముద్రపు దొంగల బారి నుండి తప్పించుకోవటానికి శాంతాక్లారా వలస వచ్చేశారట. అప్పట్లో వారందరూ ఒక చెట్టు చుట్టూ చేరి ప్రార్థనలు చేసుకునేవారట. ఇప్పుడున్న ఈ చెట్టు, ఆ నాటి చింతమాను అంటుమొక్క.

సాధారణంగా ఒక క్రొత్త ప్రదేశానికి వెళ్ళినప్పుడు, చూడవలసిన ప్రదేశాలను చూడటం వలన ఏర్పడిన ఆ ప్రాంతపు చిత్రపటాన్ని మనోఫలకం మీద భద్రపరచుకుంటాము. కాని ఒక్కొక్క సారి నేను, చూడవలసిన ప్రదేశాల పట్టికను ప్రక్కకు నెట్టి, అందులో లేని ప్రదేశాలకు వెళ్ళటం కూడ కద్దు. అట్లా చెయ్యటం వలన, సగటు యాత్రికులను ఆకర్షించటం కోసం చేసే ఏర్పాట్ల పొరలు లేని, ఆ ప్రాంతపు సహజత్వాన్ని గ్రహించవచ్చు. అక్కడ నివసించే సామాన్యుల దైనందిన జీవనాన్ని కూడ ఆకళింపు చేసుకోవచ్చు. శాంతా క్లారా సదరు ప్రయాణీకుల చిట్టాలో సాధారణంగా ఉండకపోయినా. చే పట్ల మాకున్న ఆకర్షణ మమ్మల్ని ఇక్కడకు రప్పించింది. అందుకు అతనికి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకుంటూ, అక్కడి నుండి సాయంత్రం 5 గంటలకు బయలుదేరి, ఎంతో అందమైన ట్రినిడాడ్ పట్టణానికి సాగిపోయాము.

ఇంగ్లీషు మూలం: డా. నిమ్మగడ్డ శేషగిరి రావు (ఇంగ్లాండ్)
e-mail: srnimmagadda@googlemail.com

అనువాదం: ప్రొ. ఆదినారాయణ (భ్రమణ కాంక్ష)
జయశ్రీ అట్లూరి (ఇంగ్లాండ్)

## క్రియ ఒక జీవన లయ

*ఒకరు పరిచయం చేస్తే*
*తెలిసే కవి కాదు గోపి –*
*కవిగా విశ్వరూపం చెందిన గోపి*
*ఏది కలానికెత్తుకొని రాసినా కవి గోపి*
*అది కవిత్వమై తలయెత్తుకొని నిలిచేది*
*క్రియ అయినా కర్త అయినా అది లయవిన్యాసమే*
*ఆ లయ గోపి కవితా విన్నాణమే*
*మట్టి ఒకటే ఏ గ్రహానికెళ్ళినా, అది గుప్పెడు మట్టియే*
*పదాలన్నీ వాక్యాలవ్వాలని తహతహ*
*అక్షరాలన్నీ గోపి కవితలవ్వాలని తపన*
*ఆకాశంలోని నక్షత్రాలు*
*నువ్వు తిరిగి రావడానికి దారిచూపుతాయా?*
*పొద్దున పూట ఫ్రెష్‌గా ఉండటమంటే*
*కాఫీ వాసన ముక్కుపుటాలకు జేరటం*
*గోపి అక్షరాలు మన చేతికి రావటం*



# నైరూప్య చిత్ర కళ

– తంగెడ విశ్వేశ్వర ప్రసాద్

నైరూప్య చిత్రకళ, అమూర్త చిత్రకళ రెండూ ఒకటే. దీన్ని విరూపకళ అనీ అనవచ్చు. మనం గుర్తించగలిగిన భౌతిక వస్తువుల రూపం గానీ, వర్ణన గానీ లేని కళ. వాస్తవ ప్రపంచానికి అతి తక్కువ లేదా అసలు సంబంధమేలేని చిత్రకళ. తాను చెప్పదలుచుకున్న విషయాన్ని, ఇవ్వదలుచుకున్న సందేశాన్ని నైరూప్య చిత్రకారుడు చిత్రాల ద్వారా తెలియజేస్తాడు. వాటిలోని వస్తువుల స్థానంలో రంగులు, గీతలు, త్రిభుజాలు, చతురస్రాలు, వృత్తాలు మొదలైన అంశాలను ఉపయోగిస్తాడు.

నైరూప్య చిత్ర కళా మూలాలు 1990ల్లోనే వాసిలీ కాండిన్స్కీ, హెన్రీ మాటెస్ లాంటి కళాకారుల చిత్రాల్లో కన్పిస్తాయి. మనిషి భావోద్రేకాల్ని, అతని అంతరంగ స్వభావాన్ని వారు రంగులు, రూపాలు, ఆకృతుల ద్వారా వ్యక్తపరిచారు. 1950ల నాటికి కళాకారులు, ముఖ్యంగా పెయింటింగు చిత్రకారులు, కోపం, ప్రేమ లాంటి గాఢమైన భావోద్రేకాలను రంగులు ఉపయోగించడం ద్వారా, కుంచె పనితనంతో భిన్నంగా ప్రదర్శించారు. అలాంటివారిలో జాక్సన్ పోలాక్, విలియం డీ కూనింగ్ ప్రముఖులుగా గుర్తింపు పొందారు. ఎక్స్‌ప్రెషనిజం, క్యూబిజం, సర్రియలిజం లాంటి ధోరణులకు నైరూప్య చిత్రకళకు సంబంధం కన్పిస్తుంది. నైరూప్యకళ వస్తుగతంకాని, లక్ష్యంలేని కళ అనీ, ప్రాతినిధ్యం లేని కళ అనీ అంటారు. చిత్ర శిల్ప కళల్లో, గ్రాఫిక్ కళలో నిజ జీవితంలోని వస్తువులకు, దృశ్యలకు సంబంధం కన్పించదు. రూపం (Form) వర్ణం, రేఖ, నిర్మాణం (Texture)లతో రూపొందేదే అమూర్తకళ, ఇరవయ్యవ శతాబ్దానికి ముందు నాటి చిత్రకారులు ఇవే అంశాలను ఉపయోగించి ప్రకృతి చిత్రాల, వర్ణనాత్మక (Figurative) చిత్రాల ప్రతికృతులను రూపొందించి మానవ సంస్కృతిని ప్రతిబింబించారు. భావోద్రేకాలను చూపించడం కన్నా వివరణకు ప్రాధాన్యతనిచ్చారు. పెయింటర్లు తమ భావోద్రేకాలను, మనోదృశ్యాలను (Images) వెలిబుచ్చడానికి రంగులు, రేఖలు, సంకేతాలను ఆశ్రయించారు. భావాలకు రూపం ఉండనట్లే, భావ ప్రతినిధులైన వారి చిత్రాలకూ రూపం ఉండదు. అందుచేత వీటిని 'భావ' చిత్రాలు అనవచ్చునేమో! అవే అమూర్త / నైరూప్య చిత్రాలు.

20 శతాబ్దపు తొలి దశకాల్లో వెలుగు చూసిన ఎక్స్‌ప్రెషనిజం, క్యూబిజం, ఫ్యూచరిజం ధోరణులు సహజ రూపాలకు, నూతన ధోరణులలోని ఆకారాలకు మధ్యనున్న పగుళ్ళను (gaps) ఎత్తి చూపాయి. నిజ జీవితంలోని (దృశ్యాలు) దృశ్యాలను గుర్తించలేని విధంగా నైరూప్య చిత్రాలుగా రూపొందాయి. మొదటి ప్రపంచ యుద్ధానికి నాలుగైదు సంవత్సరాలకు ముందే రాబర్ట్ డెలానీ ఏ నియమ నిబంధనలకు కట్టుబడకుండా విషయ ప్రాధాన్యతను వెనక్కునెట్టి, లక్షణాలకు మాత్రమే ప్రాధాన్యత నిచ్చిన నూతన కళగా ఆవిర్భవించింది. నైరూప్య చిత్ర కళాకారులు స్ఫుటమైన ప్రకాశవంతమైన రంగులను ఉపయోగించడం, ఆకారాలను సృజించడంలో ప్రయోగాలుచేశారు. వారు అనుకున్నదే అప్రయత్నంగా చిత్ర రూపం ధరించింది. ఆ చిత్రాల్లో అప్రయత్న సిద్ధత (spontaneity) కన్పిస్తుంది.

బాహ్య ప్రపంచంలో కన్పించే వస్తు రూపాన్ని నైరూప్య కళ అలక్ష్యం చేస్తుంది. భౌతిక ప్రపంచంలో వస్తు భ్రమను వీడిన కళాకారుడు నైరూప్య కళలో ఆశ్రయం పొందుతాడు. శాస్త్ర సాంకేతిక రంగాల ప్రగతి, మానసిక విశ్లేషణా సిద్ధాంతాల పట్ల ఆదరణ పెరిగిపోవడంతో, పట్టణ జీవితం సందిగ్ధంలో పడింది. జీవితం, జీవిత వాస్తవం ఏమిటి? అందులో మనిషి స్థానం ఏమిటి లాంటిప్రశ్నలు తలెత్తాయి. ఫొటో గ్రఫీలోని కొత్త కొత్త ప్రయోగాలు కళాకారులను తమ మాధ్యమం యొక్క పరిధుల్ని విస్తరించుకుని నూతన ఆవిష్కరణలకు నడుం కట్టేలా

చేశాయి. మానవ స్వభావంలోని అత్యంత క్లిష్టమైన భావోద్రేకాలను, నిగూఢతను వెల్లడించడానికి ఈ మాధ్యమం అద్భుతమైన ప్రత్యామ్నాయ మార్గాలను వెదుక్కోవడానికి ఉపకరించింది.

సర్రియలిజం, ఫాలిజం, క్యూబిజం, ఫ్యూచరిజం ఇతర అమూర్త రూపాల కలయిక సూపర్ మాటిజం. జార్జి సూరల్ (George Seural) చుక్కలతో చిత్రాలను రచించడం, వాంఘో వర్ణం, వెలుతురుల శైలి, పికాసో అభివృద్ధి చేసిన క్యూబిజం, మాన్‌రాయల ప్రభావం, యుద్ధాల ఫలితం అమూర్త చిత్రకళకు పునాదులు వేశాయి. వాసిలీ కాండిన్‌స్కీ, మాలిరిక్ వ్లాడి మిర్, టాట్లిన్‌ల పెయింటింగుల్లో నైరూప్య కళ యొక్క ప్రాథమిక లక్షణాలు కన్పిస్తాయి. రెండు ప్రపంచ యుద్ధాల మధ్య కాలంలో నిరంకుశ పాలన, నియంతృత్వ రాజకీయాల వల్ల, క్లిష్టమైన సామాజిక సమస్యల వల్ల నైరూప్య కళను పట్టించుకున్నవారు కన్పించరు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాతనే బలమైన అమెరికన్ పెయింటింగు వర్గం వల్ల 'అబ్‌స్ట్రాక్ట్ ఎక్స్‌ప్రెషనిజం' పుట్టుకొచ్చి విస్తృతంగా ప్రభావాన్ని చూపించింది. 1950 నాటికి నైరూప్యకళ ఐరోపా, అమెరికా చిత్ర, శిల్ప కళలో ఆచరణ యోగ్యం అయింది. చాలామందిని ఈ కళ గందరగోళానికి గురి చేస్తే కొందరిని ఆకర్షించింది. దేన్నీ సూచించని చిత్ర భాషను యిష్టపడే ఆ కొందరికి అది విలువైనదిగా, సాధించ తగిందిగా ప్రీతి పాత్రమైంది.

కళాకారులు నూతన సాంకేతికాంశాలు, పద్ధతుల ద్వారా స్పుటమైన ప్రకాశవంతమైన రంగులను ఉపయోగించి చిత్ర లేఖనంలో ప్రయోగాలు చేశాయి. వారు అనుకున్న మనసులు మెదిలిన భావాలు అప్రయత్నంగానే ఏ నియమ నిబంధనలకు కట్టుబడకుండా విషయ ప్రాధాన్యతను వెనక్కునెట్టి, లక్షణాలకు మాత్రమే ప్రాధాన్యత నిచ్చిన నూతన కళ నైరూప్యకళ. నవ్య మార్గంలో నడిచిన శైలి. చిత్రకారుని భావాలకు ప్రతినిధి, వాస్తవ విరుద్ధం. వివరణకు అందని భావాలనిలయం. **అబ్‌స్ట్రాక్ట్ ఎక్స్‌ప్రెషనిజం (నైరూప్య వ్యక్తీకరణ)** రెండు ప్రపంచ యుద్ధాల తర్వాత అమెరికాలో ముఖ్యంగా న్యూయార్క్‌లో కళాకారుల ఉద్వేగ, ఉద్రేకాలకు ప్రతినిధిగా నైరూప్య కళ రూపుదిద్దకుంది. భావ వ్యక్తీకరణకు కళాకారులు తమకు తోచిన మార్గాలను, శైలిని అనుసరించారు. సాంప్రదాయక పద్ధతుల్ని ఛేదించుకుని నూతన వస్తు సముదాయం (Materials)తో కాన్వాస్‌లై అప్రయత్నంగా చిత్రీకరణ చేశారు. ఈ శైలీ వైవిధ్యం నుండి పుట్టుకొచ్చినవే ఫాలిజం, క్యూబిజం, ఫ్యూచరిజాలు. వాటిని సంగ్రహంగా పరిచయం చేసుకుందాం. **ఫాలిజం** (**Fauvism**) : ఇది 20వ శతాబ్దపు తొలి దశలో పుట్టిన కళాశైలి – ఫ్రెంచి భాషలో ఫావ్ అంటే అడవి మృగం అని అర్థం. కానీ ఫాలిజం పెయింటింగుల్లో విశృంఖలత కన్పిస్తుంది. 1905లో పారిస్‌లో పుట్టి కొద్ది కాలమే మనగలిగింది. చిక్కటి రంగులు, ప్రకృతి చిత్రాలు. బ్రష్ పనితనం ఈ కళ ప్రత్యేకత. ఆంద్రీ డేరియన్, హెన్రీ మాటిస్, ఎమిలీ బార్మీలు ఇంప్రెషనిస్టుల ననుసరించి తీరిగ్గా వేసే ప్రకృతిచిత్రాలపై దృష్టి పెట్టారు. వీరి చిత్రాలు నైరూప్య కళకు మార్గం సుగమం చేశాయి.

**ఫ్యూచరిజం** (**Futurism**) : ఇటలీకి చెందిన కళాత్మక, సాంఘిక ఉద్యమం. ఇది కూడా ఫాలిజం లాగా 20వ శతాబ్ది తొలినాళ్ళలో ఒక వెలుగు వెలిగి ఆరిపోయింది. ఫ్యూచరిజం సాంకేతిక ప్రగతికి మారుపేరుగా నిలిచిన వేగం (speed) పైన దృష్టి పెట్టింది. విమానాలు, రైళ్ళు వేగవంతంగా నడిచే ఇతర ప్రయాణ సాధనాలు వారి అభిమాన విషయాలు. యువత, సాంకేతిక ప్రగతి మొదలైన అంశాలు ఫ్యూచరిస్టులను ఆకర్షించిన విషయాలు. గత కళా సాంప్రదాయాలను తిరస్కరించినా పెయింటింగుల్లో విశ్వ చలనానికి ప్రాతినిధ్యం వహించారు. వేగుగా నడిచే వాహనాలు, పారిశ్రామిక ప్రగతి, పట్టణాలు వారి చిత్రాల ఇతివృత్తాలు. అంతరిక్షంలోకి దూసుకు పోయే మనిషినే వేగవంతమైన



వాహనంగా చూపించడంలో వారి లక్ష్యం తెలుస్తుంది. హింస, యుద్ధం కూడా వారిని ఆకర్షించడం విచారకరం. మారినెట్టి (Marinetti) ఫ్యూచరిజాన్ని ఫాసిస్ట్ ఇటలీ రాష్ట్ర కళ కావాలని ప్రయత్నించాడు. ఐనా ముస్సోలిని ఫాసిస్ట్ ప్రభుత్వం (జర్మనీ నాజీలు కళాఖండాల మీద దాడి చేయడం ఉత్తేజంగా) దాన్ని భ్రష్టు పట్టించింది.

**క్యూబిజం (Cubism) :** ఇది పారిస్‌లో పికాసో, బ్రావ్‌ల 1907ల నాటి సంయుక్త కృషి ఫలితం. చిన్న చిన్న ఘనాకారాల ద్వారా చిత్రాలను రూపొందించే వీరి ప్రయత్నం విమర్శకుల హేళనకు గురైంది. క్యూబిస్టులు అభివృద్ధి పరిచిన దృశ్యమాధ్యమం (Visual Language). వారు చూపిన 4డి, నాలుగు తలాల చిత్రాలు వీక్షకునికి సవాలుగా నిలిచాయి. ఒకే చిత్రాన్ని ఏక కాలంలో వివిధ కోణాల్లో చూపించడం, చిత్రమౌలిక స్వరూపాన్ని గుర్తించగలిగేట్లుగా పెయింట్ చేయడం వీరి ప్రత్యేకత. రేఖాగణిత గుర్తులు సాయంతో క్లిష్టమైన అంశాన్ని తేలికగా చూపగలిగిన ప్రజ్ఞ వారిది. ఆఫ్రికా ఆదిమ ప్రాచీన ట్రైబల్ ఆర్టుతో ప్రేరణ పొంది పికాసో సృజించిన కళ యిది.

విషయ ప్రాధాన్యత లేకుండా మానవ స్వభావానికి, భావాలకు పట్టంకట్టిన ఎక్స్‌ప్రెషనిస్టుల్లో జాక్సన్ పోలాక్, మార్క్ రోథ్‌కో విల్లెమ్ డి కూనింగ్, హెలెన్ ఫ్రాంకెన్ థాలర్, లీక్రాస్నర్, జాన్ మిచెల్ తదితరులు ముందు వరసలో వుంటున్నారు అగ్రగణ్యులు. **నైరూప్యకళ – భావవ్యక్తీకరణ స్వేచ్ఛ :** నైరూప్య కళకు మూలాలు అంతర్దృష్టి, స్వేచ్ఛ మనం చూడగలిగే దృశ్యాలను మించి కళాకారుడు ఊహాశక్తితో తనలోని భావోద్రేకాలను కాన్వాస్ మీదికి అనువదిస్తాడు. నైరూప్యకళను అర్థం చేసుకోవాలన్నా, అందులోని రహస్యాన్ని మెచ్చుకోవలన్నా (appreciate) ఆర్టుకు చెందిన మౌలికాంశాలు వర్ణం, రూపం, రేఖ, ఆకృతి, నిర్మాణాలపై అవగాహన అవసరం. 1912–1925 తిరిగి 1947–1970ల కాలం నైరూప్య కళకు స్వర్ణయుగంగా పరిగణించబడింది. సృజనతో కూడిన ఆధునిక కళాకేంద్రం ప్రపంచ యుద్ధాల తర్వాతి దశకాల్లో పారిస్ నుండి న్యూయార్కుకు మారిపోయింది. గాఢమైన రంగుల్లో చిత్రకారులు తమ జ్ఞాపకాలను, అంతర్గత శక్తిని (Inner strength) ధ్యానం, ఆత్మ శోధనకు ఉపయోగించారు. చాలా పెద్ద కాన్వాసుల మీద కలర్ ఫీల్డ్ పెయింటింగులను, ఏక్షన్ పెయింటింగులను చిత్రించే పద్ధతి వెనకబడి అతి తక్కువ వివరాలతో, చప్పగా వర్ణ విస్తరణ చేసే పద్ధతి ముందుకు వచ్చింది. "సాధారణ దృష్టికి గోచరించని ప్రత్యక్షంగా చూడలేని దృశ్యాలను మనో నేత్రంతో చూడడం నేర్పింది. పరిమితమైన పరిధినుండి అనంతాన్ని గ్రహించడానికి అవకాశం కలిగించింది. పరిచయంలేని అంశాల అన్వేషణకు దారి చూపి మానవ మేదస్సుకు స్వేచ్ఛను ప్రసాదించింది" అని ఆర్షిలీ గోర్కీ అభిప్రాయపడ్డాడు.

**నైరూప్యకళ – వాస్తవిక స్వేచ్ఛ :** కళ అంటేనే స్వేచ్ఛా మాధ్యమం. చిత్రకారుడు వస్తువుల అసలు రూపాలను విస్మరించి, వర్ణానికి అధిక ప్రాధాన్యత నివ్వడం ఈ కళా లక్ష్యం. "ఇది నియమ నిబంధనలకు కట్టుబడని కళ, కళాకారుడు తాను ఏమి చిత్రించదలుచుకున్నాడో దాన్నే చిత్రిస్తాడు" అంటాడు. యూరీ ష్వెడాఫ్ (Shwedoff). నైరూప్య కళాకృతిని ఎవరికి వారు తమ అనుభవాలకు, వివరణకు తోచిన విధంగా అన్వయించుకునే అవకాశానికి తావిస్తుంది. కళాకారుడు మరింత సృజనతో వీక్షకుణ్ణి మరింత తృప్తిపరచగలుగుతాడు. నైరూప్య కళను అర్థం చేసుకోవడానికి కొంత స్వీయ శిక్షణ అవసరమౌతుంది. కళారూపం చిత్రం, శిల్పం ఫొటోగ్రఫీ, డిజైన్ –ఏదైనా వాస్తవ రూపానికి ప్రాతినిధి కాకపోతే అదే నైరూప్య చిత్రంగా పరిగణించబడుతుంది. మూర్తిమత్వ కళ (Figurative art)లో వస్తువు ఆకారం యధాతథంగా చిత్రించబడ్తే, నైరూప్యకళలో వస్తు రూపంతో పని లేకుండా, కేవలం భావానికి వర్ణరూపం యివ్వబడుతుంది. 20వ శతాబ్దపు ఎబ్‌స్ట్రాట్ ఎక్స్‌ప్రెషనిష్టులు హెన్రీమాటిస్, యువ చిత్రకారులు జార్జిబ్రాక్, ఆండ్రీడేరియన్, రోల్‌డఫీ తదితరులు పారిస్ చిత్ర కళా రంగాన్ని లాండ్ స్కేపులతో, ఫిగర్ పెయింటింగులో విప్లవం సృష్టించారు. నైరూప్య చిత్ర కళాకారుల మీద ఎడ్వర్డు మంక్, జేమ్స్ ఎన్సార్‌ల ప్రభావం కన్పిస్తుంది. నైరూప్య కళకు ఆద్యురాలైన హిల్మా ఆఫ్ క్లింట్ చిత్రాల్లో ప్రాచ్యదేశాల మార్మిక వాదం, ఆధునిక మత తాత్వికత, రేఖాగణిత లక్షణాలు కన్పిస్తాయి. హిల్మా ఆఫ్ క్లింట్ 'మదర్ ఆఫ్ ఎబ్‌స్ట్రాక్ట్ ఆర్టుగా' పేరు పొందింది. **నైరూప్యకళ లక్షణాలు :** రంగు, రూపం, రేఖ, ఆకృతి కలగలిసిన దృశ్య కళ అనీ, దృశ్య ప్రపంచంతో సంబంధం




లేని కళ అనీ, మోడల్ అవసరం అసలే లేని కళ అనీ అర్థం చేసుకున్నాం. దీని లక్షణాలను పరిశీలిద్దాం. ఇది వివరణాత్మక, వర్ణనాత్మక చిత్రాలకు వ్యతిరేకి. భౌతిక రూపాలకు చెందని కళ. గుర్తించకలిగిన ఆకారాలు లేనిది, భావాలను వెల్లడించడంలో చిత్రకారునికి, దాన్ని అర్థం చేసుకుని ఆనందించడంలో వీక్షకునికి వ్యక్తిగతం. నిజ జీవితంలోని వస్తువులకు ప్రాతినిధ్యం లేని కళ. గృహాలంకరణలో విరివిగా ఉపయోగపడుతుంది. చిత్రంలోని విషయం దేన్ని గురించో తెలియక అయిష్టం, తికమక కలిగిస్తుంది. అందుకే ఇది వారికి అనాకారకళగా వికార కళగా తోస్తుంది. ఇందులోని నవ్యత, సందిగ్ధత, వైరుధ్యం సంచలనం కలిగిస్తాయి. పద్ధతి ప్రకారం ఉండాలని కోరుకోని వారికి, నిష్కపటంగా, పక్షపాత రహితంగా ఆలోచించేవారికి ప్రీతిపాత్రమైంది. ఆత్మకు ఆలోచనకు సంబంధించినది. సంచలనాలను, నూతన ప్రయోగాలను, నవ్యతను యిష్టపడే వారికి నచ్చుతుంది.

**నైరూప్యకళను అర్థం చేసుకోవడానికి మార్గాలు :** చిత్ర రూపాన్ని కాకుండే దానిలోని అతంతరార్థాన్ని వెదికి పట్టుకోవాలి. చిత్రంపై ఏకాగ్రతలో అది యిచ్చే సందేశాన్ని శ్రద్ధగా గమనించడం, మన అనుభవాలకు, భావాలకు అన్వయించుకోవడం అవసరం. తరచుగా గొప్ప కళాకారుల తెలుపు నలుపుచిత్రాలతో మొదలుపెట్టి క్రమంగా వర్ణ చిత్రాలను చూడడానికి అలవాటుపడాలి. చిత్రంలోని స్థలం, దాని వినియోగాన్ని గమనించాలి. చిత్రాన్ని మరీ దగ్గరగా కాకుండా తగిన దూరం నుండి చూడడం, అదిమనలో రేకెత్తించే వివిధ భావాలతో ఆడుకోవాలి.

**ప్రయోజనాలు :** మన ఊహాశక్తికి పదును పెడుతుంది. మన ఆలోచనలకు, వివిధ భావాలను ఊహించుకోవడానికి ఒత్తిడి కలిగిస్తుంది. సాధారణంగా కన్పించే చిత్రాలను చూసి అసాధారణంగా ఆలోచించడానికి, మనోదృశ్యాలను చూడడం నేర్పుతుంది. భావ పరిధిని విస్తృత పరుస్తుంది.

**నైరూప్యచిత్రకళను మెచ్చుకునే ప్రతిభ / ప్రజ్ఞ :** చిత్రాన్ని చూసి ఆనందించడానికి అభినందించడానికి కొంత శిక్షణ అవసరం. ముందుగా సాంప్రదాయక కళలోని మౌలికాంశాలను, కళలోనిమెలకువలను, డ్రాయింగు పెయింటింగుల లక్షణాలను తెలుసుకుని వుంటే నైరూప్య కళను ఆస్వాదించడం సులవవుతుంది. సంకుచిత భావాలకు స్వస్తి పలికి, నిర్బంధమే లేని స్వేచ్ఛా మార్గంలో ఆలోచించడం నేర్చుకోవాలి. వర్ణాలకు, రేఖలకు మధ్య గల సంబంధాన్ని తెలుసుకోవడం ప్రత్యామ్నాయ పద్ధతిలో ఆలోచించడం, కొత్త భావోద్రేకాలకు, సృజనాత్మక ఆలోచనలకు పని చెప్పడం ఈ కళను అర్థం చేసుకోడానికి దోహద పడ్తాయి. చిత్రకళలో ఉపయోగపడే సంకేతాలు, ప్రతీకలు, రంగుల లక్షణాలు మొదలైన విషయ కళా పరిజ్ఞానం పెంపొందించుకుంటే నైరూప్య చిత్రకళను మరింత వివరంగా అవగాహన చేసుకోగలుగుతాం.

**నైరూప్యకళ - విమర్శకులు :**

**థామస్ క్రేవన్ :** "ఏమి చిత్రించాలన్నది కాకుండా, ఎలా పెయింట్ చేయాలి అన్న ఆలోచన ఆధునిక కళలో విపరీత భావనలకు, అర్థంపర్థం లేని చిత్రాలకు బాటలువేసింది. ఆధునిక కళలు విషయం పూర్తిగా లుప్తమై అర్థంకాని ఆకారంతో, చిత్రం మిగిలిపోతుంది. దీన్ని యిష్టపడేవారు యిష్టపడతారు. నాకు మాత్రం అది లైన్ లేని వైన్ పాత్ర వంటిది. కథ, నాటకీయత, సంఘటన, సన్నివేశం ఉన్న విషయగత చిత్రాలే నన్ను ఆకట్టుకుంటాయి. వాటిని మెచ్చుకోవడం సులభం. విషయం, దాన్ని అర్థవంతంగా చిత్రించగల నేర్పు సమపాళ్ళలో కుదిరితేనే కళాకృతి పూర్తవుతుంది. రెంటిలో ఏ ఒకటి లోపించినా అది అసమగ్రంగా, అసంపూర్తిగా మిగిలిపోతుంది అని దాదాపు 70 సంవత్సరాలకు పూర్వమే. ప్రముఖ ప్రపంచ చిత్రకారులు పుస్తకానికి రాసుకున్న ముందుమాటలో స్పష్టం చేశాడు. క్లెమెంట్ గ్రీన్‌బర్గ్, నైరూప్యకళను సమర్థిస్తే హెరాల్డ్ రూసెన్‌బర్గ్ సాంప్రదాయక కళలోని రీతిని ప్రమాణాన్ని మెచ్చుకుంటాడు. నైరూప్యకళ ఆధునిక చిత్ర కళా చరిత్రలో పెద్ద పగులు, బీట అంటాడు.

**జేమ్స్ ఆకర్‌మన్ :** ఆధునిక కళాసమస్యలను విపులంగా చర్చించి, నైరూప్యకళను గురించి ఇలా అంటాడు. ప్రముఖ

నైరూప్య చిత్రకారుల పెయింటింగుల్ని చాలామంది అర్థంలేని కళారూపాలని తీసి పారేస్తారు. (సాంకేతికాంశాలను తెలియని అసమర్థులు విషయం మరింత గందరగోళం అవడానికి జటిలతకు కారకులవుతారు) వారికి అర్థంకాని, అర్థం లేనిదనిపించే నైరూప్య చిత్రకళ నిరాశను కలిగిస్తుంది. తమ అసమర్థత వారి బాధను ఎక్కువ చేస్తుంది. ఎందుకు అది అపార్థం చేసుకోబడుతుంది? అన్న ప్రశ్నకు జవాబుకూడా తానే బెబ్తాడు వీక్షకుని నైరూప్య చిత్రకళా ప్రావీణ్యతకన్నా కళాకారుని దృష్టిని (Vision) అందుకోలేక పోవడం చిత్రంతో అతని ప్రతిస్పందన సరిగా లేకపోవడం కారణాలు అంటాడు. కళాకారుడు తనతో అర్థం కాని భాషలో ఏదో చెబుతున్నట్లు భావిస్తాడు. ఏ భాషనైనా నేర్చుకోనిదే అర్థం కాదు, నైరూప్య చిత్ర కళాభాషకు కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది అంటాడు.

చిత్రంలో చూడడానికి ఎంత తక్కువ సమాచారం ఉంటే అంత ప్రాధాన్యత కలిగి వుంటుంది. అప్పుడు చిత్రాన్ని మరింత శ్రద్ధగా పరిశీలనగా చూస్తాం, నైరూప్య కళారహస్యం ఇదే అని (మరొక అభిప్రాయం). కిర్క్‌వార్నెడూ (Kirk Varnedov) అంటే నేను నైరూప్యచిత్ర కళాకారుణ్ణి కాను, దానిపై నాకు సదభిప్రాయం లేదు. మానవ విషాదం, సంతోషం, ఉత్సాహం మొదలైన అంశాలనూ చూపే చిత్రాలంటే యిష్టం అని మార్కు రోథ్‌కో అంటాడు. (Mark Rottoo) ఆబ్‌స్ట్రాక్ట్ ఆర్టు అంటే అందరికీ తెలుసు. అందులో ఏదో లక్ష్యం వుందని తెలిసినా చాలామంది యిష్టపడరు. రాయ్ / రే లిచన్ స్టెయిన్ (Roy Litehen stain) మార్కురోథాక్, కిండెన్‌స్కీ చిత్రాల్లో కథ కోసం వెతక్కూడదు. అవి కలిగించే భావోద్రేకాలతో తాదాత్మ్యం చెందాలి. ఇది పెర్సన్ జెల్లర్ అభిప్రాయం.

**ప్రఖ్యాతి గాంచిన నైరూప్య కళాచిత్రాలు**

వాసిలీ కాండిన్‌స్కీ - కాంపోజిషన్ (1939)

పీట్‌మాంండ్రియన్ (Piet Mondian)

ఇది గత వంద సంవత్సరాల్లోని నైరూప్య చిత్రాల్లో మిక్కిలి ప్రసిద్ధి గాంచింది.

జాన్‌మిరో - పెయింటర్ (painture) 1927

బెన్‌నికల్సన్ - OM (1934) ఇది కుడ్య చిత్రం

జెరార్డ్ రిచర్ - ఆబ్‌స్ట్రాక్ట్ పెయింటింగ్ 599 (1986) జాక్‌సన్ పోలాక్ - కన్వర్జెన్స్ (Convergence) 1952 హెలెన్ ఫ్రాంకెన్ థాలర్ - మౌంటేన్స్ & సీ (......) 1952



ఇంకా టాంబ్లీ, రాబర్ట్ మదర్ వెల్ల చిత్రాలు. **అత్యంత విలువైన నైరూప్య చిత్ర కళాఖండాలు**

1. నెం5 (1948) జాక్‌సన్ పోలాక్. 2006లో 140 మిలియన్లకు అమ్ముడు పోయిన ఈ చిత్రరాజం ప్రస్తుత విలువ 188.2 మిలియన్లుగా అంచనా వేయబడింది. 2. వుమన్ III. విల్లెమ్ డి.కూనింగ్ (1953) ఇది 6 వరుస చిత్రాలలో ఒకటి. 137.5 మిలియన్లు. డేవిడ్ జఫెన్ ఫౌండేషన్ దీన్ని ఖరీదుచేసిన కళాసంస్థ. 3. మార్క్ రోథ్కో నెం.6 వయెలెట్, గ్రీన్ & రెడ్. 186 మిలియన్లు 2014. 4. జెస్పర్ జోన్స్ - ఫాల్స్‌స్టార్ట్ (1959) 2006లో దీని విలువ 80 మిలియన్లు. 5. టాంబీ (Cy Twomby) - లెడా అండ్ దస్వాన్ (1962) 6. వాసిలి కాండిన్‌స్కీ - కాంపోజిషన్ VII (1913)ల చిత్రాలు. **భారతీయ ఆబ్‌స్ట్రాక్ట్ పెయింటర్లు** ఎస్.వి.రామారావుగా ప్రసిద్ధుడైన సిరందాసు వెంకట రామారావు భారతీయ వర్తమాన నైరూప్య కళా ప్రతినిధి, స్రష్ట (exponnent). రామారావు చిత్రాలు ప్రపంచంలోని ఆర్టు గాలరీలన్నింటిలో ప్రదర్శితాలు. లండన్ టేట్ మాడరన్‌లో అతని చిత్రాలు చూడవచ్చు. బ్యూటిఫుల్‌స్కై, హిడెన్ జెమ్స్, షూటింగ్ స్టార్స్, బర్డ్స్ ఇన్ ఫ్లైట్ మొదలైన చిత్రాలు, విజయవాడ దగ్గర కృష్ణానది ప్రఖ్యాతి గాంచినవి. ప్రస్తుతం నివాసం హైదరాబాద్. పద్మశ్రీతో పాటు అనేక అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్నాడు. కవితా జైస్వాల్, మోనారాయ్, రవి మాండిక్, సచిన్ జార్జి సెబాస్టియన్, జోన్ కృష్ణమాచారి, లక్ష్మణ్ శ్రేష్ట తదితరులు వివిధ రాష్ట్రాల ప్రతినిధులు. **నైరూప్య చిత్ర కళా మ్యూజియాలు** న్యూయార్క్ మోడరన్ ఆర్టు మ్యూజియం (Musium of Modern Art - MoMA) 19-20 శతాబ్దాల చిత్ర కళకు ప్రసిద్ధి గాంచింది. గూగెన్ హెయిమ్ మ్యూజియం,




మన్‌హట్టన్, న్యూయార్క్ విషయ ప్రాధాన్య (Non-objective) పెయింటింగులు, నైరూప్య చిత్రకళా కృతులు, కళాఖండాల నిలయం. గగెన్ హెయిమ్ మ్యూజియం, బిల్బొ భారీ నైరూప్య చిత్రాలకు పేరు గాంచింది. టేటో మాడరన్, లండన్ ఆధునిక కళా మ్యూజియాలలో ఉత్తమ శ్రేణి మ్యూజియం. వర్తమాన కళామ్యూజియం (Contemporary Art Stedelijk musium) ఆమస్టర్‌డాం. పామిమ్‌పిడో సెంటర్ (Centre Pomipidou) ఫ్రాన్స్ మ్యూజియం, ఐరోపా కంతటికీ పెద్ద ఆధునిక కళామ్యూజియం. 20వ శతాబ్దపు మేటి మ్యూజియం, జపాన్ షికాగో ఆర్టు ఇన్‌స్టిట్యూట్ (Art Institute) ప్రముఖ ఓపెరా హౌస్ సమీపంలో వున్న వర్తమాన కళామ్యూజియం (The Museum of contemparary Art) సిడ్నీ. పైవన్నీ దేనికదే ప్రత్యేకతలు కలిగిన ఆధునిక కళా మ్యూజియాలు మన దేశంలోని ఆధునిక కళా మ్యూజియాలు కిరణ్ నాడార్ మ్యూజియం, న్యూఢిల్లీ. ఇదేకాక ఇంకో ఏడు మ్యూజియాలకు నిలయం న్యూఢిల్లీ.

సెంటర్ ఫర్ క్రియేటివిటి 777 – కలకత్తా సాక్షిగాలరీ, ఝ వేరీ కాంబెపరరీ మ్యూజియం, ముంబై హైదరాబాద్ ఆర్ట్ గాలరీ, ఆదిగాకల కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లోని మ్యూజియాలూ ప్రసిద్ధిగాంచినవి. 21వ శతాబ్దంలో నైరూప్య కళను అత్యంత ప్రతిభావంతంగా చిత్రించిన కళాకారుల్లో థామస్ ఏబ్స్, మార్క్ బ్రాడ్‌ఫోర్ట్, చార్లీవాన్ హెయిల్, నికలస్ హెల్లాబో, జిమ్ లాబీలు ప్రముఖులు.

**21వ శతాబ్దపు చిత్రకళాశైలి :** 21వ శతాబ్దపు చిత్రకళను నిర్వచించాలందే ముందుగా చెప్పుకోవలసింది కంప్యూటర్ ఆర్టును గురించి టీవీ, డీడియోగేమ్స్, ఆర్టు గాలరీల కొరకు రూపొందించే చిత్రాల కోసం చిత్రకారులు శోధించే, ఉపయోగించుకునే వనరుల విషయంలో హద్దులు ఉండవు. వారి అవగాహనలో దృక్పతంలో బహుముఖ విధానాలు, పద్ధతులు అనుసరిస్తారు. చూసిన విషయాలకు రూపం యివ్వడంలో అనంతమైన వైవిధ్యం కన్పిస్తుంది. ఈ రకమైన అంతర్విషయ అధ్యయనం దృశ్య సంస్కృతి (Visual Culture) అనబడుతుంది. మేధావుల నిరంత అన్వేషణ, అధ్యయనం, విశ్లేషణ వల్ల చిత్రకారులు ప్రతి కళా రూపాన్ని శోధించడం (explose) లలిత కళతో తైలవర్ణ చిత్రాలను, సినిమా కళలన్నింటిని మేళవించడం గమనించవచ్చు.

మొత్తం ప్రక్రియకు సరిపడే పేరు ఇంతవరకు దొరకలేదు. దృశ్యకళ డ్రాయింగు, పెయింటింగు పరిధిని దాటి విస్తరించడం పెనుమార్పు. దాడాయిజం – ఇది (మరీ కొత్త ధోరణి), అసంబద్ధకళ (absurdist art) నేటి కళా ప్రపంచంలో ఎన్నడూ లేనంతగా ఆదరణ పొందుతున్నాయి. కళాకారుడు స్వేచ్ఛగా చేసే వింత వింత ప్రయోగాలను ఆనందించడం, అభినందించడం మనవంతు ప్రపంచ ప్రఖ్యాత ఆధునిక చిత్రకారుల భారీ నైరూప్య చిత్రాలు ప్రపంచస్థాయి హోటళ్ళు, రాజ భవనాల్లాంటి సంపన్న విలాస నివాసాల్లో స్థానం సంపాయిస్తాయి. సర్రియల్ మ్యాజిషియన్లు, గోల్డెన్ గేట్ బ్రిడ్జి ఆర్టు (శాన్ ఫ్రాన్సిస్కో) జనాదరణ పొందిన కళ. ఐతే, థామస్ ఏబ్స్ (Abts), మార్క్‌బ్రాడ్ ఫర్ట్, ఛార్లెస్ వాన్ హెయిల్, నికలోస్ హెల్లాబో, జిమ్‌లాంబీ, జూలిమెహ్రెటు, ఒడిలి డోనాల్ట్ లాంటి గొప్ప గొప్ప నైరూప్య చిత్ర కళాకారులుగా కీర్తి గడించారు.

తంగెడ విశ్వేశ్వర ప్రసాద్,
హైదరాబాద్, ఫోన్ : 9440033699

# రాజస్థాన్ సమాజ చరిత్ర

- లక్ష్మీ అయ్యర్



రాజస్థాన్ రాణి

రాజస్థాన్ అంటే గుర్తుకు వచ్చేది ఒంటెలు,ఎడార్లు, అందమైన రాజసం ఉట్టి పడే  కోటలు, భవనములు ఎన్నో రకాల నేతి  పాల మిఠాయిలు, పన్నాధాయి స్వామి భక్తి పృథ్వీ రాజ్ చౌహాన్ మాతృ దేశానికై చూపిన శౌర్యం,సతీత్వ రక్షణకై  రాణి పద్మిని యొక్క అగ్ని ఆహుతి ,సమర్పణ భావము, మీరాబాయి భక్తి భావం రాణా ప్రతాప్ సింగ్ యొక్క ధైర్యము ,వీరము. హల్ది ఘాటి త్యాగము (యుద్ధ భూమికి వెళ్తున్న భర్తకు కానుకగా అప్పుడే పెళ్లి చేసుకున్న నవ వధువు తన తలను కోసి తట్టలో పెట్టి తనను మరచి పోయి మాతృభూమిని కాపాదామని ఇచ్చిన లేఖ)థార్ ఎడారి మొదలగునవి. ఈ నాడు కూడా హల్దీ ఘాటి  అనర్ చోట 300 కీ. మీటర్ వరకు వున్న లోయలోని మట్టి పసుపుగా దర్శనం ఇస్తున్నది . సుమారు 3000 మంది సైనిక రక్తం మట్టిలో కలసి పసుపుగా మారిందని ప్రతీతి, రాతియుగం నుండే ఆరావళి కొండల దగ్గర ఉన్న నదులలో కొన్ని ఆదిమ జాతులు ఉండేవని అవే రాజస్థాన్ కి మూలకారక జాతులని చెప్తారు. మహాభారతంలోని మత్స  జనపదం అనే ప్రాంతము తూర్పు రాజస్థాన్లో జైపూర్ యొక్క మధ్య భాగంలో ఉన్నారని చెబుతున్నారు. ఇక్కడ ఉన్న సవర జాతి రాజులు విశ్వవిజేతకని పరుగు పెడుతున్న అలెగ్జాండర్ను భారతదేశంలో రానీకుండా చేశారని చెబుతున్నారు జైపూర్ నుండి 80 కిలోమీటర్ల ఉత్తరాన  బైరాటా అనే స్థలం ఉంది దాన్ని విరాట నగరి అని పేరొందినదని అది ఒకప్పటి రాజధాని అని కూడా చెప్పబడుతున్నది అశోకుని యొక్క శిలాశాసనాల్లో కూడా రాజస్థాన్  యొక్క భరత్పూర్ అనే ప్రదేశాలలో సూరసేన మహారాజులు పరిపాలించినట్లు కనబడుతున్నది. ఇక్కడ మౌర్య శాసకుల మూర్తులు మౌర్య కాలపు పాత్రలు త్రవ్వకంలో దొరికాయి రాజస్థాన్లోని రాజుల చరిత్రను పట్టి చూస్తే ఎప్పుడూ యుద్ధం చేస్తూ ఉండే వారని అనిపిస్తున్నది. విదేశీ ఆక్రమణలు జరగడం వాటిని తట్టుకోవడం యుద్ధప్రాంతంగా ఎప్పుడూ రాజస్థాన్ ఉండేది. రాజుల స్థానం కాబట్టి ఇప్పుడు కూడా ఇక్కడ జీవనశైలిలో ఒక రాజుల హుందాతనము కొట్టినట్లు కనిపిస్తుంది. రాజస్థాన్ వారు తమ దేశానికి ప్రాంతానికి వచ్చే వారిని పధారో మ్హారా దేశ్  రాజస్థాన్ (पधारो म्हारा देश) అని చెప్పి చేతులు జోడించి ఖమ్మా  గణి అంటారు బదులుకి గణి ఖమ్మా అని చెప్పి అభివాదం చేసుకుంటారు . జోధ్పూర్ భాషలోనే ఓ ఆత్మీయత తీయదనం తాండవిస్తుంది. హుకుం, హుజూర్, విరాజియే, పధారియే  అని తెల్లవారి ఒకరి నొకరు చూసినపుడు రామ్ రామ్ అని లేదా జై శ్రీ రాధే కృష్ణ అని జై భోలే నాథ్ అని భక్తితో కూడిన రాజపూత్ శబ్దాలను విన్నప్పుడు మన ద్రావిడ భాషలలొ ఈ పిలుపు తీయదనాలు ఎక్కడ పోయాయి అని తప్పక అనిపిస్తుంది. ఇకన్నా గుడ్ మార్నింగ్, మమ్మీ డాడీ సంస్కృతికి ఓ ముగింపు నిద్దాం .

రాజస్థాన్ భారతదేశంలో ఉన్న అన్ని రాష్ట్రాల అంటే అధిక విస్తీర్ణం గల రాష్ట్రంగా గుర్తింపబడింది. దీని భూమి క్షేత్ర సీమ 5920 కిలోమీటర్లు ఇక్కడ అనేక మతాలవారు అనేక జాతుల వారు నివసిస్తున్నారు. ఇక్కడ ఉన్న ప్రజలు సాధారణ జీవనం గడుపుతూ సంస్కతిని సాహిత్యాన్ని భారత దేశాన్ని విదేశీ ముస్లింల ఆక్రమణల నుండి రక్షించిన వీరులు . వీళ్ళ సాహిత్యంలో జానపద సాహిత్యం అత్యధిక మోతాదులో కనిపిస్తుంది. జానపద గీతాలు జానపద కథలు జానపద గాథలు జానపద నాట్యాలు, నృత్యాలు సుభాషితాలు ఎన్నో మౌఖిక సాహిత్యాలు వికసిస్తూనే వస్తున్నాయి,  ఇక్కడ ఉన్న ప్రజల జీవన సరళి

అన్నపానాదులు దుస్తులు, ఆచార వ్యవహారాలు, నమ్మకాలు నడవడికలు ప్రాచీన పద్ధతులు జానపద కళలు గ్రామీణ దేవీ దేవతలు గ్రామీణ ఆటలు ఎన్నో ఇంటి వైద్యాలు కాకమ్మ కథలు ఎన్నెన్నో కనిపిస్తాయి. బ్రాహ్మణులు శర్మ జోషి పారీఖ్,ఖాండల్ అనే శబ్దాలు పేరు వెనుక, అగర్వాల్, ఖండేల్వాల్, జైన్, మాహేశ్వరీ, బాఫ్నా, గుప్తా అనే అంతిమ శబ్దం గల పేర్ల కోమరి వాళ్ళను, రాథౌడ్(జనరల్) రాజ్యపుత్రులను రావణా ర ఠౌడ్ (ఓబిసి -రాజులకు దాసీలకు జన్మించిన తెగ), జాట్ అనే జాతి మీణా అనే జాతుల వర్గాల వారే కాక ఎందరో సింధీలు కూడా వసిస్తున్నారు. (వారి పేర్ల వెనుక "నీ "శబ్దము వుంటుంటుంది-పార్ దాసనీ,హేమలతా మంగలాని) .. మొదలగునవి. ముందు. మనము ఈ వ్యాసంలో రాజస్థాన్ జానపద సాహిత్యం గురించి చర్చిద్దాం. ఇక్కడ జానపద సాహిత్యంలో జానపద గీతాలు ప్రసిద్ధి చెందినవి. వీటిని తొమ్మిది లేదా 10 భాగాల్లో విభజించవచ్చు. వీటిని ఇక్కడ సంస్కార్ గీతాలు అని ఇక్కడ వాళ్ళు పిలుస్తారు. వాటికి అంటే జన్మ నుండి మృత్యువు వరకు జరిగే విభిన్న జీవన శైలిని అనుసరించి ఈ గీతాలు రాయబడ్డాయి. 1. జన్మకు సంబంధించిన అంటే పుట్టుక నుండి పాడబడే జానపద గీతాలు. ప్రసవ వేదన ,శిశు గీతాలు, కు ఆన్ పూజన్ (బావిపూజ) ఝుదూలా, మూడన్ మొదలైనవి ప్రసిద్ధి చెందినవి. జన్మ దినోత్సవం నాడు ఆలపించే గీతాలు ఇలా ఉంటాయి

జచ్చారాణి జాయీ హై పూత్ పాగల్యా లిఖ్ మేలో భం వర్సా మ్హారే బాప్ రై మ్హారా బాభౌసా కహి జై దాతార్, ఘుడ్లాతో దేసీ నాయిజీ థానై హీన్నా (రాణికి పుత్రుడు ఉద్భవించాడన్న కబురు వారి పుట్టింటికి పంపండి ఎందుకంటే ఆమె తండ్రి పెద్ద దాన గుణం గల వ్యక్తి). ఇక్కడ సాధారణంగా మొదటి రెండు ప్రసవాలు అత్తవారింట్లోనే జరుగుతాయి.

ఇక వైవాహిక పద్ధతుల గీతాలకు వస్తే సగాయి, లగ్న , టీకా, వినాయక్ తేల్ లగానే గీత్ , టీకా రతీజగా,బిన్ బారా, బనా- బన్నీ,బాత్ (మా య డో ) బారాత్ కీ అగ్ బాని, తోరణ్, ఫేరే కన్యాదాన్ విధాయి ముకలావై మొదలైన పాటలు కలవు ఉదాహరణకు అగ్నిని సాక్షిగా వధూవరులు తిరిగే గీతాన్ని ఫేరే గీత్ అంటారు పాణిగ్రహణం తర్వాత బ్రాహ్మణుడు మంత్రోచ్చారణ మధ్యలో వధువు ముందు వరుడు వెనక మూడుసార్లు అగ్ని ప్రదక్షిణ కావిస్తారు. నాలుగో చుట్టులో వరుడు ముందు వధువు వెనక ఉంటుంది అంటే ఆ చుట్టూ నుండి వధువు పరాయిది అయిపోతుంది. తన కులం నుండి పుత్రపక్షం యొక్క నాలుగు తరాల వాళ్లకు వధువు చెందుతుంది అని అర్థము. పైలో ఫేరో బనడి భాభోసా రీ లాడ్ లీ ,దూజో ఫేరో తో బన్ డీ కాకోసా రీ భతీ జీ తీ జో ఫేరో తో బన్ డీ వీరా సా రీ వైనడ్ ,చౌథీ ఫేరో తో బన్ డీ హుయీ రే పరారీ ॥ అదెలా మృత్యు సంస్కార గీతాలలో దూరకి ,పంత్ వారీ హరజన్ ముఖ్యమైనవి ఇక ప్రకృతి సంబంధమైన జానపద గీతాలలో వర్షానికి గీతాలు భూమి పాటలు బారహ్ మాసా అంటే 12 మాసాలలో జరిగేవి హీడో గీత్ ఇలాంటివి ముఖ్యమైనవి పట్టు వస్త్రాలతో చేసిన ఊయల ఊగుతూ సావన్ గీత్ పాడుతారు.

డాలా హై హిండోళా కన్హైయా జి కే బాగ్ మేన్ జీ

ఎజి కోయీ డాలి హై రేశం డోర్ నన్హీ నన్హీ బూన్ దే.

తను కట్టిన పట్టు వస్త్రముతో నిండిన ఊయలలో కృష్ణుని స్మరిస్తూ యువతులు ఊయలలు ఊగుతారు. వసంతోత్సవ గీతాల్లో ముఖ్యమైంది సావన్ గీత్. ఇవి గాక పర్వదినాల గీతాలు పండుగ గీతాలు ఎన్నో మౌఖిక సాహిత్యపు గీతాలు కోకొల్లలుగా ఇక్కడ ఉన్నాయి. ఫాల్గుణ మాసంలో వచ్చే హోలీ గీతం చాలా ప్రసిద్ధి చెందింది. ఇక నాలుగో కోవలో భక్తి సంబంధమైన దేవీ దేవతల సంబంధమైన జానపద గీతాలు మనం చూడవచ్చు. మన ఊర్లో అంకాలమ్మ గౌరమ్మ కాళీ చండీ ఎల్లమ్మ ఇలాంటి గ్రామ దేవతలు ఉంటారో అదేలాగా రాజస్థాన్లో వీధి వీధికి ఒక గ్రామ దేవత ఉంటుంది. ఈ గ్రామ దేవత పాటలు శీతలమాత పాటలు చాలా ప్రసిద్ధము. శీతల మాత కోప పడితే మశూచి సంక్రమిస్తుందని నమ్ముతారు. అది

ఇక్కడ సేడల మాత, మహామాయి, సైడ్,శీతలా మాత అని ఆమెని ఎన్నో పేర్లతో పిలుస్తారు. ఆ శీతల మాత పర్వదినం రోజు పొయ్యి వెలిగించక ఆ రోజంతా శీతల భోజనంతోనే గడుపుతారు అంటే మజ్జిగ పెరుగు పచ్చి పాలు మిఠాయిలు ఏమన్నా సరే పచ్చిగానే తింటారు. ఆ రోజంతా ఎవరు వెళ్లినా వాళ్ళ ఇంట్లో పొయ్యి వెలిగించరు కొత్త వధువు వచ్చినా కూడా చేతి ద్వారా సైడ్ మాత పూజ చేపిస్తారు. దీనికి సంబంధించిన పాట కూడావుంది.

యెదల సైదలే నీకలి ఏ మా అడ్ సర్ గధా ఏ పిలాణ్ మేరీ మా " అని మొదలవుతుంది. ప్రేమతో కూడిన ఎన్నో శృంగార గీతాలు గ్రామీణ పరిధిలో చూడవచ్చు. సంయోగ శృంగార గీతాలు వర్ణనతో కూడిన గీతాలు. (వీటీల్లో ఇండోణి, పణి హారీ, లహరియా ముఖ్యమైనవి), ఇది గాక వియోగ శృంగారపు గీతాల్లో సప్నా చౌమాసా, కేసరియా, బాలం, ఓల్యూ ఓయూ కురజా, కాగా, చిర్మి, జీరో మోరియా హెచ్ కీ అన్ని పాటలు వస్తాయి, కిచకీ అనే పాట జానపద పాటలలో తనను వదిలి వెళ్లిపోయిన ప్రియుడిని పదేపదే తలచిన ప్రియురాలికి వెక్కిళ్ళు వస్తుంది. ఆ వెక్కిళ్లు పాటగా మారాయి. వెక్కిళ్లు వస్తే ఎవరో గుర్తు చేసుకుంటున్నారన్న నమ్మకంపై ఆధార పద్ద పాట. ఇవి గాక సంస్కృతిని సూచించే ఎన్నో జానపద పాటలు కూడా ఉన్నాయి వీటిలో ఘూమర్, గోర్ బందే కాల్ బేలియా అనేవి చాలా ప్రముఖమైనవి. ఘూమర్ అనే పాటతో కూడిన గోళాకార నృత్యం రాజస్థాన్లో అత్యంత ప్రసిద్ధమైనది. ఇక కష్టించేవారు కూలీ శ్రామికుల పాటలు ఆవులు గాని మేకలను గానీ మేపుతూ పాడే పాట రాజస్థాన్‌కు చెందిన ఆహార వ్యవహారాలు కలివిడి పద్ధతులు దుస్తులు అలంకారం గురించి చూద్దాం.

ఇక్కడ మూల వృత్తి వ్యవసాయము పశుపాలన మాత్రమే ఇక్కడ వ్యాపారులు చాలా పెద్ద షావుకారులుగా కనిపిస్తారు రైతులు సాధారణంగా కనిపించినా కూడా వారి దగ్గర కనీసం 250 ఏకర్ల భూమి ఉంటుంది. అదంతా ఒకే కుటుంబానికి ఉంటుంది. ఇక్కడ రాఠీ అనే ఆరడుగుల (మన ఒంగోలు ఎద్దు లాగ కనబడే) అందమైన ఆవులు కిషన్ గఢ్ లో ఠీవిగా దర్శన మిస్తాయి . ఇవి సుమారు 8 నుండి పది లీటర్లు పాలునిస్తాయి. ఇక్కడ గిత్తలు రోడ్లపై వదిలేస్తారు. పెంచరు. ఆవుకు ప్రతీ రోజు చారా అని ఒక రకమైన ఆకు కూర ఖ తప్పని సరిగా పేదోడు గౌప్పోడు వేస్తారు. ఆవులంటే పూజ్య భావం. శాకాహారంగల రాష్ట్రం. గోయరా అనబడే పాకులాడే పెద్ద మొసలి లాగ చెక్క రంగులో గల ఆటవిక ప్రాణి తిరుగుతూ వుంటుంది. మగది గోయరా ఆడది గోయలి. గోయరా విషయ జంతువు. గోయలిని చంపారు ఎందుకంటే అది విషజంతువు కాదు, చూస్తే భయంగా వుంటుంది. నీల్ గాయ్ అనే జింక గుర్రం కలసిన ప్రాణి జిరాఫీ ఎత్తులో కనబడుతుంది. కొమ్ములు గల నీల్ గాయ్ మగది కొమ్ములు లేనిది ఆడది తన తలతో ఢీ కొడితే కార్ ఎగిరి పోతుంది, ఇక్కడ పితృ సత్తాత్మక వ్యవస్థ జోరుగా ఇప్పుడు సాగుతూనే ఉంది. బాల్య వివాహం కూడా చురుకుగా సాగుతూ ఉంది ఇక్కడ ఒక గజ్జి అంటే 9 అడుగులు ఇక్కడ మనుషులు సన్నగా పొడవుగా కనిపిస్తారు లేదా పొట్టిగా కనిపిస్తారు మధ్య రకంగా ఉన్న మనుషులను చూడలేము ఇక్కడ శీతోష్ణస్థితి మితిమీరిన చలిగా ఉంటుంది చలి కాలంలో. మితిమీరిన ఎండగా ఉంటుంది వేసవికాలంలో అందుకనే సద్దలు జొన్నలు శనగపప్పు ఆవాలు ధనియాలు జీలకర్ర పాలక్ మెంతికూర ఇలాంటిది ఎక్కువగా పండిస్తారు రాజస్థాన్ వాళ్లు. వాళ్ళ రాష్ట్రం లాగానే పెద్ద మంచి మనసు కలవారు. ఒక చిన్న ఆటో డ్రైవర్ అయినా ట్రక్ డ్రైవర్ అయినా కూడా వారానికి మూడు కిలోల నేతిని వాడుతారు. కడుపునిండా ఇతరులకు పెడతారు కడుపునిండా తను కూడా తింటారు. ఇక్కడ ఎక్కువగా నేతి మిఠాయిలు ప్రసిద్ధం. పాలకోవాతో చేసిన మిఠాయిలు ఎన్నెన్నో రకాలుగా కనబడుతుంది. పశ్చిమ రాజస్థాన్లో ఉండే రైతులు తూర్పు రాజస్థాన్ వైపుకు తమ పశువులను మేతకు పంపుతారు బీదవాళ్లు మట్టితో ఇల్లు కట్టుకుంటారు సద్దలు జొన్నలు చిరుధాన్యాల రొట్టెలు శనగపిండితో చేసిన పదార్థాలు ఎక్కువగా కనబడతాయి దాల్ బాటి చూర్మా అనే పదార్థము రాజస్థానీయుల ప్రియమైన వంటకం అదేలాగా ఘేవర్ అనబడే మిఠాయి కూడా ఇక్కడ ప్రసిద్ధము. ఇక్కడ ఆలు పరాటా ప్యాజ్ పరాటా మిస్సి రోటి, రబడీ, మాల్ పూవా అనే తీపి పదార్థాలు ఎంత తిన్న తనివి తీరవు. ఇక్కడ పురుషుల వస్త్రాలలో సాపా పగడి ,స్త్రీ వస్త్రాలలో కుర్తా –కాంచ్ లీ ,లహంగా చూనడి వేసుకుంటారు, కుండలాలు,కడియాలు భుజాలపై మోచేతుల దగ్గర కడియాలలంటివీ, వడ్డాణం లాంటివి ముక్కుకు స్త్రీలు బుల్లకీ, చెవుల చుట్టూ గుండ్రటి రింగ్ లాంటి ఆభరణాలు బంగారు వెండి రాగితో చేసినవి పెట్టుకుంటారు.

పూజ్య గురువులు అశ్విని గారి ప్రేరణతో ఈ వ్యాసం మొదలవుతున్నది. మరిన్ని విశేషాలతో సశేషం.

మి

ప్రొ. లక్ష్మీ అయ్యర్
జైపూర్, రాజస్థాన్, ఫోన్ : 9680276038

# కర్పూర పరిమళాలు

– నల్లపనేని విజయలక్ష్మి

ఊహల గుసగుసలను వినిపించి హృదయాన్ని ఊగిసలాడించగల భావుకుడు, కలల అలలపై మనసును మల్లెపూవును చేసి తేలించగల మనోజ్ఞ సౌందర్య సీమా విహారి, వసంత ఋతువులో వెన్నెలకు కర్పూర పరిమళాలను అద్దిన కళాహృదయుడైన రాజు కథను వర్ణిస్తే ఎంత సొగసుగా ఉంటుంది? ఒక సౌందర్యభరిత, కళానిలయమైన ఆనందసీమలో రసజ్ఞులను ఓలలాడించగల 'కర్పూర వసంతరాయలు' గా మన ముందు నిలుస్తుంది.




సాహిత్యరంగానికి సంబంధించి దేశంలో అత్యున్నత పురస్కారమైన 'జ్ఞానపీఠ' పురస్కారాన్ని అందుకున్న సి.నా.రె పరిచయం అక్కర లేని మహాకవి. డెబ్బైకి పైగా గ్రంథాలు, మూడు వేలకు పైగా సినిమా పాటల రచనతో ధగధగాయమానంగా వెలిగిపోతున్న ఆయన కీర్తి కిరీటంలో పద్మశ్రీ, పద్మ భూషణ్ పురస్కారాలు కలికితురాళ్లుగా అమిరాయి. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులు ఆయనను వరించడం వల్ల తమ విలువను పెంచుకున్నాయి. ఆయన 1957 లో రచించిన గేయకావ్యం 'కర్పూర వసంతరాయలు'. ఆయన ఈ కావ్యాన్ని మల్లంపల్లి సోమశేఖరశర్మ గారికి అంకితమిచ్చారు.

'కర్పూర వసంతరాయలు' గేయకావ్యంలోని కర్పూర వసంతరాయలు చారిత్రక వ్యక్తి. రెడ్డిరాజులలో ఒకడైన కుమారగిరి రెడ్డి కళాప్రియుడు. ప్రతి ఏటా వసంతోత్సవాలను జరిపించి 'కర్పూర వసంతరాయలు' గా కీర్తించబడ్డాడు. అతడి ఆస్థాన నర్తకి లకుమ. ఈమె నాట్యానికి పరవశించే కుమారగిరి రెడ్డి 'వసంతరాజీయం' అనే నాట్యశాస్త్రం రాశాడు. చరిత్ర ద్వారా మనకు తెలుస్తున్న కథ ఇంతే. సి.నా.రె ఈ కావ్యం రాయడానికి పది–పదిహేనేళ్లు ముందు భావరాజు వెంకట కృష్ణారావు గారు 'లకుమాదేవి' అనే కథను రాశారు. ఆ కథ ఆధారంగా రజని సంగీత నాటిక రాసి 'ప్రతిభ' లో ప్రచురించారు. ఆ కథలో పట్టపురాణి ప్రస్తావన లేదు. ఆ కథలో రాయలు లోకుల గుసగుసలు విని లకుమ శీలాన్ని శంకించడం, ఆమెను పరీక్షించడం కనిపిస్తుంది. లకుమ శీలపరీక్షను నెగ్గాక ప్రియుడు చూపిన అవిశ్వాసాన్ని సహించలేక కత్తితో పొడుచుకొని అతని చేతులలోనే మరణిస్తుంది.

ప్రేమకావ్యంలోని ఉదాత్తతకు భంగమైన అవిశ్వాసానికి సి.నా.రె తన కావ్యంలో తావీయలేదు. పట్టపురాణి పాత్రను కల్పించి రాజును, రాజ్యాన్ని కాపాడుకొనే గురుతర బాధ్యతను వహించిన సాధ్వీమతల్లిగా తీర్చిదిద్దాడు. రాజును విడిచి పొమ్మన్న రాణి కోరికలోని ఔచిత్యాన్ని గ్రహించిన లకుమ రాయలను విడిచి జీవించలేని కారణంగా ప్రాణాలు తీసుకొన్నదని కల్పించడం వల్ల కథ ముళ్లు లేని గులాబీలా వికసిస్తుంది. ప్రతి పాత్రా తనదైన వ్యక్తిత్వ సౌరభాన్ని వెదజల్లుతుంది. ఈ చిన్న కథను శృంగార ప్రధానమైన గేయకావ్యంగా మలచడమే కాక 'వ్యక్తి సుఖం కన్న దేశ క్షేమం ముఖ్యం' అనే ఉపదేశాన్ని కూడా అందించాడు సి.నా.రె.

'కర్పూర వసంతరాయలు' ఐదు ఆశ్వాసాల కావ్యం. రాజు చైత్ర శుద్ధ త్రయోదశి నాడు దేవతా పూజ చేసి వసంతోత్సవాన్ని ప్రారంభించడంతో కథ మొదలవుతుంది. చైత్ర పూర్ణిమ నాడు లకుమ నృత్యాన్ని చూసి రాజు పరవశుడై రత్నహారాన్ని బహూకరించడం తొలి ఆశ్వాసంలోని కథ. వసంతరాయలకు, లకుమకు పరస్పరం ప్రేమ కలగడం, వసంతరాయలు లకుమను రాజనర్తకిగా ప్రకటించడం రెండవ ఆశ్వాస కథ. రాయలు లకుమతో కలసి తీర్థయాత్రలకు వెళ్లడం, అహోబల నృసింహుని,

ద్రాక్షారామ శివుని దర్శించుకోవడం, అప్పటివరకు మనసులోనే దాగి ఉన్న ప్రేమను వారు పరస్పరం ప్రకటించుకోవడం మూడవ ఆశ్వాస కథ. లకుమతో కలసి రాచనగరుకు వచ్చిన రాయలు ఆమె కోసం కేళీమందిరాన్ని నిర్మించడం, రాణిని, రాజ్యాన్ని, పరిపాలనను, ప్రజలను మరిచి ఆమె తోడిదే లోకంగా బ్రతకడం, 'వసంత రాజీయం' ను రచించడం నాల్గవ ఆశ్వాస కథ. కాటయవేముని కోరిక మీద బలవంతంగా రాజసభకు వెళ్లిన రాయలు లకుమ కాలు బెణికినదని వినగానే సభను వదిలి ఆమె వద్దకు పరుగెత్తడం, రాజ్యం పట్ల, ప్రజల పట్ల రాజు నిర్లక్ష్యాన్ని సహించలేని రాణి లకుమని అతని జీవితం నుండి తొలగిపొమ్మని కోరడం, రాజును విడిచి జీవిమచలేని లకుమ ప్రాణత్యాగం చేయడం ఐదవ ఆశ్వాస కథ. నాలుగే పాత్రలతో సి.నా.రె ఈ కావ్యాన్ని నడిపాడు. వసంత రాయలు, రాణి, లకుమ, కాటయ వేముడు. ముఖ్యంగా వసంత రాయలు, రాణి, లకుమల మానసిక అవస్థలను సి.నా.రె చిత్రించిన తీరు అద్వితీయం.

**వసంత రాయలు:** మొదటి ఆశ్వాసంలో కవి 'కళాదుగ్ధసాగర మనో ముగ్ధ సంపూర్ణ చంద్రమూర్తి' గా వసంతరాయలను మాగధుల చేత స్తుతింపజేయడమే కాక, వసంతకాంతుని రాజసమూర్తిగా, మహీశ్వరుని యువమూర్తిగా, ఇక్షుధన్వి కీడగు మోహనమూర్తిగా దర్శింపజేస్తాడు.

కాటయవేముని చేత

*'మృదుని మూడవ కంటి చిచ్చున*
*బడి శరీరము విడిన మరునికి*
*మిమ్ము బోటి రసజ్ఞులే రూ*
*పమ్ము నిల్పినవారు సుమ్మా'*

అని పలికించి రాయలు సాక్షాత్తు మన్మథుడే నని కవి ప్రకటించాడు. ఆ మన్మథుడు చైత్ర పౌర్ణమి నాటి రాత్రి నృత్య ప్రదర్శనను తిలకించడానికి విచ్చేసినపుడు వాతావరణం ఎంత మనోల్లాసకరంగా ఉందో కవి అద్భుతంగా వర్ణించాడు.

*'పాలవెల్లిని దేలు పూలదోనియ లీల*
*ఎల్ల లోకమ్ము భాసించె వెన్నెలలోన'*

అటువంటి మనోల్లాసకరమైన వాతావరణంలో అందాల నర్తకి 'ఓ రాజా! నీవు శ్రేష్ఠుడవు' అనే అర్థాన్ని ప్రకటించే పతాక హస్త ముద్రను ప్రదర్శించి, కటకా ముఖముతో పల్లవ హస్త ముద్ర పట్టి పూలదండను ధరించినట్టు చూపితే ఆ అర్థం గ్రహించిన రసికుడు, కళాభిమాని అయిన రాజు పరిస్థితి ఎలా ఉందో కవి వర్ణించాడు.

*'తన పైన పారిజాతములు జలజల కురిసి*
*నటుల పులకించె నా అవనీపతి'*

లకుమ రాధగా అభినయిస్తుంటే రాజు పరవశుడై తనను తాను బృందావనంలోని కృష్ణునిగా భావించుకున్నాడు. నాట్యం పూర్తయ్యేసరికి రాజు పంచప్రాణాలు లకుమ మీదే లగ్నమయ్యాయి.

*'ప్రభువు తన్మయుడయ్యె*
*ప్రభువు చిన్మయుడయ్యె*
*ప్రభువు లకుమా లగ్న*
*పంచప్రాణుండయ్యె'*

రత్నహారాన్ని లకుమకు కానుకగా ఇచ్చాడు రాయలు. ఆ రాత్రి అతడికి నిద్ర దూరమైంది. కన్ను మూసినా తెరిచినా లకుమ రూపమే.

*'ఎపుడు వీచిన గాడుపే కద*
*ఎందుకో నేడంత వాడి?*
*ఎపుడు కాచిన వెన్నెలే కద*
*ఎందుకో నేడంత వేడి?'*

అతడిని చల్లగాలి, వెన్నెల సైతం బాధించాయి. తాను లకుమ వైపు అంతగా ఆకర్షింపబడడానికి కారణమేమిటో తనలో తాను తర్కించుకున్నాడు.

*'వెండి గజ్జెల రవళియే క*
*వ్వించునా నన్నింతగా?*
*గుండె గజ్జెలలోన చొరబడి*
*యుండెనేమో వింతగా'*

అది మామూలు నాట్యం అయితే తనను ఆకట్టుకోగలిగేది కాదు. కళలో హృదయాన్ని మిళితం చేసి ఆత్మానందాన్ని పొందుతూ చేసిన నృత్యం కావడం వల్ల తన హృదయంలో చెరగని ముద్ర వేసిందని గుర్తించాడు. అంత చక్కని అభినయాన్ని ప్రదర్శించిన లకుమ కేవలం ఆటవెలదుల ఇంటి పడుచు అయి ఉండదని, ఆమె దివి నుండి భువికి దిగి వచ్చిన అప్సరస అని భావించాడు. ఆమె అభినయం అతడిని వెంటాడింది.

*'ఆమె నృత్తము ఆమె నృత్యము*
*ఆమె సాత్త్వక భావ నాట్యము*

మరల మరల స్మరించి భూపతి
మరులు గొల్పగ పొరలె పొన్నున'

మొదట రాజు ఆమె నాట్యానికి అభిమాని. ఆ తరువాతే ఆమె సౌందర్యానికి బానిస. ఆ విషయం పంచమాశ్వాసంలో స్పష్టంగా తెలుస్తుంది. లకుమ నాట్యం చేయలేకపోవడాన్ని కూడా రాజు ఊహించుకోలేకపోయాడు. లకుమ కాలు బెణికిందని వినగానే రాజసభను విడిచిపెట్టి పరిగెత్తుకుంటూ లకుమ వద్దకు వెళ్లాడు. ఆమె పాదాలను ఒడిలో పెట్టుకొని మర్దన చేశాడు. 'నీ కాలు కాదు బెణికింది. నా జీవ నవామృత భాండమే తొణికింది' అన్నాడు. మామూలు రాజైన తనని అనంత రస రాజ్యానికి అధిపతిని చేసింది, తనకు రెక్కలిచ్చి గంధర్వశ్రేష్ఠుడిని చేసింది ఆ పాదాలే నన్నాడు. ఆ పద మంజీరాల చిరు గజ్జెల సవ్వడులే తన బ్రతుకులో రస ధ్వనులను పలికించాయన్నాడు.

'మరల నీవు గజ్జె కట్టి
మరాళ రాజమ్ము వోలె
కదలినపుడె నా ప్రాణము
గానము చేయును చెలియా'

రాజుకు లకుమ మీద ఎంత ప్రేమ ఉందో, అంతకు మించిన ప్రేమ ఆమె నాట్యం మీద ఉందని ఇక్కడ స్పష్టమైంది. రాజుకు అనిర్వచనీయమైన ఆనందాన్నిచ్చింది, ఒకానొక పారవశ్య స్థితిలో ముంచి తేల్చి లకుమా దాసుణ్ణి చేసింది ఆ నాట్యం కనుకనే ఆయన నాట్యశాస్త్ర గ్రంథం (వసంత రాజీయం) రాయగలిగాడు.

**లకుమ:** ఏటేటా వసంతోత్సవాలను జరిపించి ప్రజలను ఆనంద సముద్రంలో ఓలలాడించే రేడు, మన్మథ స్వరూపుడు తన స్వంతం కావాలని ఏ కన్నె కోరుకోదు? లకుమ కూడా అంతే. రాధా కృష్ణుల ప్రేమను, రాధ విరహాన్ని రాజు ముందు నృత్య నాటకంగా అభినయించడానికి వచ్చిందామె. రాజు పట్ల తనకు గల ప్రేమను వెల్లడించడానికి తన కళనే మాధ్యమంగా ఉపయోగించుకుంది. తాను పట్టిన నాట్య ముద్రలతో అతని పట్ల గల ప్రేమను వెల్లడించింది. ఆమె మనోభావాన్ని గ్రహించిన రాజుకు ఆ తరువాతి ఆమె అభినయమంతా తన కొరకే అనిపించడంలో ఆశ్చర్యం లేదు. ఆమె రాధగా అభినయిస్తుంటే తనను కృష్ణుడిగా ఊహించుకొని పరవశుడయ్యాడు. తొలి సందర్శనంలోనే రాజు మనసుపై ముద్ర వేయగలిగింది లకుమ. రత్నహారాన్ని కానుకగా ఇస్తూ రాయలు ప్రదర్శించిన తన్మయత్వాన్ని ఆమె గ్రహించింది.

'రాజమణి రాసిక్యమున కీ
రత్నహారమె వైజయంతిక
తన రసాభినయమ్మునకు ప్రభు
తన్మయత్వమె వేల కానుక'

అయితే మళ్లీ రాజు ఎదుట నాట్యం చేయగలిగే అవకాశం వస్తుందో లేదో నని ఒక చిన్న సందేహం ఆమెను పీడించింది. రాయలు తనను రాజనర్తకిగా ప్రకటించడంతో ఆమె ఆనందానికి మేర లేదు. రాయలతో కలసి తీర్థయాత్రలకు వెళ్లి వచ్చాక అతడు తన కోసం నిరించిన కేళీమందిరంలోనే ఆమె నివాసం. నిఖిల సృష్టికి తననే ప్రతీకగా నెంచి ప్రేమించిన ప్రియుని పొందిన అదృష్టవంతురాలు. రాయలపై ప్రేమ కలిగినది మొదలు లకుమ మనసులో ఏదో భయం వెంటాడుతూనే ఉంది. రత్నహారాన్ని ధరించి రాజునే తలచుకుంటూ నిద్రించిన లకుమకు మెడపై పాము పాకినట్లుగా కల వచ్చి భయపడి నిద్ర లేచింది. రాయలతో తీర్థయాత్రకు వెళ్లినపుడు సైతం దైవదర్శనం చేసుకొన్న ప్రతిసారీ ఆమెకు దుశ్శకునాలే కనిపించాయి. అహోబల నరసింహస్వామిని దర్శించినపుడు రాయలకు స్వామి ప్రసన్ననేత్రాలలో అమృతపు నవ్వు మొలకలు కనిపిస్తే, లకుమకు స్వామి కళ్లలో హిరణ్యకశిపుని నెత్తురు చారలు కనిపించాయి. కేసరాలను ఊగిస్తూ, భయంకరమైన ఆగ్రహంతో గర్జిస్తున్న స్వామి రూపమే ఆమెకు కనబడి గజగజ వణికిపోయింది. రాయల ప్రేమను పొందగలిగినా తన జీవితం చివరివరకూ సంతోషంగా సాగకపోవచ్చునన్న అనుమానం ఆమె అంతరాంతరాల్లో దాగి ఉండి ఉండాలి. సింహాసనం సింహమై తన ప్రాణాలను బలిగొనగలదన్న ఊహ అంతర్లీనంగా ఉండే ఉండాలి. ఆ దుశ్శకునాలను అడుగడుగునా చూపడం ద్వారా కవి లకుమ సబ్‌కాన్షస్ మైండ్‌లో ఒకానొక భయంతో కూడిన స్థితిని కలిగి ఉ ండడాన్ని స్ఫురింపజేశాడు. రాయలను మనసు నిండా నింపుకున్న అనురాగ దేవతగా, తన నాట్యకళతో ప్రేరణ నందించి శాస్త్రరచన చేయించిన రసాధిదేవతగా, రాజ్య క్షేమాన్ని కోరి ప్రాణాలర్పించిన విషాదాంత నాయికగా లకుమ పాత్ర అద్భుతంగా తీర్చిదిద్దబడింది.

**రాణి:** భర్త క్రమంగా పరకాంతానురక్తుడు కావడాన్ని చూసి లోలోపలే కుమిలిపోయి మంచం పట్టిన భార్య ఆమె. వసంతోత్సవాల ప్రారంభ సమయంలో నీడ వలె భర్త వెంట ఉన్నది. చైత్రపూర్ణిమ నాటి నాట్య ప్రదర్శన ను భర్త ప్రక్కన కూర్చొని తిలకించింది. లకుమ నాట్యాన్ని చూసి తన్మయుడైన రాయలు తన స్థితిని మరచి పైకి లేవడాన్ని గమనించి భుజంపై చేయి వేసి ఆపింది. సభా మర్యాదను గుర్తు చేసింది. రత్నహారాన్ని బహూకరించే నెపంతో లకుమ మెడను తాకిన భర్తను, సిగ్గు పడుతున్న లకుమను చూసి విషాదంగా నవ్వుకున్నది. లకుమను రాజనర్తకిని చేయడం, తనతో కాకుండా లకుమను వెంటబెట్టుకొని భర్త తీర్థయాత్రలకు వెళ్లడం ఆమెకు బాధను కలిగించాయి. యాత్ర ముగియగానే రాయలు లకుమను రాజసౌధానికే తెచ్చినపుడు రాణి వడదెబ్బ తగిలినట్లు వణికిపోయింది.

*'ఆమె నేత్రములందు*
*అమవసలు జడలు విరబోసుకొనె*
*ఆమె హృదయాంగణము*
*నందు శూన్యము చోటు చేసుకొనె'*

పూర్తిగా లకుమే లోకంగా బ్రతుకుతున్న భర్తను చూసి మనోవ్యాధితో మంచం పట్టింది. రాయలు ఒక్కసారైనా తనను చూడడానికి రాకపోయినా ఓర్చుకున్నది. ఇన్నీ ఓర్చుకున్న రాణి రాయలు పాలనను తృణీకరించడం మాత్రం భరించలేకపోయింది.

*'కేళికా మందిరము కన్నను*
*ఓలగమ్ము పవిత్రమైనది*
*వ్యక్తి కన్నను దేశ సౌభా*
*గ్యమ్ము ఆదర్శ పాత్రమయినది'*

అని భావించి కాటయవేముని సాయంతో రాయలకు సద్బుద్ధి గరపడానికి ప్రయత్నించింది. అది సాధ్యం కాకపోవడంతో తానే స్వయంగా రంగంలోకి దిగింది. లకుమను కలిసింది. వ్యక్తి సుఖం కన్న సంఘశ్రేయస్సు ముఖ్యమన్న విషయాన్ని గమనించి రాయలను విడిచిపెట్టి వెళ్లమని కోరింది. లకుమను దూరం చేయడం ద్వారా రాజుకు బాధ్యతను గుర్తు చేసింది. రాణిగా తన బాధ్యతను నెరవేర్చింది. మాత్రా ఛందస్సుల అశ్వహృదయం తెలిసినవాడిగా గొప్ప కవితాశక్తితో, వర్ణనానైపుణ్యంతో, కల్పనా చాతుర్యంతో కథను నడిపిన సి.నా.రె కళాకారిణికి, కళారాధకునికి మధ్య గల అవధులెరుగని ప్రేమబంధాన్ని అపురూపంగా సృజించాడు. కళారాధకుడైనవాడు రాజ్య సింహాసనం కన్నా ఆత్మానందానికే ప్రాధాన్యమిస్తాడన్న వాస్తవాన్ని ఆయన వివరించాడు. రసైకజీవికి తగిన ప్రేరణ లభించినపుడు అతడు శాస్త్రరచనాకారుడు కాగలడని తెలియజెప్పాడు. అనురాగానికి, ధర్మానికి నడుమ లకుమ అనుభవించిన సంఘర్షణను అనితరసాధ్యంగా చిత్రించి జ్ఞానపీఠ శిఖరారోహణకు సోపానాన్ని నిర్మించుకున్నాడు.

లకుమా వసంతరాయల అమరప్రేమను గానం చేసిన గంధర్వుడతడు. కొండవీటి మట్టి వెదజల్లే కర్పూర పరిమళాలను మన చేత ఆఘ్రాణింపజేసిన గంధవహుడతడు.

డా. నల్లపనేని విజయలక్ష్మి
ఫోన్ : 9701667350

*"... ఏదో చిత్తమైన ఆమె చీకటి కుప్పలో (చిత్తూరుజిల్లా కుప్పం వారు) దాగిన నాగమణుల పాములబుర్ర – ఓ ప్రొఫెసర్ మది నుండి నాగస్వరూప అక్షరాలుగా, కళా-కథా తనువు తన్మయత్వపు బుస-గుసలు-గత జూలై 23 **మిసిమి** లో కుప్పం నుండి శ్రీ పొదిలి నాగరాజు గారు తన వ్యాసపు నాగ నాట్యపు భంగిమతో నన్ను కాటేసినారు. "అది ఓ కుముదం గురించి ఓ కథ వ్రాయవూ?" మన తెలుగు బుచ్చిబాబు – మన అన్ని తరాల అణువులలో ఒకో పచ్చిబాబు (ఎవర్‌గ్రీన్‌బాయ్)గా మగజాతికి, అందని కుముదాన్ని (లోటస్-ఎ జాయ్ ఆఫ్ ది ఎర్త్) అనుభవించని/దొరకని సంపాదనా లక్ష్మిలా చివరికి ఏమీ మిగలని నవాబు-నిజమని-ప్రతి మగాన్ని నిరాస నిద్ర నుండి మరోసారి లేపారు. కాదు ప్రతీసారీ లేపుతారు. చాలాకాలానికి-నాకు మొదటిసారి నన్ను గురించి ఓ కథ రాయవూ-1946లో మా ఏలూరు వెనుక కొల్లేరులో-ఆ పచ్చని/వెచ్చని బాబు-అదే ఆ బాల బుచ్చిబాబు పొందని-ఆకుముదాన్ని ప్రజ్వలించే కార్తీక దీపపు ప్రమిదతో వదిలితే-తెనుగు మునుగు/ముసుగు నురుగు మూసీ-బ్రోచే తరంగాలలో-మరల మెరిసే **మిసిమి** కళాజ్యోతి చివరికి 2023లో దర్శించుకున్నాను. డా. పొదిలి నాగరాజుగారికి **మిసిమి** పత్రిక ద్వారా ధన్యవాదాలు*

*– ఐ.వి. రామరాజు, హైదరాబాద్/పిప్పర*





# ఎన్.టి.ఆర్. జ్ఞాపకాల పూలమాల

# "శక పురుషుడు"

– పాటిబండ్ల దక్షిణామూర్తి

సుప్రసిద్ధ నటుడు, విశిష్ట రాజకీయవేత్త శ్రీ ఎన్.టి. రామారావు (1923–96) శత జయంతి సందర్భంగా జయప్రదా ఫౌండేషన్ వారు శ్రీ టి.డి. జనార్ధన్ ముఖ్య సంపాదకునిగా వివిధ రంగాలలోని ప్రముఖుల రచనలతో, అనుభవాలతో ఈ సంచికను రమణీయంగా రూపొందించారు.

గేయ రచయిత వేటూరి నయనా నంద తారక రామారావు అనే వ్యాసంలో "దీక్ష, దక్షత, క్రమశిక్షణ అతని వర్తమాన, భవిష్యత్, భూత కాలాలు. ఆయన వంటి సుందర విగ్రహం భారత చిత్ర పరిశ్రమలోనే లేదు. అతని అక్షరాలు కూడా ముత్యాలవలె ఉండి 'దస్తూరీ తిలకం' అనవచ్చని ప్రశంసించారు. ఎ.వి.ఎం. సంస్థ అధిపతి మెయ్యప్పన్ కుమారుడు కుమరన్ "ఎన్.టి.ఆర్. క్రమశిక్షణతో ఉండేవారని, సెట్టులో ఎటువంటి బాతాఖానీ లేకుండా నిశ్శబ్దం కోరుకొనేవారని, నిర్మాత అంటే యజమాని అని, నిర్మాత సెట్టులోనికి రాగానే లేచి నమస్కరించేవారని వ్రాసారు.

1957లో "మాయా బజార్"లో శ్రీకృష్ణ పాత్రకు తగినవారని కె.వి. రెడ్డి ప్రోత్సహించి, మేకప్ రూములో నుంచి బయటకు వచ్చిన దైవ స్వరూపాన్ని చూసి ఆనందభరితులైన వారిలో ఇప్పటికీ సజీవులైన వారిలో ఒకరైన సింగీతం శ్రీనివాసరావు వ్యాసం ఆకట్టుకొంటుంది. ప్రముఖ దర్శకులు కె.వి. రెడ్డి, బి.యన్. రెడ్డి, ఎల్.వి. ప్రసాద్ వంటి పెద్దల పట్ల ఎన్.టి.ఆర్. కృతజ్ఞతాభావంతో ఉండేవారు. పెద్దవారిని గాని, తన కంటె చిన్న వయస్సు వారిని కూడా "మీరు" అని సంబోధించేవారు. 1963లో విడుదలైన "నర్తనశాలలో బృహన్నల పాత్రను ధరించమని నిర్మాతలు కోరగా దిగ్భ్రమ చెందిన ఎన్.టి.ఆర్. భారతాదిపురాణాలను అవగాహన చేసుకోవటంలో దిట్ట అయిన కమలాకర కామేశ్వరరావు దర్శకత్వంలో రచయిత సముద్రాల సీ॥, కళాదర్శకుడు టి.వి.ఎస్. శర్మ, మేకప్ నిపుణుడు హరిబాబు, ఫొటోగ్రాఫర్ రెహమాన్, నృత్య దర్శకుడు వెంపటి సత్యం ప్రజ్ఞా విశేషాలతోనే ఆ పాత్రను నేను నటించగలిగానని ఎన్.టి.ఆర్. ఒక వ్యాసంలో ప్రశంసించారు.

"కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు" అన్న దానికి ప్రత్యక్ష తార్కాణం ఎన్.టి.ఆర్." అని కళా తపస్వి కె. విశ్వనాథ్ కొనియాడారు. అన్న గారి చిత్రాల్లో పాతాళభైరవి, మాయబజార్ తర్వాత 'సీతా రామ కల్యాణం' (1961)లో రావణబ్రహ్మ పాత్రధారణ చూసి ఆయన అభిమానినయ్యానని రచయిత పరుచూరి గోపాలకృష్ణ పేర్కొన్నారు. "అల్లూరి సీతారామరాజు" విప్లవ యోధుని జీవితాన్ని తాను పకడ్బందీగా నిర్మించాలని సంకల్పిస్తుండగా, సోదరుడు కృష్ణ, రచయిత మహారధి దర్శకుడు రామచంద్రరావుల సహకారంతో నిర్మించగా, దాన్ని చూసి చాలా గొప్పగా తీసారు బ్రదర్, సీతారామరాజుగా మీరు బాగా నటించారు" అని ఎన్.టి.ఆర్. కృష్ణను అభినందించారు. ఎన్.టి.ఆర్. కు మధుర గాయకుడు ఘంటసాలతో వారి కుటుంబంతో ఆత్మీయ అనుబంధం ఉన్నది. ఘంటసాల 2 చిత్రాలు తీసి ఆర్థికంగా నష్టపోయినప్పుడు, ఎన్.టి.ఆర్. వారింటికి వెళ్లి కష్టం, సుఖం చాలాసేపు మాట్లాడి, సినిమాలకు బదులుగా ఇళ్లు, వాకిళ్లు, పొలాలు కొని కుటుంబానికి రక్షణ కల్పించమని, అవసరమైతే తాను ఆర్థిక సహాయం

చేస్తానని ఓదార్చి వెళ్లారు (ఘంటసాల సతీమణి సావిత్రి వ్యాసం).

మద్రాసు వెళ్లిన తొలిదశలో స్నేహితుడైన గుమ్మడితో మీ ఆదాయానికి మించిన ఖర్చును చేయవద్దని హితవు పలికారు. ఎన్.టి.ఆర్. తనను విలన్‌గా, తరువాత తనతో పాటు ప్రధాన పాత్రధారిగా 'పిచ్చి పుల్లయ్య' 'తోడు దొంగలు'లో నటింపచేసి ప్రోత్సహించారని గుమ్మడి వెల్లడించారు. ఆ రెండు చిత్రాలు విమర్శకులు మెచ్చుకున్నా, ఆర్థికంగా నష్టపోవటం వల్ల, కుటుంబ గాథా చిత్రాలు, వినోదాన్ని అందించే చిత్రాలతోపాటు, పౌరాణిక చిత్రాలను ప్రామాణికంగా ఎన్.టి.ఆర్. నిర్మించారు. "ఆరోగ్యకరమైన అభివృద్ధికి సద్వివేచనతో కూడిన విమర్శ ప్రాణవాయువు వంటిది" అని 1962లో ఎన్.టి.ఆర్. ఒక వ్యాసంలో వ్రాసారు.

తెలుగు చిత్ర పరిశ్రమకు రెండు నేత్రాలుగా భాసించిన ఎన్.టి.ఆర్., ఎ.ఎన్.ఆర్.ల అనుబంధం గురించి అక్కినేని వ్రాసిన వ్యాసం మకుటాయమైనది. ఎన్.టి.ఆర్. జీవితకాలంలో ఆయనతో ఆత్మీయంగా ఉన్న నాగిరెడ్డి, చక్రపాణిల గురించి విశ్వనాథరెడ్డి, ఎల్.వి. ప్రసాద్ గురించి రమేష్ ప్రసాద్, టి.వి. రాజు గురించి ఆయన కుమారుడు రాజు, నిర్మాత డి.వి.ఎస్. రాజు గురించి డి.వి.కె. రాజు (ఎన్.టి.ఆర్. మద్రాసు వచ్చే వరకు ఆలస్యమైనా పెళ్లి పీటలమీదే కూర్చున్నాడట), శివాజీ గణేశన్ గురించి ఆయన కుమారుడు ప్రభు, పుండరీకాక్షయ్య గురించి అట్లూరి నాగేశ్వరరావు, ఎస్. రాజేశ్వరరావు గురించి వాసూరావు చక్కని అనుభూతిని కలిగించే వ్యాసాలను వ్రాసారు. కవులు, రచయితలు, ఎన్.టి.ఆర్.కు అతిసన్నిహితులు. సీనియర్, జూనియర్ సముద్రాలలు, సి.నా.రె, దాశరథి, డి.వి. నరసరాజు, కొసరాజు, పరుచూరు సోదరులు, కొండవీటి వెంకట కవి, నాగభైరవ కోటేశ్వరరావు (వీరితో అక్షరానుబంధం గురించి బీరం సుందరరావు వ్రాసారు) లతో ఎన్.టి.ఆర్.కు గౌరవ ప్రపత్తులతో కూడిన అనుబంధం ఉండేది. భారత, రామాయణ, భాగవతాలలో ఎన్.టి.ఆర్.కు అభిజ్ఞత ఉండేది. సీనియర్ జర్నలిస్టులో ఎస్. వెంకట నారాయణ్, వి. వెంకట్రావు, ఎం.జె. అక్బర్, దాసు కేశవరావు, జహీర్ ఆలీఖాన్, తిరుమల రామచంద్ర, ఎం.వి.ఆర్. శాస్త్రి, కె. రామచంద్రమూర్తి, గుడిపూడి శ్రీహరి, బోగాది వెంకట్రాయుడు, నడింపల్లి సీతారామరాజు, కె. శ్రీనివాసరెడ్డి, ఎన్. ఇన్నయ్య, విక్రం పూల, కందుల రమేష్ మొదలైన వారి విలువైన విశ్లేషణాత్మక వ్యాసాలు ఈ పుస్తకంలో ఉన్నాయి. మోహన్ కందా, టి. గోపాలరావు, కె. విజయ రామారావు, హెచ్.జె. దొర, వై.వి. రెడ్డి, జయప్రకాశ్ నారాయణ, రావులపాటి సీతారామారావు, సి.వి. నర్సయ్య, అంజారావు వంటి ఉన్నతాధికారుల అనుభవాలు ఆకట్టుకుంటాయి. వైద్య ప్రముఖులు డా॥ బి. సోమరాజు, డా॥ నోరి దత్తాత్రేయ, డా॥ డి.ఎన్. కుమార్, డా॥ బి.ఎస్. ప్రసాద్, డా॥ ఆలూరి ప్రభాకరరావు అందించిన విలువైన సమాచారం ఈ సంచికలో ఉన్నది. సినీ ప్రముఖులు ఎం.జి.ఆర్. రజనీకాంత్, రాజకపూర్, రాజకుమార్, రావోజీరావు, షావుకారు జానకి, భానుమతి, అంజలి, సావిత్రి, కృష్ణ, శోభన్‌బాబు, కైకాల, డి. రామానాయుడు, కె. రాఘవేంద్రరావు, దాసరి నారాయణరావు, అశ్వనీ దత్, తాతినేని ప్రకాశరావు, మురళీ మోహన్, శారద, వాణిశ్రీ, కె.ఆర్. విజయ, కృష్ణంరాజు, చిరంజీవి, జయప్రద, జయసుధ, పి. సుశీల మున్నగువారి వ్యాసాలు తారక రాముని స్మృతి చిహ్నాలుగా నిలిచిపోతాయి. అల్లు రామలింగయ్య, రావుగోపాలరావు వంటి నటులతో ఎన్.టి.ఆర్. అనుబంధం మరువలేనిది. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు స్వయంగా తన సహచర నటీ నటులను, సాంకేతిక నిపుణులను కూడగట్టుకొని 1952 రాయలసీమ కరువు బాధితుల సహాయార్థం, చైనా దురాక్రమణ సందర్భంగా 1962లో రక్షణ నిధి సేకరించటంలోను, 1965లో పాకిస్థాన్ యుద్ధం సందర్భంగా రక్షణ నిధులు సేకరించటంలోను, 1977లో అక్కినేనితో పాటు దివి సీమ తుఫాన్ బాధితుల సహాయార్థం నిధుల సేకరణలోను ప్రముఖ పాత్ర నిర్వహించారు.

1986లో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు లలిత కళా తోరణంలో 'ఫిల్మోత్సవ్' కార్యక్రమం వైభవంగా జరిగింది. ముంబాయి నుండి అశోక్ కుమార్, రాజకపూర్, దిలీప్ కుమార్ వంటి పెద్దలకు స్వాగతం పలకడానికి ఎన్.టి.ఆర్. డి.వి.ఎస్. రాజుతో కలిసి విమానాశ్రయానికి స్వయంగా రావటం అపూర్వం. రాజకపూర్ ఎన్.టి.ఆర్.ను చూడగానే "రామయ్యా! వచ్చానయ్యా" అంటూ తన సినిమాలోని

గీతాన్ని ఆలపించటం ఒక మధుర దృశ్యం. 1982లో రాజకీయ రంగ ప్రవేశం చేసిన తరువాత ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నాయకునిగా, క్రమశిక్షణ, సమయపాలన, పేదలపట్ల మమతానురాగాలు, సంక్షేమ పథకాలను అమలు చేయాలనే అకుంఠిత దీక్ష, అవినీతిపట్ల వైముఖ్యం, కుటుంబ సభ్యులను పాలనా వ్యవహారాల్లో జోక్యం కల్పించుకోకుండా తగు జాగ్రత్తలు, జాతీయ స్థాయిలో వివిధ ప్రతిపక్ష నాయకులను విజయవాడ వంటి చోట్లకు ఆహ్వానించి "మహానాడు"లను నిర్వహించిన తీరు అనితర సాధ్యం. ప్రత్యర్థులు దూషించినా, అసత్య ప్రచారాలను చేసినా, నిగ్రహం, సహనం చూపించి విశిష్ట రాజకీయ నాయకునిగా నిరూపించుకున్నారు. రాజకీయాల్లో ఎన్.టి.ఆర్. ప్రదర్శించిన రాజనీతిజ్ఞతను వివరిస్తూ శ్రీయుతులు ఎం. వెంకయ్య నాయుడు, ఎస్. జైపాల్ రెడ్డి, దత్తాత్రేయ, ఫరూక్ అబ్దుల్లా, శరద్ యాదవ్, శరద్ పవార్, ఎల్.కె. ఆద్వానీ, దేవగౌడ, కె. హరిబాబు, సి.హెచ్. విద్యాసాగరరావు, సురవరం సుధాకరరెడ్డి, కె. నారాయణ, అశోక్ గజపతిరాజు, యనమల, కె.ఇ. క్రిష్ణమూర్తి, అచ్చెన్నాయుడు, బుచ్చయ్య చౌదరి అయ్యన్న పాత్రుడు, యర్రా నారాయణస్వామి, సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి, దేవేంద్రగౌడ్; కొత్తపల్లి సుబ్బారాయుడు, మండలి బుద్ధ ప్రసాద్, రాజకుమారి, డా॥ తులసిరెడ్డి, గౌతు శ్యామసుందర శివాజీ, మోత్కుపల్లి నరసింహులు మొదలైన వారి వ్యాసాలు ఎన్.టి.ఆర్. విశిష్టతను వెల్లడించాయి. 2022 మే నుండి 2023 మే వరకు ఎన్.టి.ఆర్. శతజయంతి సభలు ఘనంగా తెలుగు రాష్ట్రాల్లో విదేశాల్లో కూడా జరిగాయి. తెనాలిలో మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ నాయకత్వంలో రచయిత బుర్రా సాయి మాధవ్, కొమ్మినేని వెంకేటశ్వరరావు మొదలగు వారి సహకారంతో పెమ్మసాని (రామకృష్ణ) థియేటర్‌లో 275 ఎన్.టి.ఆర్. చిత్రాలను వారానికి 5 రోజులు ప్రదర్శించి ప్రతి నెల ఒక సినీ ప్రముఖుని సత్కరించటం, ప్రతి ప్రదర్శన తర్వాత రంగస్థల కళాకారులను సన్మానించటం ఇంకెక్కడా జరగని విధంగా వైభవంగా జరిగింది. ప్రముఖ హీరో నందమూరి బాలక్రిష్ణ, నందమూరి రామకృష్ణలు కొన్ని సమావేశాలకు హాజరయ్యారు.

1950 నుంచి 40 సంవత్సరాలు చలన చిత్రాలను విమర్శనాత్మకంగా చూసిన వ్యక్తిగా, 14వ సంవత్సరం నుంచి గత 70 సంవత్సరాలుగా పత్రికా పాఠకునిగా నా దృష్టికి ఈ పుస్తకంలో కనిపించిన కొద్ది తప్పులను ప్రస్తావిస్తాను. 1) 1956లో వచ్చిన 'తెనాలి రామకృష్ణ' చిత్రానికి రచన జూనియర్ సముద్రాల, కన్న దాసన్, మురుగు దాస (పేజీ నెం. 17) అని వ్రాసారు. కాని వెంకట్రామయ్య అనే కన్నడ రచయిత మూలం ఆధారంగా సీనియర్ సముద్రాల మాటలు, పాటలను బ్రహ్మాండంగా వ్రాసారు. 2) 19వ పేజీలో భూకైలాస్ చిత్రానికి కె. శ్రీధర్ దర్శకుడని వ్రాసారు. దాని దర్శకుడు కె. శంకర్. 3) 31వ పేజీలో జానకి వ్యాసంలో 'రేడియోలో నా గొతు విని దర్శకుడు కె.వి.రెడ్డి తాము నిర్మిస్తున్న 'గుణ సుందరి'లో నటిస్తారా అని అడిగినట్లు వ్రాసారు. అలా అడిగింది 'మల్లీశ్వరి' 'బంగారుపాప' వంటి గొప్పచిత్రాలను నిర్మించిన బి.యన్.రెడ్డి (ఈయన విజయా సంస్థ అధినేత బి. నాగిరెడ్డి అన్న). 4) భానుమతి వ్రాసిన వ్యాసంలో వారిద్దరు నటించిన చిత్రాల్లో 'ఆలీబాబా నలభై దొంగలు' వర విక్రయం ఉన్నట్లు పొరపాటున వ్రాసారు (పేజీ నెం. 36). 5) 318వ పేజీలో మోహన్ కందా రచించిన వ్యాసంలో ప్రచురించిన ఫొటోలోని వ్యక్తి ఎన్.టి.ఆర్. కాదనిపిస్తుంది. నాకు తెలిసినంతవరకు 'మనోహరం' అనే సినిమాలో ఎన్.టి.ఆర్. నటించలేదు.

శ్రీ చంద్రబాబునాయుడు పేర్కొన్నట్లు వివిధ పెద్దలు ఎన్.టి.ఆర్.తో తమ సాన్నిహిత్యాన్ని ఈ సంచికలో పొందుపరచటం వల్ల ఎన్.టి.ఆర్. సమగ్ర వ్యక్తిత్వం అవిస్మృతమై పదికాలాల పాటు దాచుకోవలసిన పుస్తకం. "శక పురుషుడు" శతజయంతి సంచిక సర్వాంగ సుందరంగా రూపొందడానికి కారకులు టి.డి. జనార్ధన్, జి. భగీరథ, విక్రంపూల తదితరులు అభినందనీయులు. ఎన్.టి.ఆర్. సంపూర్ణ వ్యక్తిత్వాన్ని తెలుసుకోగోరే నేటి యువతరం, ముందు తరాల వారు కూడా చదవదగిన పుస్తకం. 522 పేజీలు, అనేక ఫొటోలు, మంచి ముద్రణ, గెటప్‌తో ఆకర్షణీయంగా తయారైన ఈ సంచిక వెల వెయ్యి రూపాయలు. అమెజాన్, ఇతర పుస్తక కేంద్రాల్లో ఈ పుస్తకం లభ్యమవుతుంది.

డా. పాటిబండ్ల దక్షిణామూర్తి,
తెనాలి, ఫోన్ : 9550652680

## హాస్య కథల హరివిల్లు

# 'రాజనాల బండ'

– దొండపాటి కృష్ణ

నవరసాలలో హాస్య రసానిది ప్రత్యేకమైన స్థానం. ప్రతి ఒక్కరూ బాహాటంగా అభిమానించేది, ప్రేమించేది, కాంక్షించేది హాస్య రసాన్నే. దీనికి స్థాయీభేదాలు లేవు. మాట్లాడేవారిలో కాస్తంత హాస్య చతురత ఉంటే చాలు, ఎదుటివారిని ఇట్టే ఆకట్టుకోవచ్చు. మాటల్లోనే కాదు, నటన ద్వారా హాస్యాన్ని పండించిన ఛార్లీ చాప్లిన్ ను మర్చిపోగలమా! ఇప్పటికీ ఆయన వీడియోలు చూస్తే ఒత్తిడులన్నింటినీ మర్చిపోయి హాయిగా నవ్వుకుంటాం.

అంతటి ప్రాశస్త్యం కల్గిన హాస్య రసాన్ని సృజించడం అంత తేలికైన విషయం కాదు. అసాధ్యాన్ని సుసాధ్యం చేయడం నేర్చుకున్న మానవుడు హాస్యాన్ని సృజించడం కూడా నేర్చుకున్నాడు. దానికున్న ప్రాధాన్యతను గుర్తించిన సాహితీ దిగ్గజాలు తమ రచనల ద్వారా నలుగురిని నవ్వించారు. నవ్విస్తూనే ఉన్నారు. కాలంలో మార్పులు చోటు చేసుకున్నాయి. పల్లెలు పట్నాలుగా రూపాంతరం చెందాయి, చెందుతున్నాయి. మనుషుల మధ్య అనుబంధాలకు బీటలు వారాయి. ఆప్యాయతలు తగ్గాయి. సరదాగా మాట్లాడేవారు కరువయ్యారు. నవరసాల్లో కొన్ని రసాలను మాత్రమే ప్రదర్శించడం మొదలైంది. తద్వార హాస్యానికి డిమాండ్ బాగా పెరిగింది. ఇంస్టాగ్రాం రీల్స్, యూట్యూబ్ షార్ట్స్, కొన్ని టీవీ ప్రోగ్రామ్స్ హాస్యాన్ని నమ్ముకునే మనుగడ సాగిస్తున్నాయంటే దానికున్న ప్రాబల్యాన్ని అర్థం చేసుకోవచ్చు.

ఈ మధ్య కాలంలో హాస్యం కాస్తంత చవకబారుగా మారిందన్నది వాస్తవం. దాన్ని గమనించిన కొన్ని పత్రికలు హాస్యానికి పెద్దపీట వేస్తూ హాస్య రచనలు ప్రచురిస్తున్నారు. అందులోనూ సరైన హాస్యం లేదని, ఒకప్పటి అనుభూతి కలగడం లేదని విమర్శలు వస్తున్నాయి. అటువంటి విమర్శలకు చెక్ పెడుతూ ఆర్.సి. కృష్ణస్వామి రాజు "రాజనాల బండ" అనే కథాసంపుటిని తీసుకొచ్చాడు. ప్రత్యేకంగా ఇది హాస్య కథాసంపుటి అని చెప్పకపోయినా ఇందులో ఉన్న ఇరవై కథలూ హాస్యం చుట్టూ పరిభ్రమిస్తున్నాయి. అన్ని కథల నేపథ్యాలూ తిరుపతి చుట్టూ ఉన్న పల్లెల్లోనే తిరుగుతున్నాయి. కథాంశం ఎలాంటిదయినా దాన్ని హాస్యంతో మనసుకు దగ్గరయ్యేలా చెప్పడం కృష్ణస్వామి రాజుకి వెన్నతో పెట్టిన విద్య. దానికి తోడు విలువైన సామెతలు, జాతీయాలు కుడిభుజం, ఎడమభుజంలాగా ఉండనే ఉన్నాయి.

కార్తవరాయుడిది చాలా విచిత్రమైన కోరిక. అందుకుగల కారణం చాలా గుప్తం. అతనికి ముక్కుపుడక ఉన్న అమ్మాయినే మనువాడాలని కోరిక. ఊళ్ళో వరసైన ఏ అమ్మాయీ ముక్కు పుడక పెట్టుకోలేదు. అతనికి పెళ్లి సంబంధాలు చూస్తున్నారని తెలిసిన వాళ్ళు, 'మా అమ్మాయిని చేసుకో' అంటే 'మా అమ్మాయిని చేసుకో' అని అడగడం మొదలెట్టారు. వాళ్ల ముక్కుకు పుడకలు లేవని తిరస్కరించాడు కార్తవరాయుడు. పెళ్ళయ్యాక పెట్టిస్తామని కొందరు, నువ్వు 'ఊ...' అంటే ఇప్పుడే పెట్టిస్తామని మరికొందరు అన్నారు. తల్లి మస్తానమ్మ కూడా కొడుక్కి నచ్చజెప్పింది. అతను ఒప్పుకోలేదు. ముక్కు పుడక అంటే ఇష్టం ఉండి, పెళ్లి గురించి కాకుండా ముందే పెట్టుకుని ఉన్న అమ్మాయి కావాలని పట్టుబట్టాడు.

'బిడ్డ ఏమైనా మణులు, మాణిక్యాలు అడగతా ఉండాడా, పెళ్ళానికి ముక్కుపుడక ఉంటే అదే పదివేలు అంటున్నాడు కదా. వాడి ఆశ ఎందుకు కాదని చెప్పాల' అని మస్తానమ్మ కూడా కార్తవరాయుడు ఇష్టానికే వదిలేసింది. అప్పట్నుంచి ఎన్నో సంబంధాలు చూశారు. ఎవరూ దొరకలేదు. అలాంటి అమ్మాయి కోసం వెతుకుతూ కార్తవరాయుడి వయసు మూడు పదులు దాటిపోయింది. ఇక అలాంటి అమ్మాయి దొరకదేమో, వయసు మీరితే పెళ్లి కాదేమో అన్న బెంగా కలిగింది. అతని గురించి తెలుసుకున్న చెంగన్నగుంట కానిస్టేబుల్ కోదండం తన కూతుర్ని ఇవ్వడానికి ముందుకొచ్చాడు. కనకలక్ష్మి

కార్తవరాయుడికి బాగా నచ్చింది. ఆమె ముక్కుపుడక చూసి డబుల్ ఓకే అన్నాడు. కొడుక్కి నచ్చిన సంబంధం దొరికినందుకు సంబరపడుతూ మస్తానమ్మా లగ్గం పెట్టించేసింది. 'దుందుం' కొట్టి పెళ్లి జరిపించేశారు. శోభనం గదిలోకి వెళ్ళాడు కార్తవరాయుడు. పాలగ్లాసుతో సిగ్గుపడుతూ వచ్చింది కనకలక్ష్మి. ఆమె ముక్కుపుడక మెరుస్తూ కనిపించేసరికి ఉప్పొంగిపోయాడు కార్తవరాయుడు. కాసేపటికి చావు కబురు చల్లగా తెలిసింది. కనకలక్ష్మి పెట్టుకున్న ముక్కుపుడక ఒరిజినల్ కాదని, పెట్టుడు ముక్కుపుడక అని...

నిజం తెలిశాక కార్తవరాయుడు ఏం చేశాడు? కనకలక్ష్మిని ఏలుకున్నాడా, లేదా? అబద్ధం చెప్పి పెళ్లి చేసిన మామ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకున్నాడో "కొత్త పెళ్ళాం ముక్కు పుడక" కథలో చదవాల్సిందే! పడీ పడీ నవ్వుకోవాల్సిందే! ఇలాంటి పెళ్లి సంబంధాల మీదే ఇంకో సరదా కథ "గెడ్డం గీకుడు". పెళ్లీడుకొచ్చిన పాలమంగళం మునిలక్ష్మికి ఆంధ్రాలో కానీ తెలంగాణాలో కానీ పెండ్లి కొడుకు దొరకలేదు. అలాగని ఆమె తల్లిదండ్రులు చేతులెత్తేయలేదు. పొరుగు రాష్ట్రాలు చూశారు. భంగపడ్డారు. దక్షిణాది వెతికారు. నీరుగారిపోయారు. చేసేదిలేక ఉత్తరాది వెతుకుదామని నడుం బిగించారు.

'ఉన్న ఒక్క ఆడబిడ్డను ఉత్తరాది రాష్ట్రాలో ఇచ్చేస్తే ఎలా? మంచికి, చెడ్డకీ రావద్దా, పోవద్దా? దక్షిణాది రాష్ట్రాలలో పాండిచ్చేరి మరిచినారు కదా, పోరాదా!' అని ఒక ఊరిపెద్ద సలహా ఇవ్వడంతో తాము బిగించిన నడుము బిగింపును వదులు చేసుకున్నారు. పాండిచ్చేరి దిన, వార పత్రికలలో పెళ్లి పందిరి ప్రకటనలు వేయించినారు. ఫలితం దొరికింది. పిలగోడు అమెరికాలో సాఫ్ట్వేర్ ఉద్యోగి. పెళ్లి కోసం వస్తాడు. ఇండియాలో వారం రోజులే ఉంటాడు. ఈ వారం రోజుల్లో మూడు రోజులు పుట్టింట్లో, తర్వాత నాలుగు రోజులు అత్తారింట్లో ఉంటాడు. అటునుంచి అటే అమ్మాయిని తీసుకుని అమెరికా వెళ్ళిపోతాడనే తీర్మానం జరిగింది. అట్లాస్ లో అమెరికా చూసిన వాళ్ళమే కాని అమెరికా అల్లుడిని తెచ్చుకోగలిగిన ముఖాలు కావని, బిడ్డ అదృష్టం బాగుండి మంచి సంబంధం వచ్చిందని మునిలక్ష్మి తల్లిదండ్రులు సంబరంగా తల ఊపారు. అప్పుడు మొదలైంది అసలు కథ. మొదటిరోజు అల్లుడికి స్వీట్లు పెడతారు. కోరింది ఇస్తారు. ఎంతో ప్రేమ చేస్తారు. కొత్త అల్లుడిని చూడడానికి ఊళ్ళో వాళ్ళందరూ వస్తూ ఉంటారు. వాళ్లకు మంచిగా కనిపించడానికి అల్లుడు పడే అగచాట్లు అన్నీ ఇన్నీ కావు. అల్లుడి ఓపికకు పిల్లనిచ్చిన మావ సంతోషించినా, ఒకటిమాత్రం అతన్ని తొలిచేస్తుంది. 'అంతా బాగానే ఉందికానీ, అల్లుడు గడ్డం ఎందుకు గీకలేదబ్బా! షేవింగ్ సెట్ తెచ్చుకోలేదా?' అని ఆలోచిస్తుండేవాడు. ఎలాగోలా అల్లుడికి మొదటిరోజు అత్తగారింట్లో గడిచిపోయింది. రెండో రోజు కూడా అల్లుడి గడ్డం చూసి మావ గుండె ముళ్ళు గుచ్చుకున్నంత బాధపడింది. పెండ్లి అయిన రెండు రోజులకే గడ్డం పెంచితే ఊళ్ళో వాళ్ళు చెవులు కొరుక్కుంటారని తన షేవింగ్ సెట్ అల్లుడికి ఇస్తాడు. 'ఒకరి రేజర్, ఒకరి బ్రెష్ ఇంకొకరు వాడటం మంచిదికాదు' అని సుతిమెత్తంగా తిరస్కరిస్తాడు అల్లుడు. మూడోరోజు కూడా అల్లుడి గొరగని గడ్డం చూస్తాడు మావ. ఊరి మంగలిని పిలిపిస్తానని, అల్లుడిని షేవింగ్ చేసుకోమని భార్యతో చెప్తాడు. అమెరికా వాడికి ఊరి మంగలి వద్దని వారిస్తుంది భార్య. చేసేదిలేక 'పట్నం వెళ్తున్నాను. అక్కడ షేవింగ్ చేసుకుందువుగాని రా అల్లుడు' అని పిలుస్తాడు. ఇక్కడి సెలూన్ షాపులు హైజెనిక్ గా ఉండవని వెళ్ళడు అల్లుడు. ఇలా మావ అడుగుతూనే ఉంటాడు. అల్లుడు వద్దని చెప్తూనే ఉంటాడు. అసలు ఈ గడ్డం గోల ఏమిటో "గెడ్డం గీకుడు" కథ చదవండి. ఎంతలా నవ్వుకుంటారు అంటే కథ చదివేటప్పుడు మీ గడ్డాన్ని తడుముకునేంతగా... మన పెదవులపై మొలిచిన చిరునవ్వు మనల్ని మరో కథ చదివేలా చేస్తుంది. అలా మరో కథలోకి వెళ్ళామా మనసు ఆనందంతో గంతులేస్తుంది. ఇలా మా ఊర్లోకూడా జరిగిందే అనిపిస్తుంది. "కొడుకా! కట్ట తెగనీయుద్దు!" కథ అయితే మరీనూ...

తుమ్మల చెరువు కండ్రిగ తుకారాముడికి, దేరాకండ్రిగ కనకలక్ష్మికి పెండ్లి కుదిరింది. పెళ్ళైన మూడోరోజు పెళ్ళికూతురు అమ్మగారింట్లో పది రోజులు ఉండి వస్తానని వెళ్ళింది. పెళ్ళాం ఊరికి పోయిన గంటకే తుకారాముడు ఎండిపోయిన చెరువులా తయారయ్యాడు. పెళ్ళాన్ని చూడకుండా ఉండలేక దిగులు పెట్టుకున్నాడు. మూతి 'ఉం' అని పెట్టుకుని పరధ్యానంగా ఉండసాగాడు. కొడుకు పరిస్థితి చూడలేక అత్తారింటికి వెళ్ళమని తల్లి చెప్పింది. యమ హుషారుగా తయారైనాడు తుకారాముడు.

'అత్తారింటికి పోయేదానికి ఈనిన మేక మాదిరి అల్లాడతా ఉండావు, పోతే పోయినావుగానీ అత్తగారింట్లో ఎక్కువ రోజులు ఉండొద్దురా, భద్రం కొడకా, కట్ట తెగేంత వరకూ అక్కడ ఉండొద్దు' అని తండ్రి హితవు చెప్పాడు. నాయన చెప్పిన దాంట్లో అన్నీ అర్థమైనాయిగానీ తుకారాముడికి ఒక్క కట్ట తెగడం అంటే ఏమిటో అర్థం కాలేదు. అత్తగారి ఊర్లో కట్ట తెగుతుందేమో అనుకున్నాడు. ఒకవేళ తెగితే అడ్డుకట్ట వేద్దాం అనుకున్నాడు. మొదటిరోజు అల్లుడికి అరటి ఆకులో మటన్ భోజనం పెట్టారు. రెండోరోజు విస్తరలో మజ్జిగ పులుసు పోశారు. మూడోరోజు మధ్యాహ్నం అన్నమే పెట్టకుండా సాయంకాలానికి సత్తు తట్టలో సంగటి, ఊరిబిండి పెట్టారు. నాలుగోరోజు గంటల తరబడి కూలోడి లెక్కన పని చేయించుకుని చేతిలో ముద్ద పెట్టారు. పైపెచ్చు పెళ్ళాం కూడా ఆమె తల్లిదండ్రులకే ఓటు వేసింది. ఇంటి అల్లుడు ఆమాత్రం సర్దుకోలేడా? అంది. అప్పటికిగాని కట్ట తెగడం అంటే ఏమిటో తుకారాముడికి తెలిసి రాలేదు.

ఇప్పుడున్న యాంత్రిక జీవనంలో అత్తగారింట్లో అన్ని రోజులు ఉండటానికి ఎవరికీ కుదరడం లేదుగాని, కొంత కాలం క్రితం ఇలాగే ఉండేది. ఇప్పటికీ చాలా పల్లెల్లో ఇలాంటి సంఘటనలు వింటూనే ఉంటాం. నవ్వు తెచ్చుకోకుండా ఉండలేకపోతున్నాం. జీవిత బీమా సంస్థలో అధికారిగా పని చేసి పదవీ విరమణ పొందిన ఆర్.సి. కృష్ణస్వామి రాజులో హాస్య చతురత ఎక్కువగా ఉంది. ఆయనతో మాట్లాడితే నవ్వకుండా ఉండలేం. సందర్భానుసారం సామెతలతో బుట్టలో వేసుకుంటారు. దేన్ని హాస్యంగా సృజించాలి అనేది ఆయనకు స్పష్టత ఉంది. ఈ రాజనాల బండ అనేది అతని పదకొండవ పుస్తకం. బాలల కథలు, ఆధ్యాత్మిక కథలు, సామాజిక కథలలో కూడా తను అందేసిన చెయ్యి. ఆయనలో ఉన్న సహజ గుణం కారణంగా ప్రతి కథలోనూ హాస్యం తొంగి చూస్తూ ఉంటుంది. మనల్ని గిలిగింతలు పెడుతుంది. హాస్య రచనల్లో ఆయన చేసిన కృషికి గుర్తింపుగా ఈమధ్యనే హైదరాబాద్ తెలుగు విశ్వవిద్యాలయం వారు కీర్తి పురస్కారాన్నిచ్చి గౌరవించారు. అది తనకు దక్కిన గౌరవం కాకుండా హాస్యానికున్న గొప్పదనం అని అనడం రచయిత మంచి మనసుకి నిదర్శనం. తిరుపతికి చెందిన ఈ రచయిత అక్కడి గ్రామీణ మాండలికాన్ని చాలా పొందికగా తన కథల్లో ఇమిడ్చాడు. పూర్తి రాయలసీమ మాండలికం కాకపోవడం కలిసొచ్చింది. ఆయన కథల్లో పాత్రలు కనిపించవు. మన మధ్యనే తిరిగే వ్యక్తులు మనల్ని పలకరించినట్లు అనిపిస్తుంది.

ఇక్కడ ప్రస్తావించిన కథలే కాకుండా ఇందులోని ఇరవై కథలూ ప్రత్యేక నేపథ్యాల్ని కలిగి ఉన్నాయి. కొన్ని తిరుపతి చుట్టుపక్కల గ్రామీణ జీవన చిత్రాన్ని అక్షరీకరిస్తే, మరికొన్ని అక్కడి సంస్కృతి సంప్రదాయాలను మన ముందుకు తీసుకొచ్చాయి. పాతాళ భేరి, తలిగ, రాజనాల బండ వంటి కథలు గ్రామీణ ఆచారాలను, విశ్వాసాలను, పండుగలను, వారి ప్రేమలు, ఆప్యాయతల్ని, ఐకమత్యాన్ని స్పృశిస్తాయి. చరణ్ పరిమి వేసిన బొమ్మ చిరునవ్వు చిందించే సజీవ జీవన చిత్రానికి ప్రతీకగా ఉంది. ఈ పుస్తకంలోని ఆత్మను పట్టుకున్న కథారచయిత చందు తులసి కవర్ వెనుక చక్కగా రాశాడు. కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత శ్రీ పల్లిపట్టు నాగరాజు రాసిన ముందుమాట పల్లె బతుకుల్ని తడిమినట్లుంది.

దొండపాటి కృష్ణ
ఫోన్ : 9052326864

---

**నిష్కామకర్మ**

నేను నాఁటినమొక్కొకటిపెంచెదవు నీవు
నేను దున్నినపొలముఁ బండింతు నీవు
సేవ నా కృషి నీదయ స్వీకరించి
యలరజేయుట యనుచు బ్రహ్మర్షిమాట

**జీవన్ముక్తి**

"ఏ నెటకుఁబోయినను సతఁడేఁగుదెంచు,
నే నెచట నున్న నతఁడటనే వసించు"
నన వలంతియైన పరమేశ్వరానుభవమె
మనకు ముక్తి యటంచు బ్రహ్మర్షిమాట

- బ్రహ్మర్షి శ్రీ వేంకటరత్న సూక్తులు



# గురువందనం

– తోట వెంకటస్వామి

సుప్రసిద్ధ సాహిత్యవేత్త గురువర్యులు ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావుగారు గత మార్చినెలలో వచ్చిన తమ 88వ జన్మదిన సందర్భంగా "గురువందనం-2022" అనే సాహిత్య వ్యాససంపుటిని వెలువరించారు. ఇది శోభకృత్ ఉగాదినాడు ప్రకటింప బడింది. బెంగుళూరు విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయనశాఖ సువర్ణ మహోత్సవాల సందర్భంగా ఈ గ్రంథం ముద్రింపబడింది. ఇది 592 పుటలుగల బృహద్గ్రంథం. దీనిలో 120 పుటలు రంగుల ఫోటోలు ఆకర్షణీయంగా ఉండటం విశేషం.

ఈ గురువందనం మూడు భాగాలుగా విభజింపబడింది. మొదటిభాగంలో ఆచార్య తంగిరాలవారు తమ గురువులైన ఆచార్య తిమ్మావజ్ఝుల కోదండరామయ్యగారు, ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు, కీ.శే. దిగుమర్తి సీతారామస్వామిగారు, కీ.శే. నండూరి రామకృష్ణమాచార్యులగారు – అనే నలుగురిని భక్తితో స్మరించుకుంటూ ఎంతో విలువైన సమాచారం ఇచ్చారు. ముఖ్యంగా కోదండరామయ్యగారు తన సుస్థిర ఉద్యోగ జీవితానికి ఎలా మార్గదర్శకులయ్యారో తెలియజేస్తూ వారిని దైవసమానులు("దైవం మానుషరూపేణ")గా నిరూపించారు. ఈ నలుగురు గురువులవల్ల తనలో తెలుగు సాహిత్యాభిరుచి పెంపొందిన రీతిని ఆవిష్కరించారు. రెండవభాగంలో పూర్వవిద్యార్థులైన శిష్యులు తంగిరాల వారికి చేసిన గురువందన విశేషాలున్నాయి. ఈ శిష్యులలో కన్నడశిష్యులు కూడా ఉండటం విశేషం. తంగిరాలవారు 1970నుండి 1976వరకు B.A. (Hons.) కన్నడ విద్యార్థులకు, M.A. కన్నడ విద్యార్థులకు తెలుగు ఐచ్ఛిక విషయాన్ని (Elective Subjectను) బోధించారు. వీరు 1971లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ P.V. నరసింహారావుగారికి లేఖ వ్రాసి, వారు ఇచ్చిన మూడులక్షల రూపాయల గ్రాంటుతో 1974లో బెంగుళూరు విశ్వవిద్యాలయంలో తెలుగు స్నాతకోత్తర శాఖను స్థాపించారు. అప్పటినుండి 1996లో వారు రిటైర్ అయ్యేవరకూ ఎం.ఏ. (తెలుగు) విద్యార్థులకు పాఠాలు చెప్పారు. ఆ పూర్వవిద్యార్థులందరూ కలిసి వీరికి 10.06.2022నాడు బెంగుళూరు విశ్వవిద్యాలయంలో జ్ఞానభారతి ప్రాంగణంలో ఘనసన్మానం చేశారు. ఆ సన్మాన విశేషాలన్నీ ఈ రెండవభాగంలో ఉన్నాయి. శిష్యులు, మిత్రులు భక్తితో సమర్పించిన కవితాపుష్పాంజలి కూడా ఈ రెండవ భాగంలో ఉంది. గురువందనం మూడవ భాగంలో తంగిరాలవారు 1986 నుండి 2009 వరకు 24 సంవత్సరాలపాటు నడిపిన "చైతన్యకవిత" అనే కవిత్వ పత్రికను గురించి, వీరు ఇటీవల ప్రచురించిన "రసగంగాధర తిలకం" – "అశ్రుతర్పణం" అనే గ్రంథాలను గురించి శిష్యులు, కవులు, మిత్రులు వెలిబుచ్చిన స్పందనలు, చేసిన సమీక్షలు ఉన్నాయి. ప్రముఖ కవుల ఛలోక్తులు, "కవితా! ఓ కవితా" అనే పేరుతో "తెలుగు కవితావైభవం", గొప్పగొప్ప యతీశ్వరుల తత్త్వవివేచన కూడా ఈ మూడవభాగంలో రసికులైన పాఠకులకు ఆనందాన్ని కలిగిస్తాయి.

సాహిత్యవ్యాస సంపుటియైన ఈ గ్రంథంలో పై మూడు భాగాలూ ఎంత విలువైనవో, చివర యిచ్చిన ఆరు అనుబంధాలు కూడా అంతే విలువైనవి. (1) అనవద్యం-తెలుగుపద్యం (ప్రాచీన కవిత్వంలోని ఆణిముత్యాలవంటి కొన్ని పద్యాలు); (2) అనర్ఘ మణిఖని – అమరవాణీ రసధుని ("శ్రీకృష్ణ కర్ణామృతం"నుండి "శ్రీరామకర్ణామృతం"నుండి కొన్ని మిక్కిలి జనప్రియమైన శ్లోకాలు తాత్పర్య సహితంగా); (3) ఆచార్య తంగిరాలవారిని గురించి "మా సుబ్బన్నబావ" అనే పేరుతో ప్రముఖకవి కీ.శే. దుగ్గిరాల రామారావుగారు వ్రాసిన ఆత్మీయమైన 51 పద్యాలు; (4) "నా ప్రాణమిత్రుడు – సరస్వతీ పుత్రుడు" అనే పేరుతో ప్రసిద్ధ బహు భాషా పండితుడు, పరిశోధకుడు అయిన డా॥ చన్నాప్రగడ తిరుపతిరావుగారిని గురించిన తంగిరాలవారి వ్యాసం; (5) "సంస్మరణం" పేరుతో కీ.శే. చిలకల వెంకట సుబ్బారెడ్డిగారిని గురించిన వ్యాసం; (6) "శ్రద్ధాంజలి" పేరుతో "దానరాధేయ" శ్రీ సకలా నరసింహులుశ్రేష్ఠిగారు బెంగుళూరులో తెలుగు సాహిత్యానికి చేసిన సేవ, వారి దానధర్మాల వివరాలు – ఇవన్నీ కూడా పాఠకులను మిక్కిలి ఉత్సుకతతో చదివిస్తాయి. పూర్వం గురువులు శిష్యులను ఎంతో వాత్సల్యంతో, పుత్రప్రేమతో, వారి అభ్యున్నతికి ఉన్నతమైన బాటలు వేయడానికి ఎలా పాటుపడేవారో ఈ గ్రంథం వేనోళ్ల చాటిచెపుతోంది. నేటి విద్యార్థులందరూ తప్పక పఠించవలసిన ఉత్తమ గ్రంథం – ఈ గురువందనం!

# మూలద్రావిడభాషకు తెలుగే దగ్గరన్న కొమర్రాజు వారి పరిశోధన



కొమర్రాజు

*– మండలి బుద్ధప్రసాద్*

కేంద్రప్రభుత్వం తమిళభాషకు ప్రాచీనభాష హెూదాని అందిస్తూ దాని అభివృద్ధికి కోటి రూపాయలనిధిని ప్రకటించినప్పుడు తెలుగువారంతా తమ బాషకు తీవ్రమైన అన్యాయం జరిగిందని బాధపడ్డాము. కోటి రూపాయల నిధి కోసం కాదు, భాషాపరంగా మన ఆత్మగౌరవానికి భగం కలిగిందనేదే ఆ బాధ! తెలుగుని ఒక పాఠ్యాంశంగా చదివి, ఆ భాషమీద జీవించే వారికన్నా తెలుగుతో సంబంధం లేని ఇతరులే ఈ విషయంలో ఎక్కువ స్పందించారు. ద్రావిడ భాషలలో తమిళం ముందా? తెలుగు ముందా? అనే ప్రశ్న అప్పుడు ప్రధానం అయ్యింది. వెయ్యేళ్ళ ప్రాచీనత ఆధారంగా తమిళానికి ప్రాచీనభాష హెూదా ఇచ్చేశారు. ఆ తరువాత సంస్కృతానికి 1500 యేళ్ళ ప్రాచీనత ఉందని దానికీ ఇచ్చేశారు.

తెలుగు కన్నడాల కొచ్చేసరికి 2000 యేళ్ళ ప్రాచీనతకు నిరూపణలు కావాలన్నారు. మన భాషావేత్తలు కానీ, చరిత్రవేత్తలు కానీ నోరు మెదపలేదు. ఔత్సాహికులైన భాషాభిమానులు తెలుగు భాష ప్రాచీనతని నిరూపించటానికి ఎంతో కృషిచేశారు. తెలుగునాట భాషోద్యమం ఉధృతంగా సాగుతోన్న దశలో కొమర్రాజు లక్ష్మణరావుగారు ఆంధ్రపత్రిక వృష సంవత్సరాది సంచికలో "ద్రావిడభాషలలో అఱవము పురాతనమైనదా?" అనే వ్యాసాన్ని వ్రాసి ప్రచురించారు. ఆ సమయంలో అది నా కళ్లలో పడింది. 2004 లో తమిళాన్ని ప్రాచీనభాషగా హెూదా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన దరిమిలా, తెలుగును ప్రాచీన భాషగా ప్రకటించాలని కోరుతూ సాగిన ఉద్యమానికి స్ఫూర్తినిచ్చింది ఈ వ్యాసమే! తెలుగు ప్రాచీనత సాధక సంఘంలో నేనూ ఒక సభ్యుణ్ణి కావటంతో ఈ ఆధారాలే మార్గనిర్దేశనం చేశాయి. కొమర్రాజువారు అరవంలోంచి తెలుగు పుట్టిందనే వాదనని అర్థం లేనిదిగా కొట్టి పారేస్తూ, "తెనుగు అఱవమునుండి పుట్టినదా? కానేకాదు, కానేకాదు, కానే కాదు..." అని ఉపశీర్షికతో ఈ వ్యాసాన్ని వ్రాశారు. ఆనాటి తమిళపండితులు మితిమీరిన తమిళ దురభిమానంతో నేల నీరు గాలి పుట్టకమునుపే తమిళం పుట్టిందంటూ అన్ని భాషలకూ తల్లి తమిళమే నంటూ వ్యవహరించిన తీరే లక్ష్మణరావు గారికి అంత ధర్మాగ్రహం కలగటానికి కారణం కావచ్చు! నేలపుట్టకమునుపే తమ భాష ఉన్నదన్న తమిళులు వెయ్యేళ్ళ చరిత్రని మాత్రమే చూపించి క్లాసికల్ హెూదా పొందటం, ఇతర భాషలకు క్లాసికల్ హెూదా దక్కకుండా అడ్డుపడటం లాంటి చేష్టలను చూసినప్పుడు కొమర్రాజువారికి వందేళ్ల క్రితం ధర్మాగ్రహం కలగడంలో ఆశ్చర్యం లేదనిపిస్తుంది. లక్ష్మణరావుగారి ఈ వ్యాసం 1941 ఆంధ్రపత్రికలో ముద్రితం అయ్యింది.

శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మగారు శ్రీ లక్ష్మణరావుగారి అముద్రిత రచనల్లో మూలనపడివున్న ఈ వ్యాసాన్ని కనుగొని, ప్రచురణార్థం ఆంధ్రపత్రికకు అందించారు. 1923లో ఆయన పరమపదించారు. ఈ వ్యాసాన్ని ఆయన ఎప్పుడు వ్రాసి ఉంటారో తెలియదు. నేటికి వందేళ్లకన్నా పూర్వం నాటిదన్నది స్పష్టం. కొమర్రాజు లక్ష్మణరావుగారు ఆధునిక యుగంలో తొట్టతొలి భాషోద్యమకారుడు. 'దేశభాషలలో శాస్త్ర పఠనం' అనే వ్యాసంలో ఆయన శాస్త్రసాంకేతిక రంగాలకు కొన్ని భాషలే చెల్లుబాటు అవుతాయనే వాదాన్ని తీవ్రంగా ఖండిస్తూ, "జ్ఞానమొక భాషయొక్క యబ్బ సొమ్ము కాదు. ఆంగ్లభాషపై అభిమానమున్నయెడల ఆ భాషను క్షుణ్ణముగా అధ్యయనము చేయవచ్చును, కాని కమ్మరము, కుమ్మరమును అదే భాషలో చదువవలసిన అవసరమేమున్నది?" అని నిలదీసిన వారాయన.

స్వంత భాషలోనే విద్యార్థులకు ఉపయోగకరమైన విద్యావనరాలన్నీ జరగాలంటూ, ఔరంగజేబు తన గురువుకు వ్రాసిన ఉత్తరాన్ని పారశీక భాషనుండి తెలుగులోకి అనువదించి కొమర్రాజువారు ప్రచురించారు. మాతృభాషాభిమానంతో ఇలా ఆయన చేపట్టిన కార్యక్రమాలు, తెలుగు ఔన్నత్యాన్ని చాటటానికి ఆయన చేసిన కృషి అనితర సాధ్యమైనవి... ఈనాటికీ! "ఒక నదీప్రవాహం రెండుపాయలుగా చీలితే, ఒక పాయ మాత్రం మూలనది అనీ, రెండోది కాదని చెప్పవచ్చునా?" అని ప్రశ్నించా రాయన. ఆ రెండు పాయల్లో ఒకటి మూలనది పేరుతో ప్రవహిస్తూ, రెండోదానికి వేరే పేరు ఉండటం కూడా మనం చూస్తూనే ఉన్నాం. మూలనది ఎంత పురాతనమైనదో ఆ రెండు పాయలు కూడా అంత పురాతనమైనవే అవుతాయి. ఒకపాయ ప్రాచీనమూ ఇంకో పాయ అర్వాచీనమూ అనటానికి వీల్లేదు కదా..." అని తన వాదాన్ని వినిపించారాయన. మూలద్రావిడభాష ఎంత ప్రాచీనమైందో దాన్నుండి పాయలుగా చీలిన ఇతర ద్రావిడభాషలు కూడా అంతే ప్రాచీనమైనవి. వాటిలో ఏ ఒక్కటీ ఇంకో దానికంటే ప్రాచీనం కాదన్నమాట. ఇది తిరుగులేని సత్యం. అరవభాష పురాతనమైందనీ, ఇతర భాషలు ఇటీవలివని చెప్పటం సరికాదని వందేళ్ళ క్రితమే నొక్కి చెప్పారాయన.

మూలద్రావిడ భాషే తమిళం అని మొదట వాదించిన తమిళ పండితులు నెమ్మదిగా ఒక అడుగు దిగి, మూల ద్రావిడంతో తమిళానికే ఎక్కువ సంబంధం ఉందనే వాదనను తెరపైకి తెచ్చారు. అంటే పరోక్షంగా ద్రావిడ కుటుంబంలో పెద్దకొడుకు తమిళం అనే భావనని ఈ ప్రతిపాదన కలిగిస్తోంది. పరోక్షంగా ఈ భావన రావటానికి కారకుడు కాల్డ్‌వెల్. ఈయన ఒకింత తమిళ పక్షపాతిగా వ్యవహరించాడు. మద్రాసు రాజధానిలో తమిళ పండితుల సంఖ్య ఎక్కువగా ఉండటం, తెలుగుపండితులకు కాల్డ్‌వెల్‌తో అందుబాటులో లేకపోవటం వలన తమిళం వైపు ఆయన దృష్టి ఎక్కువ మళ్లింది. అది తమిళ భాషాదురభిమానులకు కలిసివచ్చిన అదృష్టం. కొమర్రాజువారు ఈ వ్యాసంలో కాల్డ్‌వెల్ వాదనని ఖండించిన లింగ్విస్టిక్ సర్వే నాయకుడు గ్రియర్ సన్ వ్రాసిన విషయాన్ని ఉటంకించారు. భాషాచరిత్ర పరంగా ఈ వ్యాసం చాలా ప్రాధాన్యత కలిగింది. "అన్ని ద్రావిడబాషలకీ జననియైన మూలద్రావిడ భాష పూర్వరూపాలు అంటే ప్రోటో ద్రవిడియన్ మూలపదాలను పోకుండా పట్టుకొని ఉన్నది తమిళం అని సాధారణంగా అందరూ అనుకుంటారు. ఈ మాట నిజం కాదని ఈ గ్రంథంలో ఆయా పేజీల్లో చూపిస్తాను. తెలుగు మొదలయిన యితర ద్రావిడ భాషలలో అరవం కంటే ఎక్కువగా పురాతనములైన పూర్వకాలపు విశేష పదరూపాలు ఉన్నాయి. ఆ భాష లింకను అధిక పురాతన కాలమందలి మూలద్రావిడ భాషాభివృద్ధి యొక్క స్థితిని తెలుపుతాయి. కావున అరవము ఇతర భాషల వలెనే ఒక ఉపభాషనీ, ఇతర భాషలకంటే తాను ముసలిదాన్నని అనటానికి హక్కు లేదని చెప్పవలెను" అని వ్రాశారు.

నిజానికి ద్రావిడభాష లన్నింటిలోనూ వాటి మూలభాషాపదాలు ఏదో ఒక రూపంలో ఉంటాయి. ఒకే అర్థాన్నిచ్చే పదాలన్నింటినీ వివిధ ద్రావిడభాషల్లోంచి ఒకచోటపేర్చి T. Burrow అలాగే, M.B. Emeneau అనే ఇద్దరు పండితులు ద్రవిడియన్ ఎటిమలాజికల్ నిఘంటువును రూపొందించారు. ఒక్కొక్కపదాన్నీ ఈ నిఘంటువులో పరిశీలిస్తే మూలపదం ఏవిధంగా ఒక్కోభాషలో ఎలా రూపాంతరం చెందిందో మనకు అర్థం అవుతుంది. తెలుగు భాషకు సంబంధించినంత వరకూ బర్రో, ఎమెనో పండితులు ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి ప్రభృతుల సాయంతో అనేక పదాలను ఈ నిఘంటువులో చేర్చటం జరిగింది.

ఆసాంతం ఈ నిఘంటువును పరిశీలిస్తే చాలా తెలుగు పదాలు ఇందులో కనిపించక పోవటం ఆశ్చర్యమే! సమగ్రమైన బృహన్నిఘంటువు (లెక్సికాన్)ని ఈ నాటికీ మనం రూపొందించకపోవటం వలన అంతర్జాతీయ భాషావేత్తలకు తెలుగు గురించిన పరిశీలన చేసే అవకాశం లేకుండాపోతోంది. ఇది మన పట్టనితనమే కాని, భాష తక్కువతనం ఎంతమాత్రమూ కాదు. బర్రో, ఎమెనో పండితులకు అందుబాటులో ఉన్నందువలన తమిళ రూపాలను ఎక్కువగా ఈ నిఘంటువులో ఇవ్వగలిగారు. తెలుగు రూపాలను పరిమితంగా ఇవ్వగలిగారు. అంతేగానీ ఈ భాషాపదంలోంచి ఈ భాషాపదం ఏర్పడిందనే తీర్పు ఎక్కడా ఇవ్వకపోవటం గమనార్హం. అన్ని భాషలకూ అరవమే తల్లి అనే అపోహ తమిళ పండితుల అశాస్త్రీయ దుందగీడుతనమే! తెలుగులోనూ అనేక మూలద్రావిడ

రూపాలు పదిలంగా ఉన్నాయి. కొమర్రాజువారు ఒకే పదం తెలుగు, తమిళ కన్నడ భాషల్లో ఏ విధంగా ఉన్నదో కొన్ని ఉదాహరణలిచ్చారు. ఈ పదాలన్నీ తెలుగులో సంయుక్తాక్షరాలుగా ఉంటే తమిళంలో అవి విడిపోయి కనిపిస్తాయి. ఉదాహరణకు మ్రాను, తమిళంలో మఱమ్, కన్నడంలో మర ఇలా కనిపిస్తుంది మ్రానులోంచి మఱమ్ ఏర్పడే అవకాశం ఉంది గానీ మఱం లోంచి మ్రాను ఏర్పడేందుకు వీలవదని వివరిస్తూ లక్ష్మణరావుగారు ''సంయుక్తాక్షరములు గల శబ్దములు మొదటివిగా నుండుననియు, తరువాత నందుండి వికృతి శబ్దములు పుట్టునప్పుడు ఉచ్చారణ సౌకర్యార్థమై సంయుక్తాక్షరములు విడదీయబడుననియు నందరకు తెలిసిన విషయమే!" అని వ్రాశారు. తెలుగు 'మ్రాను' లోంచి తమిళ 'మఱమ్' ఏర్పడిందని రూఢీ అవుతోంది. వ్రేలు-విరల్‌బీ ప్రొద్దు-పొదుదుబీ వ్రత్తు-ఉరత్తుబీ త్రిప్పు-తిరుప్పుబీ ప్రత్తి-పరుత్తిబీ క్రుంగు-కురుంగు ఇలా మూలద్రావిడ (ప్రోటో ద్రవిడియన్) రూపాలు పదిలంగా ఉన్నవి తమిళానికన్నా ఎక్కువగా తెలుగులోనే అని లింగ్విస్టిక్ సర్వే వారి నివేదిక చాటి చెప్తోంది. దీన్ని నిశితంగా పరిశీలిస్తే, తెలుగే తమిళానికన్నా ప్రాచీనమని అర్థం అవుతుంది. కానీ ద్రావిడభాషా ప్రవాహంలో విడివిడిగా ప్రవహిస్తున్న రెండుపాయలు నేనే ముందు అని వాదులాటకు దిగటం సరికాదు.

'ఱ' (శకటరేఫ) అనేది ద్రావిడ భాష స్వంత వర్ణం. ఏదైనా ఒక పదం ఒకభాషలో శకటరేఫతోనూ వేరొకభాషలో మామూలు 'ర'కారం (రేఫ)తోనూ ఉంటే, శకటరేఫతో ఉన్నపదమే ప్రాచీనం అని భావించాలన్నారు లక్ష్మణరావు గారు. ఎఱుపు అనేది శకట రేఫతో ఉన్న తెలుగుపదం. త్రమిళంలో ఎరువై అని రేఫతో మాత్రమే వ్రాస్తారు. శకటరేఫతో ఉన్న తెలుగుపదమే మూలద్రావిడబాషకు దగ్గరగా ఉన్నదని దీన్నిబట్టి భావించాలి. ఇలాపరిశీలిస్తే తెలుగే మూలద్రావిడభాషతో అత్యంత దగ్గరగా ఉన్నభాష అని అర్థం అవుతుంది. రేఫతో ప్రారంభమయ్యే కొన్ని పదాలను తమిళులు ఉచ్చరించలేక ఆ పదాలకు ముందు ఏదో ఒక అచ్చును చేర్చి పలుకుతారు. 'రామ' అనేపదాన్ని ఇరామన్ అంటారు ఇలోకం, ఉలోహం లాంటివి ఇలా తమిళంలో మారిపోయి కనిపిస్తాయి. ఇలా మారటం ద్రావిడ సంప్రదాయం కాదు. రేఫ, శకటరేఫలను పలకలేకపోవటం ద్రావిడులకు ఉండదు. ఈ మార్పులు కూడా తమిళంలో గత 7-8 వందల యేళ్లనుండి వచ్చినవిగా లక్ష్మణరావుగారు భావించారు. మనం నాలుక లేదా నాల్క అంటాం. శాసనాధారాలను బట్టి కరికాల చోళుడి కాలంలో "నాల్‌కు" అనటం ఉంది ఇప్పుడు వాళ్లు 'నాక్కు' అంటున్నారు. మూలద్రావిడ భాషకు బాగా దూరంగా జరిగింది తమిళమే కదా! ఇతర ద్రావిడ భాషల్లో లోపించిన కొన్ని వ్యాకరణ రూపాలు తెలుగులో సజీవంగా ఉన్నాయి. పోదుము (ఉత్తమపురుష బహువచనం) తెలుగులో పూర్వ ద్రావిడ రూపంగా మారకుండా ఉంది. తమిళంలో ఇది లేదు. కానీ, పురాతన తమిళ గ్రంథాల్లో పోదుమ్ అనేది ఉంది'' అని వివరించారాయన.

2500 యేళ్ల క్రితం తెలుగు తమిళం భాషలు మూలద్రావిడ భాషలోంచి చీలాయనుకుంటే, అది రెండుపాయలుగా చీలటమే కాని ఒకదానిలోంచి ఒకటి పుట్టటం కాదు. ఇప్పుడు వాడుకలో ఉన్న తెలుగు తమిళాలు ఎట్టిపరిస్థితుల్లోనూ ఒకదానిలోంచి ఒకటి చీలినవి కావన్నారాయన. మూలద్రావిడ భాష కచ్చితంగా ఎలా ఉండేదో మనకు తెలీదు. వివిధ ద్రావిడ భాషాపదాలను పరిశీలించి వాటిలో ప్రాచీనమైనవిగా కనిపించిన వాటిని పూర్వ ద్రావిడభాషా రూపంగా పునర్నిర్మించే ప్రయత్నాలు ఈ వందేళ్ళకాలంలో బాగా జరిగాయి. పూర్వ ద్రావిడ భాషారూపాల మాదిరే, పూర్వ తెలుగు రూపాలను కూడా పునర్నిర్మించారు. తెలుగు ఎటిమాలజీ పేరుతో ఈ నిఘంటువు అందుబాటులో ఉన్నది కూడా! ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తిగారు ద్రావిడ బాషాకుటుంబాన్ని నాలుగు కొమ్మలు కలిగిన వృక్షంగా భావించారు. ఉత్తర ద్రావిడ భాషల్లో బ్రాహుయి, మధ్య ద్రావిడ భాషల్లో గదబ, కొలామీ లాంటి భాషలు, దక్షిణమధ్య ద్రావిడభాషల్లో తెలుగు, గోండి, కువి, కోయి వగైరా భాషలు, దక్షిణ ద్రావిడ భాషల్లో తమిళం మళయాళం, కన్నడం, తుళు వగైరా భాషలున్నాయి. తెలుగు తమిళాలు వేర్వేరు కొమ్మలకు ఉపశాఖలు. ఒక ఉపశాఖ మొత్తం చెట్టంతా నేనే అనలేదు కదా!

లక్ష్మణరావుగారు ద్రావిడ భాషను ఒక ప్రవాహంగా భావించి ఒక పాయ ఇంకోపాయ ఏర్పడటానికి కారణం నేనే అనటాన్నితీవ్రంగా ఖండించారు. భాషాశాస్త్రం శైశవదశలో ఉన్నకాలంలో తమిళంలోంచే తెలుగు

పుట్టిందని తమిళ ఆచార్యులు చేసిన వాదనకు ఖండనగా ఆయన వ్రాసిన వ్యాసం ఇది. “తెనుగు అఱవమునుండి పుట్టినదా? కానేకాదు, కానేకాదు, కానే కాదు...” అనిమూడుసార్లు నొక్కివక్కాణించటంలో ఆయన హృదయార్తి అర్థం అవుతుంది. శ్రీ కొమర్రాజు లక్ష్మణరావుగారు తెలుగు భాషకు చేసిన సేవలు అనన్యసామాన్యమైనవి. తెలుగు నాట వివిధ కాలాలకు సంబంధించిన శాసనాలను పరిశోధించి పరిష్కరించే బాధ్యతను తొలుతగా చేపట్టింది ఆయనే! విజ్ఞాన చంద్రికా మండలి ద్వారా ప్రకృతి, భౌతిక శాస్రాల్ని తెలుగులోకి తీసుకువచ్చి శాస్త్రగ్రంథాలకు తెలుగు ఎంతో అనువైన భాష అని చాటింది కూడా శ్రీ లక్ష్మణరావుగారే! ఆంధ్ర విజ్ఞాన సర్వస్వాలను ఎన్ సైక్లోపీడియా బ్రిటానికా పద్ధతిలో తెలుగులో వెలువరించిన ఘనత కూడా ఆయనదే! హైదరాబాద్ శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం స్థాపానకు కారకులు, ప్రేరకులు, సాధకులు వారే! కృష్ణదేవరాయలు ఇలా ఉంటాడంటూ ఒక ఊహాచిత్రాన్ని కల్పించింది కూడా శ్రీ లక్ష్మణరావుగారే! ఈ యుగానికి రాయలవారి ఘనత ఇంతగా తెలుగువారికి పరిచయం అయ్యిందంటే అందుకు కొమర్రాజువారి కృషే కారణం.

నందిగామ తాలూకా పెనుగంచిప్రోలులో 1877 మేనెల 18న జన్మించిన శ్రీ లక్ష్మణరావుగారు 1923 జూలై 12 న, 46 యేళ్ళ వయసులోనే మరణించారు. కందుకూరి వీరేశలింగంగారు మరణించిన ఇంటిలో, అదే గదిలో లక్ష్మణరావుగారు కూడా మరణించారు. కొమర్రాజుగారు ఒక వ్యక్తి కాదు ఒక మహాశక్తి, ఉద్యమస్ఫూర్తిగా, తెలుగు దీప్తిగా తెలుగు జాతిని జాగృతపరచిన గొప్ప విజ్ఞానవేత్త. జీవించింది బహు కొద్దికాలమైనా, అనేకమంది వ్యక్తులు కలిసి జీవితకాలం అంతా పనిచేసినా సరిపడనంత కృషిచేశారు. అందుకే తెలుగు భాషోద్యమానికి ఆయన్ని జనకుడిగా సంభావిస్తున్నాను. పితృదేవోభవ అని నమస్కరిస్తున్నాను.



మండలి బుద్ధప్రసాద్
పూర్వ శాసనమండలి అధ్యక్షులు
ఫోన్ : 9059480872

---

“... ***మిసిమి*** జూలై 2023 మాస సత్రికలో.. ‘ఈ విశిష్టుడు దర్శక వరిష్ఠుడు’.. శీర్షికతో డాక్టర్ వోలేటి పార్వతీశం గారు వ్రాసిన వ్యాసాన్ని చదివాను. ఆ రచనలో ఒక దోషం ఉంది. అది శ్రీక్రిష్ణపాండవీయం చలనచిత్రం 1962వ సంవత్సరంలో విడుదల అయిందనేదే. శ్రీక్రిష్ణపాండవీయం 1966వ సంవత్సరం జనవరి 13వ తేదీ నాడు వచ్చింది. ఎన్.టి. రామారావుగారు నటనలో, చలనచిత్ర రచనలో గొప్ప ప్రతిభ కలిగినవారు, సందేహం లేదు. అంతటి అఖండుడు కూడాను శ్రీక్రిష్ణపాండవీయంలో ఒక తప్పిదానికి తావు ఇచ్చారు. బమ్మెర పోతనగారు అనన్య సామాన్యంగా వ్రాసినటువంటి భాగవతంలోని పద్యాలను ఎన్.టి. రామారావు గారు తన సినిమాలో ఉపయోగించుకొని, బమ్మెర పోతన గారికి టైటిల్ కార్డులలో ఖ్యాతిని (క్రెడిట్‌ను) ఇస్తూ కృతజ్ఞతను తెలియజేయకపోవడమే ఆ తప్పిదం. ఈ చిత్రం రూపకల్పనలో సహకార దర్శకులుగా శ్రమించినటువంటి బి.హెచ్. విజయరావు గాని, రమేష్ గాని ఈ సంగతిని ఎన్.టి. రామారావుకు తెలియజేయలేదా అని అనిపించింది. నిజమే, ఈ చిత్రాన్ని దృశ్య కావ్యం అనాల్సిందే. దీనికి పనిచేసిన వారంతా ఉద్దండులు. వారిచేత తనకు మాత్రమే సాధ్యం అయ్యే విధంగా పని చేయించుకొన్నారు ఎన్.టి. రామారావు గారు. ఈ సినిమా ఒక్క తెలుగు వారికే కాదు సినిమాను ప్రేమించే వారికి అందరికి ఒక ఖజానాయే. మరీ ముఖ్యంగా, ఈ చిత్రంలో రెండు నిమిషాలు పాటు సాగే బకాసురుడు–భీముడుల ద్వంద్వ యుద్ధం, అయిదున్నర నిమిషాలు పాటు సాగే జరాసంధుడు – భీముడుల మల్లయుద్ధం (పోరాటములు: సాంబశివరావు, స్వామినాథన్‌లు), కనియెన్ రుక్మిణి చంద్రమండల ముఖున్ పద్య సన్నివేశం (కూర్పు జి.డి. జోషి; సహాయకుడు శివమూర్తి) నన్ను అమితంగా ఆకట్టుకొన్నాయండి.

– దిలీప్, హైదరాబాద్.

చిత్రగీతాలు

# జావళీలు

– ఎమ్. పురుషోత్తమాచార్య

**నగుమోము జూపింవవా**

**చిత్రం : అమరశిల్పి జక్కన్న (1964)**
**రచన : దాశరథి**
**సంగీతం : సి.నారాయణరెడ్డి**
**గానం : పి.సుశీల,బృందం**
**నృత్యం : బి.సరోజాదేవి**



**మిశ్రశ్రీరంజని-ఏక**

*నగుమోము చూపించవా గోపాలా ॥నగు॥*
*మగువల మనసుల ఉడికింతువేల ॥నగు॥*

*1. ఎదుట వెన్నెలపంట*
*ఎదలో తియ్యని మంట*
*ఇక సైపలేను నీవే*
*నా ముద్దుల జంట ॥నగు॥*

*2. వగకాడవని నిన్నె*
*వలచివచ్చెను రాధ*
*మగనాలిపై ఇంత*
*బిగువు చూపెదవేల ॥నగు॥*

*3. కలువపువ్వుల శయ్య*
*పిలిచేను రావయ్య*
*నెలవంకలిడి నన్ను*
*అలరించవేమయ్య ॥నగు॥*

తల్లి వత్తిడికి తట్టుకోలేని నాయిక మహారాజు ఎదుట నాట్యం చేయడానికి అంగీకరించి తాను శ్రీకృష్ణుని ఉద్దేశించి పాడుకుంటున్నట్లుగానే భావించినా,అది మహారాజు సంపదలకు లొంగిపోయి నర్తిస్తున్నట్లుగానే నాయకుడు అపోహపడడానికి దారితీసిన నృత్యగీతమిది.

యతిప్రాసలను సలక్షణంగా అనుసరించినారు. తేటతెలుగు పదప్రయోగంతో భాషామాధుర్యాన్ని పంచిపెట్టింది ఈ గీతం. 'ఎదలో తీయని మంట, మగనాలిపై బిగువు' వంటివి సరసశృంగారకావ్య వస్తువులు. చివరి చరణంలో మరో అడుగు ముందుకు వేసి 'నెలవంకలిడి' అంటూ నఖక్షతాలను కూడా ప్రస్తావించాల్సి వచ్చింది. ఈ సామగ్రియే నాయకుడిని ప్రక్కదారి పట్టించింది. 'కలువపువ్వుల శయ్య పిలిచేను రావయ్య' పంక్తి నాయకుడిని మరీ పిచ్చివాడిని చేసింది.

ఈ పాటకు లలితసంగీతధోరణిని అనుసరించడం వలన శ్రీరంజని రాగాన్ని శుద్ధంగా కాక పంచమాన్ని కూడా కలిపి ఖరహరప్రియ,భాగేశ్వరి రాగాలతో మెరిపించారు. అయితే పోకడ అంతా శ్రీరంజని రాగాన్నే దృష్టిలో పెట్టుకున్నట్లు స్ఫురింపజేస్తున్నది.

ప్రారంభంలో ఒక ఆవర్తం (ఆది) మృదంగవిన్యాసం తరువాత రెండు ఆవర్తాలలో బృందగానంలో ఆలాపన షైషడ్జమం నుంచి వినిపిస్తుంది. తరువాత మూడు ఆవర్తాలలో మృదంగవిన్యాసం వినిపించారు. ఇంతవరకు ఆదితాళాన్ని అనుసరించారు. తరువాత తబల నడక మొదలయ్యాక ఏకతాళంలోకి మారింది. పల్లవిని దైవతం నుంచి సమంలో ప్రారంభించి మొదటి పాదాన్ని రెండుసార్లు పాడారు. వెంటనే రెండో పాదాన్ని పాడి పల్లవిని అందుకుని 'గోపాలా' దగ్గర వదిలారు. అప్పుడు బృందం అతీతపద్ధతిలో 'సనిదమగరి గమదనిసా నిదమగరిసా' అని స్వరాలను పాడాక సితార్ బిట్ వినిపిస్తుంది. వెంటనే మళ్ళీ బృందం 'మాగమా నీదనీ గారినిదసా' అంటూ స్వరాలను పాడారు. ఇదంతా శ్రీరంజనిరాగమే.

తరువాత నాలుగు ఆవర్తాలలో వాద్యాలు బిట్టును ఇవ్వగా,మొదటి చరణం 'ఎదుట'ను దైవతం నుండి అందుకున్నారు. 'ఎదుట' పదం పలకగానే తబల ముక్తాయింపు వినిపిస్తుంది. తరువాత మళ్ళీ చరణం అందుకుని రెండుసార్లు పాడారు. వెంటనే రెండు ఆవర్తాలలో బిట్వర్క్ వినిపించాక మళ్ళీ మొదటినుంచి పాడారు. చివరి పాదాన్ని సాకీలాగ లయరహితంగా పాడారు. తబల ముక్తాయిని ఇచ్చాక పల్లవిని ఎత్తుకున్నారు.

రెండో చరణం ముందు నాలుగు ఆవర్తాలలో బిట్టును మరోవిధంగా వినిపించాక దైవతం నుండి సమంలో 'వగకాడ' అని చరణాన్ని ప్రారంభించారు. 'రాధ' దగ్గర రెండు ఆవర్తాలలో వేణువుపై స్వరాలతో బిట్టును అందించాక మళ్ళీ 'వగకాడ' ఎత్తుకుని చరణం మొత్తం పాడారు. 'చూపెదవేల' దగ్గర ఒక ఆవర్తంలో సితార్

బిట్టును ఇచ్చారు. వెంటనే పల్లవిని అందుకున్నారు. 'గోపాలా' అంటూ షైషడ్జమం దగ్గర వదిలేశారు.

ఈ సమయంలో కథానాయకుని మనస్సులోని విషాదాన్ని ఉధృతంగా చూపేందుకు మూడవ చరణానికి ముందు వయొలిన్స్‌తో 'గరిస' అనే మరోరకమైన బాణీలో ఉద్వేగాన్ని ప్రదర్శిస్తూ బిట్టును నాలుగు ఆవర్తాలలో వినిపించాక కోరల్ వాయిస్‌తో ఆలాపనను కూడా నాలుగు ఆవర్తాలలో వినిపించి షైషడ్జమంలో వదిలారు. మూడవ చరణం 'కలువపువ్వుల శయ్య' ను మధ్యమం నుండి సమంలో ఎత్తుకున్నారు. ఇక్కడ సితార్,వేణువులతో ఒక ఆవర్తం బిట్టును ఇచ్చారు. 'అలరించవేమయ్య' దగ్గర ఒక ఆవర్తం సితార్ బిట్టును ఇచ్చాక పల్లవిని అందుకుని మొత్తం పాడారు.

**నినుజేర మనసాయెరా**



**చిత్రం : బొబ్బిలియుద్ధం (1964)**
**రచన : శ్రీశ్రీ**
**సంగీతం : ఎస్.రాజేశ్వరరావు**
**గానం : పి.సుశీల**
**నృత్యం : ఎల్.విజయలక్ష్మి**
**భైరవి-దేశాది**

*నినుజేర మనసాయెరా నా స్వామి*
*చనువార దయసేయరా ॥నిను॥*
*విడిదికి రమ్మని చాల వేడితిరా*
*బిడియము నీకేలరా దొరా ॥నిను॥*
*చ॥ సా గరిగసా గరిగ సనిదమపా*
*నిదమపా నిదమ పదనిస*
*మపమ పదప మనిద మపదనిరిసా*
*సరసుడవని నిన్నె పదిమంది పొగడ*
*మరిమరి కోర్కెలు విరిసెను ప్రియుడా మి॥*
*వయసు నీ కొరకె పలవరించెరా*
*తనువు నిన్ దలచి పులకరించెరా*
*మగువ కోర మొగమాటమేలరా*
*బిగువు మాని జవరాలినేలరా*
*సొగసు చూచి ఎదురుకాచి నిలిచి*
*పగల్ రేలు దిగుల్ జెందు చెలికి ॥నిను॥*

చిత్రంలో బుస్సీదొర (ముక్కామల) మందిరంలో దొర ప్రక్కన విజయరామరాజు (రాజనాల) హైదర్‌జంగ్ తదితరులు ఆసీనులై ఉన్నప్పుడు వారి వినోదార్థం నర్తకీమణి నర్తిసున్నట్లుగా ఈ పాటను చిత్రించారు. పల్లవి, అనుపల్లవి,చరణం కలిగిన కృతి ఆకృతిలో శ్రీశ్రీ వ్రాశారు. చరణంలో రెండు పంక్తులు తప్ప మిగతా పాటలో ప్రాసనియమాన్ని ముగ్ధమనోహరంగా ప్రదర్శించారు. చరణంతో పల్లవికి అనుసంధించే 'చెలికి...నిను జేర' అనే పంక్తులు భావబంధురంగా మెరిశాయి. విడిదికి రమ్మంటే బిడియపడే ప్రియునికి ధైర్యం చెబుతున్నది. మగువయే కోరుతుండగా సిగ్గుపడడం ఎందుకని అడుగుతున్నది. వయస్సు,తనువు,సొగసు, నిరీక్షణ అనేవి ప్రియుని ఆహ్వానించడానికి ఎలా కారణాలయ్యాయో చరణంలో దేశ్యపదప్రయోగాలతో చెప్పారు.

సంపూర్ణశాస్త్రీయసంగీతస్వరూపాన్ని ప్రకటించే ప్రముఖమైన భైరవి రాగాన్ని తీసుకుని మనోహరంగా సాలూరివారు బాణీ చేశారు. అయితే, ఈ పాటను దేశాది (ఆదితాళక్రియలను వేగవంతంగా చూపడం,అంటే వ్రేలికి ఒక అక్షరాన్నే లెక్కించడం) తాళంలోనే వేసుకుంటే సరిపోతుంది. మధ్యలయ కుదరదు. ఎందుకంటే, మధ్యలయను అనుసరిస్తే మిత్రంలోని 'పులకరించెరా' దగ్గర తబల విన్యాసం అర ఆవర్తానికే సరిపోతుంది. కనుక మధ్యలయను అనుసరించనక్కరలేదు.

ప్రారంభంలో నాలుగు ఆవర్తాలుగా మృదంగ విన్యాసం వినిపిస్తుంది. తరువాత వయొలిన్స్, వేణువు, వైబ్రో, క్లారియోనెట్ వాద్యాలతో షైషడ్జమం నుండి బిట్టును ప్రారంభించి 5 ఆవర్తాలలో వినిపించారు. ఆధారషడ్జమం దగ్గర వదిలేశారు. అక్కడినుంచే సమంలో పల్లవిని పాడడం ప్రారంభించారు. అలా పల్లవిని మూడుసార్లు పాడారు. రెండోసారి,మూడోసారి పాడుతున్నప్పుడు 'చేర' దగ్గర సంగతిని కొద్దిగా మార్చి పాడారు. అనుపల్లవికి ముందు వాద్యాలతో బిట్టును పంచమం నుండి ప్రారంభించి నాలుగు ఆవర్తాలలో సాగించి షైషడ్జమం దగ్గర వదిలేశారు. అప్పుడు 'విడిదికి' అనే పాదాన్ని చతుశ్రుతి దైవతం నుండి ఒక అక్షరం జాగా వదిలి ఎత్తుకున్నారు. అనుపల్లవిని రెండోసారి పాడుతున్నప్పుడు 'రమ్మని,వేడితిరా' పదాలను రాగముద్రతో సంగతిని మార్చి పాడారు. తరువాతి పాదాలలో 'నీకేలరా'ను రెండోసారి మరో సంగతితో అందంగా పాడి 'దొరా'ను అవరోహణ గమకసౌందర్యంతో

పాడి,పల్లవిని ఎత్తుకున్నారు. 'స్వామి' ని 'దనిసా' గా వదిలేశారు. మృదంగం,స్వరవాద్యాలు చెరొక ఆవర్తంగా వినిపిస్తూ నాలుగు ఆవర్తాలను అనుసరించాక స్వరాలాపన చేశారు. దాని తరువాత స్వరవాద్యాలు మూడు ఆవర్తాలలో బిట్టును ఇచ్చాక పంచమం దగ్గర వదిలేశాయి. అక్కడినుంచే 'సరసుడవని' ని ఒక అక్షరం జాగా వదిలి అనాగతంతో ఎత్తుకున్నారు. మొదటి పాదాన్నే రెండుసార్లు ఏ మార్పూ లేక పాడారు. తరువాత పాదాన్ని రెండోసారి పాడుతున్నప్పుడు 'కోర్కెలు' దగ్గర చంక్రమణగమకాన్ని అందంగా పలికించారు.

'వయసు నీ కొరకె' దగ్గరినుంచి మిశ్రం పద్ధతిలో వేగంతో ఎత్తుకున్నారు. 'పులకరించెరా' దగ్గర తబల,మృదంగం కలిసి ఒక ఆవర్తంలో విన్యాసాన్ని చూపాయి తరువాతి భాగాన్ని చకచకా పాడుతూ చివరి పాదాన్ని ముక్తాయి రీతిలో అందంగా పలుకుతూ చరణాన్ని ముగించారు. తరువాత పల్లవిని మొత్తం పాడాక ఆలాపనను పంచమంలో ముగించారు. అనుసరిస్తున్న తబల రెండు ఆవర్తాలలో ముక్తాయిని వినిపించి పాటనంతటిని ముగించింది.

**శివదీక్షాపరురాలనురా**

**చిత్రం : పూజాఫలం (1964)**
**రచన : ఘనం శీనయ్య**
**సంగీతం : ఎస్.రాజేశ్వరరావు**
**గానం : ఎస్.జానకి**
**నృత్యం : ఎల్.విజయలక్ష్మి**




**కురంజి-ఏక**

*శివదీక్షాపరురాలనురా నే ॥శివ॥*
*శీలమింతైనా విడువజాలనురా నే ॥శివ॥*
*శివశివ గురునాజ్ఞ మీరనురా*
*శ్రీవైష్ణవుడంటె చేరనురా నే ॥శివ॥*
*చ॥ వడిగ వచ్చి మతము చొరవకురా*
*శివార్చనవేళ తలుపు తెరవకురా నా*
*మడుగుకావి చెఱగు తీయకురా*
*మాటిమాటికి నోరుమూయకురా నే ॥శివ॥*

చిత్రంలో కథానాయకుడు విసిగిపోయి ఇంటినుండి వెడలి దేశసంచారం చేస్తూ సంగీతనృత్యాలతో కాలక్షేపం చేసే సందర్భంలో ఒక బోగంమేళంవారితో పరిచయమవుతుంది. అందులోని ప్రధాననర్తకి కథానాయకుడైన జమీందారును ఆకర్షించడానికి ఎన్నో హొయలుపోతూ వగలొలికిస్తూ చేస్తున్న నృత్యగీతమిది. ఆ పాత్రలో ఎల్.విజయలక్ష్మి తన నృత్యకళాప్రతిభను సర్వస్వాన్ని ఈ పాటలో రంగరించి అభినయించారు. అతిశయోక్తి చెప్పుకోవాల్సివస్తే ఈ పాటలోని ప్రతి అక్షరాన్ని వివిధభంగిమలతో సహజసుందరంగా నర్తించారని చెప్పవచ్చు. అక్కినేని నాగేశ్వరరావు కథానాయకులుగా అభినయించారు.

ఇది ప్రాచీనరచన. భక్తి,శృంగారం రెండూ సమపాళ్ళలో కలిసిన ఇతివృత్తం దీనిలో కనిపిస్తుంది. శివుని తప్ప ఇతరదైవాలను స్వీకరించని వీరశైవం ప్రస్తావించబడింది. శివదీక్షాదక్షురాలైన వనిత తాను శీలాన్ని కోల్పోకుండా స్వచ్ఛంగా ఉన్నానని ప్రియునితో మొఱపెట్టుకుంటున్నది. శివార్చనాపరులను తప్ప శ్రీవైష్ణవులను అసలే చేరబోనని తన ప్రతిజ్ఞను చెప్పి నమ్మించ ప్రయత్నిస్తున్నది. గురుని ఆజ్ఞ ప్రకారం ఎంతమంది శైవులైనా ఫరవాలేదు కాని శ్రీవైష్ణవుడిని ఒక్కరిని కూడా దరికి రానీయనని ప్రమాణం చేస్తున్నది. ఇలా అంటూనే వచ్చిన వీరశైవప్రియుని పట్ల తన వగలను గ్రుమ్మరిస్తున్నది. ఆ ప్రియుడెవరో కాదు,మన్నారు రంగనాథుడట. ఎంత విచిత్రమో గమనించండి. అంతేకాదు,తానెంత పవిత్రురాలో జమీందారుకు చెప్పకనే చెప్పి బుట్టలో వేసుకునే ప్రయత్నం చేసింది.

'పంచాక్షరీ, అజ్జ జూచి,మోము మోము బట్టి' అనే ఇంకో మూడు చరణాలు కూడా దీని మూలరచనలో ఉన్నాయి. వాటిలో కావలసినంత శృంగారం లభిస్తుంది. కనుకనే వాటిని వదిలి మొదటి చరణమే తీసుకున్నారు. 'శీలమింతైనా విడువజాలను....రా' అని పాడుతున్నప్పుడు నర్తకి చూపిన భంగిమలో ఒక కాలెత్తి ప్రక్కకు వాల్చే కిలికించితం సరదాగా ఉన్నా నవ్వుకునేట్లు చేసింది. రచన,సంగీతం రెండూ ఘనం శీనయ్యగారివే.ఆ బాణీని ఒద్దికగా చేసి వాద్యసంగతిని సమకూర్చడమే సాలూరివారి ప్రతిభను చక్కగా ప్రకటిస్తున్నది. పాడే తీరులో ఎన్నెన్ని సొగసులు క్రుమ్మరించాలో అన్నీ సాఫల్యరీతిలో జానకమ్మగారు తన మధురకంఠంతో పలికించి, ఒలికించారు. కాగా నర్తకీమణిలోని ప్రతిభను ఈ పాటతో

బైటికి తెచ్చినవారు నృత్యాచార్యులు వెంపటి చినసత్యంగారు. ఇంతమంది కృషితో ఈ పాట అజరామరంగా నిలిచిపోయింది. మధ్యమశ్రుతి రాగమైన కురంజి ఈ పాటలో ఎన్నో ఒంపుసొంపుల్ని ప్రదర్శించింది. ఆదితాళపు అక్షరకాలాన్ని ఎందుకోగాని సాక్షికంగానే నిర్వహించారు. ఇది మధ్యాదిలో రూపొందించబడింది. కనుక సినిమా కోసం దేశాదిలో వేయాలనుకోవడం మర్యాద కాదు. ప్రారంభంలో నాలుగు ఆవర్తాలలో మృదంగవిన్యాసం మొదలుకాగా చివరి ఆవర్తం కాగానే 8 వ అక్షరం మీదుగా అతీతపద్ధతిలో రాగాలాపనను ప్రారంభించి ఒకటిన్నర ఆవర్తాలలో ముగించారు. మిగిలిన అర ఆవర్తంలో వేణువు,వైబ్రోలతో బిట్ ఇచ్చాక రెండవ అక్షరం నుండి పల్లవిని షడ్జమం మీద అందుకున్నారు. రెండోసారి పాడుతున్నప్పుడు పల్లవిని వేరువేరు సంగతులతో ఆలపించారు. రెండో పాదాన్ని పాడిన మూడుసార్లలోనూ 'విడువజాలను' దగ్గర మూడు రకాల సంగతులను మనోహరంగా వినిపించారు. తరువాత పల్లవిని పాడేప్పుడు సంగీతప్రాధాన్యరచన కాబట్టి 'పరూరాలను' గా పాడడం అనివార్యం. మరో సరిక్రొత్త సంగతిలో దీన్ని వినిపించారు.

అనుపల్లవికి ముందు వయొలిన్స్, వీణ, వేణువు, క్లారియొనెట్, వైబ్రోలతో నాలుగున్నర ఆవర్తాలతో బిట్టునిచ్చారు కనుక ఆదితాళం దెబ్బతిని ఏకతాళంలోకి మారింది. పంచమం దగ్గర బిట్టు ముగిశాక షడ్జమం నుండి అనుపల్లవి 'శివశివ'ను ప్రారంభించారు. రెండోసారి పాడేప్పుడు 'గురునాజ్ఞ' దగ్గర సంగతిని మార్చి పాడారు. 'మీరను' దగ్గర చిన్న బిట్టు వైబ్రోతో అందించారు. 'శ్రీవైష్ణవుడంటే' పాదాన్ని పాడాక ఒక ఆవర్తంలో వేణువు దాన్నే రిపీట్ చేసింది. మళ్ళీ అదే పాదాన్ని మరో సంగతితో పాడారు. ఈసారి 'శివదీ' దగ్గర కట్ చేసి 'క్షాపరు' గా పాడాల్సివచ్చింది. తరువాత మరో వైవిధ్యమున్న సంగీతస్వర సంపుటితో మూడు ఆవర్తాలలో బిట్‌వర్క్ ఇచ్చి పంచమం దగ్గర వదిలేశాక చరణం షడ్జమం నుంచి 'వడిగ వచ్చి' అంటూ మొదలైంది. మొదటిపాదాన్నే రెండు రకాలైన సంగతులతో పాడారు. తరువాతి పాదాన్ని రెండోసారి పాడేప్పుడు 'వేళ' దగ్గరే ఆపి మూడో పాదాన్ని అందుకోవడంలో గడుసుదనం కనిపిస్తున్నది. ఈ మూడు పాదాలను పాడుతున్నప్పుడు నర్తకీమణి మూసిన తలుపులు తెరుస్తున్నట్లు, వచ్చిన ప్రియుని జూచి సిగ్గుపడుతున్నట్లు, రావద్దని వారిస్తున్నట్లుగా చక్కని భావాభినయాన్ని ప్రదర్శించారు. 'మడుగు కావి' పాదాన్ని రెండు సార్లు చిన్న మార్పులతో పాడారు. చివరి పాదాన్ని రెండోసారి పాడుతున్నప్పుడు చివరిలోని 'రా' ను 'సరిగమగరిసరిగా' అనే విలక్షణమైన బాణీలో అందంగా పలికించారు.

తరువాత నృత్యాచార్యులు నోటితో జతులను (కొనగోలు) రెండున్నర ఆవర్తాలలో పలికారు. మిగతా అర ఆవర్తం నుండి గాయని త్రిశ్రగతిలో కొనగోలును ఒక ఆవర్తంలో పొడిగా చెప్పగా అర ఆవర్తం నుండి వాద్యసంగీతం ప్రారంభమై నాలుగున్నర ఆవర్తాలలో త్రిశ్రగతితోనే కొనసాగింది. చివరి ఆవర్తంలో క్లిష్టమైన ఆదితాళపు ముక్తాయిని వాద్యాలు వినిపించాయి. మళ్ళీ పల్లవిని అందుకుని పాడగా వాద్యాలు పాటతోపాటు ముక్తాయింపుతో ముగిశాయి. పాటలోని ప్రతిపాదం రెండవ అక్షరం నుంచి పాడడం ఒక గొప్ప విశేషం.

డా. ఎమ్. పురుషోత్తమాచార్య
నల్లగొండ. ఫోన్: 939 661 1905.

దైవ యోగము

ప్రతి హఠాద్ఘటనాపయోవహము వెనుక
నొకయమోఘసంకల్ప మేదో తటిత్తు
కరణిఁదోఁచుట దైవయోగమ్ము గాదె
యనుచు నమృతాలతేట బ్రహ్మర్షిమాట.

ఆకాశము

'ఇచటనే యున్న దనుకొన్న దెచటనైన
నలరుచుంట యఖండసత్యమ్ముగాదె;
అట నిటనుగూడ చాందినీ యగును గాదె
మనకు నాకాశ మనుచు బ్రహ్మర్షిమాట.

- బ్రహ్మర్షి శ్రీ వేంకటరత్న సూక్తులు

# స్వేచ్ఛ

– ఓల్గా

మూడు దశాబ్దాల క్రితం 'చతుర' నిర్వహించిన పోటీలో అత్యుత్త మంగా ఎంపికయింది 'స్వేచ్ఛ' నవల. 1987 ఫిబ్రవరిలో తొలిసారి ప్రచురితమైన ఈ నవల వస్తువిస్తృతి చాలా ఎక్కువ. తరతరాల ఆచార వ్యవహారాల వల్ల స్త్రీలు పడుతున్న హింసను గురజాడవారు ముందుగా గుర్తిస్తే, దానిని కదిపి, కుదిపిన వ్యక్తి గుడిపాటి వెంకటచలం. స్త్రీ తాలూకు అన్నిరకాల బాధల్ని, హింసల్ని ఓ ఉప్పెనగా మార్చా రాయన. చలంగారి వాక్యానికి జనం భయపడ్డారు, కదిలిపోయారు. తరతరాల ప్రభావం చలం. అనేక లక్షల జీవితాల కదలిక చలం. స్త్రీ స్వేచ్ఛా స్వాతంత్ర్యాల ప్రతినిధి చలం. స్త్రీ స్వేచ్ఛకి సంబంధించినదే ఓల్గాగారి 'స్వేచ్ఛ' నవల.



స్వేచ్ఛ, స్వతంత్రం రెండు భిన్నపదాలు. కొంత సారూప్యం ఉన్నా సామాజిక పరిమితుల దృష్ట్యా తేడా వున్న పదాలు. స్వతంత్రంలో కొన్ని పరిమితులున్నా స్వేచ్ఛ వుంది. స్వేచ్ఛ మితిమీరితే విచ్చలవిడి విశృంఖలత్వం అవుతుంది. తన నవలలో ఓల్గా ప్రతిపాదించిన స్వేచ్ఛ వీటి నుంచి వేరైంది. ఒకరకంగా సిద్ధాంతపరమైంది. జీవితంలో ఆడది పడుతున్న కష్టాన్ని, హింసని చలంగారు తనదైన తీక్షణ దృష్టితో చూసి, మనకి చూపించారు. ఆయన ఆ అద్భుత రచనల్లోంచి స్త్రీ జీవితానికి సంబంధించి రకరకాల సిద్ధాంతాలు ప్రచారంలోకి వచ్చాయి. జీవితంలోంచి వెలువడ్డ సిద్ధాంతాలు అవి. ఓల్గా 'స్వేచ్ఛ' రచనాపద్ధతి పై తీరుకి భిన్నం. 'స్వేచ్ఛ' పదానికి సిద్ధాంతీకరణ వివరణ ఇచ్చి అందులో ఒదిగేలా నవలారచన చేశారు. ఈ నవలకి ఓల్గా సవివర మైన ముందుమాట, 'నామాట' అని రాశారు. దాంతో కలిపి ఈ నవల చదవటానికి, అది లేకుండా చదవటానికి చాలా తేడా వుంది. స్వేచ్ఛ అంటే రచయిత్రి ఉద్దేశ మేంటి? అది లభించే విధానం ఏంటి? అనే వివరాలు 'నామాట'లో వున్నాయి. అది అర్థమైతేకానీ స్వేచ్ఛ నవలలోని అరుణ చేష్టలకి, భావాలకి సరైన రూపు పాఠకుల అవగాహనకి రాదు.

స్వేచ్ఛ నవల కేవలం కొద్దిమంది వ్యక్తులకో, కొన్ని పాత్రలకో పరిమితమైంది కాదు. ఓ ప్రత్యేక వస్తువు కేంద్రంగా సంఘంలో వ్యక్తి భరించాల్సిన తీరుని విశ్లేషిస్తూ, ప్రశ్నిస్తూ, సూచిస్తూ సాగిన రచన. అందుకే ఈ వివరణకి ఉపోద్ఘాతం అవసరం. స్వేచ్ఛ అన్న వస్తువే ఈ నవల సారం. నవలలో ఎక్కువ పాత్రలు లేవు. కథ ప్రధానంగా అరుణ, ప్రకాశం, ఉమల మీద నడుస్తుంది. అరుణ సాధారణ, దిగువ మధ్యతరగతి కుటుంబం లోని యువతి. ఆ పరిస్థితుల్లోని చాలామంది యువతుల్లా అరుణా సర్దుకుపోతే ఏ చింతా ఉండేది కాదు. కానీ అరుణ స్వభావం అదికాదు. ఇంట్లోవాళ్లు చెప్పినట్టే నడుచుకోవాలి, వాళ్ల ఇష్టాలకి అనుగుణంగానే బతకాలి, వాళ్ల అనుమతి లేనిదే ఏ చిన్న పనికీ స్వతంత్రం లేదు. తండ్రీ, తల్లీ, అన్నగారు, విధవ మేనత్త, కుటుంబంలో అందరిదీ అదే ధోరణి. చిత్రమేమిటంటే ఇది అరుణ ఒక్కదాని పరిస్థితే కాదు, ఆ కాలంలో అటువంటి కుటుంబాలలో అందరి ఆడపిల్లల పరిస్థితీ అంతే. ఇంట్లో చెప్పకుండా ఎక్కడికీ వెళ్లకూడదు. అన్న టైముకి ఏమాత్రం ఆలస్యం కాకుండా ఇంటికి తిరిగి వచ్చేయాలి. పెద్దల్ని ఎదిరించకూడదు. పద్ధతి ప్రకారమే కట్టుబొట్టు, వ్యవహారం ఉండాలి. ఏమాత్రం తేడా వచ్చిన ఇంట్లో గొడవ తప్పదు. వయసు వచ్చేవరకూ ఇలాంటి ఆంక్షలతో పెరగటం, ఆ తర్వాత పెళ్లి, అది అయిన తర్వాత భర్త అత్తింటి పెత్తనం, ఆ తర్వాత పిల్లల పెంపకం, వాళ్లు పెరిగి పెద్దయ్యాక పెద్ద వయసులో ఆ పిల్లలు చెప్పినట్టు వినటం... ఇదీ ఆడదాని జీవనవిధానం. ఇది తరతరాల సంప్రదాయం. దీన్ని ఎదిరించడం మాట అలా ఉంచి, ఇదేమిటి? అని ఆలోచించిన వాళ్లు, తమ గొంతు వినిపించినవాళ్లు అరుదు. పోనీ మగ, ఆడ అందరి జీవితం ఇలాగే ఉంటే అదో దారి. మగవాళ్ల జీవితం దీనికి పూర్తిగా భిన్నం. వాళ్లు చాలావాటికి చాలామందికి సమాధానం చెప్పాల్సిన పరిస్థితి లేదు.

'తనకి నచ్చినట్టు తనని ఎందుకు బతకనివ్వరు? మిగిలినవాళ్లకి ఉన్న స్వేచ్ఛ తనకెందుకు లేదు? తనకి నచ్చినట్టు సమాజపు రూపురేఖలు ఎందుకు లేవు?' ఇదీ అరుణ ఆవేదన. తన వేదనకి ఓ దారి కావాలి. అరుణ తన మనసుని నిర్భయంగా విప్పి చెప్పుకోగలిగిన స్నేహితురాలు ఉమ. ఆమె రాకకకోసం అరుణ ఎదురుచూస్తున్నట్లు స్వేచ్ఛ నవల ఆరంభమవు తుంది. అరుణ ఎం.ఎ. ఫైనలు పరీక్షలు రాసింది. ఉమ ఎమ్మెస్సీ పరీక్షలు అంతకు ముందు రోజే పూర్తయ్యాయి. ఉమ ఆరోజు తన ఊరికి వెళ్లిపోతోంది. వెళ్లేవరకూ అరుణతో కలిసి గడపడానికి వస్తోంది. ఆ ఇంట్లో వాళ్లిద్దరూ మన స్ఫూర్తిగా కబుర్లు చెప్పుకునే సావకాశం లేదు. అందుకే బయటికి వెళ్లారు. అలా వెళ్లటానికీ అరుణకి ఇంట్లోవాళ్ల నుండి అభ్యంతరం. అయినా తెగించి వెళ్లింది. యూనివర్శిటీ గార్డన్‌లో వాళ్లు ఎప్పుడూ కూచునేచోటే కూచున్నారు. వాళ్ల కబుర్లలో ఎక్కువ అరుణ గురించే. అరుణ గురించి ఉమకి అన్నీ తెలుసు. అయినా మళ్లీ అవే కబుర్లు. ప్రకాశం అరుణ స్నేహితుడు. అతనితో జీవితం పంచుకోవాలని నిర్ణయం తీసుకుంది. తమ పెళ్లి జరిగితే తనకీ అస్వతంత్రత పోయి, స్వేచ్ఛ లభిస్తుందని అరుణ నమ్మకం. అదే ఉమతో అంది. దానికి ఉమ నవ్వింది. 'ఎందుకు నవ్వుతున్నావు?' అంది అరుణ. 'అందరూ పెళ్లయితే స్వేచ్ఛ పోతుందని గోల పెడుతోంటే, నువ్వు స్వేచ్ఛ కోసం పెళ్లాడతానంటే నవ్వరాదా?' అంది ఉమ. స్వేచ్ఛ కోరుకోవటం వరకు బాగానే ఉంది. అది ఎటువంటి స్వేచ్ఛ? ఉత్తరోత్రా జీవితంలో అది లభిస్తుందా? అన్నవి పెద్ద ప్రశ్నలు.

పెళ్లయ్యాక అరుణ కుటుంబ ఆంక్షల పరిధి నుంచి భర్త ఆంక్షల పరిధిలోకి వెడుతుందని ఉమ అనుమానం. ఆ అనుమానం వ్యక్తీకరిస్తూ అరుణని పూర్తిగా నిరుత్సాహ పరచటం ఇష్టంలేక, 'ప్రకాశం మంచివాడు, నిన్నెంతో ప్రేమిస్తాడు. నీ జీవితం బావుంటుంది,' అని ఉత్సాహపరిచింది. ఉమకి పెళ్లి చేసుకోవాలని లేదు. తనకి సబ్జెక్ట్, రీసెర్చి మీద ఆసక్తి. పెళ్లి ఆ ఆసక్తికి అవరోధమని ఉమ ఉద్దేశం. అందుకే పెళ్లి చేసుకోకుండా స్వేచ్ఛగా జీవితం గడుపుతానని చెప్పింది. తనకి అయిదూ, పదీ డబ్బు కావాల్సి వచ్చినా ఇంట్లోవాళ్ల మీద ఎంతగా ఆధారపడల్సి వచ్చిందీ అరుణ మరిచిపోలేదు. పెళ్లయ్యాక, ప్రకాశాన్నైనా డబ్బు అడిగే అవస్థ రాకూడదని అరుణ పట్టుదల. అందుకే తనకి ఉద్యోగం దొరికేవరకూ పెళ్లి చేసుకోకూడదని నిర్ణయించుకుంది.

అరుణకి ఓ కాలేజీలో లెక్చరర్‌గా ఉద్యోగం వచ్చింది. ఆ ప్రైవేటు కాలేజీకి ఎయిడ్ వచ్చేవరకూ అయిదొందలే జీతం. అయినా చేరింది. ఉద్యోగం దొరికాక పెళ్లికి ఒప్పుకుంది. ప్రకాశం, అరుణ రిజిస్టర్ మ్యారేజ్ చేసుకున్నారు. వేరే కాపురం పెట్టుకున్నారు. 'నిజంగా నేను చాలా సంతోషంగా ఉన్నాను. జీవితంలో ఇంతకంటే కావల్సిందేమీ లేదనిపిస్తోంది. నేను ధైర్యం చేసినందుకు నాకు సంతోషంగా వుంది. నన్ను ఆ ఇంట్లోంచి తప్పించిన ప్రకాశమంటే ప్రేమతో, కృతజ్ఞతతో మనసు నిండి పోతోంది. ప్రకాశం లేకపోతే నా జీవితం ఎలా ఉండేదో? ఊహించుకుంటే చాలా భయంగా ఉంది. నేను ప్రకాశం కలిసి ప్రతి అనుభూతినీ వంచుకుంటున్నాం. ఆనందిస్తున్నాం,' అని పెళ్లయిన నెలరోజులకి ఉమకి ఉత్తరం రాసింది అరుణ.

ఢిల్లీలో రీసెర్చ్‌కి సీటు వచ్చిన ఉమ, వెళ్లే ముందు అరుణని చూడటానికి హైదరాబాద్ వచ్చింది. అప్పటికి అరుణ గర్భవతి. రెండో నెల. ప్రకాశానికి అరుణకి మధ్య మొదటి బేదాభిప్రాయం ఆ విషయంలోనే వచ్చింది. అప్పుడే పిల్లలు అరుణకి ఇష్టంలేదు. ప్రకాశానికి కావాలి. ప్రకాశం మాటే నెగ్గింది. అరుణ పాపకి తల్లయ్యింది. అరుణ అత్తగారు కమలమ్మగారు వచ్చి పాపను చూసుకోవటంలో సాయంగా ఉంది. అరుణ యధాప్రకారం ఉద్యోగానికి వెడుతోంది. ప్రకాశానికి, అరుణకి మధ్య రెండోసారి భేదాభిప్రాయం అరుణ కాలేజీ లెక్చరర్స్ యూనియన్ విషయంలో వచ్చింది. అతనికి నచ్చచెప్పి, కొన్నిసార్లు అతని ఇష్టానికి వ్యతిరేకంగానూ యూనియన్ కార్యక్రమాల్లో పాల్గొంది అరుణ. ఆ విషయంగా ఇద్దరి మధ్య ఘర్షణ తలెత్తింది. గొడవపడ్డం, సమాధానపడటం, తిరిగి గొడవపడ్డం... ఇలా అది ఓ సమస్య అయి కూర్చుంది.

తన కాలేజీ యూనియన్ మెంబర్ కేశవరావు. తమందరూ కలిసి సమాజ హితం కోసం 'వెలుగు' పత్రిక తెద్దామనుకుంటున్నామని, దానికి నెలకి వంద రూపాయల ధనసహాయం కావాలంటే అరుణ ఇచ్చింది. అది ప్రకాశానికి నచ్చ లేదు. ఆ తర్వాత ఆ పత్రిక పనులకు, ఇంటర్వ్యూలు చెయ్యటానికి, సర్వే చెయ్య టానికి అరుణ వెళ్లటాన్ని తీవ్రంగా వ్యతిరేకించాడు. ఆ అనవసర గొడవల వల్ల తమ సంసార జీవితంలోను, ఆర్థిక స్థిరత్వంలోనూ లోటు ఏర్పడుతుందని, దానివల్ల తమ జీవన ఆనందానికి లోటు అని ప్రకాశం వాదన. పత్రిక పని, చుట్టూ ఉన్న... ముఖ్యంగా బాధల్లో ఉన్న తోటి స్త్రీలతో కలిసి గడపటంలో తనకి ఎంతో తృప్తి

ఉందని అరుణ దృఢాభిప్రాయం. ఇలా వాళ్ల సంసార జీవితం మూడేళ్లు సాగింది. అరుణ తను చేస్తున్న పని మానలేదు. పత్రికకి మెటీరియల్ సంపాదించే పనిమీద రెడ్‌లైట్ ఏరియా మెహందీకి వెడుతుంటే, ప్రకాశం గట్టిగా ఆపాడు. ఇప్పుడు మెహందీకి వెళ్లినా, పత్రిక పనులు మానకపోయినా... అరుణకి, ఆ ఇంటికి సంబంధం ఉండదని తెగేసి చెప్పాడు. అయినా అరుణ వెళ్లింది. అక్కడి వ్యభిచారుల దీనావస్థకి కదిలిపోయిందామె. తను చేస్తున్న పనిలో తప్పు ఉందని పించలేదు. కానీ పైకి ఆదర్శాలు చెబుతూ, 'వెలుగు'లాంటి మంచి పత్రిక నడుపు తున్న కేశవ రావు, సుబ్బారావులాంటి వాళ్లు కూడా కఠిన వాస్తవం ఎదురైతే భీరువులే నని, అంతరాంతరాల్లో స్త్రీ స్వేచ్ఛపట్ల అవగాహన లేనివారేనని అర్థమైన అరుణకి ఒక్కసారిగా సర్వం తల్లకిందులై నట్లయింది. తనని, తన వ్యక్తిత్వాన్ని విశ్లేషించు కున్నాక ఏంచెయ్యాలో నిర్ణయించుకుంది. వెంటనే ఢిల్లీలో ఉన్న ఉమ దగ్గరికి ప్రయాణం పెట్టుకుంది. తన నుంచి విడిపోయి వెళ్లిపోతున్న అరుణకి పాపని ఇవ్వనన్నాడు ప్రకాశం. కాలేజీకి సెలవు పెట్టి బరువెక్కిన మనసుతో ఢిల్లీ చేరింది అరుణ.

ఉమ, అరుణ పరస్పరం మాట్లాడుకున్నారు. అరుణ తను చెప్పగలిగిందంతా చెప్పింది. అలా చెబుతూ, 'నాకు ప్రకాశం మీద ప్రేమ లేదు ఉమా! ప్రకాశాన్ని పెళ్లి చేసుకునే నాటికి అతన్ని గురించి నాకు తెలియదు. ప్రకాశం నన్ను ప్రేమించాడన్న విషయాన్ని ప్రేమించాను. అతను జీవితం గురించి ఏం ఆలోచిస్తున్నాడు? వేటికి విలువనిస్తాడు? ఇవేమీ నాకు తెలియదు. నా గురించి నాకే తెలియదు. క్రమంగా నాకు జీవితంలో ఏం కావాలో? ఏముంటే నేను తృప్తిగా బతుకుతానో? అర్థమైంది. ప్రకాశానికీ నాకూ మధ్య భావాల్లో పెద్ద అగాథముందని తెలిశాక, ఇంకా నేను ప్రకాశాన్ని ప్రేమించానని నమ్మగలననంటావా? ఇంట్లో వాళ్లు నన్ను కట్టడి చేస్తున్నారన్న కోపం తప్ప మరో ఆలోచన లేదు. స్వేచ్ఛ అంటే అప్పుడు నా దృష్టిలో నాకిష్టమైన చీర కట్టుకోవడం, సినిమాలకు, స్నేహితులతో షికార్లకూ వెళ్లడం, ఎవరి ఆజ్ఞలకీ లోబడకుండా ఉడడం. కానీ ఇప్పుడు స్వేచ్ఛ అంటే ఏంటో? ఎందుకో? దాని విలువేంటో? తెలిసింది,' అంది. ఉమకి ఈ విషయాలు తెలియనివి కావు. అందుకే ఆమె, సుధీర్ వేరే రకంగా బతుకుతున్నారు. పెళ్లి చేసుకోలేదు. ఎవరింట్లో వారుంటారు. కావాలన్నప్పుడు ఇద్దరూ కలుస్తారు. కానీ అరుణ దానికి అభ్యంతరం తెలిపింది. 'ఒకచోట కలిసి ఉంటే, ఒకరి స్వేచ్ఛకు ఒకరు అడ్డంగా వుంటామేమోనని విడివిడిగా ఉండటం పిరికితనం కదూ! ఒకరి మీద ఒకరికి అపనమ్మకం కదూ?' అనడిగింది అరుణ. దానికి ఉమ, 'నువ్వన్నట్టు ఒకరి స్వేచ్ఛను ఒకరు గౌరవించుకుంటూ, ఆదర్శంగా బతకటం... నిజంగా ఈ ఊహ చాలా అద్భుతంగా ఉంటుంది. కానీ జీవితంలో అది కుదరదు. జీవితం మన ఆదర్శాలు, ఆలోచనల ప్రకారం జరగదు,' అంది. పుట్టెడు దుఃఖంతో పాప లేకుండా ఢిల్లీ వచ్చిన అరుణ, ఉమ చెప్పిన ధైర్యంతో, ఇచ్చిన స్వాంతనతో తిరిగి హైదరాబాదు వెళ్లి, తన హక్కు అయిన పాపను తన దగ్గరకు తెచ్చుకుని, తనకి నచ్చినట్టే బతకాలన్న కొత్త తేజంతో ఆయత్తమవటంతో కథగా ఈ నవల ముగిసింది.

అసలు స్వేచ్ఛ అంటే ఏంటి? స్వేచ్ఛకు అర్థం ఏంటి? ఏది స్వేచ్ఛ గమ్యం? ఎలాంటిదీ స్వేచ నడక? ఈ జీవితం సరిపోతుందా వీటిని తెలుసుకోవటానికి? స్వేచ్ఛకు అర్థం తెలుసుకోవడమేనా జీవితం? జీవితం, స్వేచ్ఛ... ఈ రెండు వేర్వేరు విషయాలా? ఒకటి కాదా? ఈ ప్రశ్నలు అరుణకొక్కదానికే కాదు... అందరికీ సంబం ధించినవి. మారే తత్వమున్న సమాజంలో అన్ని విలువలూ మారుతుంటాయి. స్వేచ్ఛా దానికి మినహాయింపు కాదు. ఆడామగా సంసారం చేస్తూ ఓచోట కాపురం ఉండాలంటే స్వేచ్ఛే కాదు, సయోధ్య ఉండాలి. సంపూర్ణంగా పరిపూర్ణమైంది ఈ సృష్టిలో ఏదీ లేదేమో! సంపూర్ణ స్వేచ్ఛ అంతేనేమో! స్వేచ్ఛ ముగిసిపోయిన కథ కాదు. నిరంతరం ముందుకు కదిలేది.

ఓల్గా 'స్వేచ్ఛ' చదివిన వారికి స్త్రీలని మరింత బాగా అర్థం చేసుకోవటం, మరింత మెరుగ్గా వారితో మెలగటం తెలుస్తుంది. తరతరాల సంప్రదాయానికి ఎదురీదటం అంత సులవైన పనికాదు. అందులో ఆడామగా పరస్పరం అతి సున్నితంగా ఒకరినొకరు అర్థం చేసుకోవటం, దానికి తగినట్టు ప్రవర్తించటం ఇంకా ఇంకా కష్టం. అరుణకి తన అభిరుచుల ప్రకారం ఏ ఆటంకం లేని సుగమమైన జీవితం ఎలా కావాలో, అలాగే ప్రకాశానికీ తనకిష్టమైన జీవితం కావాలి. ఈ విషయాలన్నీ ఓ జమిలి, జటిల తత్వంగలవి. అర్థం చేసుకుని, ముందుకు సాగమని సూచిస్తుంది ఓల్గా 'స్వేచ్ఛ.'

రాజా రామమోహన రావు
(నవలాహృదయం)

# సూక్తి సురభి

– రెంటాల సాంబశివరావు

*అలసస్య కుతో విద్యా*
*అవిద్యస్య కుతో ధనమ్?*
*అధనస్య కుతో మిత్రం*
*అమిత్రస్య కుత స్సుఖమ్??*

అలసస్య- బద్ధకస్తునికి, విద్యా- జ్ఞానము, కుతః- ఎలా/ ఎక్కడ నుండి వస్తుంది గనుక? అవిద్యస్య- అలాంటి విద్య లేని వానికి, ధనం- సంపద, కుతః- ఎలా/ ఎక్కడ నుండి వస్తుంది గనుక? అధనస్య- పేదవానికి, మిత్రం- మేలు కోరే స్నేహితుడు, కుతః-ఎలా/ఎక్కడ నుండి వస్తాడు గనుక? అమిత్రస్య- అట్టి మిత్రుడే లేనివానికి, సుఖం- సుఖము, కుతః-ఎలా/ఎక్కడ నుండి వస్తుంది గనుక? ఎలాంటి ప్రయత్నం చేయని బద్ధకస్తునికి జ్ఞానం/విద్య ఒంటబట్టదు. అలాంటి విద్యయే లేని వానికి ధనం లభించదు. ఆవిధంగా ధనహీనునికి మిత్రులుండరు. అలా మిత్రులే లేనివానికి సుఖమే లేదు??

*చింతనీయా హి విపదా-*
*మాదా వేవ ప్రతిక్రియా?*
*న కూప ఖననం యుక్తం*
*ప్రదీప్తే వహ్నినా గృహే??*

విపదాం- ఆపదలకు, ఆదౌ ఏవ-ముందుగానే, ప్రతిక్రియా- విరుగుడు, చింతనీయా- ఆలోచించదగినది. హి-ఏమంటే, గృహే- ఇల్లు, వహ్నినా-అగ్నిచేత, ప్రదీప్తే- కాలుచుండగా, కూప ఖననం- నూతిని తవ్వడం, న యుక్తం-తగదు??

రాబోయే ఆపదలకు విరుగుడు ఏమి చేయాలో ముందుగానే ఆలోచించుకోవాలి. ఏమంటే ఇల్లు అంటుకున్నాక, నుయ్యి తవ్వడానికి ప్రయత్నం చేయరు కదా??

*పూర్వజన్మ కృతం పాపం*
*వ్యాధిరూపేణ బాధతే?*
*తచ్ఛాంతి రౌషధై ర్దానై-*
*ర్జపహోమార్చనాదిభిః??*

పూర్వజన్మ-గతజన్మలలో, కృతం-చేసిన, పాపం- పాపకార్యము, వ్యాధి-రోగముయొక్క, రూపేణ రూపముతో, బాధతే-బాధిస్తుంది? ఔషధైః-మందుల తోను, దానైః-దానములతోను, జప-జపాలతోను, హోమ-హోమాలతోను, అర్చనా ఆదిభిః-పూజాదికములు మొదలైన వాటి చేతను, తత్-ఆ వ్యాధికి, శాంతిః- ఉపశమనము(కలుగుతుంది)??

ప్రాణి గతజన్మలలో చేసిన పాపకార్యమే రోగముగా బాధిస్తుంది? మందులతోను, దానధర్మాలతోను, జపహోమాదులతోను, పూజాదికాలతోను ఆ వ్యాధికి ఉపశమనం కలుగుతుంది??

*ఆయుః కర్మ చ విత్తం చ*
*విద్యా నిధన మేవ చ?*
*పంచైతా న్యపి సృజ్యంతే*
*గర్భస్థస్యైవ దేహినః??*

ఆయుః-ఆయుర్దాయమును, కర్మ చ-చెయ్యవలసిన (ఉద్యోగాది)పనియును, విత్తం చ-(అనుభవించదగిన) సంపదయును, విద్యా-విద్యావైదుష్యమును, నిధనం ఏవ చ-మరణమును, ఏతాని పంచ అపి-ఈ ఐదును కూడా, దేహినః-ప్రాణికి, గర్భస్థస్య ఏవ-గర్భములో నుండగానే, సృజ్యంతే-సృష్టింపబడతాయి?

జీవులకు తల్లి గర్భంలో ఉండగానే ఈ ఐదూ నిర్ణయించబడతాయి- 1.ఆయుర్దాయము 2)ఉద్యోగాది పనియును 3) సంపదయును 4)విద్యయును 5) మరణమును అనునవి?

*ఆరోహతు గిరిశిఖరం*
*తరతు సముద్రం ప్రయాతు పాతాళమ్?*
*విధిలిఖితాక్షరఫాలం*
*ఫలతి కపాలం ఖలు న భూపాలః?*

భూపాలః-రాజు, గిరిశిఖరం-పర్వతశిఖరాన్ని, ఆరోహతు-ఎక్కునుగాక? సముద్రం-సముద్రాన్ని, తరతు- దాటవచ్చునుగాక? పాతాళం-పాతాళలోకానికి, ప్రయాతు-వెళ్ళవచ్చునుగాక? విధి-బ్రహ్మదేవునిచేత, లిఖిత-రాయబడిన, అక్షర-అక్షరాలు గల, ఫాలం- నొసటిభాగమే, ఫలతి-ఫలిస్తుంది? కపాలం ఖలు-పుర్రె ఐతే, న (ఫలతి)-ఫలించదుసుమా??

ఒకానొక మహారాజు పర్వతశిఖరాల నెక్కినా, సముద్రాన్ని దాటినా, పాతాళ లోకానికి వెళ్ళినా సరే బ్రహ్మ దేవుడు వాని నొసట వ్రాసిన రాతయే ఫలిస్తుంది గానీ వాని పుర్రె మాత్రము ఫలించదు.

*అతిథి ర్యస్య భగ్నాశో*
*గృహాత్ ప్రతివర్తతే?*
*స దత్వా దుష్కృతం తస్మై*
*పుణ్య మాదాయ గచ్ఛతి*

యస్య-ఎవ్వనియొక్క, గృహాత్-ఇంటినుండి, అతిథిః-అతిథి, భగ్న ఆశః-కోరిక తీరనివాడై, ప్రతినివర్తతే-మరలి వెళ్లి పోతాడో, సః-ఆ అతిథి, దుష్కృతం-తన పాపాన్ని, తస్మై-ఆ యజమానికి, దత్వా-ఇచ్చి, పుణ్యం-వాని పుణ్యాన్ని, ఆదాయ-గ్రహించి,
గచ్ఛతి-వెళ్ళిపోతాడు?

ఎవ్వరి ఇంటికైనా అతిథి వచ్చి నిరాశతో వెనుదిరిగి పోతే, అట్టి అతిథి ఆ యజమానికి తన పాపాన్ని అంటగట్టి, పుణ్యాన్ని పట్టుకొని పోతాడు?

అధర్మ దండనం లోకే
యశోఘ్నం కీర్తినాశనమ్?
అస్వర్గ్యం పరత్రా?పి
తస్మాత్తత్ పరివ్రజేత్??

లోకే-లోకంలో, అధర్మ-ధర్మ విరుద్ధమైన, దండనం-శిక్ష విధించుట, యశోఘ్నం-ప్రతిష్ఠకు హానికరమును, కీర్తినాశనం-కీర్తిని నశింపజేయునదియును, పరత్ర అపి-పరలోకమునను, అస్వర్గ్యం-స్వర్గానికి దూరమైనదియును? తస్మాత్-అందువలన, తత్-ఆ అధర్మాన్ని, పరివ్రజేత్-అన్ని విధాలా విడువనే వలెను?

ఈలోకంలో ధర్మవ్యతిరేకంగా ఒకరిని శిక్షించుట మంచిది కాదు? కీర్తి ప్రతిష్ఠలను నశింపజేస్తుంది?పరలోకంలో కూడా నరకానికే కారణమౌతుంది? కాబట్టి అట్టి దండనను విడువనేవలెను??

*దాతృత్వం ప్రియవక్తృత్వం*
*ధీరత్వ ముచితజ్ఞతా?*
*అభ్యాసేన న లభ్యంతే*
*చత్వార స్సహజా గుణాః?*

దాతృత్వం-దానగుణమును, ప్రియం-ఇష్టముగా, వక్తృత్వం-మాట్లాడే నేర్పును, ధీరత్వం-ధైర్యగుణమును, ఉచితజ్ఞతా-మంచిచెడుల పరిజ్ఞానమును(అనే), చత్వారః-నాలుగు, గుణాః-గుణములు, సహజాః-పుట్టుకతోనే వచ్చినవి? అభ్యాసేన-సాధనచేత, న లభ్యంతే-లభించేవి కావు?

దయాగుణమును, ఎదుటి వారికి ఇష్టముగా మాట్లాడే లక్షణమును, ధైర్యమును,ఏది ఎప్పుడు ఎలా చేయ్యాలో చెయ్యగూడదో తెలియదగిన గుణమును అనే ఈ నాలుగు పుట్టుకతో వచ్చేవే గానీ నేర్చుకుంటే రావు??

*అప్రమాణం చ వేదానా-*
*మార్షాణాం చైవ కుత్సనమ్?*
*అవ్యవస్థా చ సర్వత్ర*
*నాశన మేతదాత్మనః?*

వేదానాం-వేదములయొక్క, అప్రమాణం చ-గౌరవము లేకపోవుటయును, ఆర్షాణాం చ ఏవ-మహాత్ములైన ఋషుల విషయమున గూడా, కుత్సనం నిందించుట యును, సర్వత్ర చ-అంతటను, అవ్యవస్థా-సంప్రదాయ వైరుధ్యమును, ఏతత్-ఇదంతయును, ఆత్మనః-తనయొక్క, నాశనం-నాశనమే?

వేదాలను గౌరవించకపోవుటయును, మహాత్ములైన ఋషులను నిందించుటయును, అంతటను అన్ని కార్యములలోను స్థిరత్వము లేకపోవుటయును ఇవన్నీ తనను నశింపజేసే లక్షణాలేసుమా?

*దాతృత్వం ప్రియవక్తృత్వం*
*ధీరత్వ ముచితజ్ఞతా?*
*అభ్యాసేన న లభ్యంతే*
*చత్వార స్సహజా గుణాః?*

దాతృత్వం-దానగుణమును, ప్రియం-ఇష్టముగా, వక్తృత్వం-మాట్లాడే నేర్పును, ధీరత్వం-ధైర్యగుణమును, ఉచితజ్ఞతా-మంచిచెడుల పరిజ్ఞానమును(అనే), చత్వారః-నాలుగు, గుణాః-గుణములు, సహజాః-పుట్టుకతోనే వచ్చినవి? అభ్యాసేన-సాధనచేత, న లభ్యంతే-లభించేవి కావు?

దయాగుణమును, ఎదుటి వారికి ఇష్టముగా మాట్లాడే లక్షణమును, ధైర్యమును,ఏది ఎప్పుడు ఎలా చేయ్యాలో చెయ్యగూడదో తెలియదగిన గుణమును అనే ఈ నాలుగు పుట్టుకతో వచ్చేవే గానీ నేర్చుకుంటే రావు?

రెంటాల సాంబశివరావు
కొవ్వూరు, ఫోన్ : 7893855174

# గాంధీ జ్ఞాన దర్శనం

## 'అందరి ఆశాదీపం' వెలిగేదెప్పుడు?

**– దోర్బల బాలశేఖరశర్మ**

గాంధీమార్గం, ఆయన జీవనయానం, ఆలోచనా ప్రవంతి, మొత్తంగా ఆ జ్ఞానదీప్తితో కూడిన తెలుగు సాహిత్యాన్ని (అంతా) పుస్తకాల రూపంలోకి తెచ్చే బృహత్ యత్నానికి ప్రముఖ పత్రికా రచయిత, ఆకాశవాణి పూర్వ ప్రయోక్త డా॥ నాగసూరి వేణుగోపాల్ గత నాలుగేళ్ల క్రితమే శ్రీకారం చుట్టి, స్వీయ సంపాదకత్వంలోనే ఇప్పటికి మూడు సంకలనాలు వెలువరించారు. 2019లో 'విజ్ఞాన ప్రచురణలు', 'రామమనోహర్ లోహియా సమతా ట్రస్ట్, లోహియా విజ్ఞాన సమితి' ద్వారా 'మహాస్వప్నం మహాత్మాగాంధీ', 2021, 2022 సంవత్సరాలలో 'నాగసూరి అకాడమీ ఆఫ్ మీడియా అండ్ సైన్స్' ప్రచురణ సంస్థ పేరుతో 'గాంధీయే మార్గం: సిద్ధాంతాలు– ప్రభావాలు– పరిష్కారాలు' శీర్షికతో రెండు సంకలనాలను పాఠకుల ముందుంచారు. నిజానికి ఇది ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యా కేంద్రాలు, సాహిత్య సంస్థలు, మరీ ముఖ్యంగా గాంధీ పేరుతో వెలసిన సెంటర్లు, భవనాలు, జ్ఞాన మందిరాలు వంటివి చేయవలసిన ఒక విస్తృతమైన గొప్పపని.

'మత వర్గ ప్రాతిపదికన విడిపోకుండా, భేదాభిప్రాయాలూ చూపకుండా, స్వప్రయోజనాలు స్వార్థ లాభార్జనలను ఏ మాత్రం ఆశించక పరులందరి కోసం పాటుపడేవారు ఈ కలికాలపు లోకంలో ఎవరైనా వుంటారా? ఒకవేళ వుంటే, ఖచ్చితంగా వారు తమ వ్యక్తిగత ఎదుగుదలను వదులుకోవాల్సిందే. మరి కొన్ని అడుగులు ముందుకేసి, ఎదుటివాళ్లు, వాళ్ల ప్రత్యర్థులు చేసే తప్పులన్నీ క్షమించేస్తూ, ప్రతి ఒక్కరిలోనూ హృదయ పరివర్తనను కోరుతూ, ఆ మేరకు తాపత్రయ పడేవారి పరిస్థితి ఎలా వుంటుంది? దీనికి నిట్టనిలువు నమాధానంగా మన ముందు మహాత్మాగాంధీ ప్రత్యక్షమవుతారు. ఈ క్రమంలో గాంధీజీ తన కనీస 'జీవించే హక్కు'ను సైతం కోల్పోయారు. ఎందుకంటే, ఆయన అందరికీ అన్నీ అయినా, ఎవరికీ ఏమీ కాకుండా పోయారు కాబట్టి. వారెవరూ బాపూజీని 'మా వ్యక్తి' అని సొంతం చేసుకోలేదు కనుక.

మానవులందరి బాధలు తీర్చడం కోసం తాను పుట్టిన ఇంటిని, సొంత సుఖాలను వదిలేసిన బుద్ధునివలెనే జీవించిన మహనీయుడు గాంధీజీ. గౌతముడు బోధివృక్షం కింద తపస్సు చేస్తే, గాంధీజీ సమాజాన్నే తన ప్రయోగశాలగా మార్చుకున్నారు. తాను నమ్మిన బాటను ఆజన్మాంతం వీడని నిక్కచ్చి నిబద్ధుడు. చివరకు వ్యక్తిగతంగా తన కోసం ఏమీ మిగుల్చుకోలేదు. స్వార్థసంకుచిత మానవ మృగాల బారిన పడి దుర్మరణం పాలయ్యాడు. కటిక పేదవాడిలా తన వేషధారణనూ మార్చేసి, సమస్త మానవాళి సౌఖ్యశాంతుల కోసం, నీ నా భేదం లేకుండా బానిస జీవులందరి బంధ విముక్తినీ ఆశించి, చివరకు దుష్ఫలితాన్ని అనుభవించాడు. ఇప్పటి సామాన్య మానవ మాత్రులకు సాధ్యం కాని జీవితం గాంధీజీది. హింసాసూయలకు తావులేని, నిప్పులాంటి సత్యసంధత, స్థితప్రజ్ఞతతో ఆఖరకు ఎవరికీ ఏమీ కాకుండా పోయిన గాంధీజీ వంటివారు ఈ భూమ్మీద మళ్లీ పుట్టరేమో.

ఒక మనిషి తన జీవితకాలంలో ఏవో ఒకటో, రెండో, కొన్నో తెలిసో, తెలియకో, కొన్ని పొరపాట్లు చేస్తేనో లేదా తన ప్రమేయం లేకుండానే జరగకూడనివి జరిగితేనో .. అతను చేసిన మొత్తం మంచిపని కాలగర్భంలో కలిసి పోవాలా? ఏ పేరునైతే యావత్ ప్రపంచం రామపాదుకల వలె పరమ పవిత్రంగా, ధర్మబద్ధంగా తలకెత్తుకుందో ఆ పేరునే ఇవాళ కొందరు వినడానికైనా ఇష్టపడని దుస్థితి ఎందుకు ఏర్పడింది? గాంధీజీ స్వయంగా ఆచరించిన 'హింసకు అహింస', 'చెడుకు మంచి', 'స్వార్థానికి నిస్వార్థం', 'వికృతికి ప్రకృతి', 'మృత్యువుకు ప్రాణం' వంటివాటిని హాస్యాస్పదాంశాలుగా ఇంకెన్నాళ్లు కొనసాగిద్దాం? భౌతికంగా తనను పొగొట్టుకున్న ఏడున్నర దశాబ్దాల తర్వాత కూడా మానవాళి కంతటికినీ ఆదర్శప్రాయమైన

'గాంధేయ మార్గం'లోకి మనుషులెందుకు ఇంకా రాలేకపోతున్నారు? మహాత్ముడు జీవించిన 'ఉత్తమమైన బాట' ఎందుకింత చులకనై పోయింది? ప్రపంచ పెద్దలెందరో బాపూజీ జీవించి వున్న కాలంలోనే వారి జీవనశైలిని అనుసరించడమే కాక 'ఆయన జీవితమే ఒక అద్భుత సందేశమంటూ' వేనోళ్లా కొనియాడారు కూడా. ఆధునిక కాలానికి 'గాంధీజీ నడిచిన మార్గాన్ని మించిన సానుకూల పథం మరొకటి లేదన్న' నిర్ధారణకు వచ్చిన తర్వాత కూడా వారి వారసులుగా మనమంతా అటువైపు అడుగులు వేయడానికి జంకుతున్నాం.

ఈ క్రమంలోనే అసలు, 'గాంధీమార్గం' అంటే ఏమిటి? అదెలాంటిది? ఇప్పుడెక్కడైనా వుందా? సిసలైన గాంధేయులు ఎవరు? వారెలాంటి వారు? ఎవరైనా వున్నారా? 'బాపూజీ బాట'లోని లోతుపాతులు, ఎగుడు దిగుడులు, నిజానిజాలు, ఆచరణ సాధ్యాలు ఎలాంటివి? మామూలు మనుషులెవరూ పాటించ వీలు కానంత సంక్లిష్టమైనవా అవి? ప్రజలు, పాలకులు, అధికారులు, ఈ కాలం విసిరే సవాళ్లకు పరిష్కారాలు అందులో లేవా? వాటితోనే ఆయనెలా జీవించగలిగారు? తానూ మన వలె మామూలు మనిషేకదా! ఈ ప్రశ్నలన్నింటికీ పై మూడు పుస్తకాలు ఒకింత సంతులిత సమాధానాలను ఇస్తాయి. తొలి సంపుటిలో ప్రసిద్ధ పత్రికా సంపాదకులు నార్ల వెంకటేశ్వరరావు గాంధీజీపై రాసిన సంపాదకీయాలు, ఇతరుల వ్యాసాలు పొందు పరచగా, 'గాంధీయే మార్గం' మొదటి, రెండు సంపుటాలలో కనుమర్తి వరలక్ష్మమ్మ, పుచ్చలపల్లి సుందరయ్య, రాహుల్ సాంకృత్యాయన్, దేవరకొండ బాలగంగాధర తిలక్, దాశరథి కృష్ణమాచార్య, మండలి బుద్ధప్రసాద్, కాళ్లకూరి శేషమ్మ, తిరుమల రామచంద్ర, త్రిపురనేని శ్రీనివాస్, దేవులపల్లి కృష్ణశాస్త్రి, పి.వి.నరసింహారావు, కొడవటిగంటి కుటుంబరావు ప్రభృతుల వ్యాసాలు చోటు చేసుకున్నాయి. 'గాంధీయే మార్గం' సంకలనాలలో నలభైకి పైగా ప్రసిద్ధుల వ్యాసాలు వున్నాయి. ఈ మూడు పుస్తకాలను శ్రద్ధాసక్తులతో చదివిన వారికి గాంధీజీ తన జీవితంలో త్రికరణశుద్ధిగా పాటించిన నైతిక విలువలు, క్రమశిక్షణ వంటి సుగుణాల నుంచి గట్టి పట్టుదలతో సాగించిన పోరాట పంథాల వరకూ అనేక విషయాలు తెలిసివస్తాయి. బాపూజీ ఆలోచనలు, తాత్వికత, సైద్ధాంతిక మహాస్వప్నం, సవాళ్లకు ఆయన ఇచ్చిన పరిష్కారాలు, నాటి కాలమాన పరిస్థితులు అన్నీ బోధపడతాయి. "..ధర్మసంస్థాపనకు హింసను సాధనంగా చేసుకోవడం దోషం కానేరదని శ్రీకృష్ణుని అభిప్రాయం. ఇదే నీషే, మార్క్స్, లెనిన్ ప్రభృతుల అభిప్రాయం కూడా. దీనితో ఏకీభవించని వారిలో ముఖ్యులు గౌతమ బుద్ధుడు, ఏసుక్రీస్తు, మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ. ఉత్తమ లక్ష్యం అధమ సాధనంతో సాధించగలమా?'' అని నార్ల వెంకటేశ్వరరావు తన సంపాదకీయం ('అహింసామూర్తి')లో రాసినట్టు డా॥నాగసూరి వేణుగోపాల్ ('విశ్వాంతరాళ స్థాయిలో మహితాత్ముడు') పేర్కొన్నారు. "నైతిక విలువలకు ఎక్కడ స్థానం వున్నా రాజకీయాలలో లేదు. ప్రపంచం మొత్తం మీద ఈ విశ్వాసం ప్రబలంగా ఉంది. కౌటిల్యుడు, మాకియవిలీ మొదలైన రాజనీతి తంత్రజ్ఞులు ఈ విశ్వాసం గట్టిగా వేళ్లు తన్నడానికి తోడ్పడ్డారు. వారిని ఖండించడానికే గాంధీ జీవించాడని, ఇందుకే ఆయన మరణించాడని చెప్పవచ్చు" అని నార్లవారు మరో సంపాదకీయం ('మనం పలికే ప్రతి మాట')లో చెప్పినట్టు నాగసూరి అన్నారు. 'గాంధీజీ మహాస్వప్నం' (1948 ఫిబ్రవరి11) శీర్షికన నార్లవారు రాసిన వేరొక సంపాదకీయంలో "ఆయన సిద్ధాంతాల ప్రకారం యంత్రాలు, పరిశ్రమలు తగవు.." అన్నారు. ''నిజానికి ఏసుక్రీస్తు, గౌతమబుద్ధుల కార్యరంగాలు గాంధీ కార్యరంగం కంటే కూడా చాలా చిన్నవి. ఏసుక్రీస్తు పాలస్తీనాను దాటి వెళ్లినట్టు చెప్పడానికి బలమైన ఆధారాలేవీ లేవు. గౌతమబుద్ధుడు పశ్చిమ, దక్షిణ భారతాలకు తన నవధర్మ ప్రచారం చేయడానికి వెళ్లిన నిదర్శనాలు లేవు" అని నార్ల వెంకటేశ్వరరావు ('గాంధీ జయంతి': సంపాదకీయం, 1956 అక్టోబర్ 3, ఆంధ్రప్రభ) రాశారు. గాంధీజీ కార్యరంగం దక్షిణాఫ్రికాసహా భారత్ అంతటా నెలకొంది.

తెలిసీ తెలియని వయసులో ఎవరైనా కొన్ని తప్పులు చేస్తుంటారు. గాంధీజీ సహజంగా శాఖాహారి. కానీ, 'భారతీయులు బలిష్ఠులు కావాలంటే మాంసం తినాలన్న నమ్మకంతో ప్రయత్న పూర్వకంగా ఆయన మాంసం తినాలని చిన్నతనంలో కొన్ని ప్రయత్నాలు చేసినట్టు' విన్సెంట్ షీన్ ('తనకు తానుగా మారడమే గాంధీ జీవితం') రాశారు. '..తర్వాత శాకాహారి అయ్యారని, తనకు తానుగా మారడం ఆయన జీవితమంతటా పునరుక్తమవుతుందని' ఆయన అభిప్రాయపడ్డారు. 'రాజకీయాలపై గాంధీ అంత ఆసక్తిగలవాడు కాదు. ఎప్పుడూ ఏ పదవీ నిర్వహించలేదు' అనికూడా ఆయన రాశారు. 'చనిపోయేటప్పటికి

గాంధీకున్నవల్లా ఒక జత చెప్పులు, కళ్లద్దాలు, ఓ పుస్తకం, ఒక గిన్నె.. అంతే. ఇంకేం లేవు' అని విన్సెంట్ వ్యాసంలో చదువుతాం. గాంధీజీ జీవనశైలి ఆశ్చర్యకరంగా ఆయనకు మాత్రమే సాధ్యమైంది.

"వయసులో వుండగా సరుకులు తెచ్చుకోవడం కోసం రోజుకు కనీసం 40 మైళ్ల వరకు నడిచేవాడు. వలంటీరుగా ఒక్కోసారి గాయపడిన సైనికులను ఆయన స్ట్రెచర్‌పై ఏకబిగిన 30-40 మైళ్లు మోసేవాడు. 78 ఏళ్ల వయసులోనూ వారాల తరబడి రోజుకు 18 గంటలు పని చేశాడు" అని అనుబందోపాధ్యాయ ('శ్రమజీవి') పేర్కొన్నారు. గాంధీజీని 'కర్మవీరుడు'గా అభివర్ణిస్తూ, 'బట్టలు ఉతుక్కోవడం దగ్గర్నుంచి తన జుట్టును తానే క్షవరం చేసుకొనే వరకు తన పనులన్నీ తానే చేసుకొనేవాడు. ఎవరిపైనా ఆధారపడటం అన్నదే వారికి తెలియదు. 'బాగా అలసి పోయినప్పుడు శక్తికోసం దేవుడిని ప్రార్థించేవాడు' అనీ ఆయన రాశారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 'బాపూజీ మార్గం కఠినం, కష్టసాధ్యమని, కాని ధైర్యోపేతమని' ('భారతదేశానికి అపురూపమైన ప్రతినిధి') ప్రశంసించారు.

"గాంధీజీ చరిత్రను ఎంతో నిబద్ధతతో అధ్యయనం చేస్తున్న విదేశీయులను నేను కళ్లారా చూశాను. వారు కేవలం చదవడమే కాదు, నిత్యజీవన విధానంలోకూడా గాంధీజీ ఆశయాలను అనుసరిస్తున్నారని గ్రహించాను" అని డా॥నాగులపల్లి భాస్కరరావు ('బాపుబాట కానరాదిచట')లో అభిప్రాయపడ్డారు. 'వ్యక్తిగత జీవనశైలిలో మార్పులు లేనిదే సంఘ సంస్కరణలు అసంభవమని గాంధీజీ అప్పుడే చెప్పారనీ' అన్నారాయన. "గాంధీజీ ప్రకారం హింసించకపోతే చాలు అనుకుంటే సరిపోదు. మనిషికి సృష్టించే శక్తి లేదు. కనుక, జీవించే ఏ చిన్న ప్రాణినైనా చంపే అధికారం లేదు" అని డా॥నాగసూరి వేణుగోపాల్ ('గాంధీయే మార్గం': 1,'సంపాదకీయం': 'విజ్ఞానవని, వజ్రాలగని') వెల్లడించారు. "అణ్వాయుధాల మత్తులో వున్న ప్రపంచ నాయకుల కళ్లు తెరిపించిన ఘనుడు గాంధీజీ. అందుకే, గాంధీజీని కలుసుకున్న నాయకులు, ఐన్‌స్టీన్ వంటి శాస్త్రజ్ఞులు సైతం ఆయన విధానాలకు ఆశ్చర్యపోయేవారు" అని శ్రీమతి కాళ్లకూరి శేషమ్మ ('రాజకీయ ప్రపంచ పటంలో మన స్వాతంత్ర్యోద్యమం') అభిప్రాయపడ్డారు.

---

"... మనందరి అభిమాన **మిసిమి** జూలై 2023 మాస పత్రికలో.. సామాజిక స్పృహను కోరుకున్న పాఠకుల అభిరుచులకు సరిపడే మంచి మంచి వ్యాసాలను ప్రచురిస్తున్న సంపాదకులు గౌరవనీయ అశ్వనీకుమార్ గార్కి ధన్యవాదాలు. ఇంకా ఎన్నో కళారూపాలు, కళాకారులు, సాహితీ స్రష్టం గూర్చి తెలుసుకుంటున్నాము. ఇందులో భాగంగా నేనొక ప్రత్యేక విషయాన్ని ప్రస్తావించదలచాను. **మిసిమి** పత్రిక ప్రముఖ పాఠకులు, రచయిత, సాహితీ సేవా తత్పరులు శ్రీ గార రంగనాథంగారి గూర్చి ఆయన విజయనగరం జిల్లా రాజాంలో నివాసముంటూ అక్కడ "రాజాం రచయితల వేదిక" (రా ర వే) అనే సంస్థను నెలకొల్పారు. సమాజాన్ని జాగృతపరచే మార్గంలో "రా ర వే" సభ్యుల సహకారంతో తెలుగు సాహితీ పరిమళాల్ని గుబాళింపజేసేందుకు నిర్విరామంగా కృషి చేస్తున్నారు. ప్రతినెలా "రా ర వే" సంస్థ సాహితీ సమావేశాలు ఏర్పాటు చేస్తూ అర్హులైన పెద్దవాళ్ళను అధ్యక్షులుగా, ఉపన్యాసకులుగా ఆహ్వానించడం, వారిని సన్మానించడం జరుగుతుంది. ఆ క్రమంలో ఒక్కసారి ఆంధ్రరాష్ట్ర మాజీ శాసనసభ్యులు, శాసనసభా స్పీకరు శ్రీయుతులు మండలి బుద్ధప్రసాద్ గారిని ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. సభానంతరం బుద్ధప్రసాద్‌గారు మిత్రులు రంగనాథం గార్కి సూచనప్రాయంగా "మీ పరిసరాల్లో కూడా మంచి కవులు ఉండే ఉంటారు. వారిని గురించి విషయసేకరణ చేయండి బాగుంటుంది" అన్నారట. దాన్ని దృష్టిలో ఉంచుకుని శ్రీ రంగనాథం గారు "రా ర వే" సంస్థ సభ్యుల సహకారంతో "విస్తృత కళింగాంధ్ర సాహితీ ప్రభ" అనే మంచి వ్యాస సంకలనాన్ని పుస్తకరూపంలో అందించారు. ఈ వ్యాస సంకలనాల్ని పుస్తకరూపంలో ఉంచడానికి "రా ర వే" సభ్యులు సుమారు 30 మంది ఒకరిని మించి ఒకరు అన్నట్టు చాలామంచి వ్యాసాలు అందించారు.

వారు ఎంచుకున్న పూర్వ కవులందరూ గ్రామీణవాసులు కావడం ఒక ప్రత్యేకత. నేను యీ పుస్తకాన్ని చదివిన తరువాత అనిపించింది సాహిత్యాభిలాషులు తప్పకుండా ఈ పుస్తకాన్ని చదుతారని. ఈ పుస్తకం "విస్తృత కళింగాంధ్ర సాహితీ ప్రభను" **మిసిమి** పత్రిక పాఠకుల్లో సీనియర్ సభ్యులు కీ॥శే॥ కణుగుల వెంకట్రావు (క.వె.రా) గార్కి అంకితం చేశారు. ఇది చాల ప్రశంసనీయం. ఈ వ్యాస సంకలనాన్ని పుస్తకరూపంలోకి తేవడానికి అవిశ్రాంతంగా కృషి చేసిన శ్రీ రంగనాథం గార్కి ధన్యవాదాలు. ఇప్పుడు కూడా రంగనాథం గారు రాజాం పరసిర గ్రామాలకు వెళ్ళి, అక్కడ వయోవృద్ధులను కలిసి, పూర్వ కవుల చరిత్ర, ఇంకా కొన్ని చారిత్రిక విషయాల్ని సేకరిస్తుంటారు. తెలుగు భాషా వికాసం కోసం ఆయన చేస్తున్న కృషిని సఫలీకృతం చేయాలని భగవంతుని కోరుతూ.

*– దూబ వేణుగోపాలరావు, హైదరాబాద్*

# కాశీలో అఘోరాలు

– కిల్లాడ సత్యనారాయణ

నా ఇంటర్ క్లాస్మేట్ కాశీ వస్తానన్నాడు. నాకు అఘోరాలను చూపించాలన్నాడు. కుటుంబంతో వచ్చాడు. వస్తూనే, 'పద వెళ్దాం' అన్నాడు శ్రీనివాస్. ' విశ్వనాథ గుడికా ' అన్నాను. ' కాదు, అఘోరాల దగ్గరకు' అన్నాడు. కొన్ని సినిమాల్లో, సీరియల్లో చూసి తనకు ఈ కోరిక కలిగిందన్నాడు. వీరి గురించి గూగుల్ లో చదివాడట. దేశంలో అత్యధిక అఘోరాలు కాశీలోనే ఉన్నారన్నాడు. "నేను ఈ మధ్యనే శ్రీ స్వామినాథ పాండే గారు రాసిన ' అఘోర పురుష్ ' హిందీ నవల చదివాను. చాలా బాగుంది " వెళ్తూ, దారిలో అన్నాను వాడితో. "నాకు హిందీ రాదుగా...నువ్వే దానిలో సారాశం చెప్పు " అన్నాడు. "సరే. ఆయన బాబా కీనారాం గురించి రాసారు. అఘోరాల గురించి నాకు తెలిసింది చెబుతాను. విను." అని చెప్పాను.

కాశీ సన్యాసులు, యోగులకే కాదు. సాధకులకు, అఘోరాలకు కూడా ప్రసిద్దే. సాధన, తపస్సులతో ఇక్కడ కొందరు అలౌకిక శక్తులు పొందారు. వాటిని కొందరు కట్టుకథలని కొట్టి పారేస్తారు. కొందరు కథలుగా వింటారు. కొందరు మహిమలని పూజిస్తారు. ఎవరు ఎలా చూస్తే, వాళ్లకు అలా కనబడతాయి. గమనిస్తే, కాశీ అంతా ఒక అఘోర సిద్ధిపీఠమే. దీనికి కేంద్రస్థానం మహాశివుడు. అవధూతేశ్వర భగవానుడు శివుడు. అందుకే కాశీని మహాస్మశానం అంటారు. అలాంటి మహిమగల అఘోర తపస్వి బాబా కీనారాం. ఆయన మహిమలు కథలుగా సుదూరాలకు వ్యాపించాయి. రాజా చేత్ సింగ్ కాశీరాజు. కీనారాం బాబా తిరుగుతూ తిరుగుతూ రాంనగర్ వచ్చారట. రాజుగారి దగ్గరకు నేరుగా వచ్చారు. రాజుగారికి నమస్కారం చేయలేదు. రాజుగారు ఆగ్రహించారు. " నాకు చాలా ఆకలిగా ఉంది " అని బాబా రాజును అడిగారు. రాజుగారు అతని వంక అసహ్యంగా చూసారు. "కోట వెనుక ఒక శవం పడుంది. దాన్ని తెచ్చి బాబాకు ఇవ్వండి" అని సేవకులకు చెప్పారు. సేవకులు భయంతో రాజుగారి వైపు చూసారు. బాబాను ఎగతాళి చెయ్యడం మంచిది కాదని చెప్పారు. " నేను రాజును. వాడు భికారి. నా ముందుకు వచ్చినప్పుడు నాకు నమస్కారం చెయ్యాలన్న కనీస జ్ఞానం కూడా లేదు" అని రాజుగారు కోపంతో మళ్ళీ ఆదేశించారు. చేసేదిలేక వాళ్ళు వెళ్లి శవాన్ని తీసుకొచ్చారు. "ఆలస్యం దేనికి బాబా! భోజనం వచ్చింది. ఆరగించండి" అన్నారు రాజుగారు. తన ఒంటి మీదున్న సిల్కు వస్త్రం తీసారు బాబా. దానితో శవాన్ని చుట్టి కొంతసేపు ఉంచారు. ఆ తర్వాత వస్త్రాన్ని తీసారు. శవం పంచభక్ష పరమాన్నంగా మారిపోయింది. మిఠాయిలు, కూరలు, రొట్టె, అన్నం. అది చూసిన రాజుగారు బాబా కాళ్ళమీద పడి క్షమాపణ అడిగారు. బాబా క్షమించారు. రాజునీ రంకునీ కీనారాంబాబా సమదృష్టితో చూస్తారు. అందరికీ శివుడి ఆశీస్సులు సమానమని బోధించారు.

బెనారస్ లోని శివాలలో బాబా కీనారాం ఆశ్రమం ఉంది. చాలా పెద్ద ప్రాంగణం. ఇది కీనారాంగారి తపోస్థలి. దీన్ని క్రీంకుండ్ అంటారు. ఈయన బెనారస్ దగ్గర రాంగఢ్ లో క్రీ.శ. 1601లో పుట్టారు. మంచి కవి. నిత్య సాధకుడు. ఈయన పొందిన జ్ఞానాన్ని ' వివేకసారం, రామగీత, రామరసాల్, గీతావలి ' వంటి గ్రంథాల ద్వారా ప్రజలకు అందించారు. కులాలకు ప్రాధాన్యత ఇచ్చేవారు కాదు. క్రీంకుండ్ లో అఘోరబాబాల సమాధులున్నాయి. వీటిలో ముఖ్యమైనది కీనారాంబాబా సమాధి. ఇక్కడ ఒక చింతచెట్టు ఉంది. ఈ చెట్టు కొమ్మలకు చాలా గబ్బిలాలు వేలాడుతూ ఉంటాయి. ఎన్నో యేళ్ల నుండి అవి అలాగే ఉన్నాయి. చెట్టుమీద నల్లని కంబలి కప్పినట్లుగా ఉంటుంది. బనారస్ కు 50 కి. మీ. దూరంలో హరిహరపూర్ గ్రామం ఉంది. అక్కడ బాబా కీనారాం తపస్సు చేసారని చెప్పారు. అక్కడకు నేను సకుటుంబంగా వెళ్లాను. మా బేచ్ మేట్ భార్య, వాళ్ల చినమామ కూడా వచ్చారు. వాళ్ల చినమామయ్య కీనారాం సాంప్రదాయం తీసుకున్నారు. మాకు అక్కడ స్థలప్రాధాన్యతను వివరించారు. "గోమతి నదిలో వరద వచ్చిందట. అది కీనారాం తపోస్థలిని ముంచేందుకు ముందుకొచ్చిందట. బాబా 'నువ్వు నన్ను మచేస్తావా?'

అన్నారట. అంతే. నది తన మార్గం మార్చుకుంది. అక్కడ ఎల్ ఆకారంలో వంపు తిరిగింది. చూడండి అంటూ ఆయన మాకు చూపించారు.

ప్రస్తుత క్రీంకుండ్ పీఠాధిపతి బాబా సిద్ధార్థ గౌతం రామ్. అఘోరా ఎవరు? వీరినే ఔఘడ్, అవధూత్ అని కూడా పిలుస్తారు. పూర్ణజ్ఞానం పొందిన యోగికి వస్తువుల్లో భేదాలుండవు. విచక్షణ చూపించరు. భేదబుద్ధి లోపిస్తుంది. వీరినే అఘోర అంటారు.

కాశీలో మూడు అఘోర సిద్ధ పీఠాలున్నాయి.

1) ఔఘడనాథ్ కీ తకియా, కబీర్ చౌరాహ

2) క్రీంకుండ్, శివాల

3) సర్వేశ్వరీ సమూహ సిద్ధపీఠం, పడావ్

ఈ పీఠాలన్నింటిలో స్మశానం నుండి తెచ్చిన కట్టెలతో ఎప్పుడూ అగ్ని వెలుగుతూ ఉంటుంది. అలాగే ఇక్కడ సమాధికి పూజ చేస్తారు. ఈ సమాధులపైన లింగాకారంలో ఉన్న యంత్రం ఉంటుంది. దీన్ని పూజిస్తే శక్తులు ప్రాప్తిస్తాయని నమ్ముతారు. ఔఘడనాథ్ కీ తకియా: 2022 నాగపంచమి. ఇక్కడ అఖాడాలో కుస్తీ పోటీలు జరుగుతున్నాయి. మిట్టూ పహల్వాన్ ముళ్ళగద జోడితో ప్రదర్శన యిస్తున్నాడు. అప్పుడు నేనూ, నా మిత్రుడు వెళ్ళాం. ఆ తర్వాత అన్నసంతర్పణ జరిగింది. వేమూ భోజనం చేసాం. ఆ పీఠం మహంత్ భస్కరానందగిరి గారిని కలిసాం. ఆయన ఆ పీఠం గురించి చెప్పారు.



బాబా గురుపంత్ సంభవ్ రాం

''ఈ పీఠంవద్ద మొదటి అవధూత్ మహారాజ్ బ్రహ్మనాథ్ సిద్ధి పొందారు. ఈయన గురు గోరఖనాథ్ కు సమకాలికులు. ఈ పీఠంలో ఇప్పటివరకూ పదమూడు మంది ఔఘడనాథులు ఉన్నారు. వీరందరి సమాధులు ఇక్కడున్నాయి. చూడండి. "అంటూ మాకు సమాధులు చూపించారు. "మహరాజ్ జీ... ఈ పీఠానికి ' ఔగధనాథ్ కీ తకియా 'అన్న పేరు ఎలా వచ్చింది?" అనడిగాను. తకియా పదాన్ని ఇస్లాంలో ఎక్కువగా ఉపయోగిస్తారు. హిందూధర్మంలో ఒక గద్దీకి వాడడం నేను మొదటిసారి వింటున్నాను.

"ఔరంగజేబు బనారస్ పై దండెత్తాడు. ఇక్కడున్న అనేక దేవాలయాలు కూల్చాడు. కాశీ విశ్వనాథ మందిరాన్ని కూడా నేలమట్టం చేసాడు. అక్కడ జ్ఞానవాపి మసీదు నిర్మించాడు ఆ తరువాత కబీర్ చౌర వీధికి వెళ్ళాడు. అక్కడ నిర్జన స్థలంలో కట్టిన ఒక కుటీరానికి వెళ్ళాడు. ఆ కుటీరంలో ఒక సమాధి ఉంది. అది బాబా బ్రహ్మనాథ్ సమాధి. అందుకనే దీనిని ' బ్రహ్మనాథ్ మఢీ ' అనేవారు. కొందరు అఘోరాలు సమాధి ముందు భజనలు చేసుకుంటున్నారు. ఆ అఘోరాలను చూసి ఔరంగజేబు ఆగ్రహించాడు. ఆ సమాధి పేరు విని ఉగ్రుడయ్యాడు. వెంటనే ఆ సమాధిని కూల్చెయ్యమని ఆదేశించాడు. అతని అనుచరులు కూల్చేందుకు వెళ్లారు. అప్పుడు ఔరంగజేబు కంటిచూపు పోయింది. ఆయన చాలా భయపడిపోయాడు. అక్కడున్న అఘోరాలను అడిగారు. ఇది బాబా బ్రహ్మనాథ్ మహిమని తెలుసుకున్నాడు. క్షమాభిక్ష కోరడంతో అతనికి చూపు తిరిగి వచ్చింది. ఔరంగజేబు బ్రహ్మనాథ్ భక్తుడయ్యాడు. "మహంత్ చాలా భావోద్వేగంతో చెబుతున్నారు. ఈ కథ మాలో చాలా ఆసక్తి కలిగించింది.

ఉత్సాహంగా వింటున్నాం. మహంత్ గారు దోనిటతో మంచినీళ్ళు తాగారు. "మహంత్ జీ..." అని నేను అడగబోయాను. "ఆ... నాకు గుర్తుంది. దీనికి ఈ పేరు ఎలా వచ్చిందనేగా " అన్నారు మహంత్. "అవును మహారాజ్ జీ " అన్నాను.

"ఔరంగజేబు బ్రహ్మనాథ్ కు భవ్య మందిరం కట్టించాలనుకున్నాడు. కానీ ఒక ప్రహార్ సమయంలో ఎంత నిర్మించగలవో, అంతే నిర్మించాలన్నారట అఘోరాలు. ఉత్తర భారత కాలమానంలో ఒకరోజులో ఎనిమిది ప్రహారాలుంటాయి. అంటే ఔరంగజేబుకు కేవలం మూడుగంటల వ్యవధి

ఉంది. ఆ కొద్ది సమయంలో ఇరవై స్తంబాలు నిర్మించారు. దానిపై ఒక పైకప్పు కట్టారు. ఏడు స్తంభాలతో బ్రహ్మానాథ్ సమాధికి పైకప్పు నిర్మించాడు. ఈ నిర్మాణం తర్వాత ఈ స్థలానికి ' ఔగడనాథ్ కీ తకియా 'అని ఔరంగజేబు పేరు మార్చాడు." అని వివరించారు మహంత్. ఆ ప్రాంగణంలో తిరిగాం. ఇక్కడ 13 మంది బాబాల సమాధులున్నాయి. బ్రహ్మానాథ్, శృభంగనాథ్, మసానినాథ్, శ్యాంగిరి, సవాయి నాథ్, గగన్ నాథ్, రుద్రనాథ్, గుప్తనాథ్ మొదలైన వాళ్ళవి. ఈ పీఠంలో సంత్ సేవానాథ్ గురించి ఒక ఘటన ప్రచారంలో ఉంది. దీని ద్వారం నిర్మిస్తున్నప్పుడు పైనున్న రాయి చిన్నదైపోయిందట. మేస్త్రీ అదేపనిగా ఆలోచిస్తున్నాడట. అది చూసి సేవానాథ్ గారు ఒక రాయిని ముట్టుకుని అతనికిచ్చారట. మేస్త్రీకి కావాల్సిన సైజులో అది గోడలో ఇమిడిపోయిందట. చూసినవాళ్ళు అవాక్కయ్యారు. అక్కడ ఒక బావి ఉంది. దానిలో నీళ్ళు తాగితే పచ్చకామెర్లు నయమవుతాయని చెప్పారు. కబీర్ చౌరాహ వద్ద ఉన్న ఈ పీఠంలో స్మశానం నుండి తెచ్చిన కట్టెలతో ఎప్పుడూ అగ్ని వెలుగుతూ ఉంటుంది.

సర్వేశ్వరీ సిద్ధిపీఠం: అఘోరేశ్వర బాబా భగవాన్ రాం దీన్ని 1961లో వారణాసిలోని పడావ్ వద్ద స్థాపించారు. మానవ సమాజ కళ్యాణం దీని లక్ష్యం. ప్రపంచంలో ఎన్నో అన్వేషణలు జరిగాయి. వీటన్నింటికీ మూలం సర్వశక్తి. జగమంతా వ్యాపించి ఉన్న ఈశ్వరుడు. అదే సర్వేశ్వరి. సమూహ అంటే ఒక సంఘం. ఇక్కడ అందరూ కూర్చుని తమ తమ సమస్యలు చర్చిస్తారు. కుల మత భేదాలు లేకుండా అందరికీ సర్వేశ్వరీ సమూహ సేవ చేస్తుంది.

భగవాన్ రాం 1937లో బీహార్ లో జన్మించారు. పద్నాలుగేళ్ల వయస్సులో కాశీ వచ్చారు. ఈయన క్రీంకుండ్ పీఠాధిపతి బాబా రాజేశ్వర రాం నుండి సిద్ధి పొందారు. భగవాన్ రాంగారు సిద్ధిపీఠంలో కొత్త ఒరవడి తీసుకొచ్చారు. యజ్ఞ యాగాదులూ, మంత్ర తంత్రాలకే సిద్ధిపీఠం పరిమితం కాకూడదు. అది మానవ సంక్షేమ కార్యక్రమాలను కూడా నిర్వహించాలన్నారు. ఫలితంగా పడావ్ లో ఇది అనేక సంక్షేమ కార్యక్రమాలు చేస్తుంది. పెద్ద కుష్టు సేవా కేంద్రం ఉంది. ఆయుర్వేద పద్ధతిలో ఎక్కువ కుష్టురోగుల్ని నయం చేసినందుకు ఈ సంస్థ గిన్నీస్ బుక్ లో స్థానం సంపాదించుకుందని వర్తమాన పీఠాధిపతి అఘోర సంభవరాం నాతో అన్నారు. వరకట్నానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తుంది. వృద్ధాశ్రమం నడుపుతుంది. ఈ సిద్ధిపీఠంలో మద్యం, మాంసం, గంజాయి, భాంగ్ ను నిషేధించారు. ఆ ఆశ్రమంలో వృద్ధులకు, కుష్టురోగులకు మిఠాయిలు పంచి హోలీ జరుపుకోవాలని వెళ్ళాను. అక్కడ ఉధంసింగ్ గారు కలిసారు. ఆయన న్యాయశాస్త్రంలో పోస్ట్ గ్రాడ్యుయేట్. గత ఇరవై ఏళ్ళుగా అఘోర మార్గంలో నడుస్తున్నాడు. సమాధిస్థల నిర్వహణ ఆయనే చూస్తున్నారు.

సమాధి ప్రాంగణం గంగానది ఒడ్డున ఉంది. డోమ్ శైలిలో ఉన్న భవంతి కింద బాబా భగవాన్ రాం సమాధి ఉంది. ఈ ప్రాంగణంలో ఒక పాఠశాల, వృద్ధాశ్రమం, నేచురోపతి చికిత్సాలయం ఉన్నాయి. ఇది 15 ఎకరాల్లో ఉంది. రోడ్డుకు మరోవైపు గ్రంధాలయం, గోశాల, కుష్టురోగ కేంద్రం, వాళ్లకు వసతి ఉన్నాయి. ఉధంసింగ్ గారు నన్ను వర్తమాన అఘోర బాబా వద్దకు తీసుకెళ్లారు. ఆయన పేరు బాబా గురుపత్ సంభవ్ రాం. కాషాయ వస్త్రాలలో ఉన్నారు. ఆశ్రమం చేస్తున్న సేవ గురించి చెప్పారు. జనవరి 7, 2023 న గౌరవనీయులైన ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ యోగీ ఆదిత్యనాథ్ గారు ఈ పీఠానికి వచ్చారు. ఇక్కడ ఆయుర్వేద, నేచురోపతి ఆరోగ్యకేంద్రాన్ని ప్రారంభించారు. వారితో పాటు నేను కూడా ఈ ప్రాంగణమంతా చూసాను. అఘోరా పద్ధతి ఒక రహస్యం. ఆ రహస్యం సామాన్యులకు అంతుచిక్కదు. అఘోరాలు అద్భుతాలు చేస్తారు. అది తర్కానికి చేజిక్కదు. అఘోరాల కట్టుబాట్లు లోకరీతికి భిన్నం. దేశంతో, సమాజంతో సంబంధం లేదు. కాలమాన పరిస్థితులు వాళ్లకు అడ్డురావు. వాళ్ళు నలుగురి కోసం ఏదీ చెయ్యరు. నలుగురి మధ్యా బ్రతకరు.

కాలంతో పాటు అఘోరాలు మారారు. ఇప్పుడు నగ్నంగా, అర్ధనగ్నంగా తిరగడం లేదు. కపాలాల్ని మెడలో ధరించడం లేదు. ఊడలుగా జుట్టు విడవడం లేదు. ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. కుష్టువ్యాధి కేంద్రాలు నడుపుతున్నారు.

కిల్లాడ సత్యనారాయణ
ఫోన్ : 8333987838

# జార్జ్ ఆర్వెల్ 'అనిమల్ ఫార్మ్'

– వేలూరి కృష్ణమూర్తి

1903లో బ్రిటీషువారి పరిపాలనలో వున్న భారత దేశంలో జన్మ దాల్చిన ఎరిక్ ఆర్థర్ బ్లేర్, ఆనాటి సామాజిక, రాజకీయ వ్యవస్థను నిశితంగా విమర్శిస్తూ రచనలు చేసిన పాత్రికేయుడుగానూ, కాల్పనిక రచయితగానూ ప్రపంచ ప్రఖ్యాతి తెచ్చుకొన్నది 'జార్జ్ ఆర్వెల్'(George Orwel) అన్న కలం పేరుతో. అతడు జీవించినది 46 సంవత్సరాల కాలం మాత్రమే అయినా అతని రచనలు The Road to Wigan Pier (1937), Homage to Catalonia (1938) Animal Farm (1945) Nineteen Eighty Four (1949) Burmese Days, Coming up for Air ప్రపంచ ప్రఖ్యాతి చెందాయి. అప్పటి పరిస్థితులకు అనుగుణంగా ఇంగ్లండులో విద్య ముగించిన ఎరిక్ బ్లేర్ 1922 నుండి 1927 వరకు బర్మాలో ఇండియన్ ఇంపీరియల్ పోలీస్ (Indian Imperial Police) లో అధికారిగా సేవ చేశాడు. జీవనోపాధికి రక రకాల ఉద్యోగాలు చేయాల్సిపడినా తన మూల ఆసక్తియైన రచనను విడువక ముందుకు సాగాడు. తన జీవిత కాలంలో అతడు రచించిన Animal Farm (1945) Nineteen Eighty Four (1949) ఎన్నో ఇతర భాషలకు అనువదింపబడి ఎక్కువ ప్రఖ్యాతి గడించాయి. BBC Eastern Services, Observer, Manchester Evening News,Tribune మొదలైన పత్రికలకు పాత్రికేయుడుగా జార్జ్ ఆర్వెల్ కార్యం నిర్వర్తించాడు. 1945లో ప్రథమంగా ప్రకటన చెందిన అతడి ఒక చిన్న నవల అనిమల్ ఫార్మ్ (Animal Farm) ఆనాటి రాజకీయాలను పరిహాసం చేసే ఒక అనన్యమైన కృతి. ఇది ఒక అపహాస్యం చేసే, వెక్కిరింత రూపకం. అధికారం పొందడంతో ఆ అధికారాన్ని ఇతరులపై దర్పారు చెలాయించే మనుష్యుడి సర్వాధికార ప్రవృత్తిని, ఇతరులను తన నియంత్రణలో వుంచు కొనడంతో పాటు, అలా లభించిన నియంత్రణాధికారాన్ని నిలుపుకోవడం కోసం తనుకులాడే మానవుడి మూల స్వభావాన్ని చాలా అద్భుతంగా పరిశోధించి చూపుతుంది ఈ వెక్కిరింతతో కూడిన ఈ నవల. మనిషిలో అధికారం కలిగించే స్వార్థం, భ్రష్టతకు హాస్యం జోడించి, అప్పటి సమాజాన్ని, ముఖ్యంగా ఆనాటి రాజకీయ పరిస్థితులను చాలా అద్భుతంగా ఆవిష్కారం చేస్తుంది. సర్వాధికారి ధోరణివున్న ఒక వ్యక్తి, అధికారం పొందగానే అతడు, అలాగే అతని అనుయాయులు తమ అధికార లాలసను పూరించుకోవడానికి జనుల మనసులలో వున్న అపరాధి ప్రజ్ఞ, భయాలను ఉపయోగించుకొంటారు. ఒక దేశం వనరులను తమ ఉక్కు పిడికిలిలోనికి తీసుకొని తమకు కావాల్సిన విధంగా వాడుకొంటారు. నిరంకుశ ప్రభుత్వం తప్పులను, స్వయంగా గమనించిన ఆర్వెల్ తన మనోజ్ఞమైన నిరూపణ అలాగే విశేషమైన శైలి ద్వారా ఆనాటి రాజకీయ పరిస్థితులను అర్థపూర్ణంగానూ, పరిణామ కారిగానూ అభివ్యక్తీక రిస్తాడు ఆర్వెల్. అప్పటి కాల ఘట్టంలో ఆర్వెల్ తన రచనల ద్వారా ఎత్తుకొన్న సామాజిక అలాగే రాజకీయ ప్రశ్నలు ఈనాటికీ ప్రస్తుతమవుతాయి. ఎరిక్ బ్లేర్ తాను జీవించిన సమయంలో జరుగుతున్న సామాజిక అన్యాయాలు, దౌర్జన్యాల విరుద్ధంగా అతడికున్న ప్రబలమైన అభిప్రాయాలు, భావనలు అతని నవలలు, వ్యాసాలు, యితర రచన లలో చోటుచేసు కొన్నాయి. ఈ సంగతులే అతడు వేరు వేరు పత్రికలకు వ్రాస్తున్న విషయాలకు ప్రేరణను యిచ్చాయి. సమాజం గురించిన అతడి వ్రాతలు, సమీక్షలు చాలా నేరుగా వుండేవి. ఎరిక్ బ్లేర్ రాజకీయ నమ్మకాలు, ధోరణులను, అణచబడినవారి పరంగా అతని ప్రేమ, ధోరణి అతని రచనలలోమనం స్పష్టంగా గుర్తించవచ్చు. 'అనిమల్ ఫార్మ్' నవలలో వ్యవస్థ యొక్క కరాళ ముఖాలను అలాగే దిగ్భ్రమలను చాలా పరిణామకారిగా చిత్రించాడు ఆర్వెల్. ఆర్వెల్ తన రచనల ద్వారా ఎత్తుకొన్న సామాజిక, రాజకీయ ప్రశ్నలు ఈనాటికీ ప్రస్తుతమవుతాయి. వీటిని పాఠకుల దృష్టిని ఆకర్షించడానికి, చాలా మనోజ్ఞంగా పక్షి-జంతు ప్రపంచాన్ని ఉపయోగించుకొన్నాడు. పక్షులు, జంతువుల ద్వారా ఈ ప్రపంచంలోని కొన్ని సంగతులను ఆవిష్కారం చేస్తాడు రచయిత. ఈ నవలలో పందుల పాత్రలు ఎత్తి కనపడతాయి. నవల చివరలో రచయిత

'మనుష్యులు మనుష్యులే! జంతువులు జంతువులే!' అన్న మాటలు అర్థవంతంగా వున్నాయి. 'అనిమల్ ఫార్మ్' నవల ప్రపంచంలోని నూరు ప్రముఖ నవలలో ఒకటని పరిగణించబడింది. ప్రపంచంలో జరిగిన అన్ని క్రాంతులకు ఈ నవల ఒక రూపకం అని విమర్శకుల నుండి మెప్పు పొందినది. ఒక క్రొత్త పాలనా వ్యవస్థను రూపించుకొనే సమయంలో ఒక మానవ సమాజం కాని, జంతు సముదాయం కాని, తమ నిజ జీవితాలలో ఎదుర్కొనే సంకష్టాలను ఈ నవల చాలా వాస్తవ రీతిలో చూపుతుంది.

'అనిమల్ ఫార్మ్' కథా వస్తువు అందమైన ఆలోచనల దురంతపు కథ. మనుష్యుడి దౌర్జన్యాన్ని ప్రతిఘటించి స్వతంత్ర పరిపాలనా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడానికి పోరాటం చేసే జంతు సముదాయం, వృత్తి రాజకీయ అన్ని రకాల చమత్కారాలకు చిక్కుకొని మితిమీరిన కష్టాలకు లోనౌతాయి. తామే నిర్మించుకొన్న క్రొత్త పాలనా వ్యవస్థలో చిత్త స్వాస్థ్యాన్ని పోగొట్టుకొంటాయి. ఊపిరి బిగబట్టి జీవితాలు గడుపుతాయి. ఎక్కడో దూరపు చీకటిలో కనపడిన వెలుగు రేఖ, పగటి కలలా పరిణమించి ఒక భ్రమా లోకాన్ని ఈ కృతి చదువరుల ఎదుట వుంచుతుంది. ఈ కథను నిరూపించిన విధానం, ఈ నవలకు సార్వత్రికతను, సర్వసమకాలీనతను తెచ్చిపెట్టింది. ప్రాణి జగత్తు ద్వారా మనుష్య సమాజంలో పేరుకుపోయిన అధికార దాహం, భ్రష్టత, స్వార్థం వీటిని ఈ నవల అత్యంత సమర్థవంతంగా చూపుతుంది. ఈనవల పైకి చూడడానికి పక్షుల-జంతువుల కథలా కనపడుతుంది. కాని, 1917లో రష్యా క్రాంతికి కారణమైన పరిస్థితులు, దాని అనంతరం సర్వాధికారి స్టాలిన్ అధికారంలోనికి వచ్చినది, అనంతరం సోవియట్ సంయుక్త రాష్ట్రాలు (U.S.S.R) అవనతిని ప్రతిబింబించే ఈ కృతిలో మనకు ఎదురయ్యే అన్ని జంతువులూ, కార్ల్‌మార్క్స్, లెనిన్, లియాన్ ట్రాటిస్కి, స్టాలిన్ మొదలైన సమతావాదం ప్రభృతులను, ఎన్నో రాజకీయ వ్యక్తులను సాకేంతికంగా ప్రతినిధిస్తాయి. ఈ నవలలోని 'మ్యానర్ ఫార్మ్' రష్యాకు సంకేతమవుతుంది. ముఖ్య పాత్రలలోని జోన్స్ ఆనాటి రష్యా పాలకులు ఝార్ ను ప్రతినిధిస్తుంది. ఓల్డ్ మేజర్ అన్న పంది కార్ల్ మార్క్స్ లేదా వ్లాదిమిర్ లెనిన్ ను సంకేతమైతే, స్నోబాల్ పేరుతో వున్న పంది క్రాంతికారి, రాజకీయ సిద్ధాంతి లియోన్ ట్రాటిస్కి కు ప్రతీకం. నెపోలియన్ అన్న పంది జోసఫ్ స్టాలిన్ కు ప్రతీకమైతే, అక్కడున్న కుక్కలు స్టాలిన్ పోలీసు గూఢచారుల గుంపుకు ప్రతీకం. సిల్వర్ అన్న పంది, బాక్సర్, అలాగే క్లోవర్ అన్న గుర్రాలు, మ్యూరియల్ అన్న మేక, బెంజమిన్ అన్న కంచర గాడిద, జెస్సి, బ్లూబెల్ అన్న కుక్కలు, మోసస్ అన్న కాకి, మొల్లి అన్న ఆడ గుర్రం మొదలైన ప్రతి ఒక జంతువూ ఆనాటి రాజకీయ వ్యవస్థలో గుర్తించగల ఎవరో ఒక రాజకీయ వ్యక్తిని సంకేతిస్తుంది. మినిమస్ అన్న పంది ఆనాటి కవి మయకోవస్కిని సంకేతిస్తుంది. ఈ జంతువుల ప్రవర్తన అలాగే వాటి మధ్య జరిగే సంభాషణల ద్వారా పాఠకులకు ఒక గూఢార్థాన్ని చూపే రచయిత ఆర్వెల్ తీసుకొన్న మార్గం చదువరుల మెప్పు గడిస్తుంది. సామూహిక ఆందోళన నేపథ్యంలో, ఏ సామాజిక ఉద్యమానికైనా ప్రారంభంలో సిద్ధాంత పరమైన ఒక పునాది వుంటుంది. కాలం గడిచినంతా అది కొందరే కొందరు పట్టభద్రులైన హితాసక్తుల కపిముష్టిలో చిక్కుకొని దారి తప్పుతుంది, ఉద్దేశించిన లక్ష్యంనుండి విముఖం చెందుతుంది. విలువలు నాశనమౌతాయి. దీనిని కేవలం అపజయం అనడానికి లేదు. భ్రష్ట మనసున్న బౌద్ధిక దివాళితనం యొక్క ఫలం అది. తిరుగుబాటు, సమ్మెద్వారా మానవ దౌర్జన్యాలను ప్రతిభటించే జంతువులు మరలా చిక్కుకోవడం వర్గీకృత వ్యవస్థ బలమైన పట్టులో మాత్రమే. ఆకలి, అవమానం, అసహాయకత, తారతమ్యం-హింసల ప్రదర్శనలోనే! నాయకులే భ్రష్టతలో భాగమైపోవడం నిరాశాదాయక స్థితిని కలిగిస్తుంది. స్వాతంత్ర్యం, సమానత, భ్రాతృత్వం, ప్రగతి, అహింస మొదలైనవన్నీ పరికల్పన మట్టంలోనే ఉండిపోతాయి .

చరిత్రకెక్కిన స్టాలిన్ వాదం, అలాగే హిట్లర్ వాదాలకంటే చాలా భిన్నంగా ఏమీకాని ఒక క్రూర వ్యవస్థ ప్రపంచమంతా విస్తరించి వున్న ప్రస్తుత సందర్భంలో, మూడవ ప్రపంచ యుద్ధానికి సూచనలు కనపడుతున్న ఈ సన్నివేశంలో సమాజవాది, అలాగే ప్రజాప్రభుత్వ విలువలను ప్రతిపాదించే, శాంతి, సహజీవనం చాటే ఈ నవల ఇప్పటికీ చాలా ప్రస్తుతమవుతుంది. ఇప్పటి భారత రాజకీయ వ్యవస్థను, మలినమైన సార్వజనిక జీవిత విలువలను ఈ నవల అపహాస్యం చేస్తున్నట్టు, వెక్కిరిస్తున్నట్టు చూపుతుంది.

వేలూరి కృష్ణమూర్తి
మైసూరు, ఫోన్ : 9448977877

# తంజావూరు సంస్థానంలో తెలుగు సాహిత్య వైభవం

– కొప్పర్తి విజయకుమార్

"నిరాశ్రయే న శోభన్తే కవితా వనితా లతా" – కవితైనా, స్త్రీ అయినా, లతైనా ఆశ్రయం లేనిదే శోభించవు. మనుగడ సాగించలేవు.

దక్షిణాంధ్రకి చెందిన ఇంచుమించు రాజవంశీయు లందరూ సాహిత్య పిపాసకులే. తెలుగు సాహిత్యానికైతే చాళుక్య వంశ రాజాధిరాజైన రాజరాజ నరేంద్రుని ఆస్థానంలో అంకురార్పణ జరిగిందో, విజయనగర సంస్థానాధీశుడైన "ఆంధ్రభోజుడు" శ్రీకృష్ణదేవరాయుని కాలంలో వల్లవించిందో, ఆ తెలుగు సాహిత్యం తంజావూరు సంస్థానాధీశుల కాలంలో ఒక మహావృక్షమై విలసిల్లింది.

చాళుక్య వంశానికి సమకాలీనులైన కవులు ఏ ఆంధ్ర కావ్య కన్యకి ఒక విశిష్టమైన రూపాన్ని ఇచ్చారో, ఆ కావ్యకన్య విజయనగరాధీశుడైన శ్రీకృష్ణదేవరాయుని "భువన విజయ"మనే సభా భవనంలోకి వచ్చేసరికి అసాధారణ రీతిలో, ఎంతో అందంగా అలంకరించబడింది. ఈ స్వర్ణయుగంలోనే తెలుగు సాహిత్య కుసుమం ఎంతగానో వికసించి, గౌరవాదరాభిమానాలు పొందింది. అయితే, ఈ కాలాల్లో ఉద్భవించిన తెలుగు కవులు మాత్రం తక్కువే అని చెప్పుకోవాలి. విజయనగరాధీశుడు శ్రీకృష్ణదేవరాయల అస్తమయంతో నాటి ఆంధ్ర సంస్కృతి, సాహిత్యం, కావ్య పరంపరల అభివృద్ధిలో అవరోధం ఏర్పడింది. అటువంటి క్లిష్ట సమయంలో యమునా, కావేరీ నదీ తీరాల వెంబడి దక్షిణాంధ్ర సామ్రాజ్యాన్ని స్థాపించి, అస్తమించే దశలో ఉన్న ఆంధ్ర తేజాన్ని ప్రకాశింప చేసింది తంజావూరు సామ్రాజ్య నాయక ప్రభువులే. రాజ్యంలో ఒక ప్రక్క సుపరిపాలన అందిస్తూ, ఆంధ్ర సారస్వత అభ్యుదయాన్ని ప్రగతి పథంలో నడిపించారు.

తంజావూరు నాయక ప్రభువులు బహుభాషా కోవిదులు. స్వయంగా వారే ఎన్నో గ్రంథాలని రచించారు. స్వయంగా కవులు కావడమే కాకుండా వారివారి సంస్థానాల్లో ఎందరో కవులూ, కవయిత్రులకి ఆశ్రయమిచ్చి వారిచే ఎన్నో గ్రంథాలని రచింపచేశారు. వారి కాలంలో తంజావూరు సంస్థానం కళాసరస్వతికి నిలయంగాను, కావ్యరచన సాగించే కవయిత్రీ కవులకి కల్పనా లోకంగాను, వాగ్గేయకారులకి రాగమయ రంగస్థలంగాను విలసిల్లింది. తంజావూరు నాయక ప్రభువుల మూలపురుషుడు కృష్ణ భూపతి. వీరి రెండవ కుమారుడైన పినచెంగప్ప నాయకుడే తంజావూరు సంస్థానానికి తొలి నాయక ప్రభువుగా విలసిల్లాడు. క్రీస్తుశకం 1550 నుంచి 1560 వరకు సాగిన వీరి పాలనాకాలంలో ప్రజలు సుఖశాంతులతో జీవించారు. వీరి కాలంలో సంస్కృత పండితులు శ్రీనివాస దీక్షితులు, తమిళ కవులైన చెల్లప్ప ఆయకుడు, కల్మదతు మొదలియారు, కాళింగరాయలు, ఉష్ణామలైనారు మొదలైన వారు పద్యరచన చేశారు.

పినచెంగప్ప నాయకుని తర్వాత వారి జ్యేష్ఠపుత్రుడు అచ్యుతప్ప నాయకుడు 1560లో తంజావూరు సంస్థానాధిపతి అయ్యాడు. క్రీ.శ. 1600 వరకు సాగిన వీరి శాసన కాలంలో దక్షిణాంధ్ర దేశంలో భక్తి భావం విశిష్టంగా వెల్లివిరిసింది. స్వయంగా అచ్యుతప్ప నాయకుడే శ్రీరంగేశుని పరమభక్తుడు. వీరి పూజాఫలానికి సాకార రూపమే వీరి పుత్రుడు రత్న రఘునాధ భూపాలుడు.

రఘునాథ భూపాలుని శాసనకాలం క్రీస్తుశకం 1600 నుంచి 1631 వరకు సాగింది. వీరి సమయంలో తంజావూరు రాజ్యం వీరి పూర్వీకుల కాలంలో మాదిరిగా సుఖశాంతులతో వర్ధిల్లింది. విశిష్టత ఏమిటంటే, వీరి కాలంలోనే దక్షిణాంధ్ర సాహిత్యం పునీతమయింది. సర్వగుణసంపన్నుడైన రఘునాథుడు రాజ్యాన్ని అంతరంగికంగానూ, బాహ్యారూపంలోనూ సుసంఘటితం చేయడమే కాకుండా, కళారంగంలో స్వర్ణయుగాన్ని ప్రతిష్ఠింగాడు. స్వయంగా రఘునాథుడే సాహిత్యంలో దిట్ట. ఆయనే స్వయంగా ఎన్నో ప్రబంధ కావ్యాలనీ, ద్విపదులూ,

యక్షగానాల్నీ రచించిన ఘనత కలిగినవాడు. ప్రక్రియా వైవిధ్యంలో తంజావూరు కవుల స్థానం విశిష్టమైనది. స్వయంగా రఘునాథుడే ఆ కవులలో అగ్రజుడని చెప్పవచ్చు. వీరు రచించిన కావ్యాలలో రఘునాథ రామాయణం, వాల్మీకి చరిత్ర, పారిజాతాపహరణం మొదలగు ప్రబంధ కావ్యాలు, రుక్మిణి శ్రీకృష్ణ వివాహము అనే యక్షగానము ప్రసిద్ధికెక్కినవి. ఆశుకవిత చెప్పడంలో నిష్ణాతుడైన ఈ రాజకవి "పారిజాతాపహరణము" కథను వినిపిస్తున్నప్పుడు ఆస్థానంలోని మహాపండితులే దాన్ని లిపిబద్ధం చేయడానికి చాలా అవస్థ పడుతూ ఉండేవారని ప్రతీతి. వీరి రామాయణ మహాగ్రంథం ఎంతటి మహాకృతి అంటే ఇది సంస్కృతంలోకి కూడా అనువదింపబడింది.

రఘునాథుడు ఇటు సంగీతంలోనూ అటు సంగీత శాస్త్రంలోనూ కూడా పారంగతుడే "సంగీత సుధ" అనే మహత్వపూర్ణ సంగీత శాస్త్రగ్రంథాన్ని కూడా వీరు రచించారు. ''జయంత సేన'' అనే కొత్త రాగాన్ని, "రామానంద"మనే క్రొత్త తాళాన్ని, "రఘునాథ మేళ"మనే క్రొత్త మేళాంతాన్ని సృజించి రఘునాథుడు ఒక మమహా స్రష్టగానూ, వీణావాద్య కళామర్మజ్ఞునిగాను వినుతికెక్కాడు.

అటువంటి రఘునాథుడు తన "ఇందిరా మందిరం" అనే సభా భవనంలో కవులు, కవయిత్రులు, కళాకోవిదులు, శాస్త్ర మీమాంసకులతో ఆసీనుడై సాహిత్య గోష్ఠులను నిర్వహిస్తుండేవాడు. సంస్కృతాంధ్ర కావ్యనిపుణి, సరస సంగీత కళాకోవిదురాలు, "రఘునాథ రామాయణా"న్ని సంస్కృతీకరించిన కవయిత్రీ అయిన మధురవాణి, "రఘునాథభ్యుదయం" కావ్యకర్త్రీ, సాహిత్య సామ్రాజ్య విదుషీమణీ అయిన రామభద్రాంబ. వీరి ఆస్థానాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దిన వారిలో అగ్రశేణులు.

తంజావూరు తెలుగు సుమధుర శైలి, ప్రభావవంతమైన అభివ్యంజనతో "సారంగధర చరిత్ర" "విజయ విలాసము" వంటి కావ్యాలను రచించి అక్షుణ్ణ గౌరవ ప్రతిష్ఠలు సమపార్జించుకున్న చామకూర వెంకట కవి, "నైషధ పారిజాతమ"నే ద్వ్యర్థి కావ్య నిర్మాత అయిన కృష్ణాధ్వరి, చాటువుల్ని ఎన్నో విరచించిన కవి చౌడప్ప, మువ్వగోపాలునిపై పద కవితలెన్నో రచించి, శ్రావ్యంగా వినిపించిన వాగ్గేయకారుడు క్షేత్రయ్య మొదలైనవారంతా రఘునాథుని సభాభవన ప్రతిష్టని పెంపొందింపచేసిన మహాకవివర్యులు. రఘునాథ భూపాలుడు, సతీమణి కళావతీల కుమారుడు విజయ రాఘవ మహీపాలుడు తండ్రి తదనంతరం తంజావురు రాజ్యానికి రాజైనాడు. వీరు క్రీస్తు శకం 1633 నుండి 1673 వరకు 40 సంవత్సరాలు తంజావూరుని పాలించారు. వీరి సుదీర్ఘ పరిపాలనా కాల అవధిలో వీరు కేవలం రాజనీతి, ప్రజా పరిపాలనలోనే కాక సాహిత్య, కళా క్షేత్రాలలో కూడా విశిష్టమైన కృషి చేశారు. స్వయంగా గేయ సాహిత్య మర్మజ్ఞుడు కావడంతో వీరు అనేక యక్షగానాలను రచించారు. అలాగే తన ఆస్థానంలోని కవుల చేత కూడా ఎన్నో రచనలను చేయించారు. వీరు తమ విరామసమయాలలో కవి సమ్మేళనల్నీ, సాహిత్య గోష్టులనూ, గేయ శ్రవణాలనూ, నృత్య ప్రదర్శనలనూ నిర్వహించేవారు.

విజయ రాఘవులు బృహదాంధ్ర సాహిత్య ప్రక్రియ అయిన యక్షగానాన్ని ఎక్కువగా ఇష్టపడేవారు. ఈ కారణం చేతనే వీరు తను స్వయంగా రచించిన పదాలు, ద్విపదులు, పద్య నాటకాలు మొదలైన వివిధ ప్రక్రియలలో కెల్లా యక్షగానాలకే విశిష్ట స్థానం లభించింది. ఈ యక్షగానాలే వీరికి ఎక్కువ ఖ్యాతినార్జించి పెట్టాయి. వీరిచే రచించబడిన గ్రంథమాలలో "రాజగోపాల విలాసము", "జానకి కల్యాణము", "రఘునాథాభ్యుదయము", మంజరి ద్విపదికి నాటక రూపము వంటివి మణిపూసలు. సంగీత సాహిత్య కళారంగాలలో ప్రవీణులు, లబ్ధ ప్రతిష్టులు అయిన విజయ రాఘవుని ఆస్థాన ప్రతిష్టను పెంపొందించిన వారిలో చంద్రలేఖ, కృష్ణాజి, రంగజి వంటి కవయిత్రులు, చెంగల్వ కాళ కవి కామరుసు వెంకటపతి సోమయాజి, కోనేటి దీక్షిత కవి చంద్రుడు, పురుషోత్తమ దీక్షితులు మొదలైన కవులు ముఖ్యులు. చంద్రలేఖ, కృష్ణాజీలు మాత్రం తమ తమ విద్యాచాతుర్యాన్ని అప్పుడప్పుడు ప్రదర్శించేవారు వీరి గ్రంథాలు ఏవీ లభ్యం కాలేదు. కానీ వారు ఛందశ్శాస్త్రంలోనూ, ఆశుకవిత చెప్పడంలోనూ ఎంతోఖ్యాతిని గడించారు. పెద్దగా విదుషీమణి కాకపోయినప్పటికీ రంగాజమ్మ చాలా ప్రతిభావంతురాలు. ఈమె మన్నారు 'దాస విలాసము', 'ఉషాపరిణయము' మొదలైన ప్రబంధాలను రచించింది. చెంగల్వ కాళ కవి రఘునాథ భూపాలుని సమకాలీనుడు. కానీ వీరి కళా కౌశలం విజయ రాఘవుని ఆస్థానంలో సఫలీకృమయ్యింది.

వీరు 'రాజగోపాల విలాసము' అను ఐదాశ్వాసాల ప్రబంధ కవ్యాన్ని రచించారు. కమరుసు వెంకటపతి సోమయాజి 'విజయ రాఘవ విలాసమ'నే దృశ్య కావ్యాన్ని రచించారు. కోనేటి దీక్షిత కవి చంద్రుడు 'విజయరాఘవ విలాసము' అనే యక్షగాన రచనతోనే ప్రసిద్ధికెక్కారు. పురుషోత్తమ దీక్షితులు విరచించిన 'తంజాపురాన్న దాన మహా నాటకం' సంపూర్ణంగా ప్రహసనాలతో కూడిన యక్షగానం. ఈ విధంగా విజయ రాఘవుని ఆస్థానం ఎల్లప్పుడూ కవులు, కవయిత్రులతో కలకలలాడేది. ఇదే కాలానికి చెందిన పదకవి పెద్ది దాసు రాజాశ్రయం పొందడానికి విముఖత వ్యక్తం చేసినప్పటికీ, వారి పద రచనలతో హిమాలయాల కంటే ఉన్నత స్థానాన్ని అధిరోహించి నాటి అన్య కవులందరిలోకి శ్రేష్ఠునిగా వినుతికెక్కాడు. వీరి పదాలలో ఎక్కడా విజయ రాఘవున గూర్చిన ప్రశంస గాని, వారి ఆశ్రయాన్ని గూర్చిన ప్రస్తావన గాని లేదు. వీరి పదాలలోని ముఖ్య భావం కేవలం భక్తి మాత్రమే. విజయరాఘవుడు, రాజగోపాంచికల పుత్రుడు మన్నారు దేవుడు. వీరు కూడా చాలా సాహిత్య పిపాసకులు. వీరు "హేమాబ్జ నాయికా స్వయంవరం" అనే యక్షగానాన్ని రచించారు. కానీ వీరి కళాకౌశలం అంతగా సఫలీకృతం కాకపోవడానికి కారణం మధుర సేనల ఆక్రమణను ఎదుర్కోవలసి వచ్చింది. చివరికి ఈ యుద్ధంలోనే వీరికి వీరగతి ప్రాప్తించడం జరిగింది. వీరిచే రచింపబడిన ఏకైక గ్రంథం 'హేమాబ్జ నాయికా స్వయంవరా'న్ని పరిశీలిస్తే వీరి వర్ణన శైలి, కథా పటుత్వం, అభివ్యక్తీకరణ అత్యద్భుతం అని చెప్పవచ్చు. చివరిలో మిగిలిన ఒకే ఒక నాయక ప్రభువు చంగలమ దాసు. వీరితో తంజావూరులో నాయక ప్రభువుల పాలన అంతమయింది.

క్రీ.శ. 1675 నుండి తంజావూరు పాలనాధికారం ఏకోజి అనే మరాఠా సేనాని హస్తగతమయింది. తత్ఫలితంగా తంజావూరు సంస్థానం మరాఠీ పాలకుల వశమైంది. ఏకోజితో తంజావూరులో మరాఠీ పాలకుల రాచరికం ఆరంభమైంది ఏకోజి సుప్రసిద్ధ మరాఠా వీరుడు చత్రపతి శివాజీకి సోదరుడు. తంజావూరులో మరాఠీయుల పాలన క్రీస్తుశకం 1855 వరకు కొనసాగింది ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, మరాఠీ పాలకులు కూడా నాయక ప్రభువుల మాదిరిగానే దక్షిణాంధ్ర వాంఙ్మయ వికాసానికి విశిష్టమైన రీతిలో సేవలందించారు. తంజావూరు రాజ్య ప్రాంతంలో తమిళ భాషాధిక్యత ఎక్కువ అయినా, నాయక ప్రభువులు ఏ సంస్కృతీ వికాసానికి కృషి చేశారో, ఏ వాఙ్మయాభివృద్ధికి దోహదపడ్డారో, ఏ భాషలో తమ గ్రంథ రచన చేసారో అది వారి మాతృభాష తెలుగే కనుక ఇందులో పెద్దగా ఆశ్చర్యపడాల్సిన ఏమీ లేదు కానీ, మరాఠా పాలకులు తమ మాతృభాష మరాఠీ, పాలనా ప్రాంత భాష అయిన తమిళాన్ని ప్రక్కన పెట్టి తెలుగు సాహిత్య అభివృద్ధికి నడుం బిగించడం అనేది నిజంగా ఆశ్చర్యపడాల్సిన విషయమే. ఇదో చారిత్రాత్మక సంఘటన. పైన చెప్పిన విధంగా మొదటి శహాజీ ఇరువురు పుత్రులలోనూ ఛత్రపతి శివాజీ సోదరుడైన ఏకోజి తంజావూరు రాజ్యానికి మొట్టమొదటి మరాఠా పాలకుడు. వీరిపుత్రుడు రెండవ శహాజీ శాసన కాలంలో హస్తప్రాయమవుతున్న ఆంధ్ర వాంఙ్మయ జ్యోతి తిరిగి ప్రజ్వలితమవసాగింది. క్రీస్తు శకం 1684 నుండి 1712 వరకు సాగిన వీరి పాలనాకాలంలో అనేక కావ్యాలు రచించబడ్డాయి. స్వయంగా ఈ శహాజీయే 20 కావ్యాలు రచించడం జరిగింది వాటిలో 16 దృశ్యకావ్యాలు (నాటకాలు) మొగిలిన నాలుగు ప్రబంధకావ్యాలు వీటిలో 'ద్రౌపది కళ్యాణము', 'రుక్మిణి సత్యభామ సంవాదము', 'శచీపురందరము' 'సతీ దాన శూరము' వంటి దృశ్యకావ్యాలూ, 'పంచరత్న ప్రబంధము', 'విష్ణు పల్లకి సేవా' వంటి ప్రబంధాలు ముఖ్యమైనవి. వీరి నాటకాలన్నీ యక్షగాన రూపంలో ఉంటాయి. వీరి ప్రబంధాలలో నృత్యోద్దీప్త గీత రచన. నాటకాలలో సంవాదశైలి పటుత్వం స్పష్టంగా కనిపిస్తాయి ఈ మరాఠా పాలకుడు ఏ విధంగా తన కావ్యాలలో ఇంతటి ఉత్కృష్టమైన శైలిని ప్రయోగించాడా అనేది విస్మయం కలిగిస్తుంది.

'సతీ దాన శూరము' నాటకంలోని ఒక సన్నివేశంలో, గురుశిష్యుల సంభాషణ ఎంత ప్రభావితంగా సాగిందో చూస్తే, అబ్బురపరిచే వీరి సంవాద పటుత్వం అర్థమౌతుంది. ఇందులో శిష్యుని మనసులో స్త్రీ పట్ల చాలా జుగుప్సాభావం ఉండేది. అతని ప్రకారం స్త్రీ సంశయ భావానికి ఒక తుఫానులా, వినయరాహిత్యానికి గృహంలా, సాహసాలకి నగరంలా, దోషాలకి భ్రష్టత్వ స్థానంలా, ముక్తిద్వారానికి విఘ్నంలా, నరకపురికి మార్గంలాగ ఉంటుంది. స్త్రీ సకల మిథ్యలకి పాత్రధారి. అతను అంటాడు

*"దర్శనాద్ధరతే చిత్తం, స్పర్శ నాద్దరతే బలం।*
*సంగమాద్ధరతే వీర్యం, నారీ ప్రత్యక్ష రాక్షసి॥"*

కానీ గురువు దీన్ని వ్యతిరేకిస్తూ ఒక మాతంగ స్త్రీని అనుసరిస్తూ అంటాడు.

*"పసలేని బ్రహ్మానం పదవి నేనొల్లర*
*స్వశరీర స్వర్గఫలం సమకూరు దీనివల్ల"*

అంటే, రసహీన బ్రహ్మానంద పదవి నాకంగీకార సూచకం కాదు. తన స్వశరీర స్వర్గ ప్రాప్తి దీని ద్వారానే (స్త్రీ ద్వారానే) సాధ్యమవుతుంది.

రాజ కవి శహజీ ప్రభావవంతమైన అభివ్యక్తీకరణ, సంవాద పటుత్వం వారి అన్ని కవ్యాల్లోనూ ఇదే విధంగా సుస్పష్టంగానూ, అద్భుతంగానూ ఉంటుంది. శహజీ కవిగానే కాక ఎందరో కవులకి పండితులకి ఆశ్రయ దాతగానూ, కవి భర్త గానూ కూడా ఖ్యాతినార్జించాడు. వాసుదేవ కవి, నివర్తి శేషాచలపతి, బాల కవి సుబ్బన్న, దర్భగిరి రాజు మొదలైన కవులు శహజీ ఆస్థానంలో శృంగార కవులుగా ప్రసిద్ధి పొందారు. వీరి ఎక్కువ రచనలు శహజీ శృంగార విలాసాల ఇతివృత్తంతో సాగాయి. శహజీ కాలంలోని ఇతర కవులలో అక్కనామాత్యుడు, అష్టావధాన కవి, పాలూరి గోవింద కవి, చల్లపల్లి వెంకన్నాయుడు, సోమకవి, భాస్కర శేషాచల కవి, వెంకటగిరి మొదలైన కవులు ముఖ్యులు.

తంజావూరులో శహజీ తర్వాత అతని సోదరుడు మొదటి శరభోజి పాలన ప్రారంభమైంది క్రీస్తుశకం 1712 నుండి 1728 వరకు వీరి పాలన సాగింది. వీరి ఆస్థానంలో సంస్కృత భాషకి ఉన్నతస్థానం లభించింది. వీరి ఆస్థానంలోని ఆనంద రాయముఖి 'విద్యా పరిణయము' అనే గ్రంథాన్ని రచించారు. 'రాఘవ చరితము' అనే వీరి పన్నెండు సర్గలు గల మరో కావ్యంలో రామాయణ కథ సంపూర్ణంగా రచించబడింది. పరమానంద కవీంద్రుడు అనే ఆస్థాన కవి 'శివ భారతం' అనే సుప్రసిద్ధ చారాత్రాత్మక గ్రంథాన్ని రచించారు. శరభోజీ సమయంలోని మరోకవి జగన్నాథుడు 'రతీ మన్మధుడు' అనే నాటకాన్ని రచించారు. సుప్రసిద్ధ వాగ్గేయకారుడు గిరిరాజు రాజైన శరభోజీపై కొన్ని పదాలను రచించారు.

శరభోజి తర్వాత అతని సోదరుడైన ప్రథమ తులజాజీ (తుక్కోజీ) క్రీస్తు శకము 1728 నుండి 1736 వరకు తంజావూరును పరిపాలించాడు. సంగీత, సాహిత్యాలకు ఆయన ఎనలేని సేవలందించారు. వీరి రచనలు 'శివకామసుందరీ పరిణయము', 'రాగరంజన విద్యా విలాసము' అనే రెండు యక్షగాన నాటకాలు. ఇవి రెండూ ప్రదర్శింపబడుతూ ఉండేవి. 'సంగీత సారస్వతము' అనే సంగీత శాస్త్ర గ్రంథాన్ని కూడా వీరు రచించారు. వీరు రచించిన కొన్ని నీతియుక్త పద్యాలు కూడా ప్రాచుర్యం పొందాయి. ఆలూరి కుప్పన, కస్తూరి రంగ కవి అనే కవులు తులజాజీ కరుణా కటాక్షాలతోనే ఎన్నో గ్రంథాలను రచించారు. వాటిలో కుప్పన రచించిన ఇందుమతీ పరిణయము, రామాయణ భాగవత కథల యక్షగానాలు మొదలైనవి, 'ఆనంద రంగరాట్ ఛందము' అనే లాక్షణిక గ్రంథము, 'సాంబ నిఘంటు' అనే తెలుగు నిఘంటువు, 'కృష్ణార్జున చరితము', 'గయోపాఖ్యానమ' మొదలైన కృతులు తలజాజీ కాలంనాటి సాహిత్య సృజనకి అద్దం పట్టేవి. తులజాజీ రెండవ కుమారుడు రెండవ ఏకోజీ క్రీస్తు శకము 1737 ఉండి 1739 వరకు తంజావూరును పరిపాలించాడు. ఈ మధ్యకాలంలో (1736–37) ఇతని పెద్ద సోదరుడు కేవలం ఒక సంవత్సరం మాత్రమే పరిపాలించాడు. రెండవ ఏకోజీ తెలుగులో రచించిన ద్విపద కావ్యం బహుప్రశంసలందుకొంది. వీరి 'రామాయణ కథ' ఆరుకాండలతో రచించబడింది. వీరు 'విఘ్నేశ్వర పరిణయము' అనే యక్షగాన నాటకాన్ని కూడా రచించి తన కొద్దిపాటి శాసనాకాలంలోనే సాహిత్య సేవని తెలుగు పాఠకుల మదిలో నిలిపారు.

క్రీస్తుశకము 1740 నుండి 1762 వరకు మరాఠారాజు ప్రతాపసింహ తంజావురుని పరిపాలించి తెలుగు సాహిత్య సేవకి విశేషమైన కృషి చేశారు. దీనికి సాకార రూపమే – కవయిత్రి ముద్దుపళని. ఈమె అత్యంత సాహిత్య కోవిదురాలు, భక్త శిరోమణీను. ఈమె నిత్యం భగవానుడైన శ్రీరాముని పూజించేది. అమితమైన సాహిత్యాభిమాని. ఎన్నో కృతులను ఆయనకు సమర్పించింది. ఈమె ఎన్నో రచనలు చేసింది. కానీ, వాటిలో ఎక్కువ భాగం లభ్యం కాలేదు. ఈమె రచించిన 'రాధిక సాంత్వనం' అనే కావ్యం మాత్రం లభ్యమయింది. దీని ద్వారానే అంతఃప్రామాణికంగా ఈమె మరెన్నో రచలను చేసిన విషయం తెలియవచ్చింది.

ముద్దు పళని చాలా అందగత్తె. ఈ కారణం చేతనే రసజ్ఞుడైన ప్రతాప సింహుని సమక్షంలో ఎంతగానో

అభ్యున్నతి పొందింది. అంతేకాదు, తంజావూరు ఆంధ్ర సాహిత్యంలో శృంగారపర కవిత్వ రచన చేసిన వారందరిలోకీ ఆమెది విశిష్టమైన స్థానం. నాట్య, సంగీత, సాహిత్య రంగాలలో ఆమె ప్రతిభ అపారం. వీరరాఘవ దేశికాచార్యుడు ఈమె గురువర్యులు భగవంతుడైన శ్రీకృష్ణుని ఆదేశానుసారం ఈమె తన శృంగార పూర్వమైన కావ్యం 'రాధిక సాంత్వనా'న్ని శ్రీహరికే సమర్పించింది. ఇలాంటి ప్రబంధకావ్యమేదీ అంతవరకు రచింపబడి ఉండలేదు. సంయోగ శృంగార పూర్వమైన మధుర కావ్యాన్ని రచించి ముద్దు పళని తంజావూరు సాహిత్య జగత్తులో అపారమైన కీర్తిని అనుభవించింది. ప్రతాప సింహుని తర్వాత రెండవ ఏకోజీ జ్యేష్ఠ పుత్రుడైన రెండవ తులజాజీ క్రీస్తుశకము 1762 నుండి 1787 వరకు, అటుపిమ్మట అమరసింహుడు 1787 నుండి 1798 వరకు తంజావూరుని పరిపాలించాడు. అమరసింహుని కాలంలో శివరామకవి, నెల్లూరి వీర రాఘవ కవి, మాతృ భూతకవి మొదలైన కవులు కావ్యరచన చేసి సాహిత్య క్షేత్రాన్ని సమృద్ధి గావించారు.

ద్వితీయ తులజాజీ కుమారుడైన ద్వితీయ శరభోజీ క్రీస్తుశకము 1798 నుండి 1833 వరకు పాలన కొనసాగించాడు. వీరు బహుభాషా పారంగతుడే కాక సంగీత, సాహిత్యాది విద్యలలో అత్యంత ప్రవీణుడు. వీరు సంస్కృతంలో రచించిన 'కుమార సంభవమ'ను కావ్యం నాలుగుశ్వాసాలు కలిగిన చంపూ కావ్యం. అయితే వీరు తెలుగులో కావ్యరచన చేశారా లేదా అన్నది తెలియ రాలేదు. సుప్రసిద్ధ వాగ్గేయకారుడు త్యాగరాజు వీరి ఆస్థానంలోనే ఉండేవాడు. వీరి జీవితం భక్తి, సంగీత, సాహిత్యాల త్రివేణీ సంగమం. వీరు భగవానుడైన శ్రీరామచంద్రుని పరమ భక్తుడు వీరు శ్రీరాముని మహిమలను స్తుతిస్తూ ఎన్నో కీర్తనలను రచించారు. వీరి గీతాలు ఎంతో రాగయుక్తంగా ఉంటాయి. భక్తి రసాధిక్యతతో పాటు ఉత్కృష్ట సాహిత్యానికి దివ్య సంగీత మేళవింపు కలిగి ఉంటాయి. ఈ కీర్తనలే కాక త్యాగరాజు ఎన్నో కావ్యాలను కూడా రచించారు. నాటక రచనలో కూడా వీరి నైపుణ్యం అపారం. సీతారామ విజయము, ప్రహ్లాద భక్తి విజయం, నౌకా చరిత్రము అనే పద్య కీర్తన యుక్త నాటకాలను వీరు రచించారు. ఈ మూడు నాటకాలు యక్షగానాల మాదిరిగా సాగుతాయి. మరాఠా పాలకులలో చివరిగా ద్వితీయ శరభోజీ కుమారుడు ద్వితీయ శివాజీ క్రీస్తుశకము 1833 నుండి 1855 వరకు తంజావూరును పరిపాలించాడు సాహిత్య అభిమాని కావడంతో వీరే స్వయంగా 'అన్నపూర్ణ విజయము' అవే యక్షగానాన్ని రచించాడు. వీర ఆస్థానం కూడా ఎప్పుడూ మహాకవులతో అలరారుతుండేది. వెంకట జెట్టి కవి, శృంగార కవి, తిరుమనాధ కవి, బుడగల నాటి నరసకవి, నేలటూరి వెంకట రామశాస్త్రి మొదలైన కవులు వీరి ఆస్థానంలో ఉండి తెలుగు సాహిత్యానికి అపారమైన సేవలందించారు. వీరిచే రచింపబడిన నాటకాలు, యక్షగానాలు, ద్విపదులు, ప్రంబంధాలు మొదలైనవి దక్షిణాంధ్ర సాహిత్య ఉన్నతికి తమ వంతు దోహదపడ్డాయి కానీ ఈ పాలకుని తరువాత తంజావూరులో తెలుగు సాహిత్య ప్రగతి ముందుకు సాగలేదు.

ఈవిధంగా తంజావూరు సంస్థానంలో మొదటగా నాయక ప్రభువులు, అటుపిమ్మట మరాఠా శాసకులు దక్షిణాంధ్ర సాహిత్య వికాసానికి ఎనలేని సేవలందించారు. రమారమి 250 ఏళ్లపాటు ఈ పరంపర కొనసాగింది. యావత్ భారత సాహిత్య జగత్తులో ఇంతమంది రాజులు అటు రణరంగంలోనూ, ఇటు కావ్యరచనలోనూ, కవి పండితులకి ఆశ్రయమిచ్చి సాహిత్య సేవ చేయడంలోనూ, పరిపాలనా దక్షతతో రాజ్యాన్ని పరిపాలించడంలోనూ ఉండడం అనేది నిజంగా అపూర్వ ఘటనే.

కొప్పర్తి విజయ్‌కుమార్
ఫోన్ : 9885659574

సప్తపది

*సత్యరతి, ధర్మగతి, గృహస్థవిధి, యతిథి*
*యర్చన, స్వదేశసేవన, మఖిలమాన*
*వాసురక్తి, యీశ్వరభక్తి యని వధూప*
*రార్థసప్తపది యనుచు బ్రహ్మర్షిమాట*

ఆస్తికయోగి

*అంతట ఈశ్వరు నగపడ జేయు*
*సద్దాలమేడ ఈ యఖిల లోకమ్ము*
*ఆలోన నాతని లీలయే కాక*
*ఏదియు చూడదు వైదిక యోగి.*

- బ్రహ్మర్షి శ్రీ వేంకటరత్న సూక్తులు

# రాయ రత్నమంజూష

**– ఘట్టమరాజు**

శ్రీ కృష్ణదేవరాయలు రచించిన ప్రబంధం 'ఆముక్తమాల్యద' తెలుగు పంచకావ్యాల్లో పలువిధాలా ప్రశస్తమైనది. సంస్కృత పదాలు ఎక్కువగా వున్నందువల్లా, క్లిష్టమైన దీర్ఘ సమాసాలు ప్రయోగింపబడిన కారణంగా 'ఆముక్తమాల్యద' మహా ప్రబంధం నారికేళ పాకానికి చెందినదనీ మహా పండితులు పదేపదే చెప్పడం వల్ల, ఆ విశిష్ట కావ్యం విపుల పాఠక సముదాయానికి అందని పండైంది.

'ఆముక్తమాల్యద' ను నేటి పాఠకుల దగ్గరకు తెచ్చే వ్యాస సంకలనం 'రాయ రత్నమంజూష'. దీని కర్త సంస్కృతాంధ్ర భాషా ప్రవీణులు శ్రీగార రంగనాథం గారు. ఈ వ్యాసం సంకలనంలో ముప్పై చక్కని వ్యాసాలున్నాయి. విషయ సూచికలో పేర్కొనబడ్డ 'సంజీవని' పై పలువురి అభిప్రాయాలు, పరిశీలించిన గ్రంథాలు (31,32 అంకెలు) అనేవి వ్యాసాలు కావు. 'రాయ రత్నమంజూష' పుస్తకంలోని ముప్పై వ్యాసాలూ మేలిమిరత్నాలే. వాటికి భద్రపేటిక ఈ మంజూష. గార రంగనాథం గారు పండితులు కాదు, రస హృదయులు కూడా. పైగా చారిత్రక స్పృహ, మత ధార్మిక పరిజ్ఞాన మున్న విద్వాంసులు. అందువల్ల ఈ ముప్పై వ్యాసాల్లోనూ రంగనాథం గారి విద్వత్తు, సహృదయతలు వెల్లవిరిసాయి. గార రంగనాథం గారి రసాస్వాదనకు సాక్షీభూతం మొదటి వ్యాసం 'శ్రీ విలుబుత్తూరు'. ఈ నగరంలోని భవనాల సౌందర్యాన్ని, ఉద్యానవనాల శోభను, ద్రావిడస్త్రీల సోయగాన్ని. వేశ్యల శృంగార చేష్టల్ని, వరిమళ్ల సొబగును, పక్షుల కలరవాల్ని రాయలు వర్ణించిన ప్రతిభను కొనియాడుతూ గ్రంథకర్త ఈ ఆంధ్రభోజుణ్ణి 'ఉత్ప్రేక్షా కృష్ణరాయన్య' అన్నా అతిశయోక్తి కాదేమో అంటారు. రసవంతమైన, ఎంతో ప్రసిద్ధమైన రాయలవారి పద్యరచనా కౌశలాన్ని వివరించి చెప్పారు రంగనాథం గారు. రచయిత 'విష్ణుచిత్తయోగి' వ్యాసంలో పెరియాళ్వారు విష్ణుభక్తి పారమ్యాన్ని చక్కగా పోషించారు. 'విశిష్ట కావ్యనాయిక' గోదాదేవిని 'ఆముక్తమాల్యద' కావ్యంలో నాయికగా ప్రతిష్ఠించి. తెలుగు కావ్య జగత్తులో స్త్రీకి గౌరవస్థానం కలిగించిన కీర్తి రాయలవారిదే అని ప్రస్తుతించారు రంగనాథం. గార వారు వివిధ ఋతువుల్లో మారుతున్న ప్రజా జీవన వైవిధ్యాన్ని చాలా లోతుగా పరిశీలించి, సరసంగా వివరించారు. ఇతర ప్రబంధ కవులు గమనించని ప్రజల జీవన విధానాన్ని లోతుగా చూసి, చిత్రించిన కృష్ణరాయల ప్రతిభానైశిత్యాన్ని ఎత్తి చూపారు. 'ఖాండిక్య కేశిధ్వజ సంవాదం', 'యామునా చార్యుడు', 'గోసంగి (మాలదాసరి) వ్యాసాల్లో రంగనాథం గారు శ్రీ కృష్ణదేవరాయలు తమ వైష్ణవ భక్తిని వివిధ పాత్రల ద్వారా ఎంత చాకచక్యంగా, పటిష్ఠంగా ప్రతిపాదించారో పాఠకులకు తెలియచేశారు. సమకాలీన, తర్వాతి ప్రబంధాల్లో కనపడని కులవృత్తుల, కర్షకుల జీవితాల్లోని శ్రమైక జీవన సౌందర్యాన్ని పాఠకుల కళ్లకు కట్టేలా అనన్య సదృశమైన ప్రతిభ రాయల వారిదన్నారు గ్రంథకర్త. 'తింగణా' వ్యాసంలో గ్రంథ రచయిత రాయల వారి 'యిసుమంత తింగణావు' పద ప్రయోగంలోని అర్థ సంపదను వెలికి తీశారు. 'ఇసుమంత తింగణావు' అని పాండ్యరాజు పొట్టివాడైన శ్రీ వైష్ణవ మత గురువు యామునా చార్యుణ్ణి చులకన భావంతో సంబోధించిన వైనాన్ని రాయలవారు ఆ బ్రాహ్మణ విద్వాంసుణ్ణి త్రివిక్రమునిగా ప్రదర్శించిన ప్రాగల్భ్యాన్ని మనకు తెలియచేశారు.




గార రంగనాథం గారి 'ఉత్తరాంధ్ర' వ్యాసంలోని శబ్దచర్చ జ్ఞాన దాయకంగా సాగింది. ఉత్తరాంధ్రలో నేడు కూడా చలామణిలో వున్న బాసికం, మాత్ర సంచి, గరగ, చట్టి, ఒలె పదాలు కొద్ది పాటి మార్పులతో రాయలసీమలో కూడా వాడుకలో వుండటం గమనార్హం. వీటిపై చర్చ అవసరం కూడా. 'ఆముక్తమాల్యద' ప్రబంధ రాజాన్ని అర్థం చేసుకోవడం కష్టమే 'చెట్టు మీది విరులైనా చేతుల గోయక రావు' అన్న తాళ్లపాక వారి మాట అర్థం చేసుకొంటే కావ్యాస్వాదన మార్గం సుగమ మవుతుంది. గార రంగనాథం గారి 'రాయ రత్నమంజూష' గ్రంథం 'ఆముక్తమాల్యద' కావ్యాన్ని అర్థం చేసుకొనడానికికై దివ్వెలాంటిది.

**పేజీలు: 374, వెల: రూ - 300/- దొరకు చోటు అన్ని ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాలు, ప్రచురణ: బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్, గుంటూరు)**

మి

# చదవండి...

**– మనిషి**

**కవిత 2020:** ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండ మే 1వ తేదీన 'కవిత' వార్షికను ఆవిష్కరిస్తారు శ్రీశ్రీ ప్రింటర్స్ విశ్వేశ్వరరావుగారు. ఆ సంవత్సరం వెలువడిన ఉత్తమ కవితలను ఒకచోట చేర్చాలన్న తాపత్రయం వారిది. సాహితీ మిత్రులు విజయవాడ పేరుతో ఉత్తమ కవిత్వాన్ని వెలువరించే ప్రయత్నం



వారిది. కవులు బండ్ల మాధవరావు, అనిల్ డ్యానీ సామాజిక సమస్యలపై సృజనలో కవిత్వమెప్పుడు ముందుంటుంది. 2020 అంటే విష వాయువులు వ్యాపించిన కరోనా వైరస్, లాక్‌డౌన్ విసిరిన వంజా, వలస కార్మికులు వేలాది మైళ్ల కాలినడక గుర్తొస్తాయి. సాగు చట్టాలు, రైతుల పోరాటాలు కళ్లముందు మెదలుతాయి. కవులు కలాలు సవరించి అక్షరాల్ని నిప్పుల్ని చేసిన కవితలెన్నో ఉన్నాయి. ఈ సంకలనంలో అనేక కొంత ఆశలను రేకెత్తించే ఒక Positive approach తో ఈ సంకలనము గతాన్ని ఒక అనుభవంలా తీసుకోవాలని సూచన చేస్తోంది.

**కవిత 2021 :** చుట్టూ సమాజంలో దుఃఖం పేరుకుపోతున్నప్పుడు కవిత్వం హుషారుగా ఎలా పలకరిస్తుంది? ఆ దుఃఖాన్ని అక్షరాలుగా మనలోకి పంపుతుంది. కవిత 21లోని ఏ కవితను తడిమినా



ఏదో దుఃఖశకలం చేతుల్లో జారిపడుతుంటుంది. కొరోన రెండో అలలో ఆక్సిజన్ అందక ఆప్తులను పోగొట్టుకున్న వారెందరో. మరోపక్క ప్రమాద స్థాయిని మించిపోయి భయం గుప్పెట్లో మనల్ని ఉంచుతున్న అత్యాచారాలు, పరువు హత్యలు, అభాగ్యుల ఆక్రందనలు ఇంత దుఃఖం 'ఒక దోవ దొరుకుతుంది (కె. శివారెడ్డి) 'అమ్మ మా కుట్టు మిషన్ (దొరబాబు) 'వర్షఋతువులు (డా. రమేష్) 'ప్రియమైన వాన' ( వంటి కవితలు కొంచెం ధైర్యాన్నిస్తాయి సమాజమింకా పూర్తిగా భ్రష్టుపట్టలేదని.

**కవిత 2022 :** ఒక సంవత్సరంలో ఒకచోట చేర్చిన కవితలన్నీ 'సామూహిక' ప్రతిఘటన స్వరంలా అగుపిస్తాయి. ఆ అనుభూతి కవిత 2022



చూసినప్పుడు కలిగింది అంటారు ప్రముఖ రచయిత్రి వోల్గా. 2020, 2021 సంవత్సరాల కొరోనా భీభత్సం తగ్గినట్టు, దానిపై వచ్చిన కవితల హోరు నెమ్మదించింది. కరోనా కవితలన్నీ భిన్న నేపథ్యాలను సంతరించుకున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న ఉక్రెయిన్‌పై రష్యా దాష్టీకాన్ని ఎక్కువ కవితలు ప్రతిఫలించాయి అంటారు కవులందరు. దేశాలన్నీ ప్రేమామృతంతో నిండిపోవాలని ఆకాంక్షిస్తున్నారు. అయినా కవుల కలాల్లో ఆశలు సిర అక్కడక్కడ ఒలుకుతూనే ఉంది. రేపటి స్వప్నాల్ని కలగంటున్నారు. వర్ధమాన గాయాల్ని తలుచుకుంటున్నారు.

*ప్రతులకు: 9490634849*

**పుత్తూరు పిలగోడు - కృష్ణ స్వామి రాజు :** ఇందులో కృష్ణుడు రచయితే అయి ఉండాలి. ఇక కృష్ణుడి పేరుతో ఎన్నో పాత్రలు వేయించి చిన్ననాటి ముచ్చట్లు కుశాలగా చెప్పుకుంటూ పోయారు. చిన్న చిన్న కథల్లో చిన్న చిన్న సంఘటనలతో బాల్యంలోని




జ్ఞాపకాలను మనకు వినిపిస్తారు. మనకు కూడా అలాంటివి ఎన్నో జ్ఞాపకానికి తెస్తారు. మీరు చదవవచ్చు. మీ పిల్లలతో మనుమలతో చదివి వినిపించవచ్చు.

అంకితం కూడా పుట్టి పెరిగిన పుడమితల్లికి అంటారు – కృష్ణ స్వామి. దాట్ల దేవదానం రాజు (యానాం) ముందుమాట ముచ్చటగా రాశారు.

*పుటలు : 107, వెల: ₹ 160/–*

*ప్రతులకు: 9393662821*

**దూరతీరాలు :** విశ్వవిద్యాలయం మీద తెలుగులో వచ్చిన నవలలు తక్కువే. అంపశయ్యా, అనుక్షణికం తప్పించి పెద్దగా వచ్చినట్లు లేవు. ఆకాశవాణిలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసి పదవీ విరమణ చేసిన చల్లా జయపాల్ రెడ్డి కథకులు కూడా. అయితే 80ల నాటి ఉస్మానియా విశ్వవిద్యాలయ జీవితాన్ని తన "దూరతీరాలు" నవల ద్వారా ఆవిష్కరించారు. ముఖ్యముగా ఎనభైలలో విశ్వవిద్యాలయాలన్నీ విద్యా నిలయాలుగా ఉంటూనే అనేక సిద్ధాంతిక భావజాలాలకు పుట్టినిల్లుగా ఉండేది. ఆ విశ్వవిద్యాలయాలలో విద్యార్థులు రాజకీయపార్టీల విద్యార్థి సంఘాలలో చేరి భవిష్యత్తు రాజకీయ నాయకులుగా ఎదుగుతుండేవారు. అలాంటి భ్రమల్లో చిక్కుకున్న ఓ యువకుడి కథ "దూరతీరాలు".. ఉత్తమ కథనం సాగడం వలన ఆసక్తిగా సాగుతుంది.




*పేజీలు: 131, వెల: ₹ 200/-*

*ప్రతులకు: 9849208080, 9182205830*

**సమీకరణం :** కవి భూసురపల్లి వెంకటేశ్వర్లు గారి నాల్గవ కవిత్వ సంపుటి "సమీకరణ". నిత్యం కవిత్వాన్ని శ్వాసించడం, కవిత్వంతో జీవించడం ఈ కవి తన జీవలక్షణంగా చెప్పుకుంటాడు. యదార్థాన్ని కటువుగా చెప్పవలసిన అవసరం లేదని ఈ కవి భావన. స్వతహాగా సంగీత కళాకారులయిన ఈ కవి తన కవిత్వంతో సంగీత స్పర్శను పొందుతాడు. సమాజంలోని అన్యాయాలకు అందరి కవులలానే తల్లడిల్లుతాడీకవి. ఇవాళ మా ఊరు నదిని వదిలి రోడ్డుకు చేరింది అని గండ్లకమ్మ నది గురించి తపిస్తారు. కవిత్వం చదవడమంటే ప్రపంచాన్ని నీలోకి తీసుకోవడం అని హృద్యంగా చెప్పే భూసురపల్లి వెంకటేశ్వర్లు గారి 'కవిత్వ సమీకరణమిది'.




*పేజీలు: 198, వెల: ₹ 180/-*

*ప్రతులకు: 9848361627*

**రాయ రత్నమంజూష :** ఆముక్తమాల్యదలో అరుదైన పదం 'రింగడా' పేరుతో వ్యాసం రచించిన గార రంగనాథం గారు రాయ రత్నమంజూష శీర్షికన ఆముక్తమాల్యదపై ముప్పైరెండు వ్యాసాలతో చక్కటి గ్రంథం వెలువరించారు. ఇంతకీ రింగడా అంటే పొట్టి. చిన్నజాతి గుర్రం. ఈ వ్యాసాలన్నీ రంగనాథం గారిలోని సాహిత్య పరిశోధనా శక్తికి పట్టం కట్టె పాఠకుడికి ఎంతో ప్రీతిని కలిగిస్తాయి. ఆనాటి కాల మాన పరిస్థితుల గురించిన అనేక పరిశీలనలు ఈ గ్రంథంలో కనిపిస్తాయి. ఆముక్తమాల్యదలోని ప్రత్యేక పదజాలాన్ని ఒక పట్టికగా రచయిత ఈ గ్రంథంలో పొందుపరిచారు. సంస్కృతమే కాకుండా అచ్చ తెలుగు పదాల పొహళింపు ఆముక్తమాల్యద అని రచయిత అభిప్రాయం.




*పేజీలు: 370, వెల: ₹ 300/-*

*ప్రతులకు: 9885758123*

**పారిజాతావతరణము :** రామాయణ, భాగవతాది గ్రంథాలలోని పాత్రల అంతరంగాలలోకి తొంగిచూచి నేటి కాలానికి అనువైన రీతిలో ఆలోచించవలసిన రీతిలో అనుభూతింపవలసిన విధానంలో అన్వయించి చూపడం ఆచార్య అనుమాండ్ల భూమయ్య గారి ప్రత్యేకత. సరళసుందరమైన దేశీ ఛందంలో పొందువరచిన వసందైన కవిత్వం ఆచార్య అనుమాండ్ల భూమయ్య గారిది. నంది తిమ్మన నాటిన ప్రసిద్ధ ప్రబంధ కల్పవృక్షానికి కాల్పనికతను జోడించి రూపొందించిన మిత్రబంధం "పారిజాతావతరణము. ఇది పారిజాతాపహరణము కాదు పారిజాతా వతరణము. "కథలోని నామములు పాతదైనను కల్పన క్రొత్తదైనచో కావ్యము క్రొత్తది" అన్న విశ్వనాథ వారి పలుకులకు అక్షరసత్యము ఈ గ్రంథం.




*పేజీలు: 100, వెల: ₹ 100/-*

*ప్రతులకు: 8897073999*

# మిసిమి
మాసపత్రిక

**మీరు చందాదారులుగా చేరండి** **బహుమతిగా పంపండి**

మీ ఊరు, మీరు చదివిన బడి, మీరు పట్టభద్రులయిన కళాశాల ఇవన్నీ మీకు అపురూపమైనవేకదా! మీకు ప్రియమైనవారు, స్నేహితులు - మీకు ఎంతో ముఖ్యంకదా! వీరందరికీ మీరు **మిసిమి** ని బహుమానంగా నెలనెలా పంపవచ్చు. మీ ఊరి గ్రంథాలయానికి లేదా మీరు చెప్పిన స్నేహితుల కోసం చందా **మిసిమి** పేర పంపి, చిరునామా వివరాలు మాకు ఫోన్ (994 951 6567) లేదా ఇ-మెయిల్ (misimi90monthly@gmail.com) ద్వారా తెలియజేయండి. మీరు ఇచ్చిన చిరునామాకు నెలనెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం.

**చందా వివరాలు:**
₹ 600/- (సంవత్సర చందా),
₹ 1200/- (రెండు సంవత్సరాలకు),
₹ 1800/- (మూడు సంవత్సరాలకు),

**Scan QR to Pay**
Misimi Publication

## మిసిమి ప్రచురణలు


నోబెల్ వ్యాసాలు


మిసిమి పార్థసారథి వ్యాసాలు


చిత్రకళా నీరాజనం


నరిసెట్టి ఇన్నయ్య మిసిమి వ్యాసాలు


రజ్జు సర్పభ్రాంతి


బైరన్


పురస్కార సాహిత్యం


వ్యాస మంజూష


సారస్వత వ్యాసాలు


చార్లీ చాప్లిన్


సిద్ధార్థ


సప్తపర్ణి


షెల్లీ జీవిత కథ


దోసిట చినుకులు


నృత్యభారతి


పారిజాతం

ప్రతులకు: **మిసిమి** కార్యాలయాన్ని సంప్రదించండి. ఫోన్: 994 951 6567.

**మిసిమి** at Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, R.T.C. 'X' Roads, Hyderabad - 500 020. Ph. 040-27645536.



అనంత శేషశయన శ్రీ మహావిష్ణుమూర్తి

మిసిమి / RNI Regd.No.45042/90
Postal Regd.No.HQ/SD/191/2021-23
Date of Posting: On 29th & 30th
Date of Publication: 25.7.2023



దివ్య ద్వారం